ఈనాడు

విజయవాడ 21-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 342
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



జీతం..
ఉద్యోగ స్థాయి ఆధారంగా

హెచ్1బీ వీసా?

అమెరికా ప్రయత్నాలు

ఇంటర్నెట్ డెస్క్: హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టేందుకు ట్రంప్ కార్యవర్గం తాజాగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ మేరకు డిపార్టుమెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఓ ప్రతిపాదనను శ్వేతసౌధం లోని ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ ఎఫైర్స్ ఫర్ రివ్యూ కార్యాలయానికి పంపింది. 2026 కోసం వార్షిక పరిమితికి తగినన్ని దరఖాస్తులు రావడంతో ప్రాసెస్‌ను నిలిపివేసినట్లు శుక్రవారం యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. దీంతో 2026 సంవత్సరానికి లాటరీ విధానం ఉండకపోవచ్చు. ప్రస్తుతం పరిమితి ఆధారంగా లాటరీ విధానంలో వీసా దారులను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత ఆయా కంపెనీలు తమకు వచ్చిన వీసాల్లో అక్టోబరు నాటికి విధుల్లో చేరాల్సిన కార్మికుల దరఖాస్తులను సమర్పిస్తాయి. ట్రంప్ తొలి విడత అధికారంలోకి వచ్చాక.. లాటరీ విధానంలో కాకుండా.. సదరు పోస్టుకు ఆఫర్ చేస్తున్న వేతనం ఆధారంగా (మిగతా 2లో)





బిగ్‌బాస్ జగనే

మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఆయనే

వైకాపా ముఠాను తెరవెనక నడిపింది మాజీ ముఖ్యమంత్రే | ప్రతి నెలా రూ.50-60 కోట్ల ముడుపులు

ఐదేళ్లలో మొత్తం రూ.3,500 కోట్లపైనే

రాజ్ కెసిరెడ్డి నుంచి మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలకు

ఆ ముగ్గురి నుంచి జగన్‌కు చేరవేత • ముడుపుల సొత్తులో రూ.200-300 కోట్లు ఎన్నికల్లో ఖర్చు

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ముడుపుల సొత్తు

భారీ మొత్తంలో సొమ్ము దుబాయ్‌కు తరలింపు • సిట్ ప్రాథమిక అభియోగపత్రంలో వెల్లడి

ఈనాడు - అమరావతి

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు నాటి సీఎం జగనేనని స్పష్టమైపోయింది. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము చివరిగా జగన్‌కే చేరిందని వెల్లడైంది.

ప్రధాన నిందితుడు (ఏ-1) రాజ్ కెసిరెడ్డి ప్రతి నెలా రూ.50-60 కోట్లు వసూలుచేసి ఆ మొత్తాన్ని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ-4), నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డి (ఏ-5), భారతి సిమెంట్స్ డైరెక్టర్, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీకి (ఏ-33) అందజేసేవారని, వారు ఆ సొత్తును ఎప్పటికప్పుడు జగన్‌కు చేర్చేవారని తేలింది. ఇలా రూ.3,500 కోట్ల మేర కొల్లగొట్టినట్లు వెలుగుచూసింది. దీన్నిబట్టి ఈ మొత్తం కుంభకోణమంతా జగన్ కోసం, ఆయనకు అత్యంత సన్నిహితులైన వ్యక్తుల ద్వారానే జరిగినట్లు తేటతెల్లమైపోయింది. ముడుపుల సొత్తులో కొంత మొత్తాన్ని గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు అందజేసి, ఓట్లు కొనుగోలు చేసినట్లు వెలుగుచూసింది. మద్యం స్కాం కేసులో సిట్ దాఖలుచేసిన 305 పేజీల ప్రాథమిక అభియోగపత్రం ఆదివారం వెలుగుచూసింది. అందులోని అంశాల్ని విశ్లేషిస్తే... ఈ వైకాపా మద్యం ముఠాను తెరవెనక నుంచి నడిపించిన 'బిగ్‌బాస్' జగనేనని స్పష్టమైపోయింది. పలుకుబడిని అడ్డం పెట్టుకుని బెదిరింపులకు పాల్పడి సొమ్ము కొల్లగొట్టినట్లు సిట్ తేల్చింది.

కొల్లగొట్టేందుకు వీలుగా..

2019లో జగన్ అధికారంలోకి రాగానే ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన, అందుకోసం నిర్వహించిన సన్నాహక సమావేశాలు, ఈ కుట్ర అమలుకు అనుసరించిన విధానం, ముడుపులు చెల్లించిన బ్రాండ్లకు అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇవ్వడం, ముడుపులివ్వడానికి నిరాకరించిన కంపెనీలకు అసలు ఆర్డర్లే ఇవ్వకుండా మార్కెట్ నుంచి తరిమేయడం, ముడుపుల సొమ్ము వసూలు కోసం అనుసరించిన విధానం, ఆ సొమ్ము ఎవరెవరికి, ఎలా చేరింది? డొల్ల కంపెనీల ద్వారా దాన్ని ఎలా మళ్లించారు? గత సార్వత్రిక ఎన్నికల్లో ఎలా ఖర్చుచేశారు? హవాలా ద్వారా దుబాయ్‌కి ఎలా తరలించారు? ఈ డబ్బుతో ఎంత విలాసవంతమైన జీవితాన్ని (మిగతా 2లో)

ఛార్జ్‌షీట్‌లో ఏముంది?

- ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటే.. ఓ కుట్ర
- ముడుపులు తగ్గాయని.. పన్నుల్లో కోత
- వసూళ్ల గుట్టు.. వాట్సప్‌తో 'రట్టు'
- డిస్టిలరీలకు.. 'డిస్కౌంట్' రూ.64.02 కోట్లు!
- నిందితుల మధ్య రెండేళ్లలో 13,787 ఫోన్‌కాల్స్
- కుదిరితే బంగారం.. లేకుంటే హవాలా!
- కుంభకోణంలో పాత్రధారులు ఎవరెవరు..

లోపలి పేజీల్లో »

'బిగ్‌బాస్'నూ బోనెక్కించాల్సిందే!
సంపాదకీయం 4వ పేజీలో

మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్

విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు

జైలు వద్ద వైకాపా శ్రేణుల రచ్చరచ్చ

దూరంగా పంపి బారికేడ్లు పెట్టిన పోలీసులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నాలుగో నిందితుడు, వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు ఆగస్టు 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆయనను రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించారు. అంతకుముందు సిట్/సీఐడీ తరఫు ప్రత్యేక పీపీ, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ (మిగతా 2లో)



కోర్టు రిమాండు విధించడంతో మిథున్‌రెడ్డిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఈ చింతలనూ తీర్చండి

- ఇప్పటికే గుంతల రోడ్లకు కూటమి సర్కారు మరమ్మతులు
- మిగిలిన వాటికీ తక్షణమే పునరుద్ధరణ అవసరం
- అప్పుడే వాహనదారులకు ఉపశమనం

ఈనాడు - అమరావతి

దేశంలో మరే రాష్ట్రంలో లేనంతలా వైకాపా ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో రహదారులు అత్యంత ఘోరంగా ఉండేవి. ప్రతి రహదారీ అడుగుకో గుంతతో అధ్వానంగా దర్శనమిచ్చేది. వర్షం కురిస్తే.. వందల సంఖ్యలో భారీ గుంతలు ఈత కొలనులను తలపించేవి. వీటన్నింటితో వాహనదారులు ప్రత్యక్ష నరకం చూసేవారు. ఈ రోడ్లపై ప్రమాదాలకు గురై ఎందరో వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్నా, నాటి జగన్ సర్కారు పట్టించుకోలేదు. రోడ్లు బాగుచేయాలని, కనీసం గుంతలైనా పూడ్చాలంటూ అప్పట్లో ప్రతిపక్షాలు ఎక్కడికక్కడ ఉద్యమాలు, నిరసనలతో హోరెత్తించినా, సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ట్రోల్ చేసినా.. చలనం లేకుండా వ్యవహరించేది. గతేడాది కూటమి (మిగతా 2లో)



విజయనగరం జిల్లాలోని గరివిడి నుంచి గర్భాం వెళ్లే రహదారి ఇది. 15 కి.మీ. ధ్వంసమై అధ్వానంగా మారింది. గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 30 గ్రామాలకు ఇది కీలకమైన రోడ్డు

వెంటనే చేపడితేనే..

కూటమి ప్రభుత్వం తొలుత గుంతల రోడ్లకు మోక్షం కల్పించాక.. రూ.2 వేల కోట్లతో 5,975 కి.మీ. రహదారుల ఉన్నతీకరణ (అప్‌గ్రేడేషన్)పై దృష్టిపెట్టింది. తొలివిడత రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. ఇందులో నాబార్డు నిధులు రూ.600 కోట్లు, ప్లాన్ కింద రూ.200 కోట్లతో మొత్తం 1,433 కి.మీ. జిల్లా రహదారుల ఉన్నతీకరణకు టెండర్లు పిలిచారు. మరో రూ.400 కోట్లతో 2,683 కి.మీ. రాష్ట్ర రహదారుల పనులకు టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. ఈ పనులను తక్షణం చేపట్టాల్సి ఉంది. ఇంకా రెండో విడతలో ప్లాన్ కింద జిల్లా రోడ్లకు రూ.600 కోట్లు, రాష్ట్ర రహదారులకు రూ.400 కోట్లతో మొత్తం 2,292 కి.మీ. మేర ఉన్నతీకరణకు కూడా నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సభా సమరమే!

నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

ఆపరేషన్ సిందూర్ సహా పలు అంశాలపై ప్రధాని సమాధానానికి విపక్షాల పట్టు

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై ప్రశ్నల్ని సంధించడానికి విపక్షాలు మూకుమ్మడిగా సన్నద్ధమవుతున్న తరుణంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కాబోతున్నాయి. దీనిలో అనుసరించాల్సిన వ్యూహంపై ఇండియా కూటమి నేతృత్వంలోని విపక్షాలు ఇప్పటికే వ్యూహరచన చేశాయి. ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు అధికార కూటమి కూడా పూర్తి సన్నద్ధంగా ఉంది. నిబంధనల ప్రకారం వెళ్తే ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమేనని ప్రభుత్వం చెబుతోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు సమావేశాలు జరగడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జనవరి 31న మొదలైన బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4న ముగిశాయి. సమావేశాల్లో తాము లేవనెత్తే అంశాలపై ప్రధాని స్పందించాల్సిందేనని విపక్షం డిమాండ్ చేసింది. రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డా అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, రాందాస్ అఠావలె, కాంగ్రెస్ నేతలు- జైరాం రమేశ్, గౌరవ్ గొగొయ్, ఎన్సీపీ-ఎస్పీ నాయకురాలు సుప్రియా సూలె, డీఎంకే నేత టి.ఆర్. బాలుతో పాటు భారాస, వైకాపా, జేడీయూ, ఏఐఏడీఎంకే, సీపీఎం (మిగతా 2లో)



తుది దశకు చేరిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం భవన నిర్మాణ పనులు

సీఆర్డీఏ కార్యాలయం ఆగస్టు 15కల్లా సిద్ధం!

చకచకా సాగుతున్న నిర్మాణం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో తొలి శాశ్వత భవనం ప్రారంభోత్సవానికి శరవేగంగా సిద్ధమవుతోంది. రాయపూడిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. పనులు అనుకున్న విధంగా పూర్తైతే అదే రోజున ప్రారంభించాలని యోచిస్తోంది. దీనిపై ఇప్పటికే పురపాలకశాఖ మంత్రి నారాయణ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గతేడాది అక్టోబరు 19న సీఎం చంద్రబాబు అమరావతి పునర్నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. భూమి పూజ చేసి లాంఛనంగా ప్రారంభించారు. 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులతో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. బిల్టప్ ఏరియా 2.42 లక్షల చదరపు అడుగులు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచే రాజధాని నగరంలో పారిశుద్ధ్యం, వరదలు, ట్రాఫిక్, భద్రత తదితరాలను పర్యవేక్షించనున్నారు. విజయవాడ నగరంలో ఉన్న ప్రస్తుత సీఆర్డీఏ కార్యాలయ భవనాన్ని మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)కు ఇస్తారు.

రాబోయే 5 రోజులూ భారీ వర్షాలు

23న బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో.. ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. బుధవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం విశాఖ, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం, ప్రకాశం, విజయనగరం, గుంటూరు, పల్నాడు, శ్రీసత్యసాయి, బాపట్ల, (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం
రోదసియాత్రలో పెనుముప్పును తప్పించాం
ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్

మీరేమైనా సూపర్ కాప్ అనుకున్నారా?
దృష్టికి వచ్చిన ప్రతి దానిపై దాడులు చేయడానికి వీల్లేదు
ఈడీని ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యలు

విద్యార్థులకు 'ధ్యాన' బోధన

'విపశ్యన' సహకారంతో కోనసీమ జిల్లాలో అమలు

ప్రయోగాత్మకంగా గురుకుల పాఠశాలల్లో శ్రీకారం

ఈనాడు, రాజమహేంద్రవరం

సమాజంలో మారుతున్న జీవనశైలి అన్ని వయసుల వారిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. బడిలో చదువుకునే విద్యార్థి నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి ఒక భాగమైపోయింది. ఏ వ్యక్తి అయినా ఉన్నతంగా రాణించాలంటే బాల్య దశ నుంచే ఏకాగ్రత, క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక సత్తువ అవసరం. అందుకు ఏకైక మార్గం ధ్యానం (మెడిటేషన్) అని పెద్దలు చెప్పే మాట. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ పాఠశాలల్లో ధ్యాన అభ్యాసం అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ రంగంలో విశేష సేవలందిస్తున్న 'విపశ్యన' అంతర్జాతీయ మెడిటేషన్ సెంటర్‌తో ఒప్పందం చేసుకున్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. దీనివల్ల ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం పెరిగి ఉన్నతంగా ఎదిగేందుకు ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

మహారాష్ట్రకు చెందిన అంతర్జాతీయ విపశ్యన మెడిటేషన్ సెంటర్ వాలంటీర్ల బృందం సహకారంతో తొలివిడత జిల్లాలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో అమలుకు నిర్ణయించారు. దాదాపు 3,000 మంది విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం 10 నిమిషాల పాటు ధ్యానం చేసేందుకు అవసరమైన వనరులు సమకూర్చారు. హైదరాబాద్ నుంచి 'విపశ్యన' సహాయక ఆచార్య బృందం 30 మంది వచ్చి ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆడియో సిస్టమ్ నుంచి వచ్చే సందేశం ఆధారంగా విద్యార్థులతో మిత్ర (మైండ్ ఇన్ ట్రైనింగ్ ఫర్ రైట్ ఎవేర్‌నెస్) ధ్యాన ప్రక్రియలు చేయిస్తున్నారు. ప్రతి పాఠశాలలో రెండ్రోజులు ఉండి ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారు. గురుకులాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ధ్యాన ప్రక్రియను రెండోదశలో ఉన్నత పాఠశాలల్లో (మిగతా 2లో)



ధ్యానం చేస్తున్న విద్యార్థులు



కాలువల్లో సేకరించిన గుర్రపుడెక్కను శుభ్రం చేస్తున్న మహిళలు

గుర్రపుడెక్కతో ఎరువు

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా తయారీ

2లో

కాలువల్లో పూడికకు పరిష్కారం • మహిళలకు ఉపాధి



సిద్ధమవుతున్న ఎరువు

సభా సమరమే!

(మొదటి పేజీ తరువాయి)

తదితర పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నేతలు తమ తమ రాష్ట్రాల సమస్యల్ని ప్రస్తావించారు. ప్రధాని మోదీ పార్లమెంటులో సమాధానాలు చెప్పాలని గొగొయ్ డిమాండ్ చేశారు. అది ఆయన నైతిక ధర్మమని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని పార్లమెంటులో సమాధానం చెప్పకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సవివర ప్రకటన చేస్తారని చెబుతున్నాయి. పాక్‌ను ఎండగట్టడానికి విదేశాలకు బృందాలుగా వెళ్లిన ఎంపీలు ఆ ప్రయత్నం విజయవంతం కావడంపై సభలో చర్చను కోరుకుంటున్నారు.

'ఆపరేషన్ సిందూర్‌'పై చర్చకు సిద్ధం: కేంద్రం

పార్లమెంటు నియమాలు, సంప్రదాయాలకు అనుగుణంగా పార్లమెంటు సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' సహా అన్ని అంశాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరులకు చెప్పారు. అన్ని పక్షాలూ తగినంత సమయం కేటాయించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రధాని పార్లమెంటులోనే ఉంటారని, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై సంబంధిత మంత్రులు స్పందిస్తారని వివరించారు.

ఈ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం

జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ), ఐఐఎం (సవరణ), పన్ను చట్టాల (సవరణ), గనులు-ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ, జాతీయ క్రీడా పాలన, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు వంటివి పార్లమెంటులో ప్రవేశపెట్టాలని అధికార పక్షం ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు తీర్మానం ప్రవేశపెట్టేందుకూ రంగం సిద్ధమవుతోంది.

మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఇది రూ.3,500 కోట్ల కుంభకోణానికి సంబంధించిన తీవ్రమైన కేసు అని అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించాలని కోరారు. వాదనల అనంతరం న్యాయాధికారి పి.భాస్కరరావు.. మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించారు. ఆయన ఎంపీ కనుక జైలు నిబంధనల ప్రకారం అవసరమైన సౌకర్యాలను కల్పించాలని స్పష్టంచేశారు. మందులు తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తన వివరాలను న్యాయాధికారితో మిథున్‌రెడ్డి మాట్లాడారు.. రాజకీయ కారణాలతో తనపై కేసు నమోదు చేశారని ఆరోపించారు. వైద్యులు తనకు రెండుసార్లు ఈసీజీ పరీక్షలు చేస్తే హెచ్చుతగ్గులు వచ్చాయని చెప్పారు. వైద్య పరీక్షలు అవసరమని అన్నారు. ఆయన ఆరోగ్యం సక్రమంగానే ఉందని వైద్యులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చారని సిట్ తరఫు న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు న్యాయాధికారి దృష్టికి తీసుకువచ్చారు.

వీఐపీ బ్యారక్ ఇవ్వండి: మిథున్ న్యాయవాది

మిథున్‌రెడ్డి న్యాయవాది టి.నాగార్జునరెడ్డి వాదనలు వినిపిస్తూ.. రిమాండ్ విధింపునకు తాము వ్యతిరేకమే అయినా తాము అభ్యంతరం పెట్టదలచలేదని తెలిపారు. రిమాండ్‌కు పంపేలా అయితే సదుపాయాలున్న నెల్లూరులోని కేంద్ర కారాగారానికి పంపాలని, సాధ్యం కాకపోతే రాజమహేంద్రవరం పంపాలని కోరారు. పిటిషనరు ఎంపీగా వై కేటగిరీ భద్రత ఉన్నందున వీఐపీ బ్యారక్ ఇవ్వాలని కోరారు. ఎక్కువ ములాఖత్‌లకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. వైద్యం కోసం ఇంటి నుంచి ఆహారం, వైద్య పరీక్షలకు అనుమతించాలని కోరారు.

కోర్టు వద్ద, జైలు వద్ద వైకాపా శ్రేణుల వీరంగం

గవర్నరుపేట, విజయవాడ వైద్యం, కంబాలచెరువు, న్యూస్‌టుడే: ఎంపీ మిథున్‌రెడ్డిని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానానికి తీసుకురానుండటంతో నేతలు పెద్దఎత్తున చేరుకున్నారు. పోలీసులు ఎవరినీ అనుమతించకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైకాపా నేతలు, వారితో వచ్చిన న్యాయవాదులు తమను లోపలికి పంపించాలంటూ వాదనకు దిగారు. కొంత మంది ముఖ్య నేతలను మాత్రమే పోలీసులు అనుమతించడంతో మిగతా వాళ్లు గొడవ చేశారు. వైకాపా తరఫు న్యాయవాదులు తమను లోపలికి పంపించడం లేదంటూ అనిశా కోర్టు న్యాయమూర్తికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వైకాపా నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్, ద్వారకానాథ్‌రెడ్డి, మల్లాది విష్ణు తదితరులు న్యాయస్థానం వద్దకు వచ్చి మిథున్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. మిథున్‌రెడ్డిని రాత్రి 8.37 గంటలకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. వైకాపా యువ నాయకుడు జక్కంపూడి గణేశ్ అనుచరులతో జైలు వద్ద బైఠాయించి హడావుడి చేశారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశరావు, సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకటరావు, మాజీ ఎంపీ భరత్, ద్వారకానాథరెడ్డిలు అక్కడకు చేరుకున్నారు. వైకాపా శ్రేణులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. అయినా బారికేడ్ల వద్ద బైఠాయించిన జక్కంపూడి గణేశ్.. కాసేపు రచ్చ చేశారు. ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, అప్పిరెడ్డి మరికొందరు పోలీసుల కళ్లుగప్పి జైలు ప్రధాన గేటు వద్దకు వచ్చారు. వెనక్కి వెళ్లాలని సూచించిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విజయవాడ నుంచి పోలీస్ కాన్వాయ్ వచ్చేసరికి వైకాపా నాయకులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. మిథున్‌రెడ్డి జైలు లోపలికి వెళ్లగానే, అంతా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

విద్యార్థులకు 'ధ్యాన' బోధన

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు.

45 రోజులకోసారి సమీక్ష: ధ్యాన ప్రక్రియ ప్రారంభించిన 45 రోజుల తరువాత విద్యార్థుల్లో మార్పులు, సామర్థ్యాలను ఉపాధ్యాయులు, అధికారులు, విషయ ప్రతినిధులు వేర్వేరుగా పరిశీలించి, సమీక్షిస్తామని కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఇతర రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సంస్థ ఏడాది పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ సమయంలో వసతి, రవాణా సదుపాయం కల్పించేందుకు ఒప్పందం (ఎంఓయూ) చేశామని వెల్లడించారు.

రెండు దశాబ్దాలుగా..: మహారాష్ట్రలో తమ సంస్థ ఆధ్వర్యంలో 2001 నుంచి ధ్యాన శిక్షణ ఇస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధి అమరేంద్ర తెలిపారు. ఇప్పటి వరకు 2.5 కోట్ల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు. దీని వల్ల ప్రాథమిక దశ నుంచే చిన్నారుల్లో నైతిక విలువలు పెరిగి చెడుమార్గం వైపు మళ్లకుండా సమాజానికి మేలు చేస్తుందన్నారు. మనసు, శరీరం ఉత్తేజంగా ఉండడంతోపాటు నిర్భయంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడడంతోపాటు డ్రాపౌట్లు తగ్గుతాయని వివరించారు.

(మొదటి పేజీ తరువాయి)

గడిపారు? విదేశాల్లో ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు? ముడుపుల సొమ్ము దాచిన డెన్‌లు ఎక్కడెక్కడున్నాయి? తదితర వివరాలన్నింటినీ ఈ అభియోగపత్రంలో సిట్ పేర్కొంది. సాక్షుల వాంగ్మూలాలు, డమ్మీ కంపెనీల లావాదేవీల రికార్డులు, సీడీఆర్‌లు, ప్రయాణాలు, ఫోరెన్సిక్ నివేదికలన్నీ విశ్లేషించి ఈ కుంభకోణం గుట్టు రట్టుచేసింది. ప్రధానాంశాలివి.

నాటి ప్రభుత్వ పెద్దలకు, సన్నిహితులకే అందజేత

మద్యం ముడుపుల సొత్తు గత ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్న జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, అప్పటి సీఎంఓ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ సహా అనేకమందికి అందేవి. రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరగణంతో వీరు నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నట్లు టెలిఫోన్ రికార్డుల విశ్లేషణలో వెల్లడైంది.

● మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి,

90% ముడుపులు ఆ 40 కంపెనీల నుంచే

ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా నూతన మద్యం విధానం రూపొందించారు. ఆయా బ్రాండ్ మూలధర (బేస్‌ప్రైస్) ఆధారంగా ఒక్కో కేసుకు రూ.150-600 చొప్పున ముడుపులు వసూలు చేశారు. ఇలా మొత్తం రూ.3,570 కోట్లు దోచుకున్నారు. ఈ సొమ్ము చివరకు జగన్‌కు చేరేది. మద్యం సరఫరా కంపెనీలకు త్వరగా చెల్లింపులు చేసేందుకు వారి నుంచి ఏపీఎస్‌బీసీఎల్ పొందే రాయితీ విషయంలో జీవోలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఖజానాకు రూ.64 కోట్ల మేర నష్టం కలిగించారు. ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా అత్యధిక ఆర్డర్లు పొందిన 40 కంపెనీల నుంచే.. వైకాపా ముఠాకు 90% ముడుపులు అందాయి.

బిగ్‌బాస్ జగనే

ధనుంజయరెడ్డి తదితరులు రాజ్ కెసిరెడ్డి ముఠాలోని సభ్యులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండేవారు. అనేక సందర్భాల్లో వారితో కలిసి ఒకేచోట ఉండేవారు. ఆ సందర్భాల్లోనే ముడుపులు తీసుకున్నారు.

ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలిచేందుకు రూ.200-300 కోట్ల పంపిణీ

ముడుపుల ద్వారా కొల్లగొట్టిన సొత్తులో రూ.200-300 కోట్లను గత సార్వత్రిక ఎన్నికల్లో ఖర్చుల కోసం వైకాపా అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఆ పార్టీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి ద్వారా ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని అభ్యర్థులకు ఈ డబ్బు చేరవేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి తన పీఏలు, తనవద్ద పనిచేసే గన్‌మెన్‌ను ముడుపుల డబ్బు తెచ్చేందుకు హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని డెన్‌లకు పంపేవారు. ఈ సొత్తు రవాణా కోసం తుడా వాహనాలు వినియోగించారు. ఒక్కో విడతలో రూ.8-9 కోట్ల చొప్పున తెచ్చేవారు. ఈ డబ్బును చెవిరెడ్డి చెప్పినవారికి ఇచ్చేవారు. కావలి వైకాపా అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పీఏకూ ఈ సొమ్ము అందజేశారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ రూ.8.36 కోట్లు.. మద్యం ముడుపుల సొత్తే.

ముడుపుల సొత్తుతో కంపెనీల ఏర్పాటు

మద్యం ముడుపుల్లో కమీషన్ల ద్వారానే కాకుండా.. సొంతంగా కొన్ని మద్యం సరఫరా కంపెనీలను ఏర్పాటుచేసుకుని రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దోచుకున్నారు. ఈ సొత్తుతో తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9)తో కలిసి అనేక స్టార్టప్ కంపెనీలు ఏర్పాటుచేశారు. అప్పటికే ఉన్న కొన్ని కంపెనీలను కొనేశారు. ప్రధానంగా ఈవీలు, ఫార్మా, లాజిస్టిక్స్, ఇతర వర్ధమాన రంగాల్లో కంపెనీలు పెట్టారు. వాటికి పరిశోధన వ్యయం, నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులన్నింటికీ మద్యం ముడుపుల సొత్తే వాడారు. రాజ్ కెసిరెడ్డి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరిట సినీ నిర్మాణ కంపెనీ ఏర్పాటుచేసి, స్పై అనే సినిమా తీశారు. దీనిద్వారా నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకున్నారు. ఆ డబ్బుతో హైదరాబాద్ శివార్లలో భారీగా భూములు కొన్నారు. రాజ్ కెసిరెడ్డి, ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు మద్యం ముడుపుల సొత్తుతో అత్యంత ఖరీదైన కార్లు కొనుగోలు చేశారు.

డొల్ల కంపెనీలు.. నకిలీ ఈ-వే బిల్లులతో దోపిడీ

అదాన్ డిస్టిలరీస్, లీలా డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, ఎస్ఎన్‌జే షుగర్స్, పీవీ స్పిరిట్స్, యూవీ డిస్టిలరీస్, అంబర్ స్పిరిట్స్, వర్చసో బెవరేజెస్, వాహిని డిస్టిలరీస్, శర్వాణి ఆల్కో బ్రూ, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్, బీఆర్‌కే స్పిరిట్స్, జీఎస్‌బీ అండ్ కో ఎల్ఎల్‌పీ, ట్రాపికల్ ఇన్‌బెవ్, బృందావన్ మార్కెటింగ్, బీ9 బెవరేజెస్ తదితర సంస్థల ద్వారా ముడుపులు కొల్లగొట్టారు.

● మద్యం సరఫరా ఆర్డర్లు, బ్రాండ్ల రిజిస్ట్రేషన్లను మానిపులేట్ చేశారు. డొల్ల కంపెనీలు, డమ్మీ వెండర్లు, మద్యం వ్యాపారంతో సంబంధం లేని సర్వీసు ప్రొవైడర్ల ద్వారా ముడుపులు వసూలు చేసేవారు. ప్యాకేజింగ్, ముడి పదార్థాలు, ప్రచార ఖర్చులు, ఇతరత్రా అవసరాల కోసం డబ్బులు వెచ్చించామంటూ నకిలీ ఇన్వాయిస్‌లు, తప్పుడు ఈ-వే బిల్లులు, నకిలీ వాహనాల నంబర్లు సృష్టించి దోపిడీకి తెరలేపారు.

ముడుపుల సొమ్ముతో జల్సాలు

- మద్యం ముడుపుల సొమ్ముతో భారీ ఎత్తున స్థిరాస్తులు కొన్నారు. బినామీల పేరిట పెద్దసంఖ్యలో ఆస్తులు కూడబెట్టారు.
- వివిధ రంగాల్లోకి ఈ సొత్తు మళ్లించి మోసపూరిత స్టార్టప్‌లు ఏర్పాటుచేశారు.
- విలాసవంతమైన జీవనాన్ని కొనసాగించారు. ఖరీదైన వస్తువుల కొనుగోలు, ఖరీదైన బహుమతులు అందించడం, లెక్కలేనన్ని విదేశీ పర్యటనలకు వెళ్లడం చేసేవారు.
- హవాలా ద్వారా విదేశాలకు డబ్బు తరలించి.. ఇనుప ఖనిజం తవ్వకాల్లో పెట్టుబడులు పెట్టేందుకు యత్నించారు.
- ఈ ముడుపుల సొత్తు మూలాలు తెలియకుండా ఉండేందుకు.. నల్లధనం లేయరింగ్, లాండరింగ్‌కు పాల్పడ్డారు.

రాజకీయాలు నేరమయం

'మద్యం కుంభకోణం నిందితులంతా కలిసి రాజకీయ వ్యవస్థను నేరమయం చేశారు. మద్యం ముడుపుల సొమ్ములో కొంత మొత్తాన్ని 2024 ఎన్నికల్లో ఖర్చుచేసి ఫలితాల్ని ప్రభావితం చేసేందుకు యత్నించారు. ఎన్నికల్లో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ లేకుండా చేసి.. ప్రజావిశ్వాసానికి విఘాతం కలిగించారు' అని ప్రాథమిక అభియోగపత్రంలో సిట్ వెల్లడించింది. ఈ కుంభకోణంలో కొల్లగొట్టిన రూ.3,500 కోట్ల ముడుపుల సొత్తుతో ఏమేం చేశారో అభియోగపత్రంలో వివరించింది.

ఇంకా లోతైన దర్యాప్తు

ఈ ముడుపుల సొమ్ము అంతిమ లబ్ధిదారుకు ఇంకా ఏయే మార్గాల్లో ఎలా చేరిందో తేల్చేందుకు మరింత దర్యాప్తు చేయాల్సిన అవసరముంది. 2019-2024 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు, కొందరు అధికారులు కలిసి ముడుపులు కొల్లగొట్టడానికి వీలుగా నూతన మద్యం విధానం తీసుకురావడంలో సహకరించారు. ఆ వివరాలు వెలికితీయాల్సి ఉంది.

జీతం, ఉద్యోగ స్థాయి ఆధారంగా హెచ్1బీ వీసా?

(మొదటి పేజీ తరువాయి)

వీసాలు జారీ చేశారు. కంపెనీలు మరింత మంది ఉన్నత స్థాయి నిపుణులను నియమించుకునేలా ప్రోత్సహించేందుకు ఈ విధానం అమలు చేసినట్లు అప్పట్లో తెలిపారు. 2021లో బైడెన్ అధికారంలోకి వచ్చాక దీనిని పక్కనబెట్టారు. మళ్లీ ఆ విధానాన్ని తేవాలని డీహెచ్ఎస్ పంపిన ప్రతిపాదనవల్ల హెచ్1బీ ఉద్యోగులు తక్కువగా అందుబాటులో ఉంటారని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. వాస్తవానికి ఏ కంపెనీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకుండా లాటరీ విధానాన్ని తీసుకొచ్చారు. కానీ పెద్ద కంపెనీలు అధిక దరఖాస్తులు చేసి.. ఎక్కువ వీసాలను దక్కించుకుంటున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రోగ్రెస్ అనే మేధోమథన సంస్థ ఈ లాటరీ విధానాన్ని తొలగించాలని సూచించింది. సీనియారిటీ, జీతం ఆధారంగా వీసాలు జారీ చేస్తే వాటి ఆర్థిక విలువ 88 శాతం పెరుగుతుందని పేర్కొంది.

రాబోయే 5 రోజులూ భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనకాపల్లి జిల్లాల్లో వర్షాలు కురిశాయి. రాత్రి ఏడు గంటల వరకు ఉన్న సమాచారం ప్రకారం.. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా మందసలో 81 మిల్లీమీటర్లు, పైడిభీమవరంలో 79 మి.మీ., ప్రకాశం జిల్లా టంగుటూరు, విజయనగరం జిల్లా పూసపాటిరేగలో 77 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఇదో రకం 'కుబేర' చిత్రం!

- నెల్లూరులో గిరిజనుల పేరుతో రూ.20 కోట్లు స్వాహా
- లబోదిబోమంటున్న బాధితులు

న్యూస్‌టుడే, వెంకటాచలం, ముత్తుకూరు: ఇటీవల విడుదలైన కుబేర చిత్రాన్ని తలపించే ఘటన నెల్లూరులో వెలుగుచూసింది. సినిమాలో నల్లధనాన్ని వైట్‌గా మార్చేందుకు అక్రమార్కులు కొందరు భిక్షగాళ్ల పేరుతో కంపెనీలు పెడతారు. బ్యాంక్ ఖాతాలు తెరుస్తారు. నెల్లూరులో నిరుపేద గిరిజనులను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా చూపిన కేటుగాళ్లు నకిలీ ధ్రువపత్రాలను బ్యాంక్‌లకు సమర్పించి.. రూ.20 కోట్లు రుణాలుగా తీసుకున్నారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు ముఠాగా ఏర్పడి నెల్లూరు, కావలి, విడవలూరు తదితర చోట్ల ఏజెంట్లను నియమించుకున్నారు. వారి ద్వారా గిరిజనుల నుంచి ఆధార్ కార్డులు, ఫొటోలు తీసుకున్నారు. ఆ తరువాత ఆధార్‌ను అడ్డుపెట్టుకుని గిరిజనులకు తెలియకుండానే వారిపేరుతో ప్రత్యేకంగా సిమ్ కార్డు, పాన్‌కార్డు సంపాదించారు. ప్రైవేటు బ్యాంక్‌లో ఖాతాలు తెరిచి ఏటీఎం కార్డులు తీసుకున్నారు.



నెల్లూరులో నిరసన తెలుపుతున్న బాధితులు, యానాది సంఘాల నాయకులు

నకిలీ సంస్థలు.. పత్రాలు

బ్యాంక్ ఖాతాలు తెరిచిన తరువాత... కొందరు బ్యాంక్ అధికారులు, సిబ్బంది సహకారంతో నగదు కొల్లగొట్టేందుకు నలుగురు నిందితులు పక్కా ప్రణాళిక రూపొందించారు. నాలుగు నకిలీ కంపెనీలు సృష్టించారు. అందులో 56 మంది ఉద్యోగులు పని చేస్తున్నట్లు రికార్డులు తయారు చేశారు. వారి పేర్లతో నకిలీ గుర్తింపు కార్డులతోపాటు నకిలీ జీతాల సర్టిఫికెట్లు తయారు చేశారు. వాటిని నెల్లూరు, ముత్తుకూరులోని బ్యాంక్‌ల్లో సమర్పించి.. వారి పేర్లతో రుణాలకు దరఖాస్తు చేశారు. రూ.20 కోట్ల వరకు రుణాలుగా తీసుకున్నారు. ముత్తుకూరు బ్యాంక్‌లో రూ.10 కోట్లు, నెల్లూరు బ్యాంక్‌లో రూ.10 కోట్లు తీసుకున్నట్లు సమాచారం.

వెలుగుచూసిందిలా..

ఆయా బ్యాంక్ శాఖల్లోని అధికారులకు వేరే శాఖలకు బదిలీ అవడంతో కొత్త అధికారులు వచ్చారు. మరోవైపు, రుణాల చెల్లింపులు లేక పోవటంతో బ్యాంక్ అధికారులు తాఖీదులు పంపారు. దాంతో కంగుతిన్న గిరిజనులు నేరుగా బ్యాంక్ వద్దకు వచ్చి ఆరాతీయగా.. అసలు విషయం వెలుగుచూసింది. తాము కూలీలమని, రుణాలు తీసుకోలేదని గిరిజనులు ఫిర్యాదు చేశారు. మరోవైపు, నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం బ్యాంక్ మేనేజర్‌ను పిలిపించి ఈ వ్యవహారంపై విచారించారు.

కేసు నమోదు చేశాం

– విశ్వనాథరెడ్డి, ముత్తుకూరు ఎస్ఐ

గత ఏడాది డిసెంబరులో బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేశారు. వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్ అనే వ్యక్తులు నాలుగు ఫేక్ కంపెనీలను సృష్టించారు. వాటిలో 56 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారంటూ.. నకిలీ జీతాల సర్టిఫికెట్లు సమర్పించి ముత్తుకూరు బ్యాంక్‌లో రూ.10 కోట్లు రుణంగా తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు అప్పట్లోనే కేసు నమోదు చేశాం. ఘటనపై విచారణ జరుపుతాం.

ఈ చింతలనూ తీర్చండి

(మొదటి పేజీ తరువాయి)

అధికారం చేపట్టిన వెంటనే గుంతల రోడ్లపై దృష్టిపెట్టింది. రూ.860 కోట్లతో 20 వేల కిలోమీటర్ల మేర రహదారుల్లో గుంతలు పూడ్చేందుకు అనుమతులిచ్చి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టింది. ఆ రోడ్లకు దాదాపు మోక్షం కలిగింది. అయినా, ఇంకా జిల్లాల్లో అధ్వాన రహదారులు కన్పిస్తున్నాయి. వాటిలో గుంతలు పూడ్చే అవకాశం లేదు. పూర్తిస్థాయిలో బీటీ లేయర్ వేసేలా పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరముంది.

సకాలంలో పునరుద్ధరించక..

రహదారి నిర్మించిన ఐదేళ్లకు మళ్లీ పూర్తిస్థాయిలో బీటీ లేయర్ వేసి పునరుద్ధరించాలి. రాష్ట్రంలో 45,378 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. అంటే వీటిలో ఏటా సగటున 9 వేల కిలోమీటర్లు పునరుద్ధరించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలో కేవలం ఒక్క ఏడాది మాత్రమే 8,268 కి.మీ. రోడ్లకు పునరుద్ధరణ పనులు చేపట్టారు. మిగిలిన నాలుగేళ్లూ ఆ ఊసే ఎత్తలేదు. దీంతో ప్రధాన రహదారులన్నీ ఘోరంగా తయారయ్యాయి. వీటికి తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ), కేంద్ర రహదారి మౌలికవసతుల నిధి (సీఆర్ఐఎఫ్), ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ).. ప్రాజెక్టుల కింద చేపట్టిన రోడ్లు మధ్యలో ఆగిపోయాయి. ఎన్‌డీబీ రోడ్ల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. సీఆర్ఐఎఫ్ రోడ్ల పనులూ పూర్తిస్థాయిలో జరగడంలేదు. ఇలా మధ్యలో ఆగిపోయిన పనులను త్వరగా పూర్తిచేయాల్సి ఉంది.



ఏలూరు-జంగారెడ్డిగూడెం రాష్ట్ర రహదారి పెద్ద గుంతలతో ఘోరంగా ఉంది. అడమిల్లి వద్ద అడుగుకో గుంతతో ఇలా కనిపిస్తోంది.



ఎన్టీఆర్ జిల్లా మైలవరం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు వెళ్లే మార్గమిది. అధ్వానంగా ఉండటంతో వైకాపా ప్రభుత్వ హయాంలో చివరి ఏడాది టెండర్లు పిలిచినా పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.6 కోట్లు మంజూరు చేశారు. అయినా ఇంకా పనులు చేపట్టలేదు.

గ్రహం అనుగ్రహం

21-7-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
ఏకాదశి: ఉ. 8-34 తదుపరి ద్వాదశి
రోహిణి: రా. 9-05 తదుపరి మృగశిర
వర్జ్యం: మ. 1-35 నుంచి 3-05 వరకు
తిరిగి రా. 2-22 నుంచి 3-53 వరకు
అమృత ఘడియలు: సా. 6-05 నుంచి 7-35 వరకు
దుర్ముహూర్తం: మ. 12-31 నుంచి 1-22 వరకు
తిరిగి 3-06 నుంచి 3-58 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.33
మతత్రయ ఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	25.5
నెల్లూరు	36.2	28.0
తాడేపల్లిగూడెం	36.2	26.8
విజయవాడ	36.2	26.4
తిరుపతి	34.5	26.2
విశాఖపట్నం	34.0	27.8
కడప	34.0	25.0
కర్నూలు	33.5	24.8

గుర్రపుడెక్కతో ఎరువు

- పశ్చిమగోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా తయారీ

ఈనాడు డిజిటల్, భీమవరం: గుర్రపుడెక్కతో పశ్చిమగోదావరి జిల్లాలో వినూత్న రీతిలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. పంట కాలువల్లో విపరీతంగా పెరిగే ఈ తీగతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడతాయి. ఏళ్లుగా అన్నదాతలను పట్టిపీడిస్తున్న సమస్యల్లో ఇదొకటి. మరోవైపు, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రభుత్వం ఏటా భారీగా ఖర్చు చేస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి వినూత్నంగా ఆలోచించారు. గుర్రపుడెక్కతో సేంద్రియ ఎరువు తయారీకి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆకివీడు మండలం సిద్ధాపురంలోని సంపద తయారీ కేంద్రంలో కుండీల్లో గుర్రపుడెక్కతో సేంద్రియ ఎరువు తయారీని ప్రయోగాత్మంగా చేపట్టారు. ఫలితంగా అన్నదాతల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతోపాటు.. మహిళల ఉపాధికీ అవకాశం ఏర్పడినట్లైంది.



తయారైన ఎరువును పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఇలా వేశారు

3×9 అడుగుల కుండీల్లో కింద గడ్డిని పొరగా వేసి, ఆపైన ముక్కలుగా చేసిన గుర్రపుడెక్క, దానిపైన రెండు అంగుళాల మందంలో ఆవుపేడను ఏడు నుంచి ఎనిమిది పొరలుగా వేశారు. 21 రోజుల పాటు అలా వదిలేశారు. అనంతరం మైక్రోబయల్ కల్చర్‌ను వాడి త్వరగా కంపోస్టింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చేశారు. ఆ మిశ్రమాన్ని ఏడు వారాల తర్వాత గుళికలుగా తయారుచేశారు. ఎరువు తయారీ ప్రాంతాన్ని క్రిమికీటకాలు ఆకర్షించే ప్రమాదం ఉండడంతో ఇళ్లకు, గోదాములకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఉపాధి, ఆదాయ మార్గం

ఎరువు తయారీని మహిళా సమాఖ్యలకు అప్పగించడంతో ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన సేంద్రియ ఎరువు దొరుకుతోంది. గుర్రపుడెక్కతో తయారుచేసిన సేంద్రియ ఎరువు ధర కిలో రూ.12 నుంచి రూ.15గా, టన్ను రూ.12 వేలుగా నిర్ణయించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 100 యూనిట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎరువు తయారు కావడానికి ఒక్కో యూనిట్‌లో 20 మందికి 50 రోజుల పాటు ఉపాధి లభిస్తుంది. దీనిని రైతులే స్వయంగా తయారు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సమయం తక్కువ.. ఫలితం ఎక్కువ

సాధారణ సేంద్రియ ఎరువు కంటే గుర్రపుడెక్క ఎరువు రెండు నుంచి మూడు రెట్లు నాణ్యంగా ఉన్నట్లు ప్రయోగ పరీక్షల్లో తేలింది. ఈ తీగ కుళ్లడానికి తక్కువ సమయం పడుతోంది. పశువుల వ్యర్థాల కన్నా ఇందులో నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రియ కర్బనం, కాపర్, మాంగనీస్, జింక్, ఐరన్ ఎక్కువగా ఉంటాయి. అంతేకాదు.. ఈ సేంద్రియ ఎరువు 6 నెలలపాటు నిల్వ ఉంటుంది.

అన్ని పంటలకు: మిద్దె పంటలు, కొబ్బరి, మామిడి, సపోటా, కూరగాయలు, ఆయిల్‌పామ్, పూలమొక్కలు, కూరగాయలు, వరి, ఉద్యాన పంటలన్నింటికీ గుర్రపుడెక్కతో తయారుచేసిన ఎరువును ఉపయోగించుకోవచ్చు.



గుర్రపుడెక్క కాడలు

జగన్ అండ్ కో ముడుపులే రూ.3,570 కోట్లు

డిస్టిలరీలను బెదిరించి మరీ వసూళ్లు

బేసిక్ ప్రైస్‌పై 20 శాతం ముడుపులు • ఒక్కో కేస్‌పై రూ.600 వరకు వసూలు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో మద్యం సిండికేట్ మొత్తం రూ.3,570.87 కోట్లు ముడుపుల రూపంలో దోచుకున్నట్లు సిట్ నిగ్గుతేల్చింది. మద్యం సిండికేట్‌కి కేటగిరీల వారీగా, ఏ సంవత్సరంలో ఎంత ముడుపులు అందిందీ, ఏ బ్రాండ్‌లకు ఎలా ముడుపులు నిర్ణయించిందీ, కుట్రను ఎలా అమలు చేసిందీ ప్రాథమిక ఛార్జ్‌షీట్‌లో వివరంగా పేర్కొంది. 2019వ సంవత్సరం రెండో అర్ధభాగంలో డిస్టిలరీల యజమానులతో హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సజ్జల శ్రీధర్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారని, తమ ప్లాన్‌కు సహకరించకపోతే మద్యం సరఫరా ఆర్డర్లు ఇవ్వబోమని బెదిరించారని పేర్కొంది. వ్యాపారం కోల్పోతామన్న భయంతో డిస్టిలరీల యజమానులు మద్యం కనీస ధరపై (బేసిక్ ప్రైస్) 12 శాతం చొప్పున ముడుపులు చెల్లించేందుకు అంగీకరించారని, కానీ లిక్కర్ సిండికేట్ దాన్ని కొన్నిరోజుల్లోనే 20 శాతానికి పెంచేసిందని తెలిపింది. వసూలు చేసిన ముడుపులు మొదట రాజ్ కెసిరెడ్డికి అందేవని, వాటిని ఆయన విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలకు అందజేసేవారని తెలిపింది. వారు ఆ సొమ్మును అప్పటి సీఎం జగన్‌కు చేరవేసే వారని, ప్రతినెలా సగటున రూ.50-60 కోట్ల ముడుపులు అందేవని తెలిపింది.

కేసుకు రూ.150-600 వరకు..

✦ మొదట్లో మద్యం సరఫరాదారులతో ముడుపుల వ్యవహారాలపై సంప్రదింపులు, లావాదేవీలు రాజ్ కెసిరెడ్డి, సుమిత్, అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి జరిపేవారు. రెండోదశలో ఏపీకి చెందిన డిస్టిలరీలు, సరఫరాదారులతో వాసుదేవరెడ్డి, హైదరాబాద్‌కు చెందినవారితో ప్రకాశ్, సుమిత్ మాట్లాడేవారు.

✦ ప్రతి నెలా 27-30 లక్షల ఐఎంఎల్, 7-10 లక్షల బీరు కేసులు విక్రయించేవారు.

✦ సదరన్ బ్లూ, 9 హార్స్, ఆంధ్రా గోల్డ్, హెచ్‌డీ విస్కీ వంటి చౌక బ్రాండ్‌లకు కేసుకు రూ.150, దారుహౌస్, రాయల్ ప్యాలెస్, బ్రిలియంట్ బ్లెండ్ వంటి బ్రాండ్‌లకు కేసుకు రూ.200, మాన్షన్ హౌస్, రాయల్ స్టాగ్, వంటి బ్రాండ్‌లకు కేసుకు రూ.350 చొప్పున, టీచర్స్, హండ్రెడ్ పైపర్స్ వంటి హైఎండ్ బ్రాండ్‌లకు కేసుకు రూ.600 చొప్పున ముడుపులు వసూలు చేశారు.

✦ ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ), ఖాళీ సీసాలు, మూతలు, కార్టన్ బాక్స్‌ల సరఫరాదారులకు మార్కెట్ ధర కంటే 3-5 రెట్లు అధికంగా చెల్లించారు. అదనంగా చెల్లించిన మొత్తాన్ని నగదు రూపంలో వెనక్కి తీసుకున్నారు.

దోచుకున్నది ఇలా..

మద్యం బేసిక్ ప్రైస్	2019-24 మధ్య విక్రయించిన కేసులు	ఒక్కో కేస్‌కు ముడుపులు (రూపాయల్లో)	వసూలు చేసిన ముడుపుల మొత్తం (రూపాయల్లో)
రూ.120 వరకు	61,26,639	150	91,89,95,850
రూ.121 నుంచి రూ.150 వరకు	6,50,96,980	200	1301,93,96,000
రూ.151 నుంచి రూ.300 వరకు	5,70,45,991	350	1996,60,96,850
రూ.300కి పైన	30,07,133	600	180,42,79,800
మొత్తం			3570,87,68,500



మద్యం కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డిని వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ముడుపులు అందాకే ఆర్డర్‌లు..

■ దోపిడీ ప్రణాళికను పక్కాగా అమలు చేసేందుకు.. విజయసాయిరెడ్డి సలహా మేరకు ఏపీఎస్‌బీసీఎల్‌లో అనూష అనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను రాజ్ కెసిరెడ్డి ప్రత్యేకంగా నియమించుకున్నారు. ఆమెను నియమిస్తూ అప్పటి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ ప్రత్యేక మెమో జారీ చేశారు.

■ ఎంఐఎస్ సెక్షన్ నుంచి ఎప్పటికప్పుడు మద్యం విక్రయ సమాచారాన్ని సేకరించి రాజ్ కెసిరెడ్డికి రియల్ టైమ్‌లో చేరవేయడం అనూష ప్రధాన బాధ్యత.

■ అనూష పంపిన సేల్స్ డేటా ఆధారంగా ఏ డిస్టిలరీ/సరఫరాదారు నుంచి ఎంత ముడుపులు రావాలో సైఫ్ పట్టిక తయారు చేసి దాన్ని రాజ్‌కు పంపేవారు.

■ రాజ్ దాన్ని మొదట్లో సుమిత్‌కు తర్వాత కాలంలో చాణక్య ఎలియాస్ ప్రకాశ్‌కు పంపేవారు. మద్యం డిస్టిలరీలు, సరఫరాదారుల ఖాతాలో సొమ్ము పడిన వెంటనే సుమిత్/ప్రకాశ్‌లు వారికి ఫోన్ చేసేవారు. ఆ వారం విక్రయాల ఆధారంగా ముడుపుల మొత్తం ఎంతో చెప్పి దాన్ని రెండు రోజుల్లోగా అందచేయాలని డిమాండ్ చేసేవారు.

■ కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్, దిలీప్, సందీప్, ఖురేషి, చిస్తి, మల్లేష్ తదితరులు మద్యం డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి డబ్బు తీసుకుని.. సుమిత్, ప్రకాశ్‌ల ద్వారా రాజ్ కెసిరెడ్డికి చేరవేశారు.

■ ముడుపులు అందాకే ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్), ఇండెంట్ ప్లాన్‌లు తయారు చేసి ఏపీఎస్‌బీసీఎల్‌లో ప్రత్యేకాధికారిగా ఉన్న సత్యప్రసాద్‌కు అందజేసేవారు. దాని ఆధారంగా ఆయన ఓఎఫ్ఎస్ జారీ చేసేవారు. తాము జారీ చేసిన ఇండెంట్ ఆర్డర్‌ను డిపో మేనేజర్లు కచ్చితంగా అనుసరించేలా చూసేవారు.

■ ప్లాన్ పక్కాగా అమలయ్యేలా చూసేందుకు వాసుదేవరెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి తరచూ సమావేశమయ్యేవారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటే.. ఓ కుట్ర

మిథున్‌రెడ్డి, కెసి రెడ్డిల పాత్రపై దొరికిన ఆధారాలు

ఈనాడు-అమరావతి: వైకాపా హయాంలో రాష్ట్రంలో 'ప్రభుత్వ మద్యం దుకాణాల' ఏర్పాటు వెనుక మద్యం మాఫియా కుట్రకోణం బయటపడింది. ప్రైవేటు దుకాణాలైతే.. సరఫరా, అమ్మకాలు వారి చేతుల్లోనే ఉంటాయి. ఏ బ్రాండ్ కావాలో వారే చెప్పి ఆర్డర్ పెడతారు. అదే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే.. అంతా తమ చేతిలోకి తీసుకోవచ్చు. ఈ ప్లాన్‌తోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల లాగిన్, ఐడీలను తాము తీసేసుకుని ఇండెంట్ వ్యవస్థను హైజాక్ చేశారు. సరఫరా, అమ్మకాలను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఈ వ్యవహారంలో మిథున్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి ప్రమేయం ఉందనేందుకు వాట్సప్ ఆధారాలను సిట్ వెలికి తీసింది.

● 2019లో జగన్ అధికారం చేపట్టాక కొత్త మద్యం విధానం తెచ్చారు. సరఫరా, అమ్మకాలన్నీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే సాగేలా ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా 3,500 దుకాణాలు (జీఆర్ఓ) ఏర్పాటు చేశారు. డిప్యుటేషన్‌పై వచ్చిన వాసుదేవరెడ్డిని కార్పొరేషన్ ఎండీగా నియమించారు.

సత్యప్రసాద్‌తో మిథున్‌రెడ్డి సమావేశం

మద్యం అమ్మకాల వ్యవహారమంతా అప్పట్లో ఎక్సైజ్‌శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్‌కు తెలుసని గుర్తించిన ఎంపీ మిథున్‌రెడ్డి తమ కోసం పనిచేయాలని ఆయనను కోరారు. కన్ఫర్డ్ ఐఏఎస్ ఇప్పిస్తామని ఆశ చూపారు. దీంతో ఆయన బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో కలిసి 2019 అక్టోబరు 13న హైదరాబాద్‌లోని విజయసాయిరెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ కెసిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, అవినాష్‌రెడ్డి ఎలియాస్ సుమిత్‌లతో సమావేశమయ్యారు. అప్పటికి మూడేళ్లుగా జరిగిన మద్యం అమ్మకాల సమాచారాన్ని వారికి వివరించారు. ఈ లోగుట్టును సిట్ బయటపెట్టింది.

నెలకు రూ.60 కోట్ల వరకు..

డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి నెలకు కనీసం రూ.60 కోట్ల వరకు ముడుపులు రాబట్టవచ్చనేందుకు ఈ సమావేశంలోనే బీజం పడింది. ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్) విధానాన్ని పక్కన పెట్టి డిపోల నుంచి సరఫరా, అమ్మకాల వ్యవహారాన్ని సత్యప్రసాద్ చూసేలా నిర్ణయించారు.

ఇండెంట్‌ల విధానం హైజాక్..

ప్రభుత్వ రిటెయిల్ దుకాణాల నిర్వాహకులే ఇండెంట్లు పెట్టాల్సి ఉండగా.. వారి లాగిన్‌ల వివరాలను వైకాపా మద్యం మాఫియా గుంజుకుంది. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో గ్రూప్ కాల్ పెట్టి.. అనుకూల కంపెనీల బ్రాండ్లకు ఆర్డర్లు పెట్టించారు. వాటన్నిటినీ సిట్ అధికారులు గుర్తించారు. అనుకూల మద్యం బ్రాండ్లకు ఆర్డర్లు పెట్టించడంలో మిథున్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి ప్రమేయాన్ని వాట్సప్ చాట్‌లు బయటపెట్టాయి. బెవరేజెస్ కార్పొరేషన్ వ్యవహారంలో వారి ప్రమేయానికి ఇదే నిదర్శనంగా సిట్ పేర్కొంది. సత్యప్రసాద్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వాట్సప్ చాటింగ్ సమాచారం బయటపడింది. అందులో 'రాజ్ కెసిరెడ్డితో మాట్లాడు.. ప్రకాశ్‌తో మాట్లాడు.. అశోక్‌రెడ్డి సార్.. మిథున్ అన్న..' వంటి కీలక పదాలున్నాయి.

ముడుపులు దాచేందుకు ప్రత్యేక డెన్‌లు!

- హైదరాబాద్, తాడేపల్లిలో ఏడు చోట్ల ఏర్పాటు
- చెవిరెడ్డికి ముడుపులు అందింది తాడేపల్లిలోనే

ఈనాడు, అమరావతి: మద్యం డిస్టిలరీల యజమానులు, వ్యాపార సంస్థల నుంచి నగదు రూపంలో ముడుపులు స్వీకరించడానికి, దాచేందుకు, పంపిణీకి మద్యం మాఫియా కొన్ని డెన్‌లను ఏర్పాటు చేసుకుంది. హైదరాబాద్, తాడేపల్లిలోని ఏడు చోట్ల ఉన్న ఈ డెన్‌లను దోపిడీకి కేంద్రాలుగా వినియోగించారు. ముడుపుల మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాలని ఆ సంస్థలపై మద్యం మాఫియా ఒత్తిడి తెచ్చినట్లు సిట్ విచారణలో తేలింది. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి ట్రేడ్ ఎమౌంట్‌ను అందుకున్న తర్వాత మద్యం మాఫియా తరఫున ప్రకాశ్ అనే వ్యక్తి ఫోన్ చేసి ఆ మొత్తాన్ని ముందుగా నిర్దేశించిన ప్రాంతాల్లోని వ్యక్తులకు అప్పగించాలని సూచించేవారు.. వైకాపా అధినేత జగన్ నివాసం ఉండే తాడేపల్లి ప్యాలెస్‌కు సమీపంలోని ది ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లోనే ఆ పార్టీ నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అతని అనుచరులకు మద్యం ముడుపులు అందాయి.

డెన్‌ల వివరాలు..

- ■ ది ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్, తాడేపల్లి, గుంటూరు జిల్లా
- ■ నిర్మితీస్ ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్, బంజారా హిల్స్, హైదరాబాద్
- ■ సాయి శ్రీనివాసం అపార్ట్‌మెంట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్
- ■ ఉమాస్ హిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్
- ■ పడాల్స్ హౌస్, హైదర్‌గూడ, హైదరాబాద్
- ■ ఎన్‌సీసీ అర్బన్ వన్ అపార్ట్‌మెంట్, నార్సింగి, హైదరాబాద్
- ■ స్క్వేర్ అపార్ట్‌మెంట్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్

కుంభకోణంలో ఎవరున్నారు.. ఏం చేశారు?

వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారి రాజ్ కెసిరెడ్డి అని ప్రాథమిక అభియోగపత్రం (ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్)లో సిట్ పేర్కొంది. హవాలా ద్వారా విదేశాలకు నిధుల తరలింపు, నిందితుల పాత్రను స్పష్టంగా వివరించింది. **-ఈనాడు, అమరావతి**

• ప్రధాన సూత్రధారి రాజ్ కెసిరెడ్డి • ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్‌లో సిట్ వెల్లడి

రాజ్ కెసిరెడ్డి A1



మద్యం పాలసీని మార్చడంలో ప్రధానపాత్ర పోషించారు. ఆటోమేటెడ్ ఎక్సైజ్ పాలసీ విధానం స్థానంలో మాన్యువల్ ప్రక్రియను తీసుకురావడంలో కీలకం. ఏపీఎస్‌బీసీఎల్‌లో తన విధేయులను నియమించి, మద్యం ఆర్డర్లను గుప్పిట్లోకి తీసుకున్నారు. అదాన్, లీలా షెల్ డిస్టిలరీలను సృష్టించారు. వసూలుచేసిన సొత్తును గోవిందప్ప బాలాజీ ద్వారా అప్పటి సీఎం జగన్‌కు చేరవేశారు. నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలిసి మద్యం సొత్తులో రూ.200-300 కోట్లను వైకాపా తరఫున ఎన్నికల కోసం మళ్లించారు. 30కి పైగా షెల్ కంపెనీల ద్వారా అక్రమ సొత్తును దుబాయ్, ఆఫ్రికా దేశాలకు తరలించారు. భూములు, బంగారం, ఆస్తులను సంపాదించారు. మద్యం కుంభకోణంలో సహ నిందితులైన కిరణ్, సైఫ్, సజల్ బెహరూన్, సైమన్, వరుణ్ పురుషోత్తం, కొమ్మారెడ్డి అవినాష్‌రెడ్డి, బొల్లారం శివకుమార్, ముప్పిడి అవినాష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి విదేశాలకు పారిపోవడానికి రాజ్ కెసిరెడ్డి సహాయం చేశారు. ఆధారాల ధ్వంసంలోనూ కీలకంగా వ్యవహరించారు.

ముప్పిడి అవినాష్‌రెడ్డి ఎలియాస్ సుమిత్ A7

మద్యం అక్రమాల్లో మాస్టర్‌మైండ్. మద్యం కొనుగోలు ఆర్డర్లు, సరఫరా, లంచాలను సమన్వయం చేశారు. బినామీ సంస్థ అదాన్ డిస్టిలరీని నిర్వహించారు. నకిలీ కంపెనీలు ఓల్విక్, కృపతి, అగ్రోయో ద్వారా రూ.300 కోట్ల మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారు. రాజ్ కెసిరెడ్డి తరఫున డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలుచేశారు. తన కుటుంబసభ్యుల పెట్టుబడులతో పీవీ డిస్టిలరీ అనే నకిలీ సంస్థను ప్రారంభించారు. దీనికి మద్యం ఆర్డర్లతో భారీగా లబ్ధి పొందారు.

బూనేటి చాణక్య ఎలియాస్ ప్రకాష్ A8

ముడుపుల వసూళ్లలో కీలకం. ఇందుకు నకిలీ పేర్లను ఉపయోగించారు. జాతీయ, అంతర్జాతీయ సిమ్‌కార్డులను కొనేందుకు ఇతరుల కేవైసీని వినియోగించారు. నల్లధనాన్ని సేకరించడం, దాచడం, పంపిణీకి డెన్‌లను నిర్వహించారు. నెలకు రూ.60కోట్లు వసూలుచేసి, దీన్ని తాడేపల్లిలోని ల్యాండ్‌మార్క్ అపార్టుమెంట్‌లో నిల్వ చేశారు. లీలా డిస్టిలరీస్ నియంత్రణను ఆధీనంలోకి తీసుకున్నారు. తప్పుడు లాభాల కోసం యూవీ డిస్టిలరీలను స్థాపించారు. సహనిందితులు దుబాయ్‌కు పారిపోయేలా సమన్వయం చేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ38), కిరణ్ (ఏ9), వెంకటేష్‌నాయుడు (ఏ34) ద్వారా ఆఫ్రికా దేశాల్లో మద్యం సొత్తును పెట్టుబడులు పెట్టేందుకు సమన్వయం చేశారు.

తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్‌రెడ్డి A9

మద్యం ముడుపుల వసూళ్లలో మరో కీలకవ్యక్తి. ఐటియన్లను ప్రభావితం చేసి, వారిని నేరాల్లోకి దించారు. హైదరాబాద్, తాడేపల్లిలో ముడుపుల సొత్తు నిల్వలకు పలు డెన్‌లను నిర్వహించారు. ముఠాగా ఏర్పడి షెల్ ఖాతాలకు డబ్బును మళ్లించారు. డిజిటల్ ఆధారాలను నాశనం చేశారు.

సజ్జల శ్రీధర్‌రెడ్డి A6



మద్యం కుంభకోణం రూపకర్తల్లో ఎస్పీవై డిస్టిలరీస్ పూర్వ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి ఒకరు. ముడుపుల రేట్లను నిర్ణయించేందుకు డిస్టిలరీల యజమానులతో సమావేశాలు నిర్వహించారు. వారిని బెదిరించి, ముడుపులుగా చెల్లించాల్సిన రేట్లను నిర్ణయించారు. మద్యం కుంభకోణంలోని సెంట్రలైజేషన్ వ్యవస్థను పర్యవేక్షించడం, ఏపీఎస్‌బీసీఎల్, ఎక్సైజ్‌లో నియామకాలు, ముడుపుల సొత్తు వ్యూహం రూపకల్పన చేశారు. వైకాపాలో అప్పట్లో కీలకంగా ఉన్న విజయసాయిరెడ్డి ద్వారా అరబిందో ప్రతినిధి శరత్‌చంద్రారెడ్డి, ఇతరుల నుంచి రుణంగా రూ.40 కోట్లు తీసుకుని, తన డిస్టిలరీలో అదాన్ బ్రాండ్ల ఉత్పత్తిలో ఏ1 రాజ్ కెసిరెడ్డితో కలిసి కుట్రపన్నారు. తన డిస్టిలరీలో సుంకం చెల్లించని మద్యం తయారుచేసి, అక్రమంగా డబ్బు సంపాదించారు.

ఎస్కే సైఫ్ అహ్మద్ A10

డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి ముడుపులు వసూలు చేసేందుకు ఏపీఎస్‌బీసీఎల్‌లో పనిచేసే అనుష, సత్యప్రసాద్ ద్వారా అనధికారికంగా డేటాను సేకరించి చాణక్యకు పంపారు. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి నిధులు పొందిన యూనికార్ప్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు.

పైలా దిలీప్ A30

రాజ్ కెసిరెడ్డికి వ్యక్తిగత సహాయకుడు. అక్రమంగా లబ్ధి పొందేందుకు చాణక్యతో కలిసి యూవీ డిస్టిలరీస్ అనే నకిలీ డిస్టిలరీని ప్రారంభించారు. సహ నిందితులు చాణక్య, సైమన్‌లతో కలిసి ముడుపుల వసూళ్ల నిల్వకు డెన్‌ల ఏర్పాటు, నగదు వసూళ్లు, పంపిణీ పర్యవేక్షణ చేశారు. ముడుపుల మొత్తాన్ని ఎన్నికలకు మళ్లించడంలో నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అతని బృందంతో సమన్వయం చేశారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో రాజ్ కెసిరెడ్డి జీపీఏ హోల్డర్‌గా ఆస్తులను సంపాదించారు. ఈ కుంభకోణంలో డిజిటల్ ఆధారాలను నాశనం చేయడంలో పాలుపంచుకున్నారు.

ముడుపులు తగ్గాయని.. పన్నుల్లో కోత

- మద్య నిషేధం మాటున దందా

ఈనాడు, అమరావతి: ధరలు పెంచి మద్యం అమ్మకాలు తగ్గిస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వ పెద్దలు.. విక్రయాలతో పాటు ముడుపులూ తగ్గడంతో ఉలిక్కిపడ్డారు. ధరలు పెంచిన నాలుగు నెలలకే మడమ తిప్పారు. ఆపై పన్నులు తగ్గించి, ముడుపులు పెంచుకుని దోచుకున్నారు. 2019-24 మధ్య దశలవారీగా మద్యనిషేధం చేస్తానని చెప్పిన వైకాపా ప్రభుత్వ పెద్దలు.. ఆ మాటున ముడుపులు పెంచుకునేలా పకడ్బందీగా కార్యాచరణ నడిపారు. తొలుత మద్యం విక్రయాల్లో అత్యధిక వాటా ఉన్న 180 ఎంఎల్ బాటిల్‌పై పన్ను తగ్గింపు మొదలుపెట్టి బీర్, రెడీ టు డ్రింక్స్ వరకు అన్నింటిపైనా తగ్గించారు. 2019లో మద్యం పాలసీని ప్రకటించిన వైకాపా ప్రభుత్వం అదే ఏడాది సెప్టెంబరులో ఐఎంఎఫ్ఎల్, విదేశీ మద్యం(ఎఫ్ఎల్)పై అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నును స్థిరమైన రేటుతో విధించారు. బార్లకు, క్లబ్‌లకు సరఫరా చేసే ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్‌పై దీన్ని అదే ఏడాది నవంబరులో మరింతగా పెంచారు. తర్వాత 2020 మేలో మరోసారి ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్‌పై అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నును భారీగా పెంచారు. ఫలితంగా మద్యం ధరలు అమాంతం పెరిగి ఆ ప్రభావం మద్యం విక్రయాలపై పడింది. 2020-21లో మద్యం అమ్మకాలు తగ్గాయి. అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నులు భారీగా పెంచడం ద్వారా మద్యం అమ్మకాల పరిమాణం తగ్గి, ముడుపులూ తగ్గాయి. దీంతో ఉలిక్కిపడి ఉన్నతాధికారులతో కుమ్మక్కై అదనపు ఎక్సైజ్ పన్ను తగ్గించడం ప్రారంభించారు. బేసిక్ ధరపై విధించిన పన్నుల్ని తగ్గించడంతో అమ్మకాలు పెరిగి కంపెనీలు ముడుపులు చెల్లించేలా చేశారు. ఇలా పన్నుల తగ్గింపు, అమ్మకాల పెరుగుదల అనేది మద్యనిషేధ విధానానికి విరుద్ధం. అయినా భారీగా అనుచిత లబ్ధి పొందేందుకే కుంభకోణాన్ని నడిపారు.

2019-24 మధ్య లిక్కర్, బీర్ అమ్మకాలు పెరిగిన తీరు

సంవత్సరం	లిక్కర్ (కేసులు లక్షల్లో)	బీర్ (కేసులు లక్షల్లో)
2019-20	308	212
2020-21	186	57
2021-22	263	81
2022-23	335	116
2023-24	346	117

కుదిరితే బంగారం.. లేకుంటే హవాలా!

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం సొమ్మును తమ సొంత ఖాతాలకు మళ్లించేందుకు మాఫియా అనుసరించిన విధానాలు చూసి సిట్ కూడా విస్తుపోయింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డితో పాటు ముఠా సభ్యులు వ్యవహరించిన తీరును సిట్ ప్రస్తావించింది. దోపిడీ సొమ్మును దాచుకోవడానికి, డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి ముడుపులు వసూళ్లకు ముఠా బంగారాన్ని మార్గంగా ఎంచుకుంది. 'డిస్టిలరీలు, మద్యం కంపెనీలు సరఫరా చేసిన మద్యానికి ఏపీఎస్‌బీసీఎల్ డబ్బు చెల్లించిన వెంటనే.. అవి మాఫియాకు ముడుపులు చెల్లించేవి. వాటినుంచి బంగారం వర్తకులకు కమీషన్ చెల్లించాక మిగిలిన మొత్తాలను రాజ్ కెసిరెడ్డి, బూనేటి చాణక్య 'పెద్దలకు' చేరవేసేవారు. కొన్ని సందర్భాల్లో డిస్టిలరీలు భారీగా బంగారం కొన్నట్లుగా చూపి, వ్యాపారులకు కమీషన్లు చెల్లించేవి. ఆ వ్యాపారుల ద్వారానే ముడుపుల సొత్తును మాఫియాకు చేరవేసేవి. అప్పట్లో ఏపీఎస్‌బీసీఎల్‌కు మద్యం సరఫరా చేసిన డిస్టిలరీలు, కంపెనీల దస్త్రాలను పరిశీలించగా ఈ విషయాలు తెలిశాయి. బులియన్ వ్యాపారులు.. బంగారం దుకాణాలతో వారు నిర్వహించిన రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల లావాదేవీలకు సంబంధించిన అనుమానిత బ్యాంక్ స్టేట్‌మెంట్లు లభ్యమయ్యాయి. ముడుపులుగా పొందిన మొత్తాలను డొల్ల కంపెనీలతోపాటు ముంబై, దిల్లీ, హైదరాబాద్ నగరాలతోపాటు ఇతర దేశాల్లోని హవాలా నెట్‌వర్క్‌ల ద్వారా మళ్లించినట్లుగా తేలింది.

వసూళ్ల గుట్టు.. వాట్సప్‌తో రట్టు

■ 'ఆంధ్రప్రదేశ్‌లో బీరు, మద్యం వ్యాపారంపై మాట్లాడటానికి, గతంలోని విషయాలను పరిష్కరించుకోవడానికి రాజు (కెసిరెడ్డి) గారిని కలవాలి'

■ 'మల్లేశ్ గారు.. ఫోన్‌లో చర్చించినట్లుగా రాజు గారితో రేపు లేదా ఎల్లుండి ఆయన సౌకర్యం ప్రకారం అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేయమని కోరుతున్నాను. ఏవైనా అపార్థాలు లేదా గతంలో పెండింగ్‌లో ఉన్న విషయాలను పరిష్కరించిన తర్వాత.. ఆంధ్రప్రదేశ్‌లో మా వ్యాపారాన్ని పునః ప్రారంభించాలనే మా ఉద్దేశాన్ని వినమ్రంగా తెలియజేస్తున్నాను.. దయచేసి సహాయం చేయండి'

- మద్యం కుంభకోణంలో ఏ1 నిందితుడు రాజ్ కెసిరెడ్డి పీఏ మల్లేశ్ మొబైల్‌కు ఎస్‌ఓఎం డిస్టిలరీస్ అధ్యక్షుడు దివాకరం పంపిన వాట్సప్ సందేశాలివి.

(వీటినీ మల్లేశ్ రాజ్ కెసిరెడ్డికి ఫార్వర్డ్ చేశారు.)

మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, వారి సహచరుల మధ్య నడిచిన వాట్సప్ సంభాషణలు మాఫియా ఎంతగా వేళ్లూనుకుందో, అందులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరెవరో బయట పెట్టాయి. డిస్టిలరీల యజమానుల్ని లొంగదీసుకునేందుకు వైకాపా మద్యం మాఫియా ఎలాంటి విధానాలు అవలంబించిందో.. ఎలాంటి అరాచకాలకు పాల్పడిందోఛార్జ్‌షీట్‌లో ఉన్నాయి.

సార్.. మిథున్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో ఉన్నారు

కెసిరెడ్డి రోజువారీ అపాయింట్‌మెంట్లు చూసే పీఏ మల్లేశ్వరరావు మధ్య సంభాషణల ద్వారా గొలుసు కంపెనీల వ్యవహారంలో ఏ8 చాణక్య, ఏ7 అవినాశ్‌రెడ్డి, ఏ6 సజ్జల శ్రీధర్‌రెడ్డి, ఏ9 కిరణ్‌లతో సంబంధాలు గుర్తించారు. 'రాజ్ అంకుల్ రాబోయే రెండు, మూడు రోజుల్లో అందుబాటులో ఉంటారా? వార్షిక లైసెన్సు ఫీజు పునరుద్ధరణ, గత నెల పనితీరుపై మాట్లాడటానికి సమయం చెప్పండి' అని మల్లేశ్ ఫోన్‌కు ఎస్పీవై ఆగ్రోకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి వాట్సప్ సందేశం పంపారు.

■ 2020 జనవరి 26న 'సాయిరెడ్డి అన్న ఇంటికి వెళ్తున్నాం' అని మల్లేశ్ నుంచి కిరణ్‌కు సందేశం వెళ్లింది.

■ 2020 ఫిబ్రవరి 24న మల్లేశ్ కిరణ్‌కు పంపిన మరో సందేశంలో 'సార్ మిథున్‌రెడ్డి గెస్ట్‌లో ఉన్నారు' అని ఉంది.

■ 2020 మే 23న కిరణ్ నుంచి మల్లేశ్‌కు సందేశం వచ్చింది. 'రేపటి షెడ్యూల్: ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలో అదాన్ మీటింగ్, మధ్యాహ్నం 1 గంటకు సాయి అన్న ఇల్లు, 2.30 గంటలకు వినీత్ ఆఫీస్‌లో లంచ్, 3.30 గంటలకు మిథున్ అన్న, సాయంత్రం 5 గంటలకు గోపి అన్న, 6 గంటలకు ధనంజయ్‌రెడ్డి - సాక్షి' అని అందులో ఉంది. **-ఈనాడు,అమరావతి**

నిందితుల మధ్య నిరంతర సంప్రదింపులు

రెండేళ్లలో 13,787 కాల్స్

- వాట్సప్, సిగ్నల్ ద్వారా మరెన్నో..

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం నిందితుల మధ్య 2023 మే నుంచి 2025 జూన్ మధ్య 13,787 ఫోన్‌కాల్స్ నడిచాయని సిట్ దర్యాప్తులో తేలింది. ఇవన్నీ సాధారణ కాల్సేనని, ఇంకా వాట్సప్, సిగ్నల్ లాంటి యాప్‌ల ద్వారా అనేక కాల్స్ మాట్లాడారని వెల్లడైంది. నిందితుల్లో ఎవరెవరు, ఎవరెవరితో ఎన్నెన్ని కాల్స్ మాట్లాడారో ఆ వివరాలన్నింటినీ ప్రాథమిక అభియోగపత్రంలో పట్టిక రూపంలో పొందుపరిచింది.

చెవిరెడ్డివే అత్యధిక కాల్స్

★ వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38) అత్యధికంగా 5,169 కాల్స్ మాట్లాడినట్లు పేర్కొంది. మద్యం ముడుపుల సొమ్ము తరలింపులో కీలకంగా వ్యవహరించిన తన పీఏ బాలాజీయాదవ్ (ఏ-35)తో 1,171 కాల్స్, ముడుపుల సొమ్ము భద్రపరిచిన వెంకటేశ్‌నాయుడితో (ఏ-34) 807 కాల్స్ మాట్లాడినట్లు తేలింది. నాటి సీఎంఓ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి (ఏ-31) నిందితులతో 379 సార్లు మాట్లాడారు.

★ రాజ్ కెసిరెడ్డి సీడీఆర్‌ను విశ్లేషిస్తే.. ఆయన ఎక్కువ సందర్భాల్లో హైదరాబాద్ ఇక్రిశాట్ కాలనీలోని మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సెల్‌టవర్ పరిధిలో ఉండేవారు. జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా పలువురు నిందితులు ఆయన్ను నిరంతరం కలిసేవారని తేలింది.

ఏయే నిందితులు.. ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ, ఎలా కలిశారంటే!

మద్యం కుంభకోణం నిందితులు, అనుమానితులు వివిధ సందర్భాల్లో ఒకేచోట ఉన్నట్లు వారి సెల్‌టవర్ లొకేషన్ల విశ్లేషణ ద్వారా సిట్ తేల్చింది. ఆ వివరాలివి.

- 2023 మే 14న ప్రణోయ్ ప్రకాశ్, కిరణ్‌కుమార్‌రెడ్డి విజయవాడ లబ్బీపేటలో కలిశారు.
- 2023 మే 21న మిథున్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, బూనేటి చాణక్యలు హైదరాబాద్‌లోని వన్‌వెస్ట్ భవనంలో కలిశారు.
- 2023 జూన్ 6న వెంకటేశ్‌నాయుడు, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలు హైదరాబాద్‌లోని జర్నలిస్ట్ కాలనీలో కలిశారు.
- 2023 జూన్ 10న ప్రణోయ్ ప్రకాశ్, మిథున్‌రెడ్డిలు తాడేపల్లిలో కలిశారు.
- 2023 జూన్ 18న సైఫ్ అహ్మద్, మిథున్‌రెడ్డిలు.. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రి సమీపంలో కలిశారు.
- 2023 జులై 1న విజయసాయిరెడ్డి, ధనుంజయరెడ్డి, పైలా దిలీప్, బూనేటి చాణక్యలు హైదరాబాద్‌లోని జూబ్లీ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కలిశారు.
- ఇలా నిందితులంతా రకరకాల సందర్భాల్లో కలిసినట్లు సిట్ తేల్చింది.

డిస్టిలరీలకు.. 'డిస్కౌంట్' రూ.64 కోట్లు!

ఈనాడు, అమరావతి: 'మద్యం డిస్టిలరీలు, ఐఎంఎఫ్ఎల్/ బీరు సరఫరాదారుల నుంచి వసూలు చేయాల్సిన డిస్కౌంట్‌నూ మద్యం మాఫియా మేసేసింది. డిస్టిలరీలకు జరిపే చెల్లింపులపై ఏపీఎస్‌బీసీఎల్‌కు వచ్చే డిస్కౌంట్‌ను 2 శాతం నుంచి 1.5 శాతానికి తగ్గించింది. అరశాతం (0.5 శాతం) తగ్గించడం వల్ల రూ.64.02 కోట్లు డిస్టిలరీలు లబ్ధి పొందాయి. ఆ మేరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. ఈ వ్యవహారం 2022 జూన్ నుంచి 2024 మార్చి మధ్య జరిగింది'' అని సిట్ ప్రాథమిక అభియోగపత్రంలో పేర్కొంది.

ఏ2 వాసుదేవరెడ్డి మౌఖిక ఆదేశాలతోనే..: మద్యం డిస్టిలరీలు.. ఐఎంఎఫ్ఎల్/బీరు సరఫరాదారులకు ల్యాండెండ్ ధర (మూల ధర+ ఎక్సైజ్ డ్యూటీ/ కౌంటర్వెయిలింగ్ డ్యూటీ)ను ఏపీఎస్‌బీసీఎల్ చెల్లించాలి. 'చెల్లించే వ్యవధి ఆధారంగా మూలధర/ ల్యాండెడ్ ధరలపై సరఫరా కంపెనీల నుంచి డిస్కౌంట్ (రిబేటు) ఏపీఎస్‌బీసీఎల్ వసూలు చేస్తుంది. 2020 అక్టోబరు ఒకటిన జీవో-294లో డిస్కౌంట్ విధానాన్ని ప్రభుత్వం పేర్కొంది. ఆ తర్వాత నిబంధనలను మార్చేసి.. డిస్టిలరీ/సరఫరా కంపెనీలకు 5 రోజుల్లో చెల్లింపులు చేసేలా కొత్త నిబంధనలను తెచ్చారు. మద్యం కేసులో ఏ2గా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి మౌఖిక ఆదేశాలతో మొత్తం వ్యవహారం జరిగింది'' అని సిట్ పేర్కొంది. డిస్టిలరీ నుంచి డిస్కౌంట్ వసూలుకు 2020 అక్టోబరు ఒకటిన జీవో-294ను ప్రభుత్వం తెచ్చింది. కేవలం 5 నెలల్లోనే కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ప్రకారం మద్యం సరఫరా కంపెనీలకు ఏపీఎస్‌బీసీఎల్ 5-7 రోజుల్లో చెల్లించినా.. 1.5 శాతం నగదు డిస్కౌంట్‌ను మాత్రమే పొందేలా మార్పులు చేసింది.

జీవో ప్రకారం డిస్కౌంట్లు

వ్యవధి	డిస్కౌంట్ (శాతంలో)
2 రోజుల వరకు	3
3 నుంచి 5 రోజులు	2.5
6 నుంచి 10 రోజులు	2
11 నుంచి 15 రోజులు	1.5
16 నుంచి 30 రోజులు	1
31 నుంచి 45 రోజులు	0.5

అదనపు చెల్లింపులు పొందిన కొన్ని కంపెనీలు

● ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ ● నీల డిస్టిలరీస్ ● అంబర్ స్పిరిట్స్ ● అదాన్ డిస్టిలరీస్ ● తిలక్‌నగర్.. మోహన్, ఎస్ఎన్‌జే సప్లయర్స్/డిస్టిలరీస్.. తదితర కంపెనీలు

సరఫరాదారుల నుంచి 1.5 శాతం నగదు డిస్కౌంట్‌కు అనుమతిస్తూ అప్పటి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 2021 మార్చి 9న జీవో 62 తీసుకొచ్చారు. ● 2022 మే 27న తెచ్చిన జీవో 414 ప్రకారం తిరిగి పాత డిస్కౌంట్ నిబంధనలు ప్రభుత్వం తీసుకొచ్చింది. ● జీవో 62 నిబంధనలే అమలు చేసేలా అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి ఇతర నిందితులతో కుమ్మక్కై మౌఖిక ఆదేశాలు ఇచ్చారని సిట్ పేర్కొంది.

ఈనాడు

‘బిగ్‌బాస్‌’నూ బోనెక్కించాల్సిందే!

నూరు గొడ్లను తిన్న రాబందైనా సరే, ఒక్క గాలివానకు నేలకరచిపోతుంది. అవినీతి డ్రాక్యులా అవతారమెత్తి ఆంధ్రప్రదేశ్‌ జవసత్వాలను పూర్తిగా పీల్చేసిన జగన్‌మోహన్‌ రెడ్డి ప్రభుత్వాన్ని నిరుటి ఎన్నికల్లో పోటెత్తిన ప్రజా సునామీ అలాగే అధఃపాతాళానికి విసిరికొట్టింది. అధికార మదంతో అంతవరకు ఎగిరెగిరిపడిన జగన్‌ పార్టీ ప్రబుద్ధుల పాతకాలను తలచుకుంటూ ‘ఎన్ని కన్నీళ్ల ఉసురిది వెంటాడుతున్నది నీడల్లె కర్మ...’ అన్న పాటను సామాన్యులు అప్పట్లో సోషల్‌ మీడియాలో విరివిగా షేర్‌ చేశారు. జగన్‌ జమానాలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టయ్యారని తెలియగానే- ‘ధర్మమే నీ పాలిట దండమై దండించ తప్పించుకోలేదు జన్మ’ అనుకుంటూ వైకాపాసురులను ఏపీ ప్రజలు మరోసారి ఛీత్కరిస్తున్నారు. ఎంతో మంది ఆడబిడ్డల తాళిబొట్లు తెంపేసి, రూ.3,300 కోట్ల దాకా ముడుపులు మేసి, అందులో 90శాతం సొమ్మును ‘బిగ్‌బాస్‌’కు చేర్చిన బందిపోట్ల ముఠా వెనక మాస్టర్‌మైండ్‌ మిథున్‌రెడ్డేనని ‘సిట్‌’ గుర్తించింది. పక్కా సాక్ష్యాధారాలతో ఆయనకు అరదండాలు వేసింది. జగన్‌కు నమ్మినబంటుగా పేరుమోసిన మిథున్‌- ముందస్తు బెయిల్‌కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. తన వాదనలను న్యాయపాలిక కొట్టేయడంతో తప్పక మొన్న ‘సిట్‌’ ముందుకొచ్చారు. ఏడంచెల వ్యూహంతో మద్యం దందాకు తెరతీసి, నెత్తుటికూడుకు లొట్టలసిన మహాపాపానికి ఇప్పుడు ఏడు ఊచలు లెక్కపెడుతున్నారు!

‘మా ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తాం’ అంటూ 2019కి ముందు జగన్‌ అబద్ధాల డప్పు యమగట్టిగా కొట్టారు. సీఎం కుర్చీలో కూర్చున్నాక అదే నోటితో లిక్కర్‌ ద్వారా ఆదాయం రాకూడదని కుట్రలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలను పడతిట్టిపోశారు. మద్యం తయారీ నుంచి విక్రయాల వరకు మొత్తం వ్యవస్థపై స్వారీచేసిన వైకాపా పెత్తందారులు- తాము కోరినంత సొమ్మును ముట్టజెప్పడానికి అంగీకరించిన సంస్థలకే అత్యధిక ఆర్డర్లు ధారపోశారు. డిస్టిలరీలను గుప్పిటపట్టి, బినామీ కంపెనీలు పెట్టి పరమ నాసిరకం మందును జనానికి తాగబోయించారు. కాలకూట విషానికి ఏమాత్రం తక్కువ కాని ‘జె’ బ్రాండు మద్యం దెబ్బకు 2019-24 మధ్యలో ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 35-45 ఏళ్ల వయసులోని మగవాళ్లు ఏడువేల మందికిపైగా చనిపోయారని డీఆర్‌డీఏ, సెర్ప్‌ పరిశోధనలో బయటపడింది. జగన్‌ పార్టీ పెద్దమనుషుల కాసుల కక్కుర్తికి ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఎందరు కడతేరిపోయారో తెలియదు. ఎన్నో కుటుంబాలు అనాథలు కావడానికి కారకులైన కర్కోటకులందరూ కటకటాల్లోకి వెళ్లాల్సిందే!

తాడేపల్లి నుంచి దుబాయ్‌ వరకు డెన్‌లు పెట్టి, మద్యం ముడుపుల పైకాన్ని పోగేసిన వైకాపా ముఠా- ఎన్నికల వేళ ప్రజాస్వామ్యాన్ని కొనిపారేయడానికి అదే సొమ్ములోంచి కొంత వెదజల్లింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లలో కొందర్ని పావులుగా వాడుకుంటూ తమ భోషాణాలను నింపుకొంది. పుట్టలోని పాములు ఒక్కొక్కటిగా బయటపడినట్లు- మద్యం కుంభకోణంలో పాత్రధారులూ సూత్రధారుల ముసుగులిప్పుడు వరసగా తొలగుతున్నాయి. జగన్‌ పార్టీ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సాగిన స్వాహాపర్వం గుట్టును తేల్చడంలో మిథున్‌రెడ్డి అరెస్టు ఒక అంకం మాత్రమే. జనారోగ్యాన్ని పణంగా పెట్టి మరీ అక్రమాస్తులను కూడబెట్టుకున్న ‘అంతిమ లబ్ధిదారు’ను చట్టం ముందుకు తీసుకొచ్చేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టువిడవరాదని ప్రజానీకం ఆశిస్తోంది. రాజ్యాంగ ప్రమాణాలకు పాతరేసిన రాక్షసులకు కఠిన దండనలు పడేలా చూడటమే కాదు- వాళ్లు మాయంచేసిన ప్రతి రూపాయినీ వెనక్కి రప్పించాలి. జగన్‌ సర్కారు పారించిన గరళ మద్యానికి బలైన కుటుంబాల సంక్షేమానికి ఆ సొమ్మును వినియోగించాలి. అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది. కూటమి సర్కారుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి సార్థకత లభిస్తుంది!



సామాజిక మార్పు ఏదీ అంత త్వరగా రాదు. ఒక అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనక్కి పడే సందర్భాలే ఎక్కువ. అయినా నిరాశ పడకుండా ప్రయత్నిస్తూనే ఉండాలి. సామాజిక వ్యాపారవేత్తలకు కావాల్సింది ఆ ఓపికే. నలుగురినీ కలుపుకొని ముందుకు వెళ్తూనే ఉండాలి.

– జెరూ బిల్లిమోరియా, చైల్డ్‌లైన్‌ వ్యవస్థాపకురాలు

వినయం - విజయం

గోరంతలను కొండంతలు చేసి చెప్పేవారిని లోకంలో చూస్తుంటాం. ఆవగింజంత ప్రతిభను తాటికాయంత చేసి చెప్పుకొనేవాళ్లూ ఉన్నారు. మరికొందరుంటారు... కొండలా నిలబడి అద్దంలో కొంచమై దర్శనమిస్తారు. ఏనుగుకు ఉన్నంత శక్తి ఉన్నప్పటికీ ఏమీ లేనట్టే సామాన్యుల్లా కనపడతారు. కానీ సందర్భం వచ్చినప్పుడు అనేక గ్రహాలూ నక్షత్రాల మధ్య వెలుగులు విరజిమ్మే సూర్యుడిలా భాసిల్లుతారు. అలాంటివాడే అంజనీ పుత్రుడు హనుమ. తనకెన్ని శక్తి సామర్థ్యాలున్నా వినయమే ఆయనకు అలంకారమైంది.

రామ రావణ యుద్ధంలో కుంభకర్ణుడు మరణించిన తరవాత ఇంద్రజిత్తు వీరవిహారం చేశాడు. రాక్షస మాయలు, అస్త్రాలు ప్రయోగించి వానరసేనను ముప్పుతిప్పలు పెట్టాడు. చివరికి బ్రహ్మదేవుడిచ్చిన శక్తిమంతమైన దివ్యాస్త్రాన్ని ప్రయోగించి రామలక్ష్మణులు సహా వానరసేనంతా మూర్ఛపోయేలా చేశాడు. రాక్షసుడు కాబట్టి విభీషణుడి మీద అస్త్ర ప్రభావం పడలేదు. వానరుల్లో ముందు స్పృహలోకొచ్చింది జాంబవంతుడు. కళ్లు తెరవగానే ‘హనుమ క్షేమమేనా’ అనడిగాడు- రామలక్ష్మణులను విస్మరించి హనుమ క్షేమాన్ని ప్రశ్నించిన జాంబవంతుడి తీరుకు ఆశ్చర్యపోతాడు విభీషణుడు. ‘హనుమ జీవించి ఉంటే చాలు... అతడే లేకపోతే యుద్ధం మీద ఆశ వదులుకోవాలి’ అంటాడు జాంబవంతుడు. అది కదా ఆంజనేయుడి శక్తి!



అంతర్యామి

అంతటి హనుమ కూడా సముద్రాన్ని దాటి త్రికూట పర్వతం మీద నిలబడి లంకలోని భవనాలు, మహా రక్షణ వ్యవస్థను చూసి క్షణకాలం విస్తుపోయాడు. రాక్షసులను జయించడం కుదురుతుందా అని సందేహించాడు. సామ దాన భేద దండోపాయాలేవీ ఫలించనంత బలమైన వ్యవస్థ రాక్షసులకు ఉందనీ, ఎవరికీ లొంగనంత గొప్ప స్థితిలో ఉండటం వాళ్ల బలమైతే- తనతో పాటు అంగదుడు, నీలుడు, సుగ్రీవుడు మాత్రమే లంకలోకి ప్రవేశించగలిగిన సమర్థులుకావడం తమ బలహీనత అనుకున్నాడు. సముజ్జీలు కానప్పుడు యుద్ధమెలా చేయగలుగుతామని సందేహించాడు. ఒక కార్యం సాధించడానికి నడుంబిగించే ముందు మంచి చెడ్డలు ఆలోచించాలని, కీడెంచి మేలెంచాలనే వివేకవంతుల లక్షణాన్ని ప్రతిబింబించింది హనుమ తీరు.

అదే సందేహాన్ని సీతాదేవి వ్యక్తంచేయగా ‘కోట్లమంది వానరసేనకు రాజైన సుగ్రీవుడి దగ్గర ఉన్నవాళ్లంతా గొప్పవాళ్లేనమ్మా. ఆకాశమార్గంలో సంచరిస్తూ, భూమండలాన్ని ఎన్నోసార్లు చుట్టి వచ్చినవాళ్లు. నాకన్నా ఘనులే తప్ప తక్కువ వాడు ఒక్కడూ లేడు. అల్పుడనైన నేనే ఇక్కడిదాకా వచ్చానంటే వాళ్ల గురించి చెప్పడానికేముంది? అధైర్యపడకమ్మా. వానర యోధులంతా ఒక్క గంతులో సముద్రం దాటి వస్తారు. యుద్ధంలో రావణుణ్ని ఓడిస్తారు’ అంటూ ఆత్మవిశ్వాసంతో పలికాడు హనుమ. ఆ మాట సీతమ్మవారిలో సడలిపోతున్న ధైర్యాన్ని నిలబెట్టింది. తనని తాను సామాన్యుడిగా చెప్పుకొన్న హనుమ వైఖరి, అన్ని శక్తులున్నా ఒదిగి ఉండటమెలాగో ఒక పాఠంలా లోకానికి చాటింది.

రామభక్తిని చాటడంలో ఉన్నతుడు, ఉత్తముడు, ధైర్యసాహసాల్లో అసాధారణుడు, సేవలో అసమానుడు... హనుమ. ఆయన మార్గంలో నడిచేవాళ్లను విజయాలు వరిస్తాయి. కర్తవ్యపాలన పట్ల సుముఖత ఏర్పడుతుంది. సానుకూల శక్తి సిద్ధిస్తుంది. జీవనగమ్యాన్ని చేరుకునేవరకూ అదే తోడుగా వస్తుంది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

ఎవరి వాదనలు వారివే!

ఉరుములూ మెరుపులతో కూడిన వర్షాకాల సమావేశాలకు పార్లమెంటు నేటి నుంచి వేదిక కాబోతోంది. ఈ భేటీలను నెలరోజులపాటు నిర్వహించేందుకు రాష్ట్రపతి సమన్లు జారీచేసినా వాస్తవంగా సభ సమావేశమయ్యేది 21 రోజులే. ఇందులోనే ఎత్తుకుపైఎత్తులు వేస్తూ అవతలివారిపై పైచెయ్యి సాధించేందుకు అధికార, ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరుగుతున్న తొలి పార్లమెంట్‌ సమావేశాలు ఇవే. దేశాన్ని కుదిపేసిన ఆ పైశాచికకాండను ప్రస్తావిస్తూ అధికారపక్షాన్ని ఇరుకునపెట్టాలని ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమి భావిస్తోంది. దాన్నే సానుకూలంగా మలుచుకుని ఉగ్రవాదంపై సాధించిన విజయాలను చాటిచెప్పాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పహల్గాం దాడి, ఆపరేషన్‌ సిందూర్‌, దాన్ని ఆపడంలో అమెరికా అధ్యక్షుడి జోక్యం, బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలనలపై ఈ వర్షాకాల భేటీల్లో వాదోపవాదాలు జరగవచ్చు. నోట్లకట్టలు బయటపడిన కేసులో అలహాబాద్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ యశ్వంత్‌వర్మ అభిశంసన, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ, పంటల కనీస మద్దతుధరలకు చట్టబద్ధతలపైనా వాడీవేడిగా చర్చలు జరగవచ్చు. ఎయిర్‌ ఇండియా విమాన దుర్ఘటన, దానిపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక దర్యాప్తు నివేదిక, జనగణన, కులగణన లాంటి అంశాలపైనా ఈ సమావేశాల్లో విమర్శలూ ప్రతివిమర్శలు రేగవచ్చు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం, అక్రమాస్తుల కేసులో రాబర్ట్‌వాద్రాపై ఈడీ ఛార్జిషీట్‌ దాఖలుచేసిన అంశాలను అస్త్రాలుగా చేసుకుని ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడానికి అధికారపక్షం సంసిద్ధమవుతోంది.



అన్నీ కీలకాంశాలే...

కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో ప్రధాన రాజకీయ అంశంగా మారింది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఎన్నికల కమిషన్‌ ప్రకటించింది. పార్లమెంటులో భాజపా తర్వాత అతిపెద్ద పార్టీలైన కాంగ్రెస్‌, సమాజ్‌వాదీపార్టీ, తృణమూల్‌ కాంగ్రెస్‌, డీఎంకేలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. వచ్చే నవంబరులో జరిగే బిహార్‌ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీలన్నీ సమాయత్తం చేయడానికి అక్కడి రాజకీయ పార్టీలన్నీ ఇప్పటికే ఈ అంశాన్ని ఆయుధంగా మలుచుకున్నాయి. క్షేత్రస్థాయిలో యుద్ధం మొదలు పెట్టాయి. అందువల్ల అది పార్లమెంటులోనూ అలజడి సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు పహల్గాంలో భద్రతా దళాల నిఘా వైఫల్యం కారణంగానే ఉగ్రదాడి జరిగిందని ప్రతిపక్షాలు మొదటి నుంచీ ఆరోపిస్తున్నాయి. హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలోనూ దీని గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ఇప్పుడు అదే అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించి ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించడానికి అవి ప్రయత్నించనున్నాయి. పహల్గాం మారణకాండపై ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, అరెస్టులు, భారత్‌-పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణలో అమెరికా జోక్యం గురించి నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ఇది సభలో ఉద్రిక్తతలను పెంచవచ్చు.

మరోవైపు జస్టిస్‌ యశ్వంత్‌ వర్మ అభిశంసన అంశమూ రాజకీయ దుమారాన్ని రేపే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు ఈయన అభిశంసనకు మద్దతిస్తూనే- విద్వేష ప్రసంగం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ శేఖర్‌ యాదవ్‌ తొలగింపునకూ పట్టుబడుతున్నాయి. దానిపై ఇప్పటికే 54 మంది విపక్ష ఎంపీలు రాజ్యసభ ఛైర్మన్‌కు అభిశంసన నోటీసు కూడా ఇచ్చారు. వారిలో 44 మంది సంతకాలను రాజ్యసభ సచివాలయం రూఢీ చేసుకుంది కూడా. అందువల్ల ముందుగా నోటీసు ఇచ్చిన జస్టిస్‌ యాదవ్‌ సంగతి తేల్చిన తర్వాతే జస్టిస్‌ యశ్వంత్‌వర్మ అభిశంసనకు వెళ్లాలని ప్రతిపక్షాలు భీష్మించవచ్చు.

ప్రతి దాడికి సిద్ధం!

స్వతంత్ర భారతంలో జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఒకటైన ఎయిర్‌ ఇండియా-171 దుర్ఘటనపైనా ప్రత్యేక చర్చ కోసం విపక్షాలు పట్టుబట్టవచ్చు. 261 మంది ప్రాణాలను బలిగొన్న ఈ ప్రమాదానికి సంబంధించిన నివేదికపై ప్రతిపక్షాలు అనేక అనుమానాలను లేవనెత్తుతున్నాయి. అర్ధరాత్రి 1.30 గంటలకు నివేదిక విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? దానిపై అధికారుల సంతకం ఎందుకు లేదు? దర్యాప్తు బృందంలో పైలెట్లకు ఎందుకు చోటు కల్పించలేదు? ప్రాథమిక విచారణాంశాలు విదేశీ వర్గాలకు ముందే ఎలా లీక్‌ అయ్యాయి? కాక్‌పిట్‌ వాయిస్‌ రికార్డర్‌లోని కేవలం ఒక అసందిగ్ధమైన వ్యాఖ్యను మాత్రమే ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నలను విపక్షాలు సంధిస్తున్నాయి. ప్రతిపక్షాల దాడికి విరుగుడుగా 50 ఏళ్ల ఎమర్జెన్సీని అధికారపక్షం ముందుకు తెస్తోంది. దానిపై ప్రత్యేకంగా చర్చ చేపట్టి, కాంగ్రెస్‌ను మిగిలిన పక్షాల నుంచి ఏకాకిని చేసే వ్యూహానికి పదును పెడుతోంది. ఎమర్జెన్సీని కాంగ్రెస్‌ మిత్రపక్షాలు కూడా సమర్థించే అవకాశం లేదు కాబట్టి ప్రధాన ప్రతిపక్షాన్ని సభలో దాదాపు ఒంటరిని చేసి తాను పైచేయి సాధించాలని చూస్తోంది.

మింగలేక కక్కలేక...

వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం 16 కొత్త బిల్లులు ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. ఇందులో ఏవీ పెద్దగా రాజకీయ ప్రాధాన్యం లేదు. అయితే గత ఫిబ్రవరిలో మణిపుర్‌లో విధించిన రాష్ట్రపతి పాలన కొనసాగింపునకు ఈసారి సభామోదం పొందాల్సి ఉంది. ఆ సమయంలో అక్కడి పరిస్థితులపై తీవ్రమైన చర్చ జరగవచ్చు. రాష్ట్రపతి పాలన విధించిన అనంతరం ఆ రాష్ట్రంలో జరిగిన జాతుల మధ్య ఘర్షణలు ఆగిపోయాయని చూపిస్తోంది. అయితే రాష్ట్రపతి పాలన అనంతరం మొత్తంగా అక్కడ హింసాత్మక ఘటనలు తగ్గి శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. అక్కడక్కడా చెదురుమదురు సంఘటనల్లో భద్రతా దళాలకు సవాళ్లు ఎదురవుతున్నా, శాంతి నెలకొల్పే ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. కాబట్టి మణిపుర్‌ పరిస్థితులపై అధికార, విపక్షాలు తమకు అనుకూలమైన వాదనలను వినిపించే వీలుంది. ఇక కీలక సమావేశాల వేళ ‘ఇండియా’ కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ‘ఆప్‌’ ప్రకటించేసింది. తిరువనంతపురం కాంగ్రెస్‌ ఎంపీ శశిథరూర్‌ స్వపక్షానికి విపక్షంగా తయారయ్యారు. ప్రతిపక్షానికి ఇవి కాస్త కొరుకుడుపడని అంశాలు. అటు ఆప్‌, ఇటు శశిథరూర్‌లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే- మొత్తం ప్రతిపక్షం గొంతులో పచ్చివెలక్కాయ పడుతుంది. ఇదే సమయంలో అధికార కూటమిలోని అన్ని పార్టీలూ ప్రతి విషయంలోనూ ఏకతాటిపై నిలుస్తూ, మద్దతు పలుకుతుండటం ప్రభుత్వ బలాన్ని పెంచుతోంది.

– వల్లా విజయభాస్కర్



ఓపిక ఉండాలి బాస్‌!

మనకు తొందరగా పండ్లు కావాలని చెట్టు మునిగిపోయేలా నీరుపోస్తే అది కాయలు కాయదు. ఎదగాల్సినంత ఎదిగాక, సీజన్‌ వచ్చినప్పుడే కాస్తుంది. మనుషులైనా అంతే... సమయం రావాలి. వచ్చేవరకూ ఓపిగ్గా ఎదురు చూడాలి. అందుకు చక్కటి ఉదాహరణ... టెంబా బవుమా.

దక్షిణాఫ్రికాలో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన బవుమా తక్కువ ఎత్తువల్ల తరుచూ హేళనకు గురయ్యేవాడు. ‘క్రికెట్‌కు పనికిరాడ’నేవారు. అవేమీ లెక్కచేయని బవుమా జాతీయ జట్టులోకి చేరాలన్న సంకల్పంతో పట్టువదలని విక్రమార్కుడిలా సాధన చేశాడు. ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లోనే సెంచరీ సాధించాడు. కొన్నాళ్లకు అంతర్జాతీయ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు మూడు ఫార్మాట్లలో సారథిగా ఎంపికయ్యాడు. జాతీయ జట్టుకు కెప్టెన్‌ అయిన తొలి నల్లజాతి క్రికెటర్‌గా పేరొందాడు. అయినప్పటికీ కోటాలో జట్టులోకి వచ్చాడని, ఆటగాడిగా అర్హుడు కానివాణ్ని కెప్టెన్‌గా ఎలా కొనసాగిస్తారనే విమర్శలు వచ్చాయి. అవేవీ లెక్క చేయకుండా ఆటపైనే దృష్టి సారించాడు బవుమా. ఫామ్‌లోకి వచ్చి ప్రపంచ టెస్ట్‌ ఛాంపియన్‌షిప్‌లో రాణించి జట్టును గెలిపించాడు. ఫైనల్లో అతడు జట్టును నడిపించిన తీరు అద్భుతం. రెండో ఇన్నింగ్స్‌లో భారీ టార్గెట్‌ ముందున్నా, తొడ కండరాలు పట్టేసినా.. నొప్పిని భరిస్తూ బ్యాటింగ్‌ చేశాడు. తన నాయకత్వ పటిమతో బలమైన ఆస్ట్రేలియా జట్టును నిలువరించి దక్షిణాఫ్రికాను విజయతీరాలకు చేర్చాడు. 27 ఏళ్ల తర్వాత స్వదేశానికి ఐసీసీ ట్రోఫీని అందించాడు. ఏడాది క్రితంవరకు బవుమాను ట్రోల్‌ చేసినవాళ్లు... ఇప్పుడు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇంతకన్నా ఏం కావాలి?

ఏ రంగంలోనైనా లక్ష్యసాధన అనుకున్నంత తేలిక కాదు. బాధలను భరించాలి, త్యాగాలు చేయాలి.. విమర్శలకు తలొగ్గకుండా, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలి. అన్నింటికీ మించి ఓపిక, సాధించగలమన్న నమ్మకం ఉండాలి. ఏదైనా అనుకుంటే అది వెంటనే జరగాలని ఆశపడతాం. ఆ పని జరగకపోతే ‘ఇది నాకు చేతకాదేమో’ అని అంతలోనే నీరుగారిపోతాం. కొంతమంది అయితే అందుకు కారణాలను ఇతరులపై నెట్టడమూ కద్దు. ఇవేవీ సరికాదు. విజయానికి ఎప్పుడూ షార్ట్‌కట్స్‌ ఉండవు. అన్నప్రాసన నాడే ఆవకాయ తినలేనట్లే పని మొదలెట్టగానే ప్రథమ స్థానాన్ని అందుకోలేం. క్రమం తప్పకుండా సాధన చేయాలి. సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచుకోవాలి. ఆ క్రమంలో ఎదురయ్యే కష్టాలను భరించాలి. అవాంతరాలను అధిగమించాలి. అప్పుడే విజయం వెతుక్కుంటూ వస్తుంది. ఒక విజయం మరో విజయానికి పునాది వేసి కెరీర్‌లో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుంది. ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కట్లేదని వాపోతుంటారు కొందరు. అలాంటివారు ప్రయత్నంలో లోపం ఎక్కడుందో పరిశీలించుకోవాలి. సరిదిద్దుకోవాలి. మనవల్ల కాదు, రాదు... అనుకుంటే ఏదీ రాదు. ప్రయాణం కొనసాగించే వారే గమ్యాన్ని చేరుకోగలరు.

– పెద్దిరెడ్డిగారి పవన్‌కుమార్‌ రెడ్డి



జీ7ను దాటిన ‘బ్రిక్స్‌’

ప్రపంచ జీడీపీలో సప్త సంపన్న రాజ్యాల కూటమి జీ7 వాటా 1980ల్లో 70శాతం దాకా ఉండేది. కాలక్రమంలో చైనా, భారత్‌ వంటి దేశాలు ఆర్థికాభివృద్ధిలో పురోగమించడంతో 2000 సంవత్సరం నాటికి అది 43 శాతానికి తగ్గింది. అదే ఏడాదిలో ప్రపంచ జీడీపీలో ‘బ్రిక్స్‌’ వాటా 21.3శాతం ఉంటే, కాలక్రమంలో అది మరింత పెరుగుతూ జీ7ను అధిగమించింది. గడిచిన ఏడేళ్లలో ప్రపంచ జీడీపీలో జీ7, బ్రిక్స్‌ ప్లస్‌ కూటమి దేశాల వాటాలో వచ్చిన మార్పులు...

సంవత్సరం	జీ7	బ్రిక్స్‌
2017	32.3	31.77
2018	31.84	32.33
2019	31.5	32.83
2020	31.08	33.64
2021	30.8	34.08
2022	30.47	34.17
2023	30.05	34.92
2024	29.64	35.43

(ఆధారం: స్టాటిస్టా)

అర్థం చేసుకుని ఆదరిద్దాం!

ఆటిజం, అటెన్షన్‌ డెఫిసిట్‌ హైపరాక్టివిటీ డిజార్డర్‌(ఏడీహెచ్‌డీ) వంటి సమస్యలతో బాధపడేవారు ఎంతో వివక్షకు గురవుతుంటారు. చిన్నప్పుడు చదువుల్లోనూ, పెద్దయ్యాక వృత్తి జీవనంలోనూ ఎన్నో చేదు అనుభవాలను చవిచూస్తుంటారు. మనోవైవిధ్యం కలిగిన వ్యక్తుల గురించిన అవగాహన లోపాలే ఇలాంటి సామాజిక వివక్షకు కారణమవుతున్నాయి.

మేధో సామర్థ్యాల్లో వ్యక్తుల మధ్య వైవిధ్యం సాధారణమని, అది ప్రకృతి సహజమని భావిస్తాం. అలాంటివే కొన్ని రకాల భేదాలకేమో వ్యాధులంటూ ముద్రలు వేసేస్తాం. అయితే ఆటిజం, ఏడీహెచ్‌డీ సమస్యలను జబ్బులుగా పరిగణించరాదని, సాధారణ మానసిక వైవిధ్యంలో భాగాలుగానే వాటిని చూడాలనే అభిప్రాయాలు ఇటీవల కాలంలో ముందుకొస్తున్నాయి. దీన్నే ‘మనోవైవిధ్యం’ (న్యూరోడైవర్సిటీ) అంటారు. మెదడు వికసించే క్రమంలో ఏర్పడే దోషాల వల్ల కలిగే సమస్యలు కాబట్టి ఇవి ‘నాడీవికాస రుగ్మతలు’(న్యూరో డెవలప్‌మెంటల్‌ డిజార్డర్స్‌) అనే కోవలోకి వస్తాయి.

భారతీయ సమాజంలో....

ప్రపంచవ్యాప్తంగా చూస్తే- 15-20శాతం మంది ఈ ‘మనోవైవిధ్య’ కోవకి చెందుతారని అంచనా. భారతదేశానికి సంబంధించి ఈ విషయంలో కచ్చితమైన గణాంకాలు అందుబాటులో లేవు. అందుకు మొదటి కారణం ఏంటంటే- మనోవైవిధ్య వ్యక్తులను గుర్తించడానికి అవసరమైన విధివిధానాలు మన సమాజంలో తగిన స్థాయిలో లేవు. ఇక రెండో కారణం సాంస్కృతికమైనది- ఇంట్లో పిల్లలు కానీ, పెద్దవారు కానీ మనోవైవిధ్య కోవకి చెందినవారని చెప్పుకోవడానికి ఆ కుటుంబం ఇష్టపడకపోవడం. అందువల్లే మన దేశంలో కొన్ని లక్షల మంది ఈ సమస్యలతో బాధపడుతున్నా కచ్చితమైన లెక్కలు తెలియట్లేదు. పిల్లల వరకు ప్రతి 68 మందిలో ఒకరు ఆటిజం బాధితులు కావచ్చని అంచనా. ఇలాంటి నాడీవికాస రుగ్మతల లక్షణాలు చిన్నప్పటి నుంచే బయటపడతాయి. భాషలో, సాంఘిక వికాసంలో, మేధలో కొన్ని భేదాలు 2-6 ఏళ్ల వయసులోనే వెలుగుచూస్తాయి. కానీ, చాలా సందర్భాల్లో వాటిని గుర్తించడంలో ఆలస్యం జరుగుతుంది. అలాంటి చిన్నారులను అల్లరివాళ్లు అంటూనో, మతిమాంద్యం కలిగిన పిల్లలంటూనో ఊరికే కొట్టిపారేస్తుంటారు. అసలు సమస్యని నిర్లక్ష్యం చేస్తారు.

ఉదాహరణకు వివేక్‌కు ఏడేళ్లు వచ్చినా పెద్దగా మాటలు రాలేదు. పెద్ద పెద్ద చప్పుళ్లు వింటే ఉలిక్కిపడతాడు, అలజడిగా స్పందిస్తాడు. ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు కళ్లు కలపకుండా ఎటో చూస్తుంటాడు. ఈ నడత చూసిన టీచర్లు ‘క్రమశిక్షణ లేనివాడు’ అని ముద్రవేశారు. మాటిమాటికి ఆ పిల్లాడి తల్లిదండ్రులని స్కూలుకు పిలిపించి ఫిర్యాదులు చేస్తుంటారు.



అలాగే డిస్లెక్సియాతో సతమతమవుతున్న స్వాతి విషయాన్నే తీసుకుందాం. తొమ్మిదేళ్ల ఈ చిన్నారి- తోటివారితో పోలిస్తే ఎంతో కష్టం మీద, నెమ్మదిగా, బోలెడు తప్పులు చేస్తూ చదువుతుంది. ఆ పాప మానసిక సమస్యను అర్థం చేసుకోకుండా ఇంట్లో వాళ్లు, బళ్లో టీచర్లు కూడా ‘చదువు మీద శ్రద్ధ తగ్గిపోతోంది’ అంటూ చీవాట్లు పెడుతుంటారు. ఇలాంటి మనోవైవిధ్యం కలిగిన పిల్లల చదువు సక్రమంగా సాగాలంటే, ఆ సమస్యల పట్ల టీచర్లకు అవగాహన ఉండాలి. అందుకోసం వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. అలాగే ఇలాంటి పిల్లల సమస్యలను గుర్తించడం కోసం ఉచిత స్క్రీనింగ్‌ సదుపాయాలు ఉండాలి. ఇప్పుడిప్పుడే అక్కడక్కడా కొన్ని స్కూళ్లలో అలాంటివి ఏర్పాటు అవుతున్నాయి. వాటి సంఖ్య పెరగాలి. కొన్నిసార్లు ఆ పిల్లలకు వైద్యం చేసే పీడియాట్రిషియన్లు సమస్యను పసిగట్టగలరు. అలా వారు విషయాన్ని గుర్తించి, నిపుణులను సంప్రదించమని సూచిస్తే తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకూడదు.

సమాధానాలు లేని ప్రశ్నలు

మామూలు స్కూళ్లలో పిల్లలందరూ ఒకే సిలబస్‌ చదువుతారు. కానీ, మనోవైవిధ్యం కలిగిన పిల్లలకు అది సరిపడకపోవచ్చు. కాబట్టి వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన సిలబస్‌ను రూపొందించాలి. దీన్నే ‘వ్యక్తిగత విద్యా ప్రణాళిక’ అంటారు. ఇలాంటి చిన్నారులు చదువులో ఎదుర్కొనే సవాళ్లను గుర్తించిన భారత ప్రభుత్వం విధానపరమైన సవరణలు కొన్ని తెచ్చింది. మనోవైవిధ్య స్థితిని కూడా ఒక మనోవైకల్యంగా గుర్తించి విద్యావ్యవస్థలో ఆ పిల్లలకు ప్రత్యేక హక్కులు దక్కేలా ఏర్పాటు చేసింది. అయితే ఆచరణలోకి వచ్చేసరికి ఒక మూసవిధానానికి అలవాటు పడ్డ మన విద్యావ్యవస్థ ఇలాంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సహాయకారి అవుతుందా అన్నది ఆలోచించాల్సిన విషయం. పైగా మామూలు పిల్లల్లోనే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఒకరు లెక్కలతో ఆటాడుకునే స్థాయిలో ఉంటే- మరొకరు గణితం పేరు చెప్పగానే ఉలిక్కి పడతారు. ఇక మనోవైవిధ్యం కలిగిన చిన్నారుల పరిస్థితులు ఇంకా ప్రత్యేకంగా ఉంటాయి. వారికోసం వ్యక్తిగత విద్యా ప్రణాళికలను రూపొందించడంలో పాఠశాలలు ఎంతవరకు చొరవ తీసుకుంటాయి? అలాగే, విద్యా ప్రమాణాలను నిర్ధారించడం ఎట్లా? ఇలాంటి ప్రశ్నలకు సులభ సమాధానం లేదు. దానికోసం చేసే శోధన మన విద్యావిధానంలో లోతైన సంస్కరణలకు బాటలు వేయొచ్చని ఆశిద్దాం.



ప్రొఫెసర్‌ వి.శ్రీనివాస చక్రవర్తి

ఐఐటీ- మద్రాస్‌లో ఆచార్యులు

కాస్త ఆలోచిస్తే...

హేలాపురి అడవిలో ఒక ఏనుగు ఉండేది. దానికి కోపం ఎక్కువ. కానీ తోటి జీవుల పట్ల చాలా ప్రేమగా ఉండేది. ఆ అడవి మృగరాజు కూడా చాలా మంచిది. ఆకలేస్తే తప్ప వేటాడదు. అదే అడవిలో ఉండే ఒక నక్క జిత్తులమారిది. ఒకసారి అది.. మృగరాజుకీ, ఏనుగుకీ.. ఒకదాని మీద మరొకదానికి చాడీలు చెప్పింది. నక్క గురించి తెలిసిన సింహం.. ఆ మాటలు పట్టించుకోలేదు. ఏనుగు మాత్రం మృగరాజు అంతు చూస్తానని బయలుదేరింది. ఈ విషయం తెలిసి అడవిలోని జంతువులన్నీ కంగారుపడి పోసాగాయి. ‘ఏనుగు, సింహాల మధ్య యుద్ధం జరిగితే అది మన అడవికి అంత మంచిది కాదు. సింహం తొందరపడి గొడవకు దిగదు. ఇప్పుడు మనం ఏనుగునే శాంతపరచాలి. లేకపోతే పక్క అడవి జంతువులకు అది అలుసుగా మారుతుంది’ అని మాట్లాడు కోసాగాయి. దానికోసం ఒక ఉపాయం కూడా ఆలోచించాయి. ఏనుగు.. మృగరాజు గుహకు వెళ్లే దారిలో అడుగు తీసి అడుగు వేయలేనన్ని పక్షులు ఉండేలా చేశాయి. దాంతో కోపంతో నడుస్తున్న ఏనుగు ఒక్కసారిగా ఆగిపోయింది. ముందుకు వెళ్తే ఆ పక్షులు తన కాళ్ల కిందపడి ఎక్కడ చనిపోతాయోనని అలాగే ఉండిపోయింది. ఈలోగా కుందేలు, జింక, ఎలుగు దాని దగ్గరికి వచ్చి.. నక్క కపటబుద్ధి గురించి చెప్పాయి. ఆ మాటలు విని.. ‘ఇంత పని చేస్తుందా? ఆ నక్క అంతు చూస్తాను’ అంది ఏనుగు. విషయం తెలిసి అడవి వదిలి పారిపోయిందది. తిరిగి సింహం, ఏనుగుల మధ్య స్నేహం ఏర్పడింది. ‘పక్షుల గురించి ఆలోచించి ముందుకెళ్లకుండా ఆగిపోయిన ఏనుగు వల్ల.. అడవి అంతా ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. ఎప్పుడైనా సరే మనం తీసుకునే నిర్ణయాల వల్ల పక్కవాళ్లకు నష్టం జరగకుండా చూసుకోవాలి’ అన్నాయి అడవిలోని జంతువులు.



హాయ్‌! బుజ్జీ!!

– కోనే నాగ వెంకట ఆంజనేయులు

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. షూ, ఉంగరం, సాక్స్‌, పట్టీలు
2. అరటిపండు, స్ట్రాబెర్రీ, నీళ్లు, మామిడిపండు
3. రామచిలుక, కోయిల, పిచ్చుక, హంస

జవాబు: 1. ఉంగరం 2. నీళ్లు 3. హంస



అమ్మ దర్శనం.. తనువు పరవశం

ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ఆషాఢసారె సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో క్యూలైన్లు, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆధ్యాత్మికత పరిఢవిల్లింది. - ఈనాడు, అమరావతి



తాడేపల్లిగూడెం నుంచి సారె తీసుకొచ్చి పూజలు చేస్తున్న భక్తులు

పండక్కి.. కొండెక్కి

రేటు పెరిగిపోయిన కొబ్బరికాయ

గొల్లపూడి, న్యూస్‌టుడే



ఈ ఫొటో చూడండి...విజయవాడ నగర పరిధిలోని ఓ సూపర్‌మార్కెట్‌లో ఒక మోస్తరుగా ఉన్న కొబ్బరి కాయ ధరే రూ.48లు పలుకుతుంది. అక్కడే అంత రేటు ఉంటే బహిరంగ మార్కెట్‌లోని ఇంకెంత ఉంటుందోనని ప్రజలు ఆందోళనపడుతున్నారు. పూజలు, హోమాలు, శుభ, అశుభ కార్యక్రమాలకు కొబ్బరికాయ లేనిదే ఆ తంతు పూర్తవదు. కానీ... ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య ప్రజలు కొబ్బరికాయలను కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం చిన్నసైజు కాయలు రూ.30లు పలుకుతుండగా, పెద్ద సైజు రూ.50 నుంచి రూ.70వరకు అమ్ముతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

ఇదే కారణం: కొబ్బరికాయలు విజయవాడకు ఎక్కువగా తమిళనాడులోని పొలాచ్చి, కోయంబత్తూరు నుంచి వస్తుంటాయి. అయితే... అక్కడ చెట్లకు చెదపురుగులు పట్టడంతో దాదాపు 70 శాతం మేర పంట పాడైపోయి దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు కర్ణాటకలోని సామ్రాజ్యనగర్, ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే కాయలుకూడా పూర్తి స్థాయిలో రాకపోవటంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో గతంలో కొబ్బరికి ధర లేదంటూ రైతులు చెట్లను నరికి పామాయిల్ పంట వేయడమూ ధర పెరగడానికి ఓ కారణం.

అమాంతం పెరిగిన ధర... తమిళనాడులో ప్రస్తుతం టన్ను కొబ్బరికాయ ధర రూ.67 వేలు పలుకుతుంది. రవాణా ఖర్చులు రూ.5 వేలు..టన్నుకు సైజును బట్టి 2వేల వరకు కాయలు వస్తాయి. ఈ లెక్కన హోల్‌సేల్ వ్యాపారులకే ఒక కొబ్బరికాయ రూ.36 పలుకుతుంది. పెద్ద సైజువైతే రూ.46 పైమాటే. విజయవాడ నగర పరిధిలో గొల్లపూడి, సత్యనారాయణపురం, ఆటోనగర్, వన్‌టౌన్ ప్రాంతంలో హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం కొబ్బరికాయల ధర పెరగడం వల్ల డిమాండ్ లేదని పూర్తిగా వ్యాపారం పడిపోయిందని హోల్‌సేల్ వ్యాపారి వీరరాఘవులు చెబుతున్నారు.

తగ్గేనా... మరికొద్ది రోజుల్లో శ్రావణమాసం, వినాయకచవితి వేడుకలు వస్తున్నాయి. ఆ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు, వ్రతాలు చేస్తుంటారు. కొబ్బరికాయ ధరలు తగ్గకుంటే భక్తులు కొనలేని పరిస్థితులు ఏర్పడతాయి.

పన్నులకూ ఎగనామం..!

- నేతల సిఫార్సులతో అసలు చెల్లించనివి వేలల్లోనే
- కృష్ణా, ఎన్టీఆర్‌లో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

ఈనాడు, అమరావతి

మున్సిపాలిటీ	పన్ను వేయని ఆస్తులు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	పన్ను తగ్గించిన ఆస్తులు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	మొత్తం ఆదాయం
విజయవాడ	990	1,24,74,264	2388	19940072	3,24,14,336
కొండపల్లి	132	13,66,946	87	41,80,534	55,47,480
నందిగామ	90	5,80,972	52	5,76,608	11,57,580
జగ్గయ్యపేట	37	147696	29	167378	3,15,074
తిరువూరు	37	1,51,518	50	4,74,684	6,26,202

★ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు పట్టణ పరిధిలో 1286 ఆస్తులకు అసలు పన్నే వేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ★ కృష్ణా జిల్లా పరిధిలో తాడిగడప, మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు పట్టణాల పరిధిలోనూ ఏకంగా 1614 నిర్మాణాలను అసలు పన్ను పరిధిలోకి తీసుకురాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పన్నుల పరిస్థితిపై తాజాగా అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో అనేక వాస్తవాలు బయటకొస్తున్నాయి. గత ఐదేళ్ల వైకాపా హయాంలోనే తెరవెనుక లాబీయింగ్ పెద్దఎత్తున సాగింది. అప్పటి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సిఫార్సులతో పట్టణ ప్రణాళిక సిబ్బంది ఈ భవనాలను చూసీచూడనట్టు వదిలేశారనే విమర్శలున్నాయి.



అందుకే ఇప్పటికీ వాటికి పన్నులే చెల్లించడం లేదు. గత నెలన్నరగా నిర్వహిస్తున్న అధ్యయనంలో పన్నుల పరిధిలోకే పూర్తిగా తీసుకురాని నిర్మాణాలు వేల సంఖ్యలో బయటపడుతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి 2,900 భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు అసలు పన్నే విధించకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారు. ★ విజయవాడలోనే అధికంగా.. పన్నుల పరిధిలోకి రాని నిర్మాణాలు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే అధికంగా ఉన్నట్టు అధికారులు గర్తించారు. ఏకంగా 990 వరకూ విజయవాడ పరిధిలో ఇలాంటి నిర్మాణాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఇలా అస్సలు పన్నులు చెల్లించకుండా వదిలేసిన భవనాలపై కనీసం ఒక పన్ను కాలానికి రూ.కోటిన్నరకు పైగా ఆదాయానికి గండి పడుతోంది. ★ ఇవికాకుండా పన్ను విధించాల్సిన దానికంటే తక్కువగా వేసి వసూళ్లు చేస్తున్న భవనాలూ ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఏకంగా 2606 ఉన్నాయి. వీటి ద్వారా ఒక్కో పన్ను కాలానికి ఏకంగా రూ.2.50కోట్ల వరకూ ఆదాయానికి గండి కొడుతున్నారు. నేతల సిఫార్సుల వల్లే వేయాల్సిన దానికంటే తక్కువ పన్ను వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పట్టణ ప్రణాళికలో అక్రమార్కులు..

నగర, పట్టణ ప్రణాళికల్లోని కొంత మంది సిబ్బంది పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారు. ఇప్పటికే విజయవాడ, తాడిగడప పరిధిలోని పలువురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే చాలా మంది సిబ్బంది పట్టణ ప్రణాళిక విభాగంలో పూర్తిగా పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమ భవనాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి దండుకోవడం, పన్నుల్లోనూ అవినీతికి పాల్పడడంపై తీవ్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ముక్త్యాల ఎత్తిపోతలకు రూ.489.28 కోట్లు మంజూరు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రైతులకు అండగా నిలిచి వారికి పురోగతి అందించడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని చూపాలన్న సీఎం చంద్రబాబు సంకల్పం జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆచరణాత్మకం కాబోతోందని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. ఆదివారం తన స్వగృహంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో 38,627 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. వేదాద్రి వద్ద నుంచి 386.27 క్యూసెక్కుల నీటిని రెండు దశల్లో ఎత్తిపోసే ఈ పథకం ద్వారా జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 30కి పైగా గ్రామాలు లబ్ధి పొందనున్నాయన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో నుంచి ప్రవహించే ఎర్ర కాలువ ప్రక్షాళనకు, ఆధునికీకరణకు రూ.5.65 కోట్లు మంజూరు కావడం వల్ల పెద్ద సమస్య తీరనుందని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ఎత్తిపోతలను వైకాపా ప్రభుత్వం పేరు మార్చి కనీస పురోగతి లేకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అయినా ఎంపీ కేసినేని చిన్ని, నెట్టెం రఘురాంలతో కలిసి తాను చేసిన కృషి ఫలించిందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కట్టా నరసింహారావు, నీటి సంఘాల అధ్యక్షులు ఏలూరి గోపాలరావు, చిట్టూరి సుభాష్, మన్నె నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ బోధన.. నైపుణ్య సాధన

జిల్లాలో మూడు పాఠశాలల్లో పాల్ అమలు ★ మరో ఐదు బడుల్లో త్వరలో మొదలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

చదువులో వెనుకబడిన విద్యార్థులపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అటువంటి పిల్లలకు డిజిటల్ విధానంలో బోధించే విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోంది. ఫలితంగా వారంతా విద్యలో రాణించడమే కాకుండా నైపుణ్యవంతులుగా మారేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు కోరుకునే.. అమితంగా ఇష్టపడే విధానంలోనే పాఠాలు అర్థమయ్యేలా చెప్పడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ముఖ్యంగా గణితం, ఆంగ్లం, తెలుగులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు పరిచేలా డిజిటల్ విధానంలో విద్యా బోధనకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) పద్ధతికి సమగ్ర శిక్షా అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఈ తరహా బోధన అందించేందుకు ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడత గతేడాది గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం కేజీబీవీల్లో అమలు చేశారు. ఒక్కొక్క పాఠశాలకు 30 చొప్పున 90 ట్యాబ్‌లు అందజేశారు. పవర్ ఛార్జింగ్ ల్యాబ్ సెటప్‌నకు ఒక్కో పాఠశాలకు రూ.22,500 చొప్పున మంజూరు చేశారు.



ట్యాబ్‌లో పాఠాలు వింటూ

విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి.. ఎంపీఎంఎస్ గంపలగూడెం, ఏపీఎంఎస్ మద్దులపర్వ, ఏపీఆర్ఎస్ భవానీపురం (మైనార్టీ), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ (బాలికలు) నందిగామ, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్ (కొండపల్లి)లో ఈ విద్యా సంవత్సరం నుంచి పాల్ అమలు చేసేందుకు సమగ్ర శిక్షా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలలకు 150 ట్యాబ్‌లు పంపించాల్సి ఉండగా.. 60 ట్యాబ్‌లు జిల్లా కార్యాలయానికి చేరుకున్నాయి. త్వరలో ఆయా పాఠశాలలకు వాటిని పంపించనున్నారు. ★ 6 నుంచి 9 వరకు పాఠ్యాంశాలను ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేస్తారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా విశ్లేషణ ద్వారా ట్యాబ్ పని చేస్తుంది. ల్యాబ్‌లోకి వెళ్లి ట్యాబ్ తీయగానే వీడియోలో పాఠం వస్తుంది. దానిపై కొన్ని ప్రశ్నలు వస్తాయి. వాటిలో ఎన్నింటికి సరైన సమాధానాలు చెప్పారో తెలుసుకొని.. విద్యార్థుల సామర్థ్యాన్ని ఏఐ అంచనా వేస్తుంది. వారూ చెప్పిన జవాబుల ఆధారంగా తర్వాత పాఠాలు వస్తాయి. ఎందుకు? ఎక్కడ? జవాబు తప్పు చేశారో విశ్లేషిస్తుంది.

విద్యా ప్రమాణాలు మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు సాధించాలనేది సర్కారు లక్ష్యం. వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను ఏఐ సాంకేతికతతో ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్నాం. మూడు పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మిగిలిన ఐదు పాఠశాలలకు కొద్ది రోజుల్లో మొదలు పెడతాం.

– జి.మహేశ్వరరావు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు సమన్వయకర్త

ఉద్యోగం పేరిట మోసం

విజయవాడ (మధురానగర్): ఉద్యోగం పేరిట మోసం చేసిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు 17న కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సాత్విక్ (30) మల్టీ నేషనల్ కంపెనీలో డేటా ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు. బాపట్ల టీచర్స్‌కాలనీకి చెందిన చల్లపల్లి అనిల్ కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను బాపట్ల కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని అనిల్‌కుమార్ చెప్పడంతో.. అతడి మాటలు నమ్మారు. రెండు సంవత్సరాల క్రితం రూ.6.5లక్షలు చెల్లించారు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే చంపుతానని బెదిరించాడు. దీనిపై సాత్విక్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నగర పరిసరాల్లో 25.2 మి.మీ.వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయవాడ గ్రామీణ మండలం (నగర పరిసరాల్లో) అధికంగా 25.2 మిల్లీ మీటర్ల వర్షం పడింది. విజయవాడలో 19.6 నుంచి 20 మి.మీ.వరకు నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ 20, పటమట 19.8, గాంధీనగర్ 19.6, భవానీపురం 19.6, విస్సన్నపేట 24.4, తిరువూరు 14.8, వత్సవాయి 6.4, ఎ.కొండూరు 2.4, నందిగామలో అత్యల్పంగా 0.4 మి.మీ. మేర వర్షం పడింది. సగటు వర్షపాతం 7.63 మి.మీ.గా ఉంది.



భయం భయంగా..



బందరురోడ్డు: ఆగిన వాహనాన్ని తోసుకుంటూ వెళ్తూ..



ఎంప్లాయీస్ కాలనీ వద్ద..



జోరువానలో కనిపించక నిదానంగా సాగుతూ..



కనుచూపుమేర అంతా నీరే..



బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మార్గం ఇలా..

దంచింది.. ముంచింది

విజయవాడ నగరంలో ఆదివారం రాత్రి కుండపోతలా వర్షం కురిసింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాన 9.30 వరకు కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లు చెరువులయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు.కొన్నిచోట్ల వాహనాలు ఆగిపోగా, కొంతమంది రోడ్డు కనపడక నీళ్లలో పడిపోయారు. నగరంలోని బెంజిసర్కిల్, మొగల్రాజపురం, బస్టాండ్, పాతబస్తీ ప్రాంతాల్లో కాలువలు పొంగి ప్రత్యక్ష నరకాన్ని చూపింది.

– ఈనాడు, అమరావతి



జలమయమైన నిర్మలా కాన్వెంట్ రోడ్డు...



దారి ఏరైంది..

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరు చేరుతోంది. జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి, సముద్రంలోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టం ఉంది. 3,000 క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి అవసరాలు తగ్గాయి. నీటి విడుదలను బాగా తగ్గించారు. కాలువలకు నీటి విడుదల పరిమితం కావడంతో వచ్చిన వరద నీటిని సముద్రంలోకి వదిలేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సముద్రంలోకి నీటిని విడుదల చేయనున్న క్రమంలో.. కృష్ణా నది దిగువ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

పట్టిసీమ పంపుల తగ్గింపు: పట్టిసీమ నుంచి 22 పంపుల ద్వారా గోదావరి నీటిని విడుదల చేస్తుండగా.. 10 పంపుల వరకు తగ్గించారు. గోదావరి నీటిని ఏలూరు జిల్లాలోనూ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అక్కడి అవసరాలకు పట్టిసీమ ఉపకరిస్తోంది. పులిచింతల నుంచి నీటిని నిలిపివేశారు. వజినేపల్లి నుంచి 1,589 క్యూసెక్కులు వస్తోంది. రెండు రోజుల్లో మునేరు నుంచి వరద నీరు వచ్చే వీలుంది. వెరసి అధికారులు అప్రమత్తమై, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

కాలువలకు నీటి విడుదల తగ్గింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో సాగునీటి కాలువలకు క్రమేపీ నీటి విడుదల తగ్గిస్తున్నారు. బాపట్ల, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాల రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు నీటిని తగ్గించారు. గత కొన్ని రోజులుగా 13,000 పైచిలుకు క్యూసెక్కుల వరకు విడుదల చేయగా.. ఇప్పుడు 9,000 క్యూసెక్కులకు తగ్గించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు ఆదివారం 9,499 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 6,492 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,204, బందరు 1,080, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,205 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. పట్టిసీమ నుంచి 5,680, వజినేపల్లి నుంచి 1589 వెరసి 7,269 క్యూసెక్కులు బ్యారేజీకి వస్తోంది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులు ఉంది.

గోవుకు గూడు.. రైతుకు తోడు

మినీ గోకులాలకు రూ.30.6 కోట్లు

ఈనాడు, అమరావతి

షెడ్డు రకం	ఖర్చు(రూ.)	ప్రభుత్వం	రైతు వాటా
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు పశువులు	1,85,000	1,66,500	18,500
ఆరు పశువులు	2,30,00	2,07,000	23,000



వైకాపా పాలనలో అటకెక్కిన మినీ గోకులాల నిర్మాణానికి పూర్వ వైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 1775 షెడ్లు ఏర్పాటు చేసిన పాడి రైతులకు అండగా నిలిచారు. తాజాగా 2025-26 ఆర్థిక ఏడాదికి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో డ్వామా సిబ్బంది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టారు. గత నిర్మాణ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన విధానంలో నిర్మాణం చేపట్టేందుకు నమూనాలు రూపొందించారు.

పాడి రైతుకు వెన్నుదన్ను.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్‌లో 1000, కృష్ణా జిల్లాలో 700 షెడ్లు మంజూరయ్యాయి. వీటికి రూ.30.6 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. రైతులు పెంచుతున్న పశువులను బట్టి మూడు రకాల షెడ్లు ఏర్పాట్లు చేసుకునేందుకు రైతులకు అవకాశం ఉంది. షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులో 90శాతం నిధులు ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా ఇస్తుంది. మిగిలిన పది శాతం రైతులు చెల్లించాలి. ప్రస్తుతం రెండు జిల్లాల్లో అర్హతలను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

కొత్త నిర్మాణానికి శ్రీకారం.. ఇప్పటివరకు షెడ్ల నిర్మాణంలో మేత తొట్టెలు ఏదో ఒక వైపు నిర్మించేవారు. వర్షం వస్తే మేత తడిసిపోవడం, గాలి, వెలుతురు సవ్యంగా రాకపోవడం వంటి సమస్యలు ఉండేవి. దీన్ని పరిష్కరించేందుకు అధికారులు వినూత్న నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. షెడ్డు మధ్యలో మేత తొట్టి నిర్మిస్తున్నారు. దీని వల్ల షెడ్డు వెడల్పు పెరుగుతుంది. మధ్యలో మేత తొట్టి ఉండడంతో వర్షం వచ్చినా గడ్డి తడవదు. షెడ్డుకు ఇస్తున్న మొత్తం నిర్మాణంలో వృథా ఖర్చులు తగ్గించి ఆ సొమ్ముతో రెండు సీలింగ్ ఫ్యాన్లు, దోమ తెర కూడా అందించనున్నారు. ఈ అంశమై ఎన్టీఆర్, కృష్ణా జిల్లా డ్వామా పీడీలు రాము, శివప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఇది మంచి అవకాశమని క్షేత్రసహాయకులు, ఎంపీడీవో కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జిల్లాలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 21వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం కోసం 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చని వివరించారు.

హరిత బరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని పర్యాటక శాఖకు చెందిన హరిత బరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల గోడ పత్రికను ఆదివారం హరిత బరంపార్కు వద్ద విడుదల చేసి మాట్లాడారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు వీలుగా ప్రతి ఆదివారం వీటిని నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు వారు మొదటి కేటగిరి, 7 నుంచి 10 రెండో కేటగిరి, 11 నుంచి 15 ఏళ్ల వారు మూడో కేటగిరి, 16 సంవత్సరాలు కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు నాలుగో కేటగిరిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. సోలో, బృందంగా, క్లాసికల్, జనరల్‌లో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ప్రతి వారం వినూత్నమైన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీవో కె.చైతన్య, పశ్చిమ తహసీల్దారు ఇంతియాజ్, నగరపాలక సంస్థ అధికారులు బి.సోమశేఖర్‌రెడ్డి, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు, చిన్నారులు

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధానిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో భాగంగా ఆయన రాయపూడి సమీపంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత ఉద్యోగుల భవన సముదాయాలు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల బంగ్లాల నిర్మాణం పనులను అధికారులతో కలిసి పరిశీలించనున్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

భవితకు భరోసా..!

వృత్తి విద్యా కోర్సులతో ప్రయోజనాలెన్నో ★ నెలాఖరు వరకు ప్రవేశాలు

మాచవరం, న్యూస్‌టుడే

పదో తరగతి పూర్తయిన తర్వాత సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ చదవాలని ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. పలువురు విద్యార్థులకు ఈ కోర్సుల్లో చేరాలనే కోరిక ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకపోవడం, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం 1985లో ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిని పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం వారికి ఉచితంగా టెక్స్ట్, నోట్ బుక్స్ అందించనుంది. ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్‌తో పాటు ఈ ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ ఇవ్వనుంది. మలి దశ ప్రవేశాలను ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది. ఇంజినీరింగ్ ఎంపీసీ, పారా మెడికల్ బైపీసీ గ్రూపులతో కొంత సిలబస్‌తో బ్రిడ్జి కోర్సు పూర్తి చేయాల్సి ఉంది. ఈ కోర్సులన్నీ రెండేళ్లలో పూర్తి చేసుకోవచ్చు.

కోర్సుల వివరాలు..

ఇంజినీరింగ్ విభాగంలో.. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ వంటి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది. కంప్యూటర్‌కు సంబంధించిన అన్ని అవసరాలను తీర్చేలా విద్యార్థి తన కాళ్లపై తాను నిలబడేలా తీర్చిదిద్దుతుంది. ఉన్నత విద్యాభ్యాసానికి దోహదం పడుతుంది.

ఈటీ (ఎలక్ట్రికల్ టెక్నీషియన్): విద్యుత్తు రంగానికి సంబంధించిన ప్రాథమిక, మాధ్యమిక అవగాహన కల్పిస్తారు. ఉన్నత విద్యాభ్యాసానికి వీలు. స్థానికంగా గృహ, వాణిజ్య సముదాయ నిర్మాణాల్లో వైరింగ్ పనులు చేసుకోవచ్చు. రైల్వేస్, ఆర్టీసీ వంటి పలు ప్రభుత్వ సంస్థల్లో జూనియర్ లైన్‌మెన్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ టెక్నీషియన్‌గా ఉద్యోగాలు పొందవచ్చు.

సీఈటీ (కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ టెక్నీషి



యన్): ఎస్‌ఈ, జేఈ (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్)లో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల (రోడ్లు, భవనాలు, వంతెనలు, చెరువుల)కు అర్హులు. వీటితో పాటు మండల సర్వేయర్ పోస్టులకు అర్హులు.

ఎం అండ్ ఏటీ (మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్): వాహనాలు, యంత్రాల పని విధానంపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు చదివిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. ఆసక్తి ఉంటే ఉన్నత విద్య కూడా చదవవచ్చు. వివిధ ఆటో మొబైల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్యలో..

★ నీట్ ద్వారా ఎంబీబీఎస్/ బీడీఎస్/ ఆయుర్వేదిక్/ హోమియో/ యునాని/ సిద్ధ కోర్సులు ★ ఎంసెట్ ద్వారా అగ్రికల్చర్/ హార్టికల్చర్/ ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ★ పారా మెడికల్‌లో ఆయితే.. కార్డియాక్ టెక్నీషియన్/ ఎక్స్‌రే/ అనస్థీషియా అసిస్టెంట్, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఈ రెండేళ్ల కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు అర్హులు.

పారా మెడికల్ విభాగం..

ఎంఎల్‌టీ (మెడికల్ లాబ్ టెక్నీషియన్): ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్లినికల్ ట్రైనింగ్ అప్రెంటిస్ పూర్తి చేసిన తర్వాత సొంతంగా ల్యాబ్ పెట్టుకోవచ్చు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) (మహిళలు): ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు క్లినికల్ ట్రైనింగ్ అప్రెంటిస్ పూర్తి చేసుకున్న వారు ఏఎన్ఎం పోస్టులకు, గ్రామ/వార్డు సచివాలయ సర్వేలుగా ఉద్యోగాలు పొందేందుకు అర్హులు.

జాతీయ స్థాయి గుర్తింపు

ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందాలనుకునే వారు ఒకేషనల్ కోర్సుల్లో చేరుతుంటారు. అలాంటి వారికి రాష్ట్ర బోర్డు జారీ చేసే సర్టిఫికెట్ కంటే ఎన్ఎస్‌క్యూఎఫ్ (జాతీయ వృత్తి విద్య శిక్షణ మండలి) సర్టిఫికెట్‌తో అధనపు ప్రయోజనాలు ఉంటాయి.

- బి.ప్రభాకరరావు, డీవీఈవో

యాదవులకు సముచిత స్థానం

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: బీసీలు మొదటి నుంచి అండగా నిలిచిన పార్టీ తెదేపా అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం పోరంకి ఎలైన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా యాదవుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండి అటు వ్యాపారం, ఇటు రాజకీయ రంగాల్లో ఎదగాలన్నారు. గొర్రెల పెంపకానికి ప్రభుత్వం సుమారు రూ.కోటి వరకు రాయితీ రుణాలు అందిస్తోందన్నారు. అవసరమైన వారికి తాను సహకారం అందిస్తానన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తనకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. యాదవులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి పార్థసారథిని ఘనంగా సన్మానించారు.



మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

యోగాతో ఆరోగ్యం.. ఆనందం

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: యోగా సాధన చేస్తే ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉండొచ్చని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్ సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ క్రీడాకారులను అభినందించారు. యోగాసనాల ద్వారా మానసికంగా, శారీరకంగా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 200 మంది క్రీడాకారులు తలపడ్డారు.



మాట్లాడుతున్న కేడీసీసీబీ ఛైర్మన్ రఘురాం

ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. నగర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సీవీ ఆర్ ప్రసాద్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా, ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పర్వతనేని ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అమ్మ తోడ్పాటు అభినందనీయం



విద్యార్థినికి ఉపకార వేతనం అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కన్వెన్షన్ పేద విద్యార్థులకు 'అమ్మ' ఉపకార వేతనాలు అందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో 408 మంది విద్యార్థులకు రూ.16.50 లక్షల ఉపకార వేతనాలు, రాత పుస్తకాలను సున్నపుబట్టీల కూడలిలోని అమ్మ కల్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మను స్ఫూర్తిగా తీసుకొని మరింతమంది పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజాసామ్యాలు సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని కోరారు. మాదక ద్రవ్యాల వల్ల యువత నిర్వీర్యం అవుతోందని, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అమ్మ అధ్యక్షుడు గారపాటి సతీష్‌బాబు అసోసియేషన్ అందిస్తున్న సామాజిక సేవ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.దుర్గామల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగా జోషి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతోనే వెళ్లిపోయా..

★ పోలీసులకు ఏఈఈ కిశోర్ వాంగ్మూలం

★ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

తిరువూరు, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: 'ఏదీ జరిగి నెల దాటినా, రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై తిరువూరు నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చాను' అంటూ.. జలవనరుల శాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తాను అదృశ్యమై చేసుకుంటున్నారనటూ శుక్రవారం లేఖ రాసి, అధికారుల గ్రూపులో పోస్టు చేసి అదృశ్యమైన ఏఈఈ ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో ఉన్నారు. దాంతో రెండ్రోజుల ఉత్కంఠ వీడింది. క్షేమంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తీసుకొచ్చి అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం తిరువూరులోని కార్యాలయం నుంచి విధుల ముగించుకుని బయటకు వెళ్లిన అతను, ఉన్నట్లుండి రాజమహేంద్రవరం చేరుకున్నారు. అక్కడ నగరం ఛార్జ్ ఫోన్ లేక రాత్రికి ప్రయివేటు వాహనంలో విశాఖపట్నం వెళ్లారు. రాత్రి సమయంలో అతని ఫోన్ ఆన్ కావడం..వెంటనే ఆఫ్ కావడంతో విశాఖపట్నంలో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు, అతని కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి వెళ్లారు. తీరా విశాఖపట్నం వెళ్లాక, శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఫోన్ ఆన్ అయినట్లు సిగ్నల్స్ రావడంతో వారు కూడా అక్కడికి చేరుకున్నారు. ఆయినా మళ్లీ ఫోన్ ఆగిపోవడంతో రాత్రంతా అక్కడే ఉండిపోయారు. ఈ లోగా ఫోన్ కలిసే వారు అందుబాటులో ఉండాలని ఏఈఈ కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు.



రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో కిశోర్

చివరికి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ కలవడంతో, సాంకేతిక సాయంతో ఆతను గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ వద్ద ఉన్నట్లు నిర్ధారించుకుని, బాధ్యతతో ఫోన్ మాట్లాడమని సూచించారు. ఈ లోగా నేరుగా అక్కడకు వెళ్లి కిశోర్‌ను పట్టుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరువూరు స్టేషన్‌కు తీసుకొచ్చి, వాంగ్మూలం నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రిలీవ్ చేస్తున్నారని తెలిసి..

శుక్రవారం రాత్రి ప్రయాణంలో ఉన్న అతడు శనివారం రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని, బస్టాండ్ ప్రాంగణంలో గది తీసుకుని అక్కడే ఉన్నట్లు పోలీసులకు వివరించారు. ఈ లోగా తనను రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు, పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలుసుకుని తిరిగి రావడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

అగ్రికల్చర్ పీహెచ్‌డీలో బంగారు పతకానికి ఎంపిక

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడుకు చెందిన దిరిసిపల్లి ప్రత్యూష అగ్రికల్చర్ పీహెచ్‌డీలో బంగారు పతకానికి ఎంపికయ్యింది. దిరిసిపల్లి లక్ష్మయ్య, సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె ప్రత్యూష గుంటూరు లాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని రాజమహేంద్రవరంలో బీఎస్సీ అగ్రికల్చర్, బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, ఇక్కడే స్థిర వ్యవసాయంలో(సస్టైనబుల్ అగ్రికల్చర్) పీహెచ్‌డీ పూర్తి చేసింది. బెస్ట్ డాక్టోరల్ డిగ్రీలో (పీహెచ్‌డీ) బంగారు పతకానికి ఎంపిక చేశారు. ఈ నెల 24న విజయవాడ సర్వ భారతి ట్రస్టులో నిర్వహించే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవంలో బంగారు పతకం అందుకోవాలని విశ్వవిద్యాలయ పీజీ విభాగం డీన్ డాక్టర్ ఎపి రమణ ఆమెకు ఆహ్వానం పంపారు. ప్రత్యూష ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆమెను పలువురు గ్రామస్థులు అభినందించారు.



ప్రత్యూష

కోర్టు పరిసరాల్లో కర్ఫ్యూ వాతావరణం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ పోలీసులు శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన్ని ఆదివారం ఉదయం విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా న్యాయస్థాన పరిసరాల్లో పోలీసులు కఠినమైన ఆంక్షలు విధించారు. న్యాయస్థానంలో వెళ్లే మార్గాలను పూర్తిగా బారికేడ్లతో మూసివేశారు. గోపాలరెడ్డి రోడ్డులో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆదివారంతో పాటు సహజంగానే నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆ దారి, నిర్మానుష్యంగా మారింది. మిథున్‌రెడ్డిని న్యాయస్థానంలో తీసుకువచ్చిన తర్వాత పోలీసులు గేట్లను మూసివేశారు. బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో న్యాయస్థానం ఆవరణలో ఉన్న న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. మరికొందరు బీజేపీ అధ్యక్షుడు ఎ.కె.బాషా ఫోన్ చేయడంతో.. ఆయన హుటాహుటిన అక్కడికి వచ్చారు. పోలీసు వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పరిస్థితి సద్దుమణిగింది.



నిర్మానుష్యంగా గోపాలరెడ్డిరోడ్డు

తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వేలాది తరలి వచ్చిన భక్తులతో ఆదివారం తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మొదలైన రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సుమారుగా 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పుస్తక పఠనంతో ప్రేరణ

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అవి ప్రేరణగా నిలుస్తాయని సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి అన్నారు. పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి రాసిన 'ఆసుపత్రం(నవల), అభిధ్ర (కథల సంపుటి), సజీవం(కవితా సంకలనం), మీరే ప్రేరణ మీదే సాధన(వ్యక్తిత్వ వికాసం), ప్రజాగానం(పాటలు), నేను పుడు కమ్యూనిజానికి సొంతం(ఆరుద్ర)' అనే ఆరు పుస్తకాలను విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సభలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలు, వివిధ పరిణామాల నేపథ్యంలో రాసిన ఈ పుస్తకాలు చదివిన వారికి ఎంతో ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. రచయిత పుస్తకాల గురించి వివరిస్తూ.. ఏవి ఆరు పుస్తకాలకు సంబంధించి సమాధానాలు చెప్పారు. ఆకాయపడం.. అపూర్వ విజయం సవలకు సంబంధించినదిగా వివరించారు. ఉమ్మడి మద్రాసు, నిజాం పాలనలో రెండు ప్రాంతాల ప్రజలు భూముల కోసం ఎలా పోరాడి అపూర్వమైన విజయాన్ని సాధించారో అందులో వివరించినట్లు చెప్పారు. ఎవరికి వారు సొంతంగా ప్రేరణపొంది, క్రమశిక్షణ కొత్త విషయాలు తెలుసుకుని విజయాలను ఎలా సాధించవచ్చన్నది 'మీరే ప్రేరణ.. మీదే సాధన' పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. వివిధ రకాల కోణాలను పరిశీలించి 'అభిధ్ర' పేరుతో కథల సంపుటిని రాసినట్లు వివరించారు. ప్రజా సాహిత్యాన్ని, ప్రజల బాధను, తెలుగు సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పుస్తకాలు రచించినట్లు రవి వివరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్, సాహితీ ప్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకుడు ఎం.వి.ఎస్.శర్మ, జి.తులసీదాస్, కె.ఆనందాచారి, కెంగార మోహన్, సత్యాజీ, గొల్ల నారాయణరావు, జగన్, పెద్ద సంఖ్యలో సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రామచంద్రమూర్తి, రవి, ఆనందాచారి తదితరులు

హెచ్ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ప్రధానోపాధ్యాయుల సమాఖ్య సమావేశం పట్టణంలోని వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వత్సవాయి మండలం భీమవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.రాంబాబు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎ.కొండూరు ఎంపీఆర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఆర్.కేశవరావు, కోశాధికారిగా కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్.వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడిగా తిరువూరు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పిఎస్ఎన్.రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా విస్సన్నపేట ఎంఈవో ఈ.సుధాకర్, రుద్రవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏ.రాంబాబు, సీవీఆర్ మున్సిపల్ పాఠశాల హెచ్ఎం సీహెచ్.వి.సుబ్రహ్మణ్యం, కేంద్ర కార్యవర్గంలో విజయవాడ ఉపాధ్యక్ష మండల ఎంఈవో ఆర్.విజయకుమారి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కె.విజయ్, వి.శ్రీనివాసరావు తెలిపారు. హైస్కూల్ ప్లస్, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయాలని, మండల విద్యాశాఖాధికారి 1, 2 లకు సమానాధికారాలతో జాబ్ చార్ట్ సవరించాలని సమావేశంలో తీర్మానం చేశారు.



తిరువూరులో నిర్వహించిన సమావేశంలో సభ్యులు

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2024, 2025 సంవత్సరాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 కరువు భత్యాలు, 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసేలా అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. బోధనేతర పనుల నుంచి, యాప్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఖాళీల భర్తీ చేయాలని, తెలుగు ఎన్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎం.కృష్ణయ్య, పి.లీల, పి.నాగేశ్వరరావు, మహేశ్వర వెంకటేశ్వరరావు, కె.గంగరాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

విద్యార్థుల్లో రచనా నైపుణ్యాల పెంపునకు కృషి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: మానవ జీవితకి మేథో వికాసం అంతిమ లక్ష్యం కావాలన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సూక్తిని నిజం చేస్తూ ఆకాంక్షలను వెలుగులుగా వేసేలా మంచి ఆలోచనలు ఉన్న ఆదర్శ రూపం ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. నేటితరంలో రచనా శక్తిపై ఆసక్తి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే సృజనాత్మక రచనా నైపుణ్యాలు పెంచేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రణామం' కవి సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కవులు, రచయితలకు ఉన్న శక్తి అసామాన్యమైనదన్నారు. వారి కలం నుంచి జాలు వారిన అక్షర శక్తి ముందు.. తూటా శక్తి నిలబడలేదని కొనియాడారు. అర్థవంతమైన రచనలు సమాజ దిశను మారుస్తాయని, .. సమాజంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు కలం, గళమే కారణమన్నారు. నేటి తరంలో రచనా నైపుణ్యాలు పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



కలెక్టర్ లక్ష్మీశను సన్మానిస్తున్న కలిమిశ్రీ, రఘువేంద్రశేఖర్ తదితరులు

ఆసక్తికరంగా కవితా గానం.. కవి సమ్మేళనంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 80 మంది కవులు విచ్చేశారు. వీరు తెలుగు భాష, ప్రపంచ శాంతి, పర్యావరణం, దేశ భక్తి, సామాజిక చైతన్యం తదితర అంశాలపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహ కలిగి, సమస్యలను పరిష్కారం చూపేలా విజ్ఞాన వ్యక్తిత్వ ముందుకు సాగుతామని కవులు ప్రతిజ్ఞ చేశారు. వ్యాఖ్యాత వేమన హజరత్తయ్య గుప్తా వారితో ప్రతిజ్ఞ చేయించారు. కవిత్వంలో స్వర్ణయుగం వంటి కార్యక్రమం చేసిన వారు.. ప్రముఖ కవులు శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎం.ప్రభాకర్, గంగా విజయ్ కుమార్, మల్లెతీగ కలిమిశ్రీ, డాక్టర్ ఎస్.దుర్గాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డే క్రికెట్ ఛాంప్ 'ప్రకాశం'

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నీ విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మంగళగిరి మైదానంలో ఆదివారం ఒక పరుగు ఓవర్ వద్ద మొదలైన రెండో ఇన్నింగ్స్ ఫాలోఆన్ కొనసాగించిన పశ్చిమ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్ ఎస్.సందేష్ (5/7) మెరిశారు. ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 493 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే ఆలౌటైంది. దాంతో ప్రకాశం జట్టు 306 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. ✦ 'పేరేచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదివారం 47 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కృష్ణా జట్టు 46.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్ ఎస్వీ గోపీచంద్ (5/25) మెరిశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 5.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. దాంతో గుంటూరు జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించింది.



విజేత జట్టు క్రీడాకారులు

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.లలో)



విజయవాడ: బ్రాయిలర్ ఫాం కోళ్ల ధర రూ.112 లైవ్ రూ.134 డ్రెస్ డ్ స్కిన్ 194, స్కిన్ లెస్ 221. అమలాపురం కోళ్ల ఫాం ధర.. బ్రాయిలర్ ఫాం కోళ్లు ...

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

...

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



? స్థానిక బీసీ బాలికల వసతి గృహం పక్కనే మురుగు పేరుకుపోయి దుర్వాసన, దోమలతో వ్యాధుల బారిన పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **-బి.సుధాకర్, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **-బసవలింగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి**

–న్యూస్‌టుడే, జి.కొండూరు



స్పందనకు వందనం

● పట్టణంలోని 3వ వార్డు పరిధి డ్రెయినేజీల్లో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ● పట్టణంలోని 2వ వార్డు బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన విద్యుత్తు నియంత్రిక వద్ద చెత్తాచెదారంతో పరిశుభ్రంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలుపగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో తొలగింపజేసి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

వృద్ధులకు అన్నదానం

భవానీపురం, న్యూస్‌టుడే: రామరాజ్యనగర్‌లోని ఆశీర్వాద్ ట్రస్టులోని వృద్ధులకు స్థానిక వాసి బాలాంత్రపు శేష శైలేష్ జ్ఞాపకార్థం ఆయన భార్య బాలాంత్రపు కమల ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవోఎస్ఆర్‌పీ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ఆలయం బయట ఎమ్మెల్యే కొలికపూడి దంపతులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా అలిపిరి నడక మార్గంలో తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర, తిరువూరు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. అక్కడి వేదపండితులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను వేద మంత్రాలతో ఆశీర్వదించగా ఆలయ అధికారులు శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కళాకారుడికి అరుదైన గౌరవం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కోడూరు గ్రామ మాజీ సర్పంచి, నటుడు వీరంకి వెంకట నరసింహారావుకు అరుదైన గౌరవం దక్కింది. రితీక ఫౌండేషన్ వారు అందించే సామాజిక సేవా పురస్కారాన్ని సినీనటి జగదీశ్వరి చేతుల మీదుగా విజయవాడలోని ఆర్మీ ఫంక్షన్ హాలులో ఆదివారం అందుకున్నారు. నాటకాలు, చలనచిత్ర రంగంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం దక్కడం సంతోషదాయకమని వీరంకి వెంకటనరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నిత్యాచారి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో స్వామి, అమ్మవారు



పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని పెనుగొలనులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ విగ్రహాలను కాయగూరలతో అలంకరించారు. దేవతామూర్తుల మూలవిరాట్టులకు అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరి అలంకరణలో ఉన్న స్వామి, దేవతామూర్తులను గ్రామస్థులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గుడి కమిటీ కార్యదర్శి సత్యనారాయణచారి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాగయ్యేనా.. సాగయ్యేనా..?

ప్రశ్నార్థకంగా మారిన తారకరామ ఎత్తిపోతల పథకం



కట్టుబడిపాలెం సమీపంలో నిర్వహణకు నోచుకోని పంపుహౌస్

జి.కొండూరు, న్యూస్‌టుడే

కుడికాలువ కింద వివరాలు	
పంప్‌హౌస్‌లు	04
మోటార్లు	14
పనిచేయనివి	10
ఆయకట్టు	4818 ఎకరాలు

మైలవరం నియోజకవర్గంలో మెట్ట ప్రాంత రైతులను ఆదుకునేందుకు వీటీపీఎస్ వేడి నీటిని తారకరామ ఎత్తిపోతల ద్వారా ఎత్తిపోయాలనే లక్ష్యంతో తారకరామ ఎత్తిపోతల నిర్మించారు. 1988లో దీనికి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేయగా 1999లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు చొరవతో పనులు ప్రారంభమయ్యాయి. మూడు విడతల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా రెండు విడతల నిర్మాణ పనులు మాత్రమే చేసి తదుపరి ఆగిపోయాయి. దీంతో మైలవరం మండలం వరకు వెళ్లాల్సిన సాగునీరు జి.కొండూరు మండలం వరకే వెళుతోంది. ఈ క్రమంలో కుడి కాలువను ఈలప్రోలు నుంచి జి.కొండూరు వరకు నాలుగు పంపుహౌస్ నిర్మించి కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. కాలక్రమేణా అధికారులు, ప్రజాప్రతినిధులు దీని నిర్వహణను గాలికొదిలేయడంతో కాలువల్లో తూడుకాడ, జమ్మి గడ్డి పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది.

గత ఐదేళ్లూ పట్టించుకోలేదు: ఈ ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురై ఆయకట్టు రైతులు సాగు చేపట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా ఎత్తిపోతల నిర్వహణ చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తే సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నదాతలు వాపోతున్నారు. రైతులకు సకాలంలో సాగు నీరందక దాదాపు 5 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీరు లేక తూటుకాడ, జమ్మి గడ్డితో దుస్థితికి చేరిన కాలువ

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి..

తారకరామ ఎత్తిపోతలపై ఆధారపడి పంటలు వేసే ఆయకట్టు గ్రామాలైన కవులూరు, కట్టుబడిపాలెం, పినపాక, జి.కొండూరు, గడ్డమణుగు రైతులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎత్తిపోతల నిర్వహణపై దృష్టి సారించి సాగునీరు అందిస్తే మెట్ట ప్రాంతమంతా సస్యశామలంగా సాగు చేపడుతామని వాపోతున్నారు. ఈ విషయమై తారకరామ సహాయక ఇంజినీర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశామని త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. అనంతరం ఎత్తిపోతల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు.

పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పి.వినయ్‌కుమార్ అనే యువకుడు ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి దుకాణానికి వెళ్తుండగా మార్గమధ్యలో రూ.30వేల విలువైన చరవాణిని పోగొట్టుకున్నాడు. దీనిపై ఈనెల 17వ తేదీన అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సత్యనారాయణకు అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సదరు యువకుడు పోగొట్టుకున్న ఫోను ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రపల్లి గ్రామంలో ఓ వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ వ్యక్తి నుంచి చరవాణి స్వాధీనం చేసుకుని ఫిర్యాదుదారుడికి ఆదివారం అందజేశారు. దీంతో ఆ యువకుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.



యువకుడికి ఫోన్ అందిస్తున్న కానిస్టేబుల్

సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి



బదిలీ అయిన సచివాలయ సిబ్బందితో ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ సేవలందించిన వారికి ఎక్కడికి వెళ్లినా మన స్వాగతమే లభిస్తుందని గ్రామ సర్పంచి నెలివి ఆశాలత అన్నారు. బదిలీపై వెళుతున్న కేతనకొండ సచివాలయ సిబ్బందికి ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు ఆదివారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన సచివాలయ సిబ్బందికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మౌనిక, సర్పంచి పత్రి లేపాక్షిరావు, గోపాలరావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు జి.ఆర్.ఎస్. ఫౌండేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. మహానాడులోని సేవాభారతి సంస్థలోని పేద విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలను అందించారు. అలాగే జక్కంపూడిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి వేద స్మార్త సేవా సమితి వేద పాఠశాలలో అన్నదానం చేశారు. వేద పాఠశాలకు అవసరమైన నిత్యావసర సరుకులను అందజేశారు. జీఆర్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉషాబాల, స్రవంతిలకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జీఆర్ఎస్ సంస్థ ముఖ్య కార్యదర్శి కొండవీటి రవికుమార్, పార్వతి, మామిడిపల్లి సాయిబాబు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులతో జీఆర్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు

న్యాయమైన వినతులు పరిష్కరించాలి



తిరువూరు పురపాలిక కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ వేతనాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గతేడాది తమ సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం హామీలిస్తూనే అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని ఆవేదన చెందారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సీఐటీయూ, ఇంజినీరింగ్ కార్మికుల సంఘాల నాయకులు బి.వెంకటేశ్వరరావు, మోహనరావు, కిశోర్, రవి, నరసింహారావు, నారాయణ, కృష్ణయ్య, బాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. పిండి వంటలు, పాయసంతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. పూలు, వేపమండలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మూలవిరాట్టుకు బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంగానమ్మకు సారె సమర్పణ

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి సూరాయపాలెంలోని గంగానమ్మ గ్రామస్థులు సారెను ఆదివారం సమర్పించారు. డప్పు వాయిద్యాలు, కోలాటంతో గ్రామంలో ఊరేగింపుగా గంగానమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయంలో మహిళలు



గొల్లపూడి: కోలాటం ఆడుతూ ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గుంతలు దాటితే గండం గడిచినట్లే..!



మోకాలిలోతు గోతుల్లో నీరు నిలిచి ఇలా

చెరువుమాధవరం గ్రామంలో రంగా బొమ్మ సెంటర్ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వానకు సైతం మార్గం లో ఏర్పడిన గుంతల్లో మోకాలి లోతు నీరు నిలబడి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కనీసం గుంతలైనా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనికితోడు కాలానుగుణ వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. రహదారికి ఇరువైపులా సరైన డ్రెయినేజీలు లేకపోవడం, రహదారి పూర్తిగా పల్లంగా మారడంతో అవస్థలు పడుతున్నామని పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

ముళ్లపొదలు.. వెళ్లలేక ఇక్కట్లు



చిన నందిగామ-పుట్రేల ఆర్అండ్‌బీ రహదారిలో ఓబులాపురం గ్రామంలోని నాగసాని పాటి చెరువు దగ్గర తారురోడ్డు పైకి దట్టంగా పెరిగిన ముళ్లపొదలతో వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి సమయాల్లో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఆ కంపచెట్లలోకి వెళ్లి చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలా రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన పొదలను తొలగించి రాకపోకలు సజావుగా సాగే విధంగా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

రైతన్నకు మరో సాయం

అన్నదాతలకు అండగా ఉపాధి హామీ పథకం ద్వారా కంపోస్టు కుంటల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించగా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో వాటి నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలో 540 కుంటలకు అనుమతులు రాగా 302 కుంటల పనులు పూర్తయ్యాయి. కంపోస్టు కుంటల్లో సేంద్రియ వ్యర్థాలను కుళ్లబెట్టి ఎరువును తయారు చేసుకోవచ్చని ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని తవ్వకానికి రూ.వెయ్యి వరకు ప్రభుత్వం సహాయం అందిస్తోందని సేంద్రియ సాగు చేసే రైతాంగానికి ఎరువుల ఖర్చు తగ్గుతుందని ఉపాధి హామీ పథకం ఇబ్రహీంపట్నం ఏపీవో ప్రమీలా తెలిపారు. **-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**



కేతనకొండలో పూర్తయిన కంపోస్టు కుంట

పనులే అనుకుంటే..దిమ్మెలు కూడానా..!



వైకాపా పాలనలో చేసిన పనులతో పాటు వాటి వివరాలకు ఏర్పాటు చేసిన దిమ్మెలు సైతం రెండు రోజుల వానలకే కూలిపోతున్నాయి. కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం సమీపంలో మురుగు కాలువ విషయమై ఓ దిమ్మెను గతంలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది కాస్తా పడిపోయింది. చేసిన పనుల వివరాలు వర్షపు నీటిలో కలిసిపోయినట్లు అయ్యింది. అయితే ఈ పనులకు సంబంధించి గుత్తేదారులకు ఇప్పటికీ నగదు చేతుల్లోకి రాకపోవడం గమనార్హం. **-న్యూస్‌టుడే, కొండపల్లి**

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత భావన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో కొల్లా భావన్ విజేతగా నిలిచాడు. ప్రీతం దర్శన్, బీజేఎస్‌కే రణధీర్, షేక్ జులేఖ బహార్, మందుల బాబు శామ్యూల్ ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుస స్థానాల్లో నిలిచారు. అండర్-7, 9, 11, 13 కేటగిరీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు నగదు పారితోషికాలు అందజేశారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎస్.రమ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్, పీఈటీ హనుక్ కుమార్ పాల్గొన్నారు.

తెదేపా నాయకుడికి నివాళి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు సుందరమ్మ చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గోపాలరావు ఇటీవల మృతిచెందగా శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ ఆదివారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెరువుమాధవరం గ్రామంలో సర్పంచి భర్త బాణవతు రాము, తెదేపా గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు బళ్ల సాంబశివరావులు అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి బాధితులను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత అదే గ్రామంలో భాజపా మండల అధ్యక్షుడు చల్లా నాగమల్లేశ్వరరావు తాతయ్య చల్లా కొండయ్య ఇటీవల మృతి చెందారని తెలుసుకుని కూటమి నాయకులతో కలిసి వెళ్లి కొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కొండపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న వైస్ చైర్మన్ శ్రీను



మైలవరంలో..



విస్సన్నపేట: పుట్రేలలో..

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన

కొండపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందజేస్తోందని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి 29వ డివిజన్ 161వ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ ఫర్హాన్, సాంబమూర్తి, వెంకటేశ్వరరావు తదితరుతు పలాగ్గన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మైలవరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన నాయకులు కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో చేసిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. లితీష్, బాలకృష్ణ, బాబూరావు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో గత ఏడాది కాలంగా ఎన్డీయే కూటమి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెదేపా నాయకులు వివరిస్తూ సంబంధిత కరపత్రాలను అందజేశారు.



తిరువూరు: చింతలపాడులో..

దుర్గగుడికి విరాళాల అందజేత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వేర్వేరు పథకాలకు దాతలు రూ.3,02,232 విరాళాన్ని ఆదివారం అందజేశారు. దుర్గగుడి ఉచిత ప్రసాదం పంపిణీ పథకానికి గుంటూరు చంద్రమౌళి నగర్‌కు చెందిన శివశంకర్ పద్మ దంపతులు రూ.లక్ష, గో సంరక్షణ నిధికి తాడేపల్లికి చెందిన సూర్యనారాయణ ప్రసాద్, జయలక్ష్మీ దంపతులు రూ.1,01,116, నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



ఆశీర్వచన మండపంలో దాత శివశంకర్ పద్మ దంపతులు



దాత సూర్యనారాయణ ప్రసాద్ దంపతులకు విరాళం రశీదు ఇస్తున్న ఈవో శీనానాయక్

మొక్కలు పెంచడం బాధ్యతగా చూడాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: వంటింట్లోని వ్యర్థాలను కంపోస్టుగా చేసుకొంటే మొక్కలకు మంచి ఎరువు అవుతాయని సీటీజీ(సిటీస్ టెర్రాస్ గార్డెన్) సభ్యులు బి.పద్మజ అన్నారు. మెప్మా ఎస్‌హెచ్‌జీ సమావేశం సచివాలయం-2లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవకాశం ఉన్న ప్రదేశంలో మొక్కలను పెంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కొండపల్లి వంటి కాలుష్యం కలిగిన ప్రాంతంలో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలని చెప్పారు. మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ..పొదుపు సంఘ మహిళలు ఒకొక్కరు ఒక మొక్క నాటడంతో పాటు ఇతరులతో కూడా నాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సీటీజీ సభ్యులు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీటీజీ సభ్యురాలు పద్మజ

సీతాకోకలు వస్తున్నాయ్.. వసతులు లేకున్నాయ్

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే: తొలకరి వానలు పడుతుండగా సందడి చేస్తున్న సీతాకోక చిలుకల కోసం వస్తున్న ప్రకృతి ప్రేమికులకు వసతుల లేమి వెంటాడుతోంది. ఇబ్రహీంపట్నం మండల శివారు మూలపాడు అటవీ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ సీతాకోక చిలుకల వనాన్ని కొన్నేళ్ల కిందట నిర్మించింది. కూటమి ప్రభుత్వం ఈ వనాన్ని ఆకర్షణీయంగా మార్చాలని, పర్యాటకులను పెంచాలని దాని రూపురేఖలు పూర్తిగా మార్చింది. వర్షాకాలం మూడు నెలలు సీతాకోక చిలుకలు సీజన్ కావడంతో దాదాపు 500 రకాల సీతాకోకలు ఇక్కడి చెట్లపై వాలుతూ కనువిందు చేస్తాయి. వీటిని చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. సాధారణ రోజుల్లో 100 మందికి పైగా వస్తుంటే ఆదివారాలు, సెలవుదినాలు, పర్వదినాల్లో 500 మంది వరకూ సందర్శిస్తుంటారు.



ప్రస్తుతం ఇది ఒక్కటే పనిచేస్తోంది..

ఈ ఇబ్బందులే ఎక్కువ

సందర్శకులకు తగ్గట్టుగా వసతులు లేకపోవడం విచారకరం. టాయిలెట్ల సౌకర్యం ఇంకా ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు తాగునీటికీ కొరతే. వనధార పేరిట తాగునీటిని ప్లాంటును ఏర్పాటు చేసినా ఒక్క చోట మాత్రమే రావడంతో పర్యాటకులకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు వ్యర్థాలు వేయడానికి డంపింగ్ బుట్టలు ఒకటే ఉండడంతో పర్యటకులు ఉపయోగించిన వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వదిలేస్తున్నారు.

ప్రాధాన్యత క్రమంలో: వనం అధికారి, శివప్రసాద్

గత సంవత్సరం నుంచి ప్రాధాన్య క్రమంలో వసతులు ఏర్పాటు చేస్తున్నాం. వనం ఇంకా ఆకర్షణీయంగా ఉంచాలన్న సంకల్పంతో పనులు జరుగుతున్నాయి. టాయిలెట్లతో పాటు తాగునీటి సౌకర్యాన్ని పలు చోట్ల ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

అవి మా బంగారాలు... అందుకే సింగారాలు!



ఆరోగ్యం, అందం మేం పెంచుకునే జంతువులకు కూడా కావాలనుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున గ్రూమింగ్ సెంటర్లు వెలిశాయి. ఇప్పుడు ఆ కేంద్రాలే ఇంటికి తరలి వచ్చి మరీ పప్పీ... డాలీలకు ముస్తాబు చేసి వెళుతున్నాయి.

ఒకప్పుడు కాస్మోపాలిటన్ నగరాలకే పరిమితమైన పెంపుడు జంతువులు, పక్షుల ముస్తాబు (పెట్ గ్రూమింగ్) కేంద్రాలు ఇప్పుడు చాలా చోట్లకు వచ్చేశాయి. హైదరాబాద్‌లో వందల సంఖ్యలో ఉంటే... విశాఖలో 60పైగా పెట్ గ్రూమింగ్ కేంద్రాలున్నాయి. ఇంటికే వచ్చి ముస్తాబు చేసే మొబైల్ గ్రూమింగ్‌కు విపరీతమైన ఆదరణ ఉంది.

నఖశిఖ పర్యంతం...

- పెంపుడు జంతువుల గ్రూమింగ్ ప్రక్రియకు గంట వరకు సమయం తీసుకుంటారు.
- పెట్స్‌కు పేలు(టిక్స్) వంటివి రాకుండా ఔషధ స్నానం చేయించి బ్లోయర్‌తో తడి ఆరబెడతారు.
- హెయిర్ కటింగ్, పళ్లను పాలిష్ చేయడం, గోళ్లకు గ్రైండింగ్ చేయడం, చెవులు క్లీన్ చేయడం వంటివి చేస్తారు.
- ఎక్కువ రోమాలు ఉండే శునకాలకు ముఖం అందంగా కనిపించేలా వివిధ ఆకృతుల్లో ట్రిమ్మింగ్, కటింగ్ చేస్తారు.

రంగు పడాల్సిందే...

శుభకార్యాలకు, టూర్‌లకు సైతం పెంపుడు జంతువులను వెంట తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో అందరినీ ఆకర్షించేలా జుత్తుకు, చెవుల వద్ద, తోక వద్ద హెయిర్ కలర్స్ వేస్తున్నారు. దీనికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు తీసుకుంటున్నారు. ఈ రంగులు జంతువుల ఒంటిపై 45 రోజులపాటు ఉంటాయి.

నెలవారీ ప్యాకేజీలు...



- ఫుల్ గ్రూమింగ్‌కు పెట్ సైజు, బ్రీడ్‌ను బట్టి రూ.1200 నుంచి రూ.2,500 వరకు తీసుకుంటారు.
- ముఖం, కళ్లు, కాళ్ల వద్ద జుత్తు కత్తిరించి, గోళ్లు తీసేసి, స్నానం చేయిస్తే రూ.వెయ్యి వరకు తీసుకుంటున్నారు.
- వీటితోపాటు నెలవారీ ప్యాకేజీలు రూ.5వేల వరకు ఉన్నాయి.

స్పాలు కూడా...

మనుషుల తరహాలోనే పెంపుడు జంతువులకు ఒత్తిడిని తగ్గించడం, శారీరక ఆరోగ్యం కోసం స్పాలున్నాయి. అరోమాథెరపీ, హైడ్రోథెరపీ వంటివి కొన్ని స్పాలలో అందిస్తున్నారు.

ఏఐ వాడేస్తున్నారు...

- పెంపుడు జంతువుల గ్రూమింగ్‌లో ఏఐ కూడా ఉపయోగిస్తున్నారు. అధునాతన క్లిప్పర్లు, స్మార్ట్ బ్రష్‌లు, ఆకృతి, కలర్ ఏది బాగుంటుందో కృత్రిమ మేధతో అంచనా వేస్తున్నారు.
- ఆటోమేటిక్ బ్లో డ్రైయర్ల వంటివీ అందుబాటులోకి వచ్చాయి.

డిమాండ్ చాలా...

- పెట్ గ్రూమింగ్ సేవలకు ప్రస్తుతం ఆదరణ పెరుగుతోంది. ఈ రంగంలో విదేశాల్లో ట్రైనింగ్ అయి వస్తున్న వాళ్లు కూడా ఉన్నారు.
- వెటర్నరీ కళాశాలల్లో డిప్లొమా చేసేవారు కూడా ఈ శిక్షణ పొందుతున్నారు.

పెంపుడు జంతువుల సంరక్షణ పరిశ్రమ భారత దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ఏడాది (2025) దాని విలువ రూ.20వేల కోట్లుగా ఉండొచ్చని భావిస్తున్నారు.

- ఈనాడు, విశాఖపట్నం



మిథున్‌రెడ్డే కుట్రదారు

- మనీ లాండరింగ్, బలవంతపు వసూళ్లలో కీలక పాత్ర
- రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన సిట్



మిథున్‌రెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కుట్రకు ప్రధాన రూపకర్త, మద్యం మాఫియా కుట్రల ప్రధాన అమలుదారు వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డేనని సిట్ నిగ్గుతేల్చింది. ముడుపుల సొమ్మును నేరుగా ఆయనే అందుకునేవారని ఆదివారం ఏసీబీ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. ముడుపుల్ని కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (ఏ1) వసూలు చేసి.. ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, బాలాజీ గోవిందప్పల ద్వారా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చేరవేసేవారని తెలిపింది. మనీలాండరింగ్, బలవంతపు వసూళ్లలో మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొంది. నెలకు రూ.50-60 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడ్డారని తెలిపింది. ముడుపులు అందిన బ్రాండ్‌లనే విక్రయించేందుకు వీలుగా మద్యం విధానాన్ని రూపొందించారని తెలిపింది. సాక్షులిచ్చిన వాంగ్మూలం, ఆర్థిక లావాదేవీలు, సాక్ష్యాధారాలు, ఈమెయిళ్లను విశ్లేషించాక ఆయన కుట్రపూరిత పాత్రను నిర్ధారించినట్లు వెల్లడించింది. ఏపీఎస్‌బీసీఎల్ విషయంలో ఎలాంటి అధికారం లేకపోయినా.. 'డిఫ్యాక్టో కంట్రోలర్'గా వ్యవహరించారని తెలిపింది.

ముడుపులిస్తేనే ఎక్కువ ఆర్డర్లు

ముడుపులిచ్చిన ప్రైవేటు డిస్టలరీస్‌కు ఎక్కువ మొత్తంలో ఆర్డర్లు ఇచ్చి, ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం చేకూర్చారని తెలిపింది. పారదర్శకంగా జరిగే మద్యం విక్రయ విధానానికి తూట్లుపొడిచి ముడుపులందిన కంపెనీల సరకు విక్రయానికి నేరపూరిత వ్యూహరచన చేసిన వారిలో మిథున్‌రెడ్డి కీలకమని వివరించింది. ముడుపులను వివిధ షెల్ కంపెనీలు, బినామీలు, రాజకీయ సంబంధ వ్యాపారాల ద్వారా మళ్లించినట్లు పేర్కొంది. ఎక్సైజ్‌శాఖ, ఏపీఎస్‌బీసీఎల్‌లలో ఎలాంటి పోస్టు నిర్వహించనప్పటికీ మద్యం విధాన రూపకల్పనను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనే ప్రభావితం చేసినట్లు తేలిందని తెలిపింది. ఎక్సైజ్ వ్యవహారాల్లో పెద్దగా అనుభవం లేని సత్యప్రసాద్(ఏ3)ని ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేక అధికారిగా నియమించడంలో ఆయన పాత్ర ఉందని పేర్కొంది. కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తామని లిక్కర్ సిండికేట్ కోసం పనిచేయాలని కోరారంది. మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు లిక్కర్ సిండికేట్ సభ్యులు రాజ్ కసిరెడ్డి, ఆయన తోడల్లుడు అవినాశ్‌రెడ్డి తదితరులు విజయసాయిరెడ్డి ఇంట్లో సమావేశమయ్యారని తెలిపింది. మద్యం బేసిక్ ధరలో 12 శాతం ముడుపుల రూపంలో తీసుకోవడాన్ని ప్రారంభించి 20 శాతానికి పెంచారని వివరించింది.

రిమాండ్ రిపోర్టులోని ముఖ్యాంశాలు..

- ప్రముఖ మద్యం బ్రాండ్లను కావాలనే పక్కన పెట్టి.. ముడుపులిచ్చిన బ్రాండ్లకు అనుమతివ్వడంలో మిథున్‌రెడ్డి పాత్ర కీలకం. మద్యం స్టాకులు, విక్రయాలు, తదితర విషయాలను ఆయనే పర్యవేక్షించారనేందుకు ఎఫ్ఎస్ఎల్ రిపోర్టే ఆధారం.
- కాల్ డేటా రికార్డులు (సీడీఆర్) పరిశీలిస్తే గత ప్రభుత్వంలోని అత్యంత ప్రభావితమైన వ్యక్తులు మద్యం మాఫియాకు పాల్పడినట్లు వెల్లడైంది.
- రాజ్ కసిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి సహా అప్పటి ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు పలుమార్లు సంప్రదింపులు జరిపారు.
- మద్యం ముడుపులను ఎలా హ్యాండిల్ చేయాలో చర్చించేందుకు రాజ్, ఇతర నిందితులను మిథున్‌రెడ్డి కలుస్తుండేవారు. కాల్ డేటా రికార్డు (సీడీఆర్), లొకేషన్ వివరాలను విశ్లేషిస్తే హైదరాబాద్, విజయవాడ, తాడేపల్లిలలో నిందితులు పలుమార్లు కలిసినట్లు వెల్లడైంది.
- ముడుపుల సొమ్ము తరలింపు, అంతిమ లబ్ధిదారులు ఎవరనే విషయాన్ని తేల్చాలంటే ఆయనను కస్టడీలోకి తీసుకొని విచారించాలి.
- దుబాయ్, అమెరికా, ఆఫ్రికా దేశాలకు చెందిన డొల్ల కంపెనీలలో ముడుపులను పెట్టుబడిగా పెట్టారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ సైతం అనుమానాస్పద ఆర్థిక వ్యవహారాలు నిర్వహించింది.
- మద్యం ముడుపుల ద్వారా వచ్చిన కొంత సొమ్మును 2024 సాధారణ ఎన్నికల్లో అక్రమాలకు, ఓట్ల కొనుగోలుకు వినియోగించినట్లు దర్యాప్తులో తేలింది. ఎవరి ప్రోద్బలంతో ముడుపుల సొమ్మును ఎన్నికల్లో వినియోగించడానికి మళ్లించారో తేల్చేందుకు ఆయనను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సి ఉంది.
- మిథున్‌రెడ్డి ఓ రోజు విచారణకు హాజరై ఎగవేత ధోరణిలో సమాధానాలు చెప్పారు. దర్యాప్తునకు సహకరించలేదు. ఆయనకు నేర చరిత్ర ఉంది.
- ఇప్పటికే పలు కీలక ఆధారాలను సీజ్ చేశాం. ఎఫ్ఎస్ఎల్ పరీక్షకు పంపాం. నివేదికలు రావాల్సి ఉంది. తదుపరి దర్యాప్తునకు ఆ ఫలితాలు చాలా కీలకం.
- ఆయనను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉంది. బయట ఉంటే సిట్టింగ్ ఎంపీగా సాక్ష్యాధారాలను తారుమారు చేయడంతోపాటు సాక్షులను బెదిరించే అవకాశం ఉంది.

అరెస్ట్‌కు కారణాలివే

మద్యం కుంభకోణం రూపకల్పనలో మిథున్‌రెడ్డి సహ కుట్రదారు. ఏపీఎస్‌బీసీఎల్ అధికారుల సమావేశంలో పాల్గొని మార్గనిర్దేశం చేశారు. వారిని ప్రభావితం చేశారు. ఎస్పీవై ఆగ్రో, సాన్‌హాక్ ల్యాబ్స్, డికార్ట్ లాజిస్టిక్స్ సంస్థల ద్వారా మద్యం ముడుపులను తన కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు చేరేలా చేశారు.

- అక్రమ మార్గంతో పొందిన సొమ్మును రాజకీయ ప్రయోజనాల కోసం 2024 సాధారణ ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల్లో వినియోగించారు. ఇది జాతి ప్రయోజనాలకు హానికరం. అప్రజాస్వామికం.
- నేర ఘటనలో లోతైన కుట్ర కోణం దాగి ఉంది.
- మద్యం ముడుపుల కోసం షెల్ కంపెనీలను వినియోగించారు. ఈ వ్యవహారంలో క్విడ్‌ప్రోకో, మనీలాండరింగ్ నేరాన్ని తేల్చడానికి తదుపరి దర్యాప్తు అవసరం.

ఎన్టీఆర్ ట్రస్టు సేవలను మరింత విస్తృతం చేస్తాం: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా తలసీమియా బాధితులకు అండగా నిలవాలనే తమ ప్రయత్నానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనకు కృతజ్ఞతలు అని సీఎం చంద్రబాబు అన్నారు. ఓ మంచి కార్యక్రమానికి ప్రజలు ఎంత మద్దతిస్తారో చెప్పడానికి విశాఖ సాగర తీరంలో తలసీమియా రన్‌కు వచ్చిన ఆదరణ నిదర్శనమని ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఎన్టీఆర్ ట్రస్టు సేవల్ని మరింత విస్తృతం చేస్తాం. తలసీమియా బాధితుల కోసం విజయవాడలో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తే వందల మంది ముందుకొచ్చి ఆర్థిక సాయం చేశారు. ప్రమాదకరమైన ఈ వ్యాధిపై చైతన్యం తెచ్చేందుకు విశాఖలో శనివారం ఏర్పాటుచేసిన రన్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మీ అందరికీ ధన్యవాదాలు' అని సీఎం చెప్పారు.

దిల్లీ మద్యం కేసును తలదన్నేలా ఏపీ కుంభకోణం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



ఈనాడు, దిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణాన్ని తలదన్నేలా ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం జరిగిందన్నది వాస్తవమని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మద్యం బ్రాండ్లు తీసుకురావడం, వాటి ధరల నిర్ధారణ, దుకాణాల్లో ఉద్యోగుల నియామకం, మొత్తం నగదు అమ్మకాలు కొనసాగించడం అంతా వ్యవస్థీకృత కుంభకోణంగా సాగిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్‌చేయడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి దిల్లీకి వచ్చి పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర సీనియర్లను కలిసిన తర్వాత ఆయన ఆదివారం ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దిల్లీ మద్యం కుంభకోణం ఆప్, భారాసలను ఎలా కుదిపేసిందో ఈ కుంభకోణం వైకాపానూ అలాగే కుదిపేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సిట్ దీనిపై దర్యాప్తు జరుపుతోందని, దీనిపై ఈడీ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంటే వారే కేంద్రానికి ఆ విషయం తెలియజేస్తారని చెప్పారు. ఈ కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు ఉంటే దర్యాప్తు జరపాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈడీకి లేఖ రాయాలన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చాలా బాగా పనిచేసిందని కితాబిచ్చారు.

- వైజాగ్ రైల్వేజోన్ సరిహద్దులను ఖరారుచేస్తూ త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేస్తుందని మాధవ్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద 'తిమింగలం' త్వరలో బయటకు: మంత్రి కొల్లు

కనగానపల్లి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో అతిపెద్ద తిమింగలం త్వరలో బయటకు రానున్నదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. వైకాపా పాలనలో రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేయడంతో పోలవరం, అమరావతి వంటి నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. ఎక్కడ చూసినా అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు, దోపిడీలే కనిపించాయన్నారు. ఎన్నో కష్టాలు పడి బనకచర్ల ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతుంటే దాన్ని అడ్డుకునేందుకు జగన్ కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చెడుగా చెబుతూ జగన్ కేంద్రానికి 200 పైగా మెయిల్స్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



> ### ఏఐ మీ మెదడుకు ప్రత్యామ్నాయం కాదు
>
> కృత్రిమ మేధ(ఏఐ) టూల్స్‌పై అతిగా ఆధారపడే ధోరణి మంచిది కాదు. వాటి సాయం లేకుండా మీ పని చేయడంలో ఇబ్బంది పడుతున్నారంటే, ఏఐ మీ ఉపాధికి ఎసరుపెట్టే రోజు ఎంతో దూరంలో లేదు. అందుకే మీ మేధస్సును సానబెట్టుకోవడానికి మాత్రమే ఏఐని ఉపయోగించండి తప్ప మీ మెదడుకు దాన్ని ప్రత్యామ్నాయంలా చూడకండి.
>
> – అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

రేణిగుంట విమానాశ్రయంలో నిలిచిన రెండు విమానాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు సాంకేతిక లోపంతో నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి రేణిగుంటకు చేరుకున్న స్పైస్ జెట్ విమానం ఇక్కడికి చేరుకున్న వెంటనే మొరాయించింది. విమానాన్ని పైలట్లు ఇక్కడే నిలిపేశారు.

- ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమానం బయలుదేరింది. ఎగిరిన వెంటనే ఏసీలు పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో పైలట్లు విమానాన్ని తిరిగి విమానాశ్రయానికి తీసుకొచ్చారు. మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడంతో సర్వీసును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

జగన్ లోభం.. ఏపీ మద్యం కుంభకోణం

- మిథున్‌రెడ్డి ఒక పావు... నిజమైన మాస్టర్‌మైండ్స్ జగన్ దంపతులే
- కోటి పేద కుటుంబాలు విధ్వంసం
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ ధ్వజం



ఈనాడు, దిల్లీ: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లోభమే ఏపీ మద్యం కుంభకోణమని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, లోక్‌సభ సభ్యుడు మాణికం ఠాగూర్ ఆరోపించారు. ప్రజల ప్రాణాలను తాకట్టుపెట్టి ఆయన మద్యం దోపిడీకి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇందులో బాధితులంతా పేదలు, నోరు లేనివాళ్లు, ఓటర్లేనని అభివర్ణించారు. ఈ వ్యవహారంలో మిథున్‌రెడ్డి ఒక పావు అని, నిజమైన మాస్టర్‌మైండ్స్ మిస్టర్ అండ్ మిసెస్ జగన్ అని ఆరోపించారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు నేపథ్యంలో ఆయన ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఇదీ.. ఆ పోస్టు!

మిథున్‌రెడ్డి కేవలం ఒక పావు.
నిజమైన మాస్టర్‌మైండ్స్?
మిస్టర్ అండ్ మిసెస్ జగన్

ఎలా జరిగింది?

ఇది యాదృచ్ఛికంగా జరిగిన కుంభకోణం కాదు. ముందస్తు ప్రణాళికతో పైనుంచి కింది వరకు జగన్ శాస్త్రీయ అవినీతి ద్వారా జరిగిందే. తమకు ఇష్టమైన మద్యం బ్రాండ్లను ఎంచుకున్నారు. పంపిణీ నెట్‌వర్క్‌ని ఫిక్స్ చేశారు. ముడుపులపై ముందే మాట్లాడుకున్నారు. డమ్మీ సంస్థలను సృష్టించారు. చట్టబద్ధంగా లూటీ చేయడానికి విధాన రూపకల్పన చేశారు.

కుంభకోణం ఎలా?

1. ఎంపిక చేసుకున్న మద్యం సరఫరాదారులతో జగన్ పార్టీ నాయకులు సమన్వయం చేసుకున్నారు.
2. అప్పటికే ఉన్న, విశ్వసనీయమైన మద్యం బ్రాండ్లను తొలగించేశారు.
3. వాళ్ల సొంతమైన, బినామీల బ్రాండ్లను ఆ స్థానంలో ఉంచారు.
4. వాటిని ఎక్కువ ధరలకు రాష్ట్ర రిటైల్ ద్వారా విక్రయించారు.

లాభాల మాటేంటి?

- కృత్రిమంగా పెంచేశారు.
- నకిలీ ఇన్వాయిస్‌లు, సర్వీస్ కాంట్రాక్టర్ల ద్వారా కమీషన్లను రూటింగ్ చేశారు.
- మనీలాండరింగ్‌కు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నాల్లో షెల్ కంపెనీలు ఏర్పాటుచేశారు.
- రవాణా, గోదాము కాంట్రాక్టునూ దగ్గరి సంస్థలకే కట్టబెట్టారు. దీన్నంతా లాజిస్టిక్స్ ఖర్చుల కింద చూపారు. ఇవన్నీ ప్రజాధనాన్ని మాయం చేసే ఎత్తుగడలే.

లబ్ధి పొందిన 3 గ్రూపులు:

1. మిస్టర్ అండ్ మిసెస్ జగన్
2. కొందరు మంత్రులు
3. మిత్ర కాంట్రాక్టర్లు

లూటీ సొమ్ము ఏం చేశారు?

- సిట్ దర్యాప్తు ప్రకారం లూటీ చేసిన రూ.3 వేలకుపైగా కోట్లలో కొంత 2024 ఎన్నికల్లోకి పంప్ చేశారు. నగదు, మద్యం పంచి, ఓట్ల కొనుగోలుకు ఉపయోగించారు.
- చాలా నకిలీ బ్రాండ్లకు తయారీ వ్యవస్థే లేదు. లైసెన్సులను అరువు తెచ్చుకొని, అనుమానాస్పద బాట్లింగ్ యూనిట్ల ద్వారా నిర్వహించారు. వ్యవస్థలో ఉండటం కోసం రోజూ లక్షల రూపాయల లంచాలు చెల్లించారు.
- మిథున్‌రెడ్డి పేరు రికార్డుల్లో ఉంది. అది కేవలం భాగస్వామిగానే కాకుండా, చీఫ్ ఆపరేటర్‌గా ఎక్సైజ్ శాఖ, రాజకీయ కార్యాలయాల మధ్య సమన్వయం చేయడానికి ఆయన సాయపడ్డారు. ముడుపుల సొమ్ము ప్రవాహాన్ని దాచడానికి షెల్ కంపెనీలను నిర్వహించారు.

ఒక విషయాన్ని మరిచిపోవద్దు

జగన్‌కు ఇదే మొదటి కుంభకోణం కాదు. సీబీఐ దాఖలుచేసిన రూ.43 వేల కోట్ల అక్రమాస్తుల కేసులో అతను ప్రధాన నిందితుడు. 2012లో అరెస్టై 16 నెలలు జైల్లో గడిపారు. జగన్‌కు అవినీతి కొత్తకాదు. ఆయన చేసేదే అది. తను చేసే నమ్మకద్రోహాల్లో మద్యం కుంభకోణం తాజా ధారావాహిక. ఇసుక మాఫియా, మైనింగ్, భూకేటాయింపులు.. ఇంకొన్ని.

బాధితులు: పేదలు, నోరు లేనివాళ్లు, ఓటర్లు.

మొత్తంగా.. 'జగన్ లోభం.. ఏపీ మద్యం కుంభకోణం''.

పిన్నెల్లికి ఎదురొడ్డిన తెదేపా నేత నంబూరు శేషగిరిరావు మృతి

గుండెపోటుతో ఇంట్లో పడిపోయిన వైనం



నంబూరు శేషగిరిరావు

రెంటచింతల, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాలువాయిగేటుకు చెందిన తెదేపా నేత నంబూరు శేషగిరిరావు(50) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. శేషగిరిరావు భార్య కృష్ణవేణి వ్యక్తిగత పనులపై మూడ్రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. కుమారుడు దత్తసాయి, కుమార్తె జాహ్నవి ఉన్నత చదువుల నిమిత్తం గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శేషగిరిరావు శనివారం రాత్రి పది గంటల వరకు చుట్టుపక్కల వారితో ముచ్చటించారు. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో పొరుగింట్లో ఉంటున్న రాచకొండ ఈశ్వరమ్మ ఆ ఇంటివైపు చూడగా.. శేషగిరిరావు వాకిట్లో పడిపోయి ఉన్నారు. వెంటనే ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు మాచర్ల ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణవేణి 2014-19 మధ్య కాలంలో గురజాల మండలం పల్లెగుంత ఆదర్శ పాఠశాలలో ఒప్పంద పద్ధతిలో వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019లో వైకాపా అధికారంలోకి రాగానే ఆమెను విధుల నుంచి తొలగించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి.. శేషగిరిరావు మృతదేహానికి నివాళులు అర్పించారు.



అప్పట్లో పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న శేషగిరిరావు

అరాచకాలను అడ్డుకున్న నేతగా గుర్తింపు

2024 మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. ఆ రోజున పాలువాయిగేటు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలోకి అప్పటి వైకాపా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులతో చొరబడ్డారు. ఈవీఎంను పగలగొట్టారు. అదే బూత్‌లో తెదేపా ఏజెంటుగా ఉన్న శేషగిరిరావు.. పిన్నెల్లిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన పిన్నెల్లి అనుచరులు కేంద్రం నుంచి బయటకు వచ్చిన వెంటనే నంబూరుపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. అప్పట్లో ఈ ఘటన సంచలనంగా మారింది. శేషగిరిరావు చూపిన తెగువను నాడు చంద్రబాబు, లోకేశ్ ప్రశంసించారు.

సీఎం చంద్రబాబు, లోకేశ్‌ల పరామర్శ

ఈనాడు, అమరావతి: గుండెపోటుతో మరణించిన తెదేపా నేత శేషగిరిరావు కుటుంబ సభ్యుల్ని సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. శేషగిరిరావు కుమారుడు, కుమార్తెలతో ఆయన మాట్లాడారు. అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. శేషగిరిరావు మృతి వార్త తనను బాధించిందని మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మిథున్‌రెడ్డిని తప్పుడు కేసులో అరెస్టు చేశారు

- ప్రభుత్వం రాజకీయ ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది
- వైకాపా అధ్యక్షుడు జగన్ విమర్శలు



ఈనాడు, అమరావతి: ఎంపీ మిథున్‌రెడ్డిని తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారని వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఆరోపించారు. అరెస్టును ఖండిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అవినీతి, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం రాజకీయ ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు లిక్కర్ స్కాం పేరుతో కట్టుకథలు అల్లింది. వైకాపా ప్రభుత్వంలోని మద్యం విధానంపై విమర్శలు చేయడం అర్థరహితం. మా ప్రభుత్వంలో రద్దు చేసిన బెల్ట్ దుకాణాలు, పర్మిట్ రూంలు కూటమి ప్రభుత్వంలో తెరిచారు. ఎమ్మార్పీకి మించి మద్యం అమ్మకాల వెనుక అవినీతి ఉంది. మద్యం దుకాణాలకు లైసెన్సుల మంజూరు నుంచి పంపిణీ సంస్థలకు ఆర్డర్లు కట్టబెట్టే వరకు వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను తుడిచిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వైకాపా నాయకులను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కుట్రతో కేసులు బనాయిస్తున్నారు. కేసులో అసలైన విచారణ మొదలైనప్పుడు నిజాలు బయటకొస్తాయి' అని జగన్ పేర్కొన్నారు.

వైకాపా విధానం మేరకు రూపొందించిన పాలసీ అది

- ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వంలో మద్యం పాలసీని వైకాపా విధానానికి అనుగుణంగా రూపొందించామని, ఆషామాషీగా చేసింది కాదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బెవరేజెస్ కార్పొరేషన్ పర్యవేక్షించే మద్యం వ్యవహారాలతో ప్రభుత్వానికి ఏం సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. ఈ కేసును అడ్డగోలుగా నడుపుతున్న వారందరినీ విచారించాలని, ఈ అంశాన్ని తాము వదలబోమని తెలిపారు. ఈ కేసు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత అక్రమ అరెస్టులపై న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని పరామర్శించేందుకు ఆదివారం విజయవాడలోని అనిశా న్యాయస్థానం వద్దకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మద్యం విక్రయాల్లో ఏవైనా అవకతవకలు జరిగితే ప్రభుత్వానికి ఏం సంబంధం? ఏ రకంగా దాన్ని నిరూపిస్తారు? ఒకే అబద్ధాన్ని వందసార్లు చెప్పించినంత మాత్రాన అది నిజం కాదు. సిట్ ఏర్పాటు చేసిన ఐదు నెలల్లో ఒక్క ఆధారమైనా చూపించారా? ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టామని చెబుతూ ఇక ఆస్తుల్ని ఎలా ఎటాచ్ చేస్తారు? విజయసాయిరెడ్డి వైకాపా నుంచి బయటికి వెళ్లారు. ఆయన అప్రూవర్‌గా మారి చెప్పినా.. ఇంకొకరు చెప్పినా ఆధారాలు ఎక్కడున్నాయి? చూపించాలి కదా? మాణికం ఠాగూర్ కాంగ్రెస్ పార్టీ తరఫున మాట్లాడుతున్నారా? ఎన్డీయే తరఫున మాట్లాడుతున్నారా? లేదంటే చంద్రబాబుకు బీ టీంగా వ్యవహరిస్తున్నారా? ఆయన చేసిన ట్వీట్‌ను ఎవరైనా రాహుల్ గాంధీకి చూపించాలి' అని పేర్కొన్నారు.

అంతా ఊహాజనితమే..: 'మద్యం కుంభకోణం అంతా ఊహాజనితమే. కొత్త పాత్రలను కలుపుతూ పోతున్నారు. ఆధారమేదీ లేదు. జగన్ హయాంలో మద్యం పాలసీ మార్చడం కుట్ర అంటున్నారు. దుకాణాలను ప్రైవేటు నుంచి ప్రభుత్వానికి మార్చితే అది కుట్ర ఎలా అవుతుంది? ఇప్పుడు జరిగేవన్నీ అక్రమ అరెస్టులే. 50-60 రోజులు జైల్లో ఉంటారు. బెయిల్ మీద బయటికొస్తారు. ఇంతకుమించి చంద్రబాబు సాధించేదేమీ ఉండదు' అని సజ్జల వ్యాఖ్యానించారు.

మద్యం కుంభకోణంపై పార్లమెంటులో చర్చించాలి

- తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: గతంలో జరిగిన రూ.వంద కోట్ల పశుదాణా కుంభకోణంపైనే పార్లమెంటులో చర్చ జరిగిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంపైనా చర్చకు అవకాశం ఇవ్వాలని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఇంత ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన తీరు అందరికీ తెలిసేలా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయలు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాల్లో తెదేపా తరఫున ఆరు అంశాలపై చర్చ కోరినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ధనధాన్య కృషి యోజనను రైతుల అవసరాలకు తగ్గట్లు అమలుచేసేలా చూడాలని తెదేపా కోరుతున్నట్లు వెల్లడించారు.

బనకచర్లపై చర్చకు అనుమతివ్వాలి: బాలశౌరి

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై పార్లమెంటులో చర్చకు అనుమతివ్వాలని కోరినట్లు జనసేన పార్లమెంటరీ పార్టీ నాయకుడు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. అఖిలపక్ష భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. "రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాల అమలుపై చర్చించి పరిష్కరించేలా చూడాలని కోరాం. 'జల్‌జీవన్ మిషన్'ను విస్తరించిన కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిచేయడానికి అవసరమైన నిధులూ ఇవ్వాలని విజ్ఞప్తిచేశాం" అని బాలశౌరి తెలిపారు.

మిథున్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఎయిర్‌పోర్ట్ మేనేజర్‌ను కొట్టాడని తప్పుడు కేసుపెట్టి అరెస్ట్ చేశారని, ఇప్పుడు మద్యం కేసులో ఇరికించి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమను ఏదో విధంగా ఇబ్బందులు పెట్టాలని మదనపల్లె భూములకు సంబంధించిన దస్త్రాల దహనం కేసు మోపారని.. ప్రభుత్వ, అటవీ భూములు ఆక్రమించారని వేధింపులకు గురిచేశారని ఆయన చెప్పారు. జగన్‌తో సఖ్యతగా ఉన్నాడనే మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు పెట్టారని, చంద్రబాబు రాజకీయ జీవితంలో ఇదో మాయని మచ్చగా మిగులుతుందన్నారు. తన కుమారుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీకి పట్టుగొమ్మల్లాంటి నాయకులను అరెస్టు చేస్తూ రాష్ట్రంలో నియంతపాలన చేస్తున్నారని విమర్శించారు.

వసుంధర

vasundhara@eenadu.in

పిల్లలతో తినిపించడం తల్లులకు పెద్ద సవాలే. మారిన జీవనశైలితో వారికి ఓపిగ్గా పెట్టలేక... కడుపు నింపడానికి ఏ చిప్స్ ప్యాకెట్టో చేతికిచ్చేస్తున్నారు. అలా చేస్తే వారు ఊబకాయం బారిన పడొచ్చని హెచ్చరిస్తున్నారు వైద్యులు. దీనికి పరిష్కారమేలాగో సూచిస్తున్నారు.

కుక్కి కడుపునింపుతున్నారా?



- ఎదిగే చిన్నారుల ఆరోగ్యానికి పోషకాలన్నీ అవసరమే. అంటే కార్బోహైడ్రేట్స్ (అన్నం, రోటీ, పరాఠా), ప్రొటీన్లు (పప్పు, పనీర్, గుడ్లు, లీన్ మీట్), ఆరోగ్యకరమైన కొవ్వులు (నెయ్యి, గింజలు), విటమిన్లు(కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు) అన్నీ ఉండేలా చూసుకోవాలన్నమాట. మసాలాలు, కారం, ఉప్పు తగ్గించి.... పసుపు, జీలకర్ర, దనియాలు... వంటివి తరచూ వాడండి.
- పిల్లల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నోట్లో కుక్కి పెట్టేస్తున్నారా? ఇలా చేస్తే ఆహారం మీదే వారు విరక్తి పెంచుకోవచ్చు. ఒకేసారి ఎక్కువగా పెట్టే బదులు కొద్ది కొద్దిగా తినిపించండి. అప్పుడే తేలిగ్గా జీర్ణం చేసుకోగలరు.
- కొందరు చిన్నారులు భోజనం కంటే స్నాక్స్ అల్పాహారాల్నే ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇలాంటప్పుడు ప్యాకేజ్డ్ స్నాక్స్ తగ్గించి గ్రిల్డ్ వెజిటబుల్స్, కూరగాయల చిప్స్ వంటివి ఇవ్వండి. చిరు, తృణ ధాన్యాలతో వారికి నచ్చే రుచులతో స్నాక్స్ చేసి పెట్టండి.
- ఇంట్లో మీరు వంట చేసేటప్పుడు వారికి నచ్చే కూరగాయల్ని ఎంచుకోమనండి. పిండి కలపడం, ఆకుకూరలు కోయడం వంటి చిన్న చిన్న పనుల్లో సాయం చేయమనండి. అప్పుడు వారికి ఆయా పదార్థాలపై ఆసక్తి ఏర్పడుతుంది.
- స్కూలుకి వెళ్లే వయసున్న పిల్లలపై వారితోపాటు చదివే స్నేహితుల ప్రభావమూ ఉంటుంది. వారికి బాక్సుని సర్ది పెట్టేటప్పుడే రుచిగానే కాకుండా కంటికింపుగానూ కనిపించేలా ఉండే పదార్థాలను ఉంచండి. అప్పుడే వారు చక్కగా తింటారు. స్కూల్లో సరిగా తింటున్నారో లేదో అన్న భయం ఉంటే... రోజులో ఒక పూట అయినా తమంతట తాముగా తినడం నేర్పించండి. కుటుంబ సభ్యులతో కలిసి కూర్చుని తినేలా చేయండి.

కోపం తగ్గేదెలా..!


మా బాబుకి 10ఏళ్లు. కోపం ఎక్కువ. వాడేం అడిగినా ఇవ్వాల్సిందే. లేదంటే తినడం మానేస్తాడు, ఇంట్లో వస్తువులన్నీ విసిరేస్తాడు. రూమ్‌లో లాక్ చేసుకుంటాడు. బాబు ప్రవర్తనని మార్చేదెలా? - ఓ సోదరి

మొండితనం, తను అనుకున్నది జరగాలనే పట్టుదల మీ అబ్బాయిలో కనిపిస్తున్నాయి. తను కోరుకున్నది సాధించడానికి మిమ్మల్ని బెదిరించడం, కోపం ప్రదర్శించడం అలవాటుగా మారినట్లు అనిపిస్తోంది. చిన్నప్పుడు పిల్లలందరూ ఇలానే చేస్తారు. గారాబం, ప్రేమతో అమ్మానాన్నలు కూడా వాళ్లకు ఏది కావాలంటే అది తెచ్చిపెడుతుంటారు. దీనివల్ల అడగగానే ఏదైనా ఇట్టే నాముందు ఉంచుతారు అన్న ఆలోచన వారి మెదడులో బలంగా పాతుకుపోతుంది. దాంతో వాళ్లకు కావాల్సింది దక్కనప్పుడు ఇలా కోపం ప్రదర్శిస్తుంటారు. దీన్ని 'లో ఫ్రస్ట్రేషన్ టాలరెన్స్' అంటారు. మీ బాబు విషయంలోనూ ఇదే జరుగుతోంది. మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే అతనిలో ఈ ప్రవర్తన ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది మీకూ, బాబుకూ ఒత్తిడే. వెంటనే సైకియాట్రిస్టు దగ్గరకి తీసుకు వెళ్లండి. బాబుని పరీక్షించి ఏడీహెచ్‌డీ, అపోజిషనల్ డెఫియంట్ డిజార్డర్ లాంటి బిహేవియరల్ సమస్యలు ఏమైనా ఉన్నాయేమో చూస్తారు. బాబు ప్రవర్తనకు అంతర్గత కారణాలు తెలుసుకుని చికిత్స చేస్తారు. తరవాత వాళ్ల సలహాతో సైకాలజిస్టునూ కలవండి. బాబు అలా ప్రవర్తిస్తున్నప్పుడు అతన్ని నియంత్రించే... పేరెంటింగ్ ఎడ్యుకేషన్, మేనేజ్‌మెంట్ మెలకువలను నేర్పుతారు. కౌన్సెలింగ్ ఇస్తారు. తరవాత బిహేవియర్ మాడిఫికేషన్ ద్వారా బాబు ప్రవర్తన మార్చేందుకు ప్రయత్నిస్తారు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు



అంతరిక్షంలో ఆధిపత్యం సాధించేందుకు ప్రపంచ దేశాలు పోటీపడుతుంటే... ఆ యుద్ధంలోకి తన బుల్లి శాటిలైట్లతో అడుగుపెట్టింది ఓ తెలుగమ్మాయి. ఇప్పుడు డీప్‌టెక్ సాయంతో... శాటిలైట్ సబ్‌సిస్టమ్‌లు, యాంప్లిఫయర్‌లు, యాంటెనాలు... వంటివి తయారుచేస్తూ ఇస్రో, డీఆర్‌డీవో, బీఈఎల్... తదితర పరిశోధనా సంస్థలకు సేవలందిస్తోంది హైదరాబాద్‌కి చెందిన **దివ్య కొత్తమాసు**. ఎన్-స్పేస్ టెక్ ఇండియా సంస్థ సీఈవో అయిన ఆమెతో 'వసుంధర' మాట్లాడగా...

దివ్య

అంతరిక్షం గుట్టు విప్పాలని...

లక్ష్యం ఏర్పడ్డాక... లాభనష్టాలను తూకం వేస్తూ అక్కడే ఆగిపోతే ప్రయోజనం ఉండదు. సాహసాలు చేయాలి. సవాళ్లను ఎదుర్కోవాలి. అప్పుడే మనమేంటో ప్రపంచానికి తెలుస్తుంది. ఈ ఆలోచనలతోనే స్పేస్ టెక్ రంగంలోకి అడుగుపెట్టా. తక్కువ సమయంలోనే గుర్తింపు తెచ్చుకోగలిగా. మాది గుంటూరు జిల్లా తెనాలి. నాన్న కె.ఎన్. ప్రసాద్ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి. అమ్మ నగజశ్రీ అనారోగ్యంతో మరణించారు. నాకో అక్క సౌమ్య... డేటా సైంటిస్ట్. నాకు చిన్నప్పటి నుంచీ సైన్స్ అన్నా, అంతరిక్ష ప్రయోగాలన్నా ఎంతో ఆసక్తి. అందులోనూ ఫిజిక్స్ నాకిష్టమైన సబ్జెక్ట్. ఖగోళశాస్త్రవేత్త నీల్ డిగ్రాస్ టైసన్ రాసిన పుస్తకాల్నీ చదివా. అయితే, అప్పట్లో ఇందులోనే కెరియర్ ఎంచుకోవాలని అనుకోలేదు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక టీసీఎస్‌లో చేరా. కొన్నాళ్లకే రఘురామ్‌తో వివాహమైంది. తర్వాత ఉద్యోగం మానేశా. ఆయనకున్న జ్యూయలరీ సంస్థలకు సాయపడాలని డిజైనింగ్ కోర్సు చేసి కొన్నేళ్లు అందులోనే పనిచేశా. అయితే, నా మనసు మాత్రం స్పేస్ టెక్నాలజీపైనే ఉండేది. దాంతో కేఎల్ యూనివర్సిటీలో ఎంటెక్‌లో చేరా. ఆ సమయంలో ఓ శాటిలైట్ వర్క్‌షాప్‌నకు హాజరయ్యా. అక్కడ దాని తయారీ, లాంచింగ్ వంటి విషయాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దాంతో మైక్రో, నానో శాటిలైట్ తయారీ రంగంలోకి అడుగుపెట్టాలనే ఆలోచన కలిగింది. ఆ విషయాన్ని చెబితే... అత్తింటివారు ప్రోత్సహించారు. ఆ సాంకేతికతను మరింత లోతుగా తెలుసుకోవడానికి అక్కడే శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లో పీహెచ్‌డీలో చేరా. అలా 2020లో ఆడపిల్లలు స్వతంత్రంగా ఎదగాలంటూ నన్ను ప్రోత్సహించిన అమ్మ నగజ పేరు కలిసివచ్చేలా ఎన్-స్పేస్ టెక్‌ని ప్రారంభించా.

తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలో...

సంస్థను ప్రారంభించాక... బుల్లి ఉపగ్రహాల తయారీతో పాటూ శాటిలైట్ కమ్యూనికేషన్స్‌పైనా అధ్యయనం చేయడం ప్రారంభించాం. ఇందుకు సుమారు రెండేళ్ల సమయం పట్టింది. తొలి ప్రయోగం కింద '1 యు క్యూబ్ శాట్' అనే పేలోడ్ తయారు చేశాం. దీన్ని ఉపయోగించి స్ట్రాటోస్ఫియర్‌లో వాతావరణ పరిస్థితులను తెలుసుకోవాలన్నదే లక్ష్యం. యూకేలోని బి2స్పేస్ టెక్నాలజీస్ నుంచి దీన్ని లాంచ్ చేశాం. ఆ సమయంలో 8 నెలల గర్భిణిని అయినా ఇష్టంగా శ్రమించా. తర్వాత కొద్దినెలల్లోనే స్కైరూట్ అనే ప్రైవేటు సంస్థ విక్రమ్-ఎస్ రాకెట్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి సబ్ ఆర్బిట్‌లోకి ప్రయోగించగా... ఆ రాకెట్ తీసుకెళ్లిన మూడు పేలోడ్లలో మేం తయారుచేసిన లక్ష్య శాట్-2 పేలోడ్ కూడా ఉంది. ఇది దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం.

నిపుణుల కొరతే ఇబ్బంది...

మొదట మూడున్నరేళ్లు బుల్లి ఉపగ్రహాల తయారీమీదే దృష్టిపెట్టగా... క్రమంగా ఏరోస్పేస్, రక్షణ శాటిలైట్ టెక్నాలజీపై పనిచేయడం ఆరంభించాం. గత డిసెంబరులో ఇస్రో పీఎస్ఎల్‌వీ-సి60/పీవోఈఎమ్-4 మిషన్‌లో స్వేచ్ఛాశాట్-వీవో పేలోడ్‌ను ప్రయోగించాం. తాజాగా సీడాక్ కోసం హై ఆల్టిట్యూడ్ పేలోడ్‌ని విజయవంతంగా పరీక్షించాం. వీటితో పాటు విద్యాసంస్థలకు క్యూబ్‌శాట్‌లు, నానోశాటిలైట్‌లను అందిస్తున్నాం. ఇస్రో, డీఆర్‌డీవో, బీఈఎల్, బీడీఎల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వంటి సంస్థలకు మేం సేవలందిస్తున్నాం. ఐదేళ్లలో ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో శ్రమించాం. ఈ ఉత్పత్తుల తయారీకి అవసరమైన సబ్జెక్ట్ చాలా తక్కువగా అందుబాటులో ఉంటుంది. రిసెర్చ్ పేపర్లు చదివి అర్థం చేసుకుని పనిచేయాలి. దీంతో దేశీయంగా స్పేస్ టెక్ ప్రొడక్ట్స్ చేయడానికి నిపుణుల కొరతే ప్రధాన సమస్య. ఈ కారణంతోనే ఆరంభంలో మా పనంతా తెనాలి నుంచే జరిగినా తర్వాత హైదరాబాద్‌కి మారాల్సి వచ్చింది. దీనికితోడు స్పేస్ డొమైన్‌కి కోట్లలో పెట్టుబడి అవసరం. నన్ను నమ్మి అత్తింటివాళ్లే ఇంత ఇన్వెస్ట్ చేయడం గర్వంగానూ అనిపిస్తుంది. ఆరంభంలో ఆడపిల్లగా నా సామర్థ్యంపై కొందరు సంశయం వ్యక్తం చేసినా... ఇప్పుడు అందుకుంటున్న ప్రభుత్వ, కీలక పరిశోధనా సంస్థల ప్రాజెక్టులు నన్ను నేను నిరూపించుకునేలా చేశాయి. నాకో గుర్తింపునూ ఇచ్చాయి.

> మహిళలు ముందుగా మాట్లాడకపోయినా, సమావేశం ముగించడానికి అయిదు నిమిషాల ముందు... ఈ అంశంపైన మీ అభిప్రాయం ఏంటి? భిన్నమైన అభిప్రాయం ఏదైనా చెబుతారా... ఇలా అడిగితే వాళ్లు ఏదో ఒక సందర్భంలో మాట్లాడ్డానికి ముందుకు వస్తారు. మొదటిరోజు ఒక వాక్యమే చెప్పొచ్చు. రెండో రోజు అయిదు, మూడో రోజు 10 వాక్యాలు... చివరకు స్వతంత్రంగా మాట్లాడే రోజు వస్తుంది. మా సంస్థలో ప్రతి విభాగంలో సీనియర్లు, తమ జూనియర్లకు ఏడాది పాటు మెంటార్లుగా ఉంటారు.

– భావనా అగర్వాల్, ఎండీ, హెవ్లెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్



ఇలా చేసి చూడండి!

తెల్లవారింది మొదలు, నిద్రపోయే వరకూ ఎన్ని పనులో! కొన్ని చిట్కాలతో జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చిలా!

నిమ్మ, బత్తాయి నుంచి ఎక్కువ రసం తీయాలనుకుంటున్నారా... అయితే వాటిని ముందు వేడినీళ్లలో వేసి తీయండి. చల్లారక పిండితే మెత్తగా ఉండటమే కాదు, ఎక్కువ రసం వస్తుంది కూడా.



- 5-10 నిమిషాలు తీరిక ఉంది... చేయడానికి పెద్ద పని లేదని భావిస్తున్నారా? అయితే దాన్ని చెక్-ఇట్ టైమ్‌గా పెట్టుకోండి. అరుదుగా ఉపయోగించే పరికరాల్ని తీసి పరీక్షించండి. దానివల్ల తర్వాత జరిగే పెద్ద ఇబ్బందిని ముందే గుర్తించినట్లవుతుంది.
- ప్లాస్టిక్ టబ్‌లు లీక్ అయినా, అంచులు విరిగినా చెత్తలో పడేస్తున్నారా? వాటిని ఎన్ని రకాలుగా పునర్వినియోగించవచ్చో తెలుసా? మట్టి నింపి కంటెయినర్ గార్డెన్‌గా మార్చొచ్చు. శాండ్‌బాక్స్‌గా మార్చి... చిన్నారుల్ని ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. పిల్లలు బొమ్మలతో ఆడుకున్నాక వాటిని ఈ టబ్‌లో పెట్టమంటే సర్దే పని తగ్గుతుంది.
- బట్టలు ఉతకడం, ఆరబెట్టడం, మడత బెట్టడం... వీటి నుంచి విముక్తి లేదా అనిపిస్తుంది కొన్నిసార్లు! మొదటి రెండింటి సంగతేమోగానీ, మడత పని కొంతవరకూ తగ్గించుకోవచ్చు. ఎలాగంటే... కొన్ని చీరలూ, డ్రెస్సుల్ని హ్యాంగర్‌కి తగిలించండి. పైజామాలూ, పిల్లల బట్టల్ని బాస్కెట్లలో వేయండి.
- నిర్విరామంగా పనిచేసినప్పుడు ఒత్తిడిగా ఉన్నట్లయితే... వెంటనే ఇంటి బయటకు, బాల్కనీలోకి లేదంటే కిటికీ తెరిచి.. దీర్ఘమైన శ్వాస తీసుకోండి. మెదడుకు అధిక మోతాదులో ఆక్సిజన్ అందితే, ఒత్తిడి నుంచి ఉపశమనం వస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

చిందరవందరే ఆమె స్టైల్!



ఇంటిని నీట్‌గా పెట్టుకోవాలి, వస్తువులన్నీ పొందిగ్గా అమర్చుకోవాలి... అమ్మాయిలకు చిన్నప్పట్నుంచీ చెప్పే మాటలే ఇవి. కాస్త చిందర వందరగా కనిపించినా ఆడపిల్లకు ఉండాల్సిన లక్షణాలు లేవనేస్తారు. ఇలా నీట్‌గా పెట్టుకోవడమన్నది ఆమెకి ఎంత ఒత్తిడి కలిగిస్తుందో తెలుసా? కాబట్టే, ఈ తరం అమ్మాయిలు కొత్త ట్రెండ్‌ని సృష్టించేశారు. దాని పేరు... మెస్సీ గర్ల్ ఈస్థటిక్! ఇంతకీ అదేమిటంటే...

దుస్తులు కుర్చీల్లో ఉంటాయి. పుస్తకాలు దిండు పక్కనే కనిపిస్తాయి. గోడలన్నీ గులాబీ, వంకాయ, నారింజ రంగుల్లో మెరిసిపోతుంటాయి. చిన్న చిన్న లైట్లు, ఆకులతో అక్కడక్కడా డిజైన్లు. ఓ వాల్ పెయింటింగ్... అంత అందంగా ఉండదు కానీ గోడ మీద వేలాడుతూ కనిపిస్తుంది. మరోవైపు సెల్ఫీలు, ఫొటోలు... అందమైనవే కాదు, ఆమె ఏడుస్తున్నవీ, షాక్‌కు గురైనవీ, స్నేహితులు టీజ్ చేస్తున్నవన్నీ కనిపిస్తాయి. ఏంటి ఇవన్నీ అనుకుంటున్నారా? ఇదే మెస్సీ గర్ల్ ఈస్థటిక్ ట్రెండ్. అందరూ మెచ్చేలా, నీట్‌నెస్‌కి, అందానికి పర్యాయపదంగా ఉండదు. ఆమెకు నచ్చినట్టుగా ముఖ్యంగా ఇంటిని సౌకర్యవంతంగా పెట్టుకోవడమే ఈ ట్రెండ్. పుస్తకాలు షెల్ఫ్‌లోనే ఉండాలి, దుస్తులన్నీ నీట్‌గా అల్మారాలోనే సర్దాలి. అందమైన ఫొటోలు, పెయింటింగ్‌లే గోడలమీద ఉండాలన్న నియమాలు వీళ్లు పాటించరు. నచ్చిన టీ కప్పే వీళ్లకు దువ్వెనలు, నగలు పెట్టుకునే స్టాండ్ అయిపోతుంది. మిస్ మ్యాచ్ చెయిర్లు, బొమ్మలు, చిన్న పిల్లలు మెచ్చే దుప్పట్లతో బెడ్ నిండిపోతుంది. మ్యాగజీన్ క్లిప్పింగ్స్, వాళ్లు గీసిన బొమ్మలు, మెచ్చిన పోస్టర్లే వాళ్లకు షో పీసులు. ఇదంతా ఎందుకు అంటే... ఇది మా స్వేచ్ఛ అంటున్నారీ అమ్మాయిలు. అంతేనా... ఓ ఆర్టిస్ట్ గదిలోకి వెళ్లండి. అందమైన కళాఖండంతోపాటు పక్కనే వాటి తాలూకూ చిహ్నాలైన రంగులు బ్రష్‌ల నిండా, ఆర్టిస్ట్ దుస్తులపైనా, నేలమీదా పడి కనిపిస్తాయి. ఒకరకంగా చిందరవందరగానే కనిపిస్తుంది. కానీ దాన్ని చూడగానే మనం అసహ్యించుకోం. ఒక రకమైన భావోద్వేగానికి గురవుతాం. పోనీ పాటరీ చేసే ప్రదేశానికి వెళ్లండి. మట్టి, బురదతో నిండినా దానిలోనూ అందం చూడగలం. ఇదీ అంతే! దుమ్ము కొట్టుకుని పోయి ఉండదు. అలాగని నీట్‌గా సర్ది కనిపించదు కానీ చూసేవారికి ఒక మ్యాజిక్ ఫీల్‌ని ఇస్తుంది. ముఖ్యంగా అక్కడ ఉండేవారికి 'ఇది నాది, నా ఆలోచనలకు ప్రతిరూపం, నా సౌకర్యానికి చిహ్నం' అన్న అనుభూతిని ఇస్తుందట. కాబట్టే, మనసు లోతుల్లోకి తొంగి చూసుకుని మరీ నచ్చినట్టు ఇలా తీర్చిదిద్దుతున్నారు. అంతేనా, ఇది ఒత్తిడిని దూరం చేసే మార్గం కూడానట. అందుకే ప్రపంచవ్యాప్తంగా అనుసరించేస్తున్నారు. ఏంటి మరి... మీరూ ప్రయత్నిస్తారా?

మీకు తెలుసా?

డాక్టర్ షిర్లీ ఆన్ జాక్సన్... మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ చేసిన తొలి నల్లజాతీయురాలు. టెలికమ్యూనికేషన్‌లో ఈవిడ చేసిన పరిశోధనలే మొబైల్ ఫోన్లో మనం వినియోగించే కాల్ వెయిటింగ్, కాలర్ ఐడీ వంటివి డెవలప్ అవడానికి కారణం.



వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 91540 91911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.



కరుణ కురిపిస్తూ... సేవ చేస్తూ!

ఆవును దైవంగా భావించే దేశం మనది. అలాంటివి రోగాల బారిన పడటం, వాటిని కబేళాలకు పంపడం చూసి చలించిపోయారామె. అలాగని ఆమేమీ భారతీయురాలు కాదు. విదేశాలనుంచి ఇక్కడికొచ్చారు. మూగజీవులను అక్కున చేర్చుకుంటూ వాటి బాగోగులు చూసుకుంటున్నారు. ఇందుకోసం స్వదేశాన్నే వీడారు లెమన్‌టింగ్స్‌పాస్.



ప్రత్యేక గదులు, నైపుణ్యమున్న వైద్యులు, అంబులెన్స్‌లు, రక్తపరీక్ష కేంద్రం... ఇవన్నీ వైద్యశాలకు చెందినవే. అయితే ఈ సౌకర్యాలను జంతువుల కోసం ఏర్పాటు చేశారు... లెమన్‌టింగ్స్‌పాస్. ఈమెది హాలండ్. సత్యసాయిబాబా భక్తురాలు కావడంతో తరచూ పుట్టపర్తి వచ్చేవారామె. ఓసారి ఆవులను కబేళాలకు తరలించడం చూసి ఆమె మనసు చలించింది. రోడ్డు పక్కన గాయాలతో పడి ఉన్న మూగజీవులను చూశాక వాటికోసం ఏమైనా చేయాలనుకున్నారు. దీనికోసం స్వదేశం వదిలి భారత్‌కి వచ్చేశారు. 1997లో పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కరుణ సొసైటీ పేరుతో జంతు సంరక్షణశాలను ఏర్పాటు చేసి, మూగజీవులను సంరక్షిస్తున్నారు.

ఇక్కడ ఆవులు, ఎద్దులే కాదు, గాయపడిన కుక్కలు, పిల్లులు, గుర్రాలు, ఒంటెలు, ఎలుగుబంట్లు, జింకలు వంటి ఎన్నో జంతువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వాటిని ఆసుపత్రిలోనే ఉంచి, వైద్యం అందిస్తున్నారు. అవి బాగయ్యాక సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు. అంతేకాదు, జిల్లావ్యాప్తంగానే కాకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అనంతపురం, గోరంట్ల, ధర్మవరం సంతల నుంచి కబేళాలకు తరలించే మూగజీవులను అడ్డుకొని, సొసైటీకి తరలిస్తున్నారు. ఇందుకోసం పశువుల సంరక్షణకు రాయలవారిపల్లి వద్ద వంద ఎకరాల్లో సంరక్షణశాలనీ ఏర్పాటు చేశారు. ఆమె సేవలను గుర్తించి కేంద్ర పర్యావరణ శాఖ జాతీయ స్థాయి అవార్డునీ అందించింది. 'స్వతహాగా జంతు ప్రేమికురాలిని. 'అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు' అన్న సత్యసాయి ప్రభావమూ నాపై ఎక్కువే. దీంతో మూగజీవులు అకారణంగా, అనారోగ్యంతో చనిపోవడం చూసి మనసు చలించింది. అందుకే వాటికోసం ఏదైనా చేయాలనుకున్నా. నా చేతులతో వాటికి వైద్యం చేస్తోంటే అదో సంతృప్తి' అనే లెమన్‌టింగ్స్‌పాస్ రోజులన్నీ మూగ జీవుల చుట్టే తిరుగుతాయి. ఏడాదిలో ఒక్కసారి మాత్రం స్వదేశానికి వెళ్లొస్తుంటారామె.


– మాదినేని రామమోహన్, పుట్టపర్తి



ఇల్లే... అడవిలా!

స్వీట్ హోమ్

ప్రకృతిలో కాసేపు గడిపినా చాలు... ఆ ఉల్లాసమే వేరు కదా! రకరకాల మొక్కలు, పక్షులు, జంతువులతో భూతల స్వర్గాన్ని తలపిస్తుంది మరి. అంత మహాత్మ్యం ఉంది కాబట్టే... అందరికీ ప్రకృతి అంటే అంత మక్కువ. అయితే, ఆ ఇష్టం సెలవురోజుల్లోనో, విహార యాత్రల్లో భాగంగానో సమయం గడిపితే తీరిపోయేదా... అంటే కాదనే అంటారు ప్రకృతి ప్రేమికులు. రోజూ అలాంటి ఫీల్‌ని పొందాలనే ఉద్దేశంతో ఈ గ్రీనరీని ఇంటీరియర్‌లోనూ భాగం చేశారు. నిజానికి, 20వ శతాబ్దంలోనే 'హిప్పీ' సంస్కృతి, ప్రకృతిని ఇంట్లో భాగం చేసింది. అయితే, మారిన జీవనశైలి... పెరుగుతోన్న పట్టణీకరణ వంటివి దీన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చాయి. ఒత్తిడిని దూరం చేస్తూ, మానసిక సాంత్వన కలిగించే ఈ ఇంటీరియర్ ట్రెండ్‌ను నేటితరం ఓ 'థెరాప్యూటిక్ స్టైల్'గానూ భావిస్తోంది. అందుకే, ఇండోర్ ప్లాంట్స్, వాల్ స్టిక్కర్లు, గదిలో ఎంచుకునే రంగులు, బెడ్, కర్టెన్లు... ఇలా అన్నింటిలోనూ పచ్చదనం మమేకం చేస్తూ 'అర్బన్ జంగిల్'లా మార్చేస్తున్నారు. హాల్, ప్లే ఏరియా, పిల్లల పడకగది... ఇలా అన్నింటినీ ప్రకృతి వనంలా రూపుదిద్దుతున్నారు. అందం, ఆహ్లాదం... రెండూ ఉంటే కాదనగలమా? మీకూ నచ్చిందా... అయితే, ఈ జంగిల్ థీమ్‌ని మీరూ ప్రయత్నించండి.














నితీశ్

గాయంతో నితీశ్ ఔట్!



శ్రీశంకర్

మహిళల చెస్ ప్రపంచకప్ సెమీస్‌లో ప్రవేశం

హంపి అదరహో..



హంపి

బాటుమి (జార్జియా): అగ్రశ్రేణి చెస్ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తోంది. గత ఏడాది ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఇప్పుడు ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ సెమీఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. క్వార్టర్‌ఫైనల్లో ఈ తెలుగమ్మాయి 1.5-0.5తో చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్‌పై విజయం సాధించింది. శనివారం తొలి గేమ్‌లో గెలిచిన హంపి.. ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను డ్రాగా ముగించడం ద్వారా ముందంజ వేసింది.

హంపి సెమీఫైనల్లో టాప్ సీడ్ లీ టింజీ (చైనా)తో తలపడుతుంది. టింజీ క్వార్టర్స్‌లో 2-0తో ననా జాగ్నిజె (జార్జియా)ను ఓడించింది. మరోవైపు ఇద్దరు భారత అమ్మాయిలు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ ఫలితం సోమవారం టైబ్రేక్స్‌లో తేలనుంది. ఈ ఇద్దరి మధ్య రెండో గేమ్ కూడా డ్రాగా ముగియడంతో టైబ్రేక్స్ తప్పలేదు. వైశాలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. క్వార్టర్స్‌లో ఆమె 0.5- 1.5తో తాన్ జ్యోంగి చేతిలో ఓడింది. రెండో గేమ్‌లో వైశాలి ఓటమి చవిచూసింది. ఈ టోర్నీలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారిణులు మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు.

ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడ్డ టీమ్‌ఇండియాను గాయాలు వేధిస్తున్నాయి. నాలుగో టెస్టుకు ముందు ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మోకాలి గాయం కారణంగా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌రెడ్డి ఇంగ్లాండ్ పర్యటనకు దూరం కానున్నట్లు సమాచారం. మరోవైపు ఫాస్ట్‌బౌలర్లు ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్ సైతం గాయాలతో ఇబ్బంది పడుతుండగా.. హరియాణా పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను అత్యవసరంగా భారత జట్టులోకి తీసుకున్నారు.



అన్షుల్

మాంచెస్టర్: తెలుగు కుర్రాడు, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి అర్ధంతరంగా ఇంగ్లాండ్ పర్యటనను ముగించుకుని స్వదేశానికి వచ్చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం జిమ్‌లో ట్రైనింగ్ సందర్భంగా నితీశ్ గాయపడ్డట్లు తెలిసింది. అతడి లిగమెంట్ దెబ్బతిన్నట్లు స్కానింగ్‌లో తేలింది. దీంతో సిరీస్‌లో మిగతా రెండు టెస్టులకు అతను దూరం కాక తప్పని పరిస్థితి నెలకొంది. పర్యటనలో రెండు టెస్టులు ఆడిన నితీశ్.. 45 పరుగులు చేశాడు. మూడు వికెట్లు పడగొట్టాడు. ఫాస్ట్‌బౌలర్లు ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్ ఇప్పటికే చిన్న చిన్న గాయాలతో బాధపడుతున్న నేపథ్యంలో నితీశ్ దూరం కానుండడం భారత్ ఇబ్బందిని మరింత పెంచనుంది. నాలుగో టెస్టు బుధవారం మాంచెస్టర్‌లో మొదలవుతుంది.

భారత జట్టులో అన్షుల్: హరియాణా ఫాస్ట్‌బౌలర్ అన్షుల్ కాంబోజ్.. భారత జట్టులోకి ఎంపికయ్యాడు. ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్‌ల గాయాలను దృష్టిలో ఉంచుకుని సెలక్టర్లు ముందు జాగ్రత్తగా అన్షుల్‌ను ఎంపిక చేశారు. ఇంగ్లాండ్‌తో రెండు, మూడు టెస్టుల్లో ఆడిన ఆకాశ్ దీప్.. గజ్జల్లో సమస్యను ఎదుర్కొంటున్నాడు. నెట్ సెషన్ సందర్భంగా సాయి సుదర్శన్ షాట్‌ను ఆపే ప్రయత్నంలో అర్ష్‌దీప్ సింగ్ ఎడమచేతికి గాయమైంది. కట్టు కట్టుకోవాల్సివచ్చింది. ఈ ఎడమచేతి వాటం పేసర్ ఇంకా ఒక్క టెస్టు మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు. ఆకాశ్‌దీప్ నాలుగో టెస్టుకు అందుబాటులో ఉంటాడా లేదా అన్న విషయంలో ఇంకా స్పష్టత లేదు. అర్ష్‌దీప్ మాత్రం సెలక్షన్‌కు అందుబాటులో ఉండొచ్చు. "నాలుగో టెస్టులో ఆడే తుది జట్టు కూర్పుపై చర్చిస్తున్నాం. అర్ష్‌దీప్ గాయం నేపథ్యంలో మ్యాచ్ ముంగిట నిర్ణయం తీసుకుంటాం. అతడి గాయం చిన్నదే. వైద్య బృందం అతణ్ని వైద్యుడి దగ్గరకి తీసుకెళ్లింది. అతడి చేతికి కుట్లు అవసరమవుతాయా లేదా అన్నది మా ప్రణాళికకు కీలకం" అని టీమ్‌ఇండియా సహాయ కోచ్ డస్కాటె చెప్పాడు.

24 ఏళ్ల అన్షుల్ టెస్టు సిరీస్‌కు ముందు భారత్-ఎ తరపున ఇంగ్లాండ్ లయన్స్‌తో ఆడి ఆకట్టుకున్నాడు. ఈ హరియాణా పేసర్ నిరుడు రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో కేరళపై ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు పడగొట్టడం ద్వారా వెలుగులోకి వచ్చాడు. ప్రేమాంగ్సు ఛటర్జీ (1956-57), ప్రదీప్ సోమసుందరం (1985-86) తర్వాత రంజీల్లో ఆ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా అన్షుల్ నిలిచాడు. మొత్తంగా అతడు గత రంజీ సీజన్‌లో ఆరు మ్యాచ్‌ల్లో 34 వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ ఈ ఏడాది ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఆడి, చక్కటి ప్రదర్శన చేశాడు.

శ్రీశంకర్‌కు పసిడి

దిల్లీ: భారత లాంగ్‌జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ సత్తా చాటాడు. పోర్చుగల్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ మీట్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. 7.75 మీటర్ల దూరంతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. పీటర్ టార్కోస్కీ (పోలెండ్) కూడా ఇంతే దూరాన్ని నమోదు చేశాడు. కానీ వీరిద్దరి మధ్య రెండో అత్యుత్తమ దూరాన్ని లెక్కలోకి తీసుకుంటే శ్రీశంకర్ (7.69 మీ).. టార్కోస్కీ (7.58 మీ)ని అధిగమించాడు. మోకాలి శస్త్ర చికిత్స తర్వాత శ్రీశంకర్ పాల్గొన్న రెండో టోర్నీ ఇది. ఈ నెల ఆరంభంలో జరిగిన ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో పునరాగమనం చేసిన అతడు 8.05 మీటర్లతో స్వర్ణం సాధించాడు. టోక్యోలో సెప్టెంబర్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో శ్రీశంకర్ ఉన్నాడు. 8.27 మీటర్ల దూరాన్ని అందుకుంటే అతడు నేరుగా బెర్తు దక్కించుకుంటాడు.

అర్జున్, ప్రజ్ఞానంద ఓటమి



ప్రజ్ఞానంద

లాస్‌వెగాస్: ఫ్రీస్టైల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద తడబాటు కొనసాగుతోంది. వర్గీకరణ పోరులో ఈ భారత స్టార్లు ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో ఓడిపోయారు. మొదట ప్రజ్ఞానందను ఓడించిన కార్ల్‌సన్.. తర్వాత అర్జున్‌పై విజయం సాధించాడు. టోర్నీ ఆరంభ దశలో అంచనాలు అందుకోలేకపోయిన కార్ల్‌సన్.. మూడో స్థానం కోసం పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. నకమురతో కార్ల్‌సన్ తలపడతాడు. ఇక ఫాబియానో కరువానా (అమెరికా)తో అర్జున్ (5-6 స్థానాలు), సో వెస్లీ (అమెరికా)తో ప్రజ్ఞానంద (7-8 స్థానాలు) పోటీపడనున్నారు. ఈ టోర్నీ తుది పోరు అమెరికా గ్రాండ్‌మాస్టర్లు హన్స్ నీమాన్-లెవోన్ అరోనియన్ మధ్య జరగనుంది.

పాక్ విలవిల

బంగ్లాతో తొలి టీ20లో చిత్తు




ముస్తాఫిజుర్

మీర్పూర్: శ్రీలంకలో టీ20 సిరీస్ గెలిచిన ఉత్సాహంలో బంగ్లాదేశ్.. సొంతగడ్డపైనా అదరగొట్టింది. పాకిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఘనవిజయంతో మొదలుపెట్టింది. ఆదివారం తొలి మ్యాచ్‌లో బంగ్లా.. 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట తస్కిన్ అహ్మద్ (3/22), ముస్తాఫిజుర్ రెహ్మాన్ (2/6), తంజిమ్ హసన్ షకిబ్ (1/20)ల ధాటికి పాక్ 19.3 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. టాప్‌ఆర్డర్లో ఓపెనర్ ఫకార్ జమాన్ (44; 34 బంతుల్లో 6×4, 1×6) మినహా బ్యాటర్లు ఘోరంగా విఫలమవడంతో పాక్ 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సయిమ్ ఆయూబ్ (6), మహ్మద్ హారిస్ (4), కెప్టెన్ సల్మాన్ అఘా (3), హసన్ నవాజ్ (0), మహ్మద్ నవాజ్ (3) పెవిలియన్‌కు క్యూ కట్టేశారు. జట్టు స్కోరు 70 వద్ద జమాన్ కూడా ఆరో వికెట్ రూపంలో ఔటైపోయాడు. ఈ స్థితిలో ఖుష్‌దిల్ షా (17), అబ్బాస్ అఫ్రిది (22) పోరాడడంతో పాక్ కష్టం మీద 100 దాటింది. అనంతరం సల్మాన్ మీర్జా (2/23) ధాటికి బంగ్లా 7 పరుగులకే తంజిద్ హసన్ (1), లిటన్ (1) వికెట్లు కోల్పోయినప్పటికీ.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' పర్వేజ్ ఇమాన్ (56; 39 బంతుల్లో 3×4, 5×6), తౌహిద్ హృదోయ్ (36), జేకర్ అలీ (15 నాటౌట్) రాణించి జట్టును గెలిపించారు. బంగ్లా 15.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

పాకిస్థాన్‌తో ఆడం

తిరస్కరించిన భారత ఆటగాళ్లు ● వెటరన్స్ మ్యాచ్ రద్దు



శిఖర్ ధావన్

బర్మింగ్‌హామ్: వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో భాగంగా ఆదివారం భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. శిఖర్ ధావన్ సహా భారత ఆటగాళ్లు పాక్‌తో ఆడేందుకు తిరస్కరించడమే అందుకు కారణం. ఏప్రిల్‌లో పహల్గాం దాడి నేపథ్యంలో భారత ఆటగాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఈ టోర్నీని నిర్వహిస్తోంది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ డబ్ల్యూసీఎల్ సహ యజమాని. జూన్ 18న మొదలైన ఈ టోర్నమెంట్ ఆగస్టు 2న ఫైనల్‌తో ముగియాల్సి వుంది. యువరాజ్ సింగ్ భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తునాడు. ధావన్, హర్భజన్, యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, వరుణ్ ఆరోన్ లాంటి మాజీ ఆటగాళ్లు ఈ జట్టులో ఉన్నారు. షాహిద్ అఫ్రిది సారథ్యంలో పాకిస్థాన్ జట్టు తరపున యూనిస్ ఖాన్, సోహైల్ తన్వీర్, వాహబ్ రియాజ్, కమ్రాన్ అక్మల్ తదితరులు ఆడుతున్నారు. "ఈ ఏడాది పాకిస్థాన్ హాకీ జట్టు భారత్ వెళ్తుందని విన్నాక.. ఇటీవల భారత్, పాక్ మధ్య వాలీబాల్ పోరు, ఇంకొన్ని మ్యాచ్‌లు చూశాక డబ్ల్యూసీఎల్‌లో రెండు దేశాల మధ్య మ్యాచ్ నిర్వహించవచ్చని అనుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా జనాలకు సంతోషాన్ని పంచాలన్నదే మా ఉద్దేశం. కానీ ఈ క్రమంలో చాలా మంది మనోభావాలను గాయపరిచాం. అసౌకర్యాన్ని కలిగించినందుకు క్షమాపణలు చెబుతున్నాం. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను రద్దు చేయాలని నిర్ణయించాం" అని డబ్ల్యూసీఎల్ ఓ ప్రకటనలో పేర్కొంది. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనని మే నెలలోనే డబ్ల్యూసీఎల్ నిర్వాహకులకు స్పష్టం చేశానని ధావన్ ఎక్స్‌లో తెలిపాడు. నిరుడు డబ్ల్యూసీఎల్ ఆరంభ టోర్నీలో భారత జట్టు పాకిస్థాన్‌తో ఆడింది. భారత్ చాలా కాలంగా ఏ ఆటలోనూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడట్లేదు. కానీ ఒలింపిక్స్ స్పోర్ట్స్‌లో వివిధ టోర్నీల్లో ఆ జట్టుతో ఆడుతోంది. హాకీ ఆసియాకప్, జూనియర్ హాకీ ప్రపంచకప్, జూనియర్ షూటింగ్ ప్రపంచకప్, ప్రపంచ పారా అథ్లెటిక్స్ సహా ఈ ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చే అనేక మేజర్ టోర్నీల్లో పోటీపడేందుకు పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఫైనల్లో దక్షిణాఫ్రికా



వాండర్‌డసెన్

హరారే: ముక్కోణపు టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్ చేరింది. ఆదివారం ఆ జట్టు 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జింబాబ్వేను ఓడించింది. మొదట జింబాబ్వే 6 వికెట్లకు 144 పరుగులు చేసింది. బ్రయాన్ బెనెట్ (61; 43 బంతుల్లో 7×4, 3×6) టాప్ స్కోరర్. ర్యాన్ బర్ల్ (36) కూడా రాణించాడు. కార్బిన్ బోష్ (2/16) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. రూబిన్ హెర్మన్ (63; 36 బంతుల్లో 3×4, 4×6), వాండర్‌డసెన్ (52 నాటౌట్; 41 బంతుల్లో 6×4) మెరుపులతో దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. 3 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో సఫారీ జట్టు తుది పోరుకు అర్హత సాధించింది. ఆడిన రెండు మ్యాచ్‌లూ నెగ్గిన న్యూజిలాండ్ కూడా టైటిల్ పోరు చేరింది. మూడు మ్యాచ్‌ల్లో ఓడిన జింబాబ్వే ఫైనల్ రేసుకు దూరమైంది.

నాకౌట్లో పంకజ్



పంకజ్ అద్వాణీ

మనామా (బహ్రెయిన్): ఐబీఎస్ఎఫ్ ప్రపంచ 6-రెడ్ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో పంకజ్ అద్వాణీ నాకౌట్ బెర్తును ఖరారు చేసుకున్నాడు. గ్రూప్-ఎంలో పంకజ్ రెండు విజయాలు నమోదు చేశాడు. మొదట 4-1తో అహ్మద్ అబ్దుల్ (కువైట్)ను ఓడించిన అతడు.. అయమన్ (దక్షిణాఫ్రికా)పై అంతే తేడాతో నెగ్గాడు. డిఫెండింగ్ ఛాంపియన్ కమల్ చావ్లా (గ్రూప్-ఎ), మనన్ చంద్ర (గ్రూప్-ఎల్), బ్రిజేష్ దమాని (గ్రూప్-జె), పరాస్ గుప్తా (గ్రూప్-కె) కూడా రెండేసి విజయాలు అందుకున్నారు. అండర్-21లో మయూర్ గార్గ్, శ్యామ్ రాజ్మి కూడా చెరో రెండు గేమ్‌లు గెలిచి నాకౌట్ బెర్తులను ఖాయం చేసుకున్నారు.

ఇంగ్లాండ్‌లోనే ఇంకో మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్



సింగపూర్: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఆరంభమైనప్పటి నుంచి ఫైనల్‌కు ఇంగ్లాండే ఆతిథ్యమిస్తోంది. ఇప్పటికే లార్డ్స్‌లో మూడు తుది సమరాలు (2021, 2023, 2025) జరిగాయి. తర్వాతి మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆతిథ్య హక్కులను సైతం ఐసీసీ ఇంగ్లాండ్‌కే కట్టబెట్టింది. ఆదివారం సింగపూర్‌లో జరిగిన వార్షిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ 2027, 2029, 2031లో జరుగుతాయి. "రాబోయే మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆతిథ్య హక్కులను ఇంగ్లాండ్‌కు కట్టబెట్టాం. తొలి మూడు ఫైనల్స్ కూడా ఇంగ్లాండ్‌లోనే భిన్న వేదికల్లో జరిగాయి" అని ఐసీసీ ఓ ప్రకటనలో చెప్పింది. ఐసీసీ నిర్ణయం పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు హర్షం వ్యక్తం చేసింది. ఫైనల్స్‌కు ఆతిథ్యమివ్వడం గొప్ప గౌరవమని చెప్పింది. భారత్‌లో టెస్టు క్రికెట్ అంతగా ఆదరణ ఉన్న ఫార్మాట్ కాదు. భారత్ ఫైనల్ చేరకపోతే.. ఇక్కడ అగ్రశ్రేణి జట్లు టైటిల్ కోసం పోటీపడ్డా జనాల్లో ఎక్కువగా ఆసక్తి ఉండకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలోనే డబ్ల్యూటీసీ ఫైనల్ ఆతిథ్య హక్కుల కోసం బీసీసీఐ పోటీ పడట్లేదని భావిస్తున్నారు.



అండర్సన్

సచిన్ పక్కన నేనా అనిపిస్తోంది

లండన్: 'సచిన్ పక్కన నేనా?' అని అనిపిస్తోందని ఇంగ్లాండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ వ్యాఖ్యానించాడు. భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌కు అండర్సన్-తెందుల్కర్ అని పేరు పెట్టిన నేపథ్యంలో అతనిలా పేర్కొన్నాడు. "ఒక ట్రోఫీకి మన పేరు పెట్టడం చాలా పెద్ద విషయం. అలాంటిది సచిన్ తెందుల్కర్ లాంటి అత్యుత్తమ ఆటగాడి పక్కన నా పేరు ఉండడం నమ్మబుద్ధి కావట్లేదు. అతడితో కలిసి ట్రోఫీని ఆవిష్కరించడం చాలా సంతోషంగా అనిపించింది. చిన్నప్పటి నుంచి సచిన్ ఆట చూశాను. అతడిపై ప్రత్యర్థిగా కూడా ఆడాను. ఒక దేశ భారాన్ని తన కెరీర్ ఆసాంతం భుజస్కంధాలపై మోస్తూ, రాణించిన గొప్ప ఆటగాడు సచిన్. అతడితో కలిసి ఒక ట్రోఫీలో భాగం కావడం ఎంతో పెద్ద గౌరవం" అని అండర్సన్ తెలిపాడు. భారత్-ఇంగ్లాండ్ టెస్టు సమరానికి పటౌడీ సిరీస్ అనే పేరు ఉండేది. దాన్ని ఇటీవలే ఇంగ్లాండ్ బోర్డు రిటైర్ చేసి, అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీగా మార్చింది.

హాంకాంగ్‌పై భారత్ గెలుపు



తన్వి శర్మ

సోలో (ఇండోనేషియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూప్-డి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 110-100తో హాంకాంగ్‌ను ఓడించింది. తొలి సింగిల్స్‌లో రాము 11-9తో సమ్ యూపై నెగ్గగా.. డబుల్స్‌లో భార్గవ్ రామ్-విశ్వతేజ్ జంట చెంగ్ షింగ్- డెంగ్ చి ఫాయ్ జోడీని ఓడించింది. దీంతో భారత్ 22-13తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత లామ్ కాపై రౌనక్ చౌహాన్ నెగ్గాడు. లామ్ కా 13 పాయింట్లు సాధించడంతో భారత్ ఆధిక్యం (55-49) తగ్గింది. లీ అనాపై తన్వి శర్మ గెలవడంతో ఆధిక్యం (66-54) కాస్త మెరుగైంది. ఆ తర్వాత కూడా హాంకాంగ్ నుంచి గట్టి పోటీ ఎదురైనా.. ఒక్క పాయింట్ తేడాతో భారత్ విజయాన్ని అందుకుంది. ఈ రెండు జట్లు ఇప్పటికే నాకౌట్ చేరాయి. సోమవారం క్వార్టర్స్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది. కొత్త పాయింట్ల పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది.



ఆదివారం ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ మాంచెస్టర్ యునైటెడ్ ఆటగాళ్లతో భారత క్రికెటర్లు. టీమ్‌ఇండియా బుధవారం నుంచి మాంచెస్టర్‌లోనే ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడనుంది.

ఇంగ్లాండ్ 221/7

చెమ్స్‌ఫోర్డ్: భారత్ అండర్-19 జట్టుతో రెండో యూత్ టెస్టులో ఇంగ్లాండ్ అండర్-19 జట్టు తడబడినా.. పుంజుకుంది. తొలి రోజు, ఆదివారం కడపటి వార్తలందే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 7 వికెట్లకు 221 పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్.. ఆదిత్య రావత్ (2/46), అంబ్రిష్ (2/43), నమన్ పుష్పక్ (2/40) విజృంభించడంతో 80 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు డాకిన్స్, ఆడమ్ థామస్ డకౌట్ అయ్యారు. బెన్ మేయర్స్ (31), ఆర్యన్ సావంత్ (20), రాకీ ఫ్లింటాఫ్ (16) కాసేపు నిలిచి వెనుదిరిగారు. ఈ స్థితిలో కెప్టెన్ థామస్ రే (59), ఏకాంశ్ సింగ్ (64 బ్యాటింగ్) జంట ఇంగ్లాండ్‌ను ఆదుకుంది. ఆరో వికెట్‌కు ఈ జోడీ 90 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచింది. థామస్ రే ఔటైనా.. ఆల్బర్ట్ (16)తో కలిసి ఏకాంశ్ స్కోరు 200 దాటించాడు. ఆట చివర్లో ఆల్బర్ట్ వెనుదిరిగాడు. ఏకాంశ్, మింటో (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రంగుల్లో పత్తి.. సాగుపై సమస్యల కత్తి!

డిమాండున్నా రైతుల్లో ఆదరణ కరవు • కేవలం 200 ఎకరాల్లోనే పంట

దిల్లీ: పత్తి తెల్లరంగులో ఉంటుందని తెలుసు.. కానీ రంగుల్లో పత్తి పండుతుందని మీకు తెలుసా.. దానికి భారీ డిమాండు ఉందని ఎప్పుడైనా విన్నారా.. సహజంగానే ఇది కొంత వింతగా అనిపించినా.. సహజ రంగుల్లో పత్తిని పండించడం అనేది వాస్తవమే. అయితే ఇది ఇప్పుడిది కాదు.. ఎప్పటి నుంచో ఉంది.. కాకపోతే అనేక సమస్యల కారణంగా రైతులు దీనిపై మొగ్గు చూపడం లేదు. ఎప్పుడో 1940లోనే సహజ రంగుల్లో పత్తిని పండించేందుకు ప్రభుత్వం వాణిజ్యపరంగా అనుమతించినా.. ఇప్పటికీ కేవలం 200 ఎకరాల్లోనే రైతులు పండిస్తున్నారు. అదీ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులలోనే పండుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండు పెరిగినా.. ప్రభుత్వం ఎన్నో పరిశోధనలు చేస్తున్నా.. రైతులకు మాత్రం సమస్యల కారణంగా ఆసక్తి కలగడం లేదు. రంగుల పత్తి కేజీకి రూ.240 పలుకుతోంది. సాధారణ పత్తి కేజీ రూ.160 ఉంది. అయితే సాధారణ పత్తితో పోలిస్తే.. రంగుల పత్తి దిగుబడి తక్కువగా ఉంటుంది. ఇదీ రైతుల్లో ఆసక్తి లేకపోవడానికి కారణమే.

■ రంగుల పత్తికి విత్తనాల కొరత, చీడపీడల ప్రమాదం, అధిక క్రిమిసంహారక మందుల వినియోగం అనేవి కొంత ఇబ్బందికరమే.

ఎకరానికి 2 క్వింటాళ్లలోపే..

లేత గోధుమ రంగులో ఉండే పత్తి.. ఎకరానికి అతి స్వల్పంగా 1.5 నుంచి 2 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తుంది. అదే సాధారణ పత్తి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

■ ఫలితంగా 200 ఎకరాల్లో కేవలం 330 క్వింటాళ్ల వరకే రంగుల పత్తి పండుతోంది.

2,500 ఏళ్ల నాటిది..

భారత వ్యవసాయ రంగంలో 2,500 బీసీ నాటికే రంగుల పత్తి ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం కోకానాడ పేరుతో ఎరుపు, ఖాకీ, గోధుమ రంగుల్లో పత్తి పండేది. ఎరుపు, ఖాకీ రంగు పత్తిని రాయలసీమ, ఆంధ్రలో పండించేవారు.



దానిని జపాన్‌కు ఎగుమతి చేసేవారు. కొన్ని రకాలను అస్సాం, కర్ణాటకల్లో పండించేవారు.

హరిత విప్లవంతో కనుమరుగు

స్వాతంత్ర్యానంతరం హరిత విప్లవం తేవడంతో అత్యధిక దిగుబడినిచ్చే తెల్ల పత్తివైపు రైతులు మొగ్గుచూపారు. దీంతో రంగుల పత్తి దాదాపుగా కనుమరుగైంది. తక్కువ విత్తనాలు, బరువు, బలహీన ఫైబర్, పొట్టి పింజలవల్ల అధికంగా రంగుల పత్తి రైతులకు లాభదాయకంగా లేకపోయింది. దీంతో భారీ ఎత్తున సాగు కాలేదు.

కొత్త వంగడాలపై పరిశోధన

భారతీయ వ్యవసాయ సంస్థలు.. పరిశోధనలు చేసి కొత్త రంగుల పత్తి విత్తనాలను సృష్టించాయి. డీడీసీసీ-1, డీడీబీ-12, డీఎంబీ-225, డీజీసీ-78 విత్తనాలను ధార్వాడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసింది. నాగ్‌పుర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ.. వైదేహీ-95ని అభివృద్ధి చేసింది. ఇందులో నాలుగైదు వెరైటీలు కొంత సత్ఫలితాలిచ్చాయి.

పర్యావరణపరంగానూ మంచిదే..

రంగుల పత్తి పర్యావరణపరంగానూ సత్ఫలితాలనే ఇస్తుందని అధ్యయనంలో తేలింది. సాధారణ పత్తితో తయారుచేసిన మీటరు వస్త్రానికి రంగు వేయడానికి 150 లీటర్ల నీరు అవసరమవుతుంది. రంగుల పత్తికి అంత అవసరముండదు. అంతే కాదు.. అది విష వ్యర్థాల విసర్జన వ్యయాన్ని 50 శాతం తగ్గిస్తుంది.



సహజసిద్ధ లేత బ్రౌన్ రంగు పత్తితో రూపొందించిన దారం, వస్త్రం



మృతదేహాలను పసిగట్టే జాగిలాలు

దిల్లీ: సహాయక చర్యల్లో మానవ మృతదేహాలు, అవశేషాల ఆచూకీని పసిగట్టే జాగిలాలు త్వరలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళంలో చేరనున్నాయి. ఇప్పటికే ఈ జాగిలాలకు ప్రత్యేక శిక్షణ మొదలైంది. ఇందుకోసం మృతదేహాల నుంచి వచ్చే వాసనను పోలి ఉండే ప్రత్యేక అత్తరు(సెంట్)ను విదేశాల నుంచి తీసుకురావడం గమనార్హం. బెల్జియన్ మాలినోయిస్, లాబ్రడార్ జాతులకు చెందిన శునకాలకు దీనిపై శిక్షణ ఇస్తున్నామని.. త్వరలోనే ఫస్ట్ బ్యాచ్ విధుల్లోకి తీసుకోనున్నట్లు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తెలిపారు.



ఇవ్వడంలోని ఆనందాన్ని అనుభూతి చెందండి

మీకున్న జ్ఞానాన్ని ఎంత ఎక్కువ మందికి పంచితే, అది అంత బాగా వృద్ధి చెందుతుంది. అలాగే మీరు ఎంత ఎక్కువ మంది ఆనందానికి కారణమైతే, మీ జీవితం అంత ఆనందకరంగా మారుతుంది. అందుకే ఇవ్వడాన్ని అలవాటు చేసుకోండి. అందులోని ఆనందం మీకు అనుభవంలోకి వస్తుంది.

- క్రిస్ పావర్స్, పాడ్‌కాస్టర్

లోక్‌సభకు ఇప్పటిదాకా 18 మంది ముస్లిం మహిళల ప్రాతినిధ్యం

• వారిలో 13 మంది రాజవంశీకులు

దిల్లీ: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభకు మొత్తం మీద 18 మంది ముస్లిం మహిళలు ప్రాతినిధ్యం వహించారు. వారిలో 13 మంది మహిళలు రాజవంశీకులు. 'మిస్సింగ్ ఫ్రం ద హౌస్- ముస్లిం ఉమెన్ ఇన్ ద లోక్‌సభ' పేరుతో రషీద్ కిద్వాయ్, అంబర్ కుమార్ ఘోష్ రాసిన పుస్తకంలో ఈ వివరాలున్నాయి. ఇది త్వరలో విడుదల కానుంది. ఇందులో రాజవంశీకుల నుంచి రాజకీయ నేతగా మారిన టీ విక్రయదారు భార్యదాకా ఎంపీలైన మహిళల గురించి రచయితలు వివరించారు. వాస్తవానికి 20 మంది ముస్లిం మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యారని, అయితే సుభాషిణి అలీ, అజీజ్ బేగమ్ తాము ఇస్లాంను అనుసరించడం లేదని తెలిపారని కిద్వాయ్ తెలిపారు. దేశ జనాభాలో 7.1 శాతం ముస్లిం మహిళలున్నారని, కానీ పార్లమెంటులో వారి ప్రాతినిధ్యం నామమాత్రమేనని వెల్లడించారు. మొత్తం 18 లోక్‌సభల్లో ఐదుసార్లు ఒక్క ముస్లిం మహిళా లేరని పేర్కొన్నారు.

■ పుస్తకంలోని వివరాల ప్రకారం.. ప్రగతిశీలంగా ఉండే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఇంతవరకు ఒక్క ముస్లిం మహిళా లోక్‌సభకు ఎన్నిక కాలేదు.



ఇక్రా హసన్ (యూపీ)

■ భారత రాజకీయాల్లో ప్రభావం చూపిన ముస్లిం మహిళా ఎంపీగా మొహసినా కిద్వాయ్ నిలిచారు. ఆమె మంత్రిగానూ పలు శాఖలను నిర్వహించారు.

■ రాజకీయ నేతగా మారిన టీ విక్రయదారు అయిన మహమ్మద్ జబ్బర్ అన్సారీ సతీమణి కైజర్ జహాన్ 2009లో లోక్‌సభకు బహుజన్ సమాజ్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

■ మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ సతీమణి బేగం అబిదా అహ్మద్ బరేలీ నుంచి రెండు సార్లు లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించారు.

■ ప్రస్తుత లోక్‌సభలో ఉత్తర్ ప్రదేశ్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎన్నికైన ఒకే ఒక్క ముస్లిం మహిళ ఇక్రా హసన్ ఉన్నారు.

మలేరియాపై పోరుకు ఐసీఎంఆర్ కొత్త టీకా!

ఇంటర్నెట్ డెస్క్: మలేరియాను నివారించడంలో భారత్ మరో ముందడుగు వేసింది. దేశంలో ఈ వ్యాధిని రూపుమాపడానికి భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్).. ఆడ్‌ఫాల్సివ్యాక్స్ అనే బహుళ-దశల స్వదేశీ రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా టీకాను అభివృద్ధి చేస్తోంది. ఇందులో పలు సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ టీకా.. మలేరియాను కలిగించే ప్లాస్మోడియం పరాన్నజీవి రక్తంలో ఉన్న రెండు క్లిష్టమైన దశలను లక్ష్యంగా చేసుకుంటుంది. ప్రీక్లినికల్ దశలో ఇది మంచి ఫలితాన్ని చూపించింది. ఇప్పటికే ఉన్న సింగిల్-స్టేజ్ వ్యాక్సిన్ల కంటే ఆడ్‌ఫాల్సివ్యాక్స్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు ఉన్నట్లు డేటా చెబుతోంది. ఇది మానవుల్లో మెరుగైన దీర్ఘకాలిక రోగనిరోధక శక్తిని పెంచి, మలేరియా నిర్మూలనకు దోహదపడుతుంది. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన దశలోనే ఉంది.

జ్ఞాన నేత్రం



మృతదేహాల వద్ద తమ వారి కోసం పాలస్తీనియన్ల వెతుకులాట

గాజాలో అన్నార్తులపై ఆగని దాడులు

తాజా కాల్పుల్లో 85 మంది మృత్యువాత

డెయిర్ అల్ బలా: గాజాలో మారణహోమం కొనసాగుతోంది. ఆహారం కోసం ఎదురుచూస్తున్న పాలస్తీనియన్లపై రెండు చోట్ల ఆదివారం భీకర దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 85 మంది మృత్యువాతపడ్డారు. జికిం మీదుగా ఉత్తర గాజాలోకి ప్రవేశించే ఆహార ట్రక్కుల కోసం వేచి ఉన్నవారిపై తీవ్రస్థాయి దాడి జరిగింది. ఆ ఒక్కచోటే 79 మంది దుర్మరణం పాలయ్యారు. 150 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ఇజ్రాయెల్ సైనికులే కాల్పులకు తెగబడ్డారని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఓ అధికారి కూడా తాజా దాడులు జరిపింది ఇజ్రాయెల్ బలగాలేనని పేర్కొన్నారు. గాజాలోని షకౌష్ ప్రాంతంలో మానవతా సాయం కోసం వేచి ఉన్నవారిపై ఆదివారం జరిగిన దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు- సెంట్రల్ గాజాలోని పలు ప్రాంతాలను ఖాళీ చేయాలంటూ స్థానికులకు ఇజ్రాయెల్ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది.

100 మందికిపైగా ఎంపీల సంతకం

• జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన తీర్మానంపై కేంద్ర మంత్రి రిజిజు వెల్లడి



దిల్లీ: ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న అభిశంసన తీర్మానంపై 100 మందికిపైగా ఎంపీలు సంతకం చేశారని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అభిశంసనకు అవసరమైన సంతకాలు పూర్తికావడంతో ఇక ఎప్పుడు తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టాలనే విషయాన్ని బీఏసీ నిర్ణయించనుందని వెల్లడించారు. ఆదివారం దిల్లీలో రిజిజు మీడియాతో మాట్లాడారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఈ తీర్మానాన్ని తెస్తామని గతంలోనే ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయించే వరకూ తీర్మానంపై తాను ఏ విషయమూ చెప్పలేనని రిజిజు తెలిపారు. జస్టిస్ వర్మను తొలగించే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని పేర్కొన్నారు. 'న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది అతి సున్నితమైన, తీవ్రమైన అంశం. ప్రజలకు న్యాయం అందించే వ్యవస్థ కావడంవల్ల దీనికి ప్రాధాన్యం ఉంది. ఒకవేళ న్యాయ వ్యవస్థలో అవినీతి ఉంటే అది ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించే అంశమే. అందుకే జస్టిస్ వర్మ తొలగింపు కోసం అన్ని పార్టీలు సంతకాలు చేశాయి' అని రిజిజు వివరించారు.

దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. ఆయన తిరస్కరించడంతో.. అభిశంసనకు సిఫారసు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీలకు జస్టిస్ సంజీవ్ ఖన్నా లేఖలు రాశారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌పై కన్వారీల దాడి

మీర్జాపుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లో కన్వర్ యాత్రికులు దుస్సాహసానికి పాల్పడ్డారు. మీర్జాపుర్ రైల్వే స్టేషన్‌లో ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్‌ను వారు చితకబాదారు. ఝార్ఖండ్‌లోని బైద్యనాథ్ ధామ్ వెళ్లే బ్రహ్మపుత్ర రైలు ఎక్కేందుకు వచ్చిన కన్వర్ యాత్రికులు, సీఆర్‌పీఎఫ్ జవాన్ గౌతమ్ మధ్య టికెట్ల కొనుగోలు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారు జవాన్‌పై దాడి చేశారు. నేలపై పడిపోయిన జవాన్‌పై కన్వారీలు పిడిగుద్దులు కురిపించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో దాడికి పాల్పడిన ఏడుగురు కన్వారీలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.



రష్యాతో శాంతి చర్చలకు సిద్ధం

• ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటన

• సానుకూలంగా స్పందించిన మాస్కో



కీవ్: రష్యాతో గత నెలలో నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ మేరకు వచ్చే వారం రష్యాతో చర్చలు జరిపేందుకు అధికారిక ప్రతిపాదనను తాము పంపినట్లు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. శనివారం రాత్రి ఉక్రెయిన్ పౌరులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. చర్చల ప్రతిపాదనను జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రుస్తెమ్ ఉమెరోవ్ రష్యా ప్రతినిధులకు అందజేశారని తెలిపారు. యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఉక్రెయిన్ ప్రతిపాదనకు రష్యా సానుకూలంగా స్పందించింది. శాంతికి తాము సిద్ధమేనని తెలిపింది. అయితే యుద్ధంలో లక్ష్యాలను సాధించడం తమకు కీలకమని పేర్కొంది. "ఉక్రెయిన్ సమస్యకు శాంతిపూర్వక పరిష్కారం సాధించాలన్న తన కోరికను అధ్యక్షుడు పుతిన్ గతంలో ఎన్నోసార్లు వెలిబుచ్చారు. ఇది సుదీర్ఘ ప్రక్రియ. దీనికి గట్టి ప్రయత్నం జరగాలి. అంత సులభం కాదు" అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు.

ఫెర్రీలో మంటలు.. సముద్రంలోకి దూకిన ప్రయాణికులు

• ఇండోనేసియాలో గర్భిణి సహా ఐదుగురి మృతి

మనాడో: ఇండోనేసియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వందల మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఫెర్రీలో అగ్నిప్రమాదం జరిగింది. సులవేసి ద్వీపం సమీపంలో ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనలో ఓ గర్భిణి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 284 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. తలౌడ్ నుంచి ఉత్తర సులవేసి ప్రావిన్సు రాజధాని మనాడోకు 'కేఎం బార్సిలోనా 5' అనే ఫెర్రీ బయలుదేరింది. తలిసే ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందడంతో స్థానిక మత్స్యకారుల సాయంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఫెర్రీలో కింద అంతస్తు సహా అంతటికీ మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. భయాందోళనకు గురైన ప్రయాణికులు లైఫ్ జాకెట్లు ధరించి సముద్రంలోకి దూకారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.





ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన ఫౌజాసింగ్ అంత్యక్రియలు

జలంధర్: ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయస్కుడైన మారథాన్ అథ్లెట్ ఫౌజాసింగ్(114) అంత్యక్రియలు జలంధర్‌లోని ఆయన స్వగ్రామం బియాస్‌లో ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం ముగిశాయి. ఈ అంత్యక్రియలకు పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, ముఖ్యమంత్రి భగవంత్ మాన్, మంత్రులు, పలువురు ప్రముఖులు హాజరై నివాళి అర్పించారు. అనేక మారథాన్‌లలో పాల్గొన్న ఫౌజా సింగ్ దేశం గర్వించేలా ఎన్నో విజయాలు సాధించారని మాన్ అన్నారు. 89 ఏళ్ల వయసులో మారథాన్ ప్రారంభించిన ఫౌజా సింగ్ 'టర్బన్డ్ టోర్నడో'గా గుర్తింపు పొందారు. ఈ నెల 14న రోడ్డుపై నడుస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఆయన మరణించారు.

మహిళా రోగులపై లైంగిక వేధింపులు.. అమెరికాలో భారత సంతతి వైద్యుడి అరెస్టు

న్యూయార్క్: వైద్యపరమైన డ్రగ్స్‌ను ఎరగా చూపి మహిళా రోగులను లైంగికంగా లొంగదీసుకుంటున్నాడన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న భారత సంతతి వైద్యుడిని అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యూజెర్సీకి చెందిన డాక్టర్ రితేశ్ కల్రా(51) సెకాకస్ ప్రాంతంలో ఫెయిర్ లాన్ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. అతడి దగ్గరికి వచ్చే రోగులకు అవసరం లేకపోయినా చికిత్స పేరుతో ఆక్సికోడోన్ వంటి శక్తిమంతమైన డ్రగ్స్ ఇస్తుండేవాడు. 2019 నుంచి 2025 ఫిబ్రవరి వరకు 31,000 కంటే ఎక్కువ ఆక్సికోడోన్ ప్రిస్క్రిప్షన్‌లను చట్ట విరుద్ధంగా రితేశ్ రోగులకు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. వాటికి అలవాటు పడిన వారు మరిన్ని మందులు కావాలని సంప్రదించేవారు. దీంతో ప్రిస్క్రిప్షన్ ఇవ్వాలంటే తన లైంగిక కోరికలు తీర్చాలని మహిళా రోగులను బలవంతం చేసేవాడు. తమతో అసభ్యంగా ప్రవర్తించాడని.. లైంగిక దాడికి పాల్పడ్డాడని పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడు చట్టాన్ని ఉల్లంఘించడంతో పాటు అధిక మోతాదు డ్రగ్స్ ఇచ్చి.. రోగుల ప్రాణాలకు ముప్పు కలిగించాడని అభిప్రాయపడిన అమెరికా కోర్టు అతడు తన క్లినిక్‌ను మూసివేయాలని ఆదేశించింది. కేసు క్రియాశీలకంగా ఉన్నంత కాలం రితేశ్ లైసెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. అతడు దోషిగా తేలితే.. దాదాపు 20 ఏళ్ల జైలు శిక్ష, భారీ జరిమానా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం రితేశ్ గృహ నిర్బంధంలో ఉన్నాడు.

ఏఏఐబీ దర్యాప్తుపై నమ్మకముంది

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఊహాజనిత కథనాలను ప్రచురించారని పేర్కొంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌లకు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) లీగల్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిరిండియా విమాన ప్రమాదంపై తప్పుడు కథనాలు, ఊహాగానాలు ప్రచారం చేయొద్దని పాశ్చాత్య మీడియా వర్గాలను పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కోరారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తుపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎయిరిండియా ప్రమాదంపై తుది నివేదిక వచ్చే వరకు ప్రభుత్వం వేచి ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు.. దేశంలో మొదటిసారిగా ఎయిరిండియా బ్లాక్ బాక్స్ డేటాను విజయవంతంగా డీకోడ్ చేసినందుకు రామ్మోహన్ నాయుడు ఏఏఐబీని ప్రశంసించారు. గతంలో బ్లాక్ బాక్సును డీకోడ్ చేయాలంటే విదేశాలకు పంపే వారని.. కానీ, ఇప్పుడు ఆ పనిని దిల్లీలోనే చేయడం అతి పెద్ద విజయమని కేంద్రమంత్రి తెలిపారు.

విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు..

• పైలట్ల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

వాషింగ్టన్: అమెరికాలో ఓ విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. పైలట్ల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 767-400 విమానానికి గాల్లోకి ఎగిరిన కాసేపటికే సాంకేతిక సమస్య ఎదురైంది. ఎడమవైపు ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పైలట్లు లాస్‌ఏంజెలెస్ విమానాశ్రయ సిబ్బందికి సమాచారం అందించి.. విమానాన్ని వెనక్కి మళ్లించి, సురక్షితంగా ల్యాండ్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రన్‌వే పైకి వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో విమానంలో ఎంతమంది ఉన్నారన్నది అధికారులు వెల్లడించలేదు. ప్రమాదానికి కారణాలు కూడా తెలియరాలేదు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. డెల్టా ఎయిర్‌లైన్స్ ప్రతినిధి ఆదివారం ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించారు.

న్యాయవాదులకు ఈడీ సమన్లు.. నేడు సుప్రీంలో విచారణ

దిల్లీ: కేసు దర్యాప్తు సమయంలో కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు విచారణ సంస్థలు సమన్లు జారీచేయడాన్ని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం ఈ అంశాన్ని సోమవారం విచారించనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీచేయడంతో ఈ అంశాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది.


■ అక్రమ వ్యాపారం చేసే వారి నుంచి పరిహారం అందేలా పంపిణీదారులు, విక్రేత వివరాలు సహా ఉత్పత్తుల ధ్రువీకరణపత్రాలు, నాణ్యత, స్వచ్ఛతను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందంటూ ప్రకటించాలని దాఖలైన పిటిషన్‌ను కూడా సోమవారం సుప్రీంకోర్టు విచారించనుంది.

సీబీఐ అధికారులమంటూ రూ.3 లక్షల నగదు, బంగారం లూటీ

దిల్లీ: సీబీఐ అధికారులమంటూ ఓ వ్యాపారి నివాసంలోకి వెళ్లిన ముగ్గురు వ్యక్తులు తనిఖీల పేరుతో రూ.3 లక్షల నగదు, బంగారం దోచుకెళ్లారు. ఈ ఘటన ఈ నెల 10న ఉత్తర దిల్లీలో చోటుచేసుకుంది. నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల్లో ఒకరైన 22 ఏళ్ల మహిళ బాధితుడైన వ్యాపారికి దూరపు బంధువు. ఆయన వద్ద నగదు, బంగారం ఉందన్న విషయం తెలుసుకున్న ఆమె ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో హోటల్ నిర్వహించే కేశవ ప్రసాద్ (28), దిల్లీకి చెందిన నిరుద్యోగి వివేక్ సింగ్(20)లను సంప్రదించింది. సీబీఐ అధికారులుగా నటించి వ్యాపారి ఇంట్లోకి వెళ్లాలని ముగ్గురు కలిసి ప్రణాళికను రచించారు. ఈ క్రమంలో ఈ నెల 10న వారు వ్యాపారి ఇంటికి వెళ్లారు. ఓఖా బ్రాంచ్ నుంచి వచ్చిన సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. ఇంట్లో సోదాలు చేయాలని చెప్పారు. సోదాలకు సంబంధించి పత్రాలు చూపించాలని వ్యాపారి కోరడంతో నిందితులు భయపెట్టే చర్యలకు దిగారు. అనంతరం బీరువా తెరిచి అందులోని రూ.3 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలను తీసుకెళ్లిపోయారు. మోసపోయినట్లు గుర్తించిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం పాటు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన పోలీసులు హరిద్వార్‌లో ముగ్గురినీ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.75 లక్షల నగదు, కొన్ని బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

నా ఇంటర్వ్యూ రోజే ఎమర్జెన్సీ ఎత్తేశారు

• జైశంకర్ జ్ఞాపకాలు



ఇంటర్నెట్ డెస్క్: సివిల్ సర్వీసెస్‌లో తన ప్రవేశంపై విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన యూపీఎస్సీ ఇంటర్వ్యూ రోజే దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేశారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలను చూస్తే ఎమర్జెన్సీకి తెరపడనుందని ముందుగానే అర్థమైందని, ఒక రకంగా చెప్పాలంటే.. అదే తన ఇంటర్వ్యూకు దోహదపడిందని తెలిపారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారిని ఉద్దేశించి ప్రసంగించిన జైశంకర్.. యూపీఎస్సీ పరీక్ష అనేది ఓ అగ్ని పరీక్షలాంటిదని, ప్రపంచంలోనే అత్యంత విలక్షణమైన పరీక్షా విధానమదని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ అసలైన సవాల్ అని చెబుతూ.. 48 ఏళ్ల క్రితం ఎదుర్కొన్న అనుభవాన్ని వివరించారు. '1977 మార్చి 21న నా ఇంటర్వ్యూ. ఆ రోజు నేనే తొలి అభ్యర్థిని. అదే రోజు దేశంలో ఎమర్జెన్సీ ఎత్తేశారు. 1977 ఎన్నికల్లో ఏం జరిగిందని ఇంటర్వ్యూలో అడిగారు. జేఎన్‌యూ విద్యార్థిని కావడం, నా సబ్జెక్టు రాజనీతి శాస్త్రం కావడంతో లక్కీ అనుకున్నా. ఇంటర్వ్యూలో ఉన్నాననే విషయం మరచిపోయా. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాం. ప్రజల్లోకి వెళ్లి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రచారం చేశామని చెప్పా. ఎవర్నీ నిందించకుండా నాటి పరిస్థితులను వివరించడం ఓ సవాల్‌గా అనిపించింది. దీనికి నా కమ్యూనికేషన్ స్కిల్స్ దోహదపడ్డాయి' అని వివరించారు.

రష్యాలో వరుసగా ఐదు భూకంపాలు

మాస్కో: రష్యా పసిఫిక్ తీరాన్ని ఆదివారం ఐదు వరుస భూకంపాలు కుదిపేశాయి. ఇందులో రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రతతో నమోదైన భూకంపమూ ఉంది. దీంతో అమెరికా జియాలజికల్ సర్వే సునామీ హెచ్చరిక జారీ చేసింది. తర్వాత ఉపసంహరించింది. 1,80,000 జనాభా ఉన్న పెట్రోపావలోస్క్-కమచాట్కా నగరానికి తూర్పున 144 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని పౌరులకు అధికారులు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.



ఉత్తరాదిన ఆచరించే పవిత్ర శ్రావణమాసం నేపథ్యంలో బిహార్‌లోని పట్నాలో ఆదివారం 108 అడుగుల పొడవైన కావడితో వెళ్తున్న కన్వారీలు

కరెంట్ అఫైర్స్



❖ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ అరేబియా పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య ఎంత మొత్తం విలువైన చరిత్రాత్మక రక్షణ ఒప్పందం కుదిరింది? జ: రూ.142 బిలియన్ డాలర్లు

❖ ఇథనాల్ సరఫరా సంవత్సరం (ఈఎస్‌వై) 2024–

మాదిరి ప్రశ్నలు

25లో ఇథనాల్ ఉత్పత్తి కోసం ఎన్ని మిలియన్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అదనంగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది? (దీంతో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (ఈబీపీ) కార్యక్రమం కింద ఇథనాల్ కోసం కేటాయించిన మొత్తం బియ్యం రూ.5.2 మిలియన్ టన్నులకు చేరుకుంది.) జ: రూ.2.8 మిలియన్ టన్నులు

❖ 78వ కేన్స్ చలన చిత్రోత్సవంలో ప్రతిష్ఠాత్మక పామ్ డి ఓర్ పురస్కారాన్ని ఎవరికి ప్రదానం చేశారు? జ: జాఫర్ పనాహి (ఈయన దర్శకత్వం వహించిన ఇరాన్ చిత్రం 'ఇట్ వాజ్ జస్ట్ యాన్ యాక్సిడెంట్'కు ఈ పురస్కారం లభించింది.)

మరింత సమాచారం

❖ మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ 2045 నాటికి తన సంపదలో ఎంత శాతాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు ఇటీవల ప్రకటించారు? జ: 99 శాతం

దక్కన్ పీఠభూమికి దక్షిణం అంచులో, తూర్పు కనుమల మధ్య సువిశాల తీరప్రాంతంతో కూడిన వైవిధ్యభరిత భౌగోళిక క్షేత్రం ఆంధ్రప్రదేశ్. అనేక రకాల నేలలతో, జీవనాడులైన జలవనరులతో, వాటిని సద్వినియోగం చేసుకోడానికి నిర్మించిన మానవ నిర్మిత బృహత్తర ప్రాజెక్టులతో నిండి ఉంది. నదుల ప్రవాహాలు సృష్టించిన సారవంతమైన డెల్టా భూములు, వర్షాధారిత మెట్టప్రాంతాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయరంగానికి వెన్నెముకగా ఉన్నాయి. ఇక్కడి వ్యవసాయాన్ని ప్రభావితం చేసే అంశాల్లో ముఖ్యమైనవి నేలలు, నీటిపారుదల సౌకర్యాలు. భిన్న పంటలు పండే నేలలతో పాటు వివిధ నదుల ప్రవాహాలు, వాటిపై కట్టిన ప్రాజెక్టుల ద్వారా విస్తృతమైన నీటిపారుదల సౌకర్యాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యవసాయ స్వరూపంపై అవగాహన కోసం రాష్ట్రంలోని నేలల రకాలు, అవి విస్తరించి ఉన్న జిల్లాలు, సాగునీటి వసతుల గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి.



జంఝావతి రబ్బర్ డ్యాం

జనరల్ స్టడీస్ — ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ

సారవంతమైన భూముల్లో సమృద్ధ ప్రవాహాలు!

ఆంధ్రప్రదేశ్ నేలలు - నీటిపారుదల సౌకర్యాలు

మృత్తికలు/నేలలు వ్యవసాయ పంటలకు, సహజంగా ఉద్భవించే సంపదకు మూలాధారాలు. దక్కన్ పీఠభూమి పురాతన స్ఫటిక శిలలు, రూపాంతర శిలలు, అగ్నిశిలలతో ఏర్పడింది. మృత్తికల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'పెడాలజీ' లేదా 'ఎడఫాలజీ' అంటారు. మృత్తిక ఏర్పడే విధానాన్ని 'పెడోజెనిసిస్'గా పేర్కొంటారు. సారవంతమైన నేల పైపొరనే 'మృత్తిక' అంటారు. మాతృశిలలు 'విదరింగ్ (శైథిల్యం)' అనే ప్రక్రియ వల్ల శిలారేణువులుగా మారతాయి. అవి జంతు, వృక్ష కళేబరాలు కుళ్లి ఏర్పడే హ్యూమస్ అనే పదార్థంతో కలిస్తే మృత్తిక ఏర్పడుతుంది. ఈ ప్రక్రియ చాలా సంక్లిష్టమైంది. ఒక సెంటీమీటర్ మందం మృత్తిక ఏర్పడటానికి మాతృశిల స్వభావాన్ని బట్టి 200 నుంచి 500 ఏళ్లు పడుతుంది. మృత్తికలు ఏర్పడే తీరు ఆధారంగా సాధారణంగా ఇవి రెండు రకాలు. అవి..

1) స్థానబద్ధ మృత్తికలు (అవక్షేప నేల): మాతృశిల ఉన్నచోట ఏర్పడతాయి. **ఉదా:** నల్లరేగడి నేలలు, ఎర్రనేలలు, లాటరైట్ నేలలు.

2) వాహక/ స్థానగమన/నిక్షేప మృత్తికలు (డ్రిఫ్ట్ లేదా ట్రాన్స్‌పోర్టెడ్ నేల): గాలి, నీరు, హిమానీనదాలు మొదలైన వాటివల్ల మరో చోటుకు కొట్టుకుపోయి ఏర్పడే మృత్తికలు. **ఉదా:** ఒండ్రు నేలలు.

ఏపీలో మృత్తికలు

ఇవి అయిదు రకాలుగా ఉన్నాయి.

1) ఎర్రనేలలు: వీటిని ఆరు ఉపసమూహాలుగా విభజించారు. రాష్ట్రంలో అత్యధిక శాతం (60%) ఎర్ర నేలలే. గ్రానైట్ శిలల శైథిల్యం వల్ల ఏర్పడతాయి. వీటిలో అధికంగా ఉండే ముడి ఖనిజం ఇనుప ధాతువు. ఈ మృత్తికలు ఎరుపు రంగులో ఉండటానికి కారణం ఐరన్ ఆక్సైడ్. గుంటూరు, పల్నాడు మినహా మిగిలిన జిల్లాల్లో అధికంగా ఉండే ఈ నేలల్లో పండ్ల తోటలు, పప్పు ధాన్యాలను ఎక్కువగా పండిస్తారు.

> ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రనేలలు అత్యధిక శాతంలో ఉన్నాయి. ఇక్కడి ఒండ్రు నేలలు సారవంతమైనవి. వ్యవసాయ భూమిలో ఎక్కువ భాగం నల్లరేగడి నేలలదే. పర్వత మృత్తికలు అతితక్కువ.

2) నల్లరేగడి నేలలు: బసాల్ట్ అగ్నిశిలలు శైథిల్యం చెందడంతో ఈ నేలలు ఏర్పడ్డాయి. క్షార స్వభావంతో ఉంటాయి. తేమను అధికంగా నిల్వ ఉంచుకుంటాయి. ఈ మృత్తికలో ఐరన్, మెగ్నీషియం ఆక్సైడ్‌లు ఉండటం వల్ల నల్లగా ఉంటాయి. ఇవి వేసవిలో పగుళ్లు చూపించి



'తమను తాము దున్నుకునే నేలలు'గా పేరు పొందాయి. వీటిని 'రైతుమిత్ర' నేలలు అంటారు. చిత్తూరు, తిరుపతి మినహా మిగతా రాయలసీమలో అందులోనూ కర్నూల్ జిల్లాలో అధికం. ఉత్తరాంధ్రలో నల్లరేగడి నేలలు లేవు. ఈ నేలలు పత్తి, పసుపు, మిరప, పొగాకు లాంటి వాణిజ్య పంటలకు అనుకూలం. వీటిని పత్తి నేలలు, చెస్ట్‌నట్ నేలలు, రెగూర్ నేలలు, చెర్నోజెమ్ నేలలు, అరిజోనల్ మృత్తికలు అని పిలుస్తారు.

3) ఒండ్రు నేలలు: ఏపీలో అన్ని నదుల డెల్టాలు ఒండ్రు నేలలతో ఏర్పడినవే. ఇవి లోమ్ నేలల తరగతికి చెందినవి. ఈ నేలల్లో నత్రజని మూలకం లోపిస్తుంది. (నత్రజని ఎరువులు ఎక్కువ మోతాదులో వాడాల్సి ఉంటుంది.) ఈ నేలల్లో వరి, చెరకు, చీనీ, నిమ్మ తోటలు లాంటివి అధికం.

4) లాటరైట్ నేలలు (జేగురు నేలలు): వాలు తలాల వెంబడి ఆర్ద్ర, అనార్ద్ర శీతోష్ణస్థితిలో సున్నం, సిలికా లాంటి మూలకాలు విక్షాళనం (లీచింగ్) చెందడం వల్ల ఏర్పడతాయి. వీటిలో అల్యూమినియం, ఐరన్ హైడ్రాక్సైడ్ మిశ్రమాలు ఉంటాయి. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట, నెల్లూరులోని కావలి ప్రాంతాలు, కాకినాడ, అల్లూరి, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ రకం భూములు ఉన్నాయి. అల్లూరి జిల్లాలోని లాటరైట్ నేలల్లో కాఫీ పండిస్తారు. జీడిమామిడి, చింత లాంటి తోట పంటలకు అనుకూలం.

> ప్రపంచ మృత్తికా దినోత్సవం డిసెంబరు 5 (యూఎన్ఓ 2013లో ప్రకటించింది.)

5) తీరప్రాంత ఇసుక మృత్తికలు: ఈ నేలలు సముద్ర తీరం నుంచి 3 నుంచి 123 కిలోమీటర్ల వరకు వ్యాపించి కొంత సముద్ర లవణీయతతో ఉంటాయి. కోస్తా జిల్లాల్లో వీటిని చూడవచ్చు. సరుగుడు, కొబ్బరి తోటలకు అనుకూలం.

నీటిపారుదల సౌకర్యాలు

ఏపీ ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రం. ఇక్కడ నీటిపారుదల సౌకర్యాలు మూడు రకాలు. అవి కాలువలు, బావులు, చెరువులు. రాష్ట్రంలో సాగుభూమి విస్తీర్ణం-60.38 లక్షల హెక్టార్లు. స్థూల నీటిపారుదల విస్తీర్ణం-38.44 లక్షల హెక్టార్లు. నికర నీటిపారుదల విస్తీర్ణం-29.54 లక్షల హెక్టార్లు.

కాలువలు: కాలువలను నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా నిర్వహిస్తారు. ప్రాజెక్టులు మూడు రకాలు -భారీ, మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులు. సూక్ష్మసేద్యంతో కలిపి మొత్తం 105.36 లక్షల ఎకరాలకు కాలువల ద్వారా నీరు అందుతోంది.

నదుల నీటి వినియోగం: గోదావరి నది కింద ప్రస్తుతం 307.8 టీఎంసీలు వాడుకలో ఉండగా, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే మరో 468.68 టీఎంసీలు లభిస్తాయి. కృష్ణా నది కింద 512.4 టీఎంసీలు వాడుకలో ఉండగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే మరో 150.5 టీఎంసీలు లభిస్తాయి. పెన్నా నది కింద 131 టీఎంసీలు, వంశధార కింద 21 టీఎంసీలు, ఇతర చిన్నచిన్న నదుల వల్ల 323.4 టీఎంసీలు లభిస్తున్నాయి. మొత్తం రాష్ట్రంలో ప్రస్తుతం 1,303 టీఎంసీలు వినియోగంలో ఉండగా, నిర్మాణంలో ఉన్నవి పూర్తయితే మరో 721.53 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయి. జలయజ్ఞం కింద 54 ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించారు.



కృష్ణా నది

ముఖ్యాంశాలు

- భారత్‌లో నీటిపారుదల విస్తీర్ణం బావుల కింద అధికం; కానీ ఏపీలో కాలువలు కింద అధికం.
- కాలువలు కింద నీటిపారుదల అధికంగా ఉన్న జిల్లాలు - గుంటూరు, పల్నాడు, కృష్ణా. తక్కువగా ఉన్న జిల్లా వైఎస్ఆర్ కడప.
- బావుల కింద నీటిపారుదల అధికంగా ఉన్న జిల్లాలు - పశ్చిమగోదావరి, అనంతపురం. తక్కువగా ఉన్నది శ్రీకాకుళం.
- చెరువుల కింద నీటిపారుదల అధికంగా నెల్లూరు, విజయనగరంలో ఉండగా, కడపలో తక్కువ.
- ఇతర వనరుల కింద నీటిపారుదల అధికంగా ఉన్న జిల్లా - అల్లూరి జిల్లా.
- రాష్ట్రంలో భూగర్భ జలాలు అంచనా వేసే సంస్థ - ఏపీ వాల్టా (ఆంధ్రప్రదేశ్ వాటర్ లాండ్ ట్రీ ఏక్ట్). భూగర్భ జలాలను పిజోమీటర్ల సాయంతో అంచనా వేస్తారు.
- ఏపీలో వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ సంస్థల సంఖ్య-748.
- దేశంలో వ్యవసాయ బోరుబావులకు అత్యధిక శాతంలో జియోట్యాగింగ్ పూర్తిచేసిన మొదటి రాష్ట్రం ఏపీ.
- సూక్ష్మ సేద్యంలో దేశంలో ఏపీ 4వ స్థానంలో ఉంది.
- ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్) ఇటీవల సర్ ఆర్థర్ కాటన్ ప్రాజెక్టును 160 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 'ప్రపంచ సాగునీటి వారసత్వ ప్రాజెక్టు'గా ప్రకటించింది.
- దేశంలో మొదటి రబ్బరు డ్యాం ఏపీలోని జంఝావతి రబ్బర్ డ్యాం కాగా, ప్రస్తుతం దేశంలో పొడవైన రబ్బరు డ్యాం - గయాజీ రబ్బర్ డ్యాం (బిహార్‌లోని ఫాల్గు నదిపై)

రెండో జలవనరుల గణన (2023)

- సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ప్రకారం ఏపీలో జలవనరుల సంఖ్య - 1,90,777, వీటిలో వినియోగంలో ఉన్నవి - 1,49,279.
- నీటి కుంటలు - 14,132.
- చెరువులు - 1,13,425 (వినియోగంలో ఉన్నవి 1,03,952). చెరువుల సంఖ్యలో ఏపీ మొదటి స్థానంలో ఉంది.
- సరస్సులు - 62, రిజర్వాయర్లు- 703 (ఏపీ అయిదో స్థానం)
- ఊటకుంటలు - 57,452
- చెక్‌డ్యామ్‌లు - 4,963 (ఏపీ రెండో స్థానం)
- చెరువుల్లో చేపల పెంపకంలో 69,510, వ్యవసాయానికి ఉపయోగంలో 37,257; పారిశ్రామిక వాడకంలో 680, తాగునీరు వినియోగంలో 1945, భూగర్భ జల పునరుద్ధరణకు 38,462 ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఇటీవల ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్) ఏ ప్రాజెక్టును 160 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రపంచ సాగునీటి వారసత్వ ప్రాజెక్టుగా ప్రకటించింది?
   1) సర్ ఆర్థర్ కాటన్ ప్రాజెక్టు
   2) ప్రకాశం బ్యారేజ్
   3) నాగార్జున సాగర్
   4) నెల్లూరు ఆనకట్ట
2. తెలుగు గంగ పథకానికి సంబంధించి సరైన అంశం?
   ఎ) చెన్నై నగరానికి తాగునీటి కోసం
   బి) ఏపీ, తమిళనాడు ఉమ్మడి ప్రాజెక్టు
   సి) దీని నిర్మాణం వల్ల కలివికోడి ఆవాసాలు దెబ్బతిన్నాయి.
   డి) రాయలసీమ సాగునీటి అవసరం
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, డి 4) పైవన్నీ
3. వేగావతి ఆనకట్ట ఏ జిల్లాలో ఉంది?
   1) నెల్లూరు 2) విజయనగరం
   3) పశ్చిమ గోదావరి
   4) కడప
4. ఏపీలో అతిపెద్ద చెరువు?
   1) కంభం 2) రామప్ప
   3) మార్కాపురం
   4) అమటం



రచయిత: మండ సతీష్

సమాధానాలు

1-1, 2-4, 3-2, 4-1.

కుంభవృష్టిని కురిపించే వాయుగుండాలు!


సముద్రం వైపు నుంచి అధిక వేగంతో ఉద్ధృతంగా వీచే బలమైన గాలులే చక్రవాతాలు. వీటినే తుపానులు లేదా వాయుగుండాలుగా పేర్కొంటారు. ఇవి కుంభవృష్టిని కురిపించి కల్లోలాన్ని సృష్టిస్తాయి. అల్పపీడన ప్రభావంతో సుడులు తిరుగుతూ ఏర్పడే చక్రవాతాలు వాతావరణాన్ని భయానకంగా మార్చేసి అపార నష్టాన్ని కలిగిస్తాయి. ఈ ప్రకృతి విపత్తు రకాలు, కారణాలు, గాలుల వేగం ఆధారంగా వర్గీకరణ, ప్రాంతాల వారీగా వాటి పేర్లపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రపంచంలో చక్రవాతాలు అధికంగా సంభవించే ప్రదేశాలు, ముందుగా గుర్తించి హెచ్చరించే వ్యవస్థలు, దేశంలో వీటి ప్రభావం, ఎదుర్కోడానికి ఉన్న సంస్థాగత ఏర్పాట్లు, విపత్తు సన్నద్ధతల గురించి తెలుసుకోవాలి.



విపత్తు నిర్వహణ

చక్రవాతాలు

1. సమశీతోష్ణ, ఉష్ణ అక్షాంశాల వేడి ప్రవాహంలో సంభవించే అల్ప వాతావరణ పీడనం?
   1) భూకంపం 2) చక్రవాతం
   3) చలిగాలులు 4) సునామీ
2. సైక్లోన్ అనేది ఏ పదం నుంచి వచ్చింది?
   1) సైక్లోస్ 2) సైక్లీన్
   3) సైక్లోనో 4) సైక్లోసిస్
3. సైక్లోస్ అనేది ఏ భాషా పదం?
   1) జపనీస్ 2) గ్రీకు
   3) ఫ్రెంచ్ 4) సంస్కృతం
4. గ్రీకు భాషలో సైక్లోస్ అంటే?
   1) పాము మెలికల చుట్ట
   2) భయంకరమైన గాలి
   3) వేగవంతమైన చిరుత 4) అలల గాలి
5. సైక్లోన్ అనే పదాన్ని మొదట ఉపయోగించింది ఎవరు?
   1) కార్లిస్ ఛాపెల్ 2) హెన్రీ పిడ్డింగ్టన్
   3) లిన్నేయస్ 4) కె.ఆర్.రావు
6. గాలి వేగం (కి.మీ./గం.) ఎంతకంటే తక్కువ ఉంటే అల్పపీడనం కింద వర్గీకరిస్తారు?
   1) 31 2) 41 3) 52 4) 34
7. గాలి వేగం (కి.మీ./గం.) ఎంత ఉంటే దాన్ని వాయుగుండం కింద వర్గీకరిస్తారు?
   1) 62-88 2) 31-49
   3) 50-61 4) 89-118
8. గాలి వేగం (కి.మీ./గం.) ఎంత ఉంటే దాన్ని అగాధ వాయుగుండం కింద లెక్కిస్తారు?
   1) 50-61 2) 62-88
   3) 31-49 4) 89-118
9. గాలి వేగం (కి.మీ./గం.) ఎంత ఉంటే దాన్ని తీవ్రమైన తుపానుగా లెక్కిస్తారు?
   1) 50-61 2) 62-88
   3) 31-49 4) 89-118
10. గాలి వేగం (కి.మీ./గం.) ఎంత ఉంటే దాన్ని అత్యంత తీవ్రమైన తుపానుగా లెక్కిస్తారు?
    1) 62-88 2) 31-49
    3) 119-221 4) 50-61
11. అల్పపీడన సమయంలో గాలి వేగం (నాట్స్/గం.) ఎంతకంటే తక్కువ ఉంటుంది?
    1) 18 2) 17 3) 14 4) 15
12. సూపర్ సైక్లోన్ సమయంలో వచ్చే గాలివేగం (కి.మీ./గం.)?
    1) 221 కంటే ఎక్కువ 2) 120 కంటే తక్కువ
    3) 140 కంటే తక్కువ 4) 150 కంటే తక్కువ
13. సూపర్ సైక్లోన్ సమయంలో గాలి వేగం (నాట్స్/గం.) ఎంత ఉండొచ్చు?
    1) 100 కంటే తక్కువ 2) 64 - 119
    3) 119 కంటే ఎక్కువ 4) 50 కంటే తక్కువ
14. కిందివాటిలో ఏది ప్రపంచంలోని ఆరు అత్యంత చక్రవాత ప్రాంతాల్లో ఒకటి?
    1) హిందూ మహాసముద్రం
    2) అరేబియా మహాసముద్రం
    3) బంగాళాఖాతం 4) పైవన్నీ
15. చక్రవాత కేంద్రపు అంచును ఏమంటారు?
    1) చక్రవాతపు పొర 2) చక్రవాత కుడ్యం
    3) చక్రవాత అంచు 4) పైవన్నీ
16. చక్రవాత కేంద్రం ఒక ప్రాంతాన్ని దాటేకొద్దీ గాలి ఏమవుతుంది?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) చెప్పలేము 4) పెరిగి తగ్గుతుంది
17. ఏ ప్రాంతాల్లో అభివృద్ధి చెందే తుపాన్లను ఉష్ణమండల తుపాన్లు అంటారు?
    1) కర్కటరేఖ 2) మకరరేఖ
    3) 1, 2 4) ఏదీకాదు
18. చక్రవాతం సాధారణ లక్షణాలు?
    1) బలమైన గాలులు 2) అసాధారణ వర్షం
    3) తుపాను కల్లోలం 4) పైవన్నీ
19. చక్రవాతం ఎన్ని దశల్లో అభివృద్ధి చెందుతుంది?
    1) 1 2) 2 3) 3 4) 4
20. పశ్చిమ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో వచ్చే తుపాన్లను ఏమంటారు?
    1) టోర్నడో 2) విల్లీ విల్లీ
    3) చక్రవాతాలు 4) హరికేన్లు
21. చక్రవాతం ఏయే దశల్లో అభివృద్ధి చెందుతుంది?
    1) రూపకల్పన, తొలి అభివృద్ధి దశ
    2) సంపూర్ణ పక్వ దశ
    3) బలహీనపడటం లేదా క్షీణించడం
    4) పైవన్నీ
22. ఆస్ట్రేలియాలో వచ్చే తుపాన్లను ఏమంటారు?
    1) హరికేన్లు 2) విల్లీ విల్లీ
    3) టైఫూన్లు 4) టోర్నడోలు
23. చైనా సముద్రంలో వచ్చే తుపాన్లను ఏమంటారు?
    1) టైఫూన్లు 2) హరికేన్లు
    3) టోర్నడోలు 4) విల్లీ విల్లీ
24. నైరుతి పసిఫిక్ మహాసముద్రం, ఆగ్నేయ హిందూ మహాసముద్రంలో వచ్చే తుపాన్లను ఏమంటారు?
    1) చక్రవాత తుపాన్లు
    2) ఉష్ణమండల చక్రవాతాలు
    3) హరికేన్లు 4) టైఫూన్లు
25. ఉత్తర హిందూ మహాసముద్రంలో వచ్చే తుపాన్లను ఏమని పిలుస్తారు?
    1) చక్రవాత తుపాన్లు 2) హరికేన్లు
    3) విల్లీ విల్లీ 4) టైఫూన్లు
26. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో, కరేబియన్ సముద్రంలోని వెస్టిండియన్ దీవుల్లో వచ్చే తుపాన్లు?
    1) విల్లీ విల్లీ 2) టైఫూన్లు
    3) హరికేన్లు 4) చక్రవాత తుపాన్లు
27. చరిత్రలో ఇప్పటివరకు అత్యంత సుదీర్ఘమైన చక్రవాతం?
    1) టైఫూన్ జాన్ 2) హుద్ హుద్
    3) తిత్లీ 4) లైలా తుపాను
28. టైఫూన్ జాన్ ఎన్నిరోజులు పాటు ఉంది?
    1) 31 2) 15 3) 30 4) 28
29. చక్రవాతం వల్ల సంభవించే ముఖ్యమైన అపాయాలు?
    1) పెనుగాలులు, బలమైన గాలులు
    2) వరదలకు కారణమయ్యే కుంభవృష్టి
    3) అధిక వేలా తరంగాలు 4) పైవన్నీ
30. భారత వాతావరణ శాఖ వేటి అంచనాలకు సంబంధించి ఒక రోడ్ మ్యాప్ తయారు చేసింది?
    1) సైక్లోజెనిసిస్ 2) మానిటరింగ్
    3) ఇంటెన్సిఫికేషన్ 4) పైవన్నీ
31. చక్రవాత మార్గాలను అంచనా వేయడంలో భారత్‌లో నోడల్ ఏజెన్సీగా పనిచేసేది ఏది?
    1) భారత వాతావరణ శాఖ
    2) పౌరవిమానయాన శాఖ
    3) హోం మంత్రిత్వ శాఖ 4) రక్షణ శాఖ
32. తుపాను హెచ్చరికల ప్రచారం వేటి ద్వారా నిర్వహిస్తారు?
    1) టెలివిజన్ 2) బహిరంగ ప్రకటనలు
    3) శాటిలైట్ ఆధారిత విపత్తు హెచ్చరికలు
    4) పైవన్నీ
33. 'క్లైమేట్ ఛేంజ్ అండ్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని రాసినవారు?
    1) ప్రొఫెసర్ సీమా ఉన్నికృష్ణన్
    2) ప్రొఫెసర్ బోస్ రావు
    3) ప్రొఫెసర్ మోహన్ కందా
    4) ప్రొఫెసర్ కోదండరాం
34. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడే తుపాన్ల నిష్పత్తి?
    1) 4 : 1 2) 1 : 4 3) 3 : 2 4) 2 : 3
35. భారత్‌లో ఎన్ని కేంద్రపాలిత ప్రాంతాలు ఉష్ణమండల తుపాను ప్రభావాన్ని కలిగి ఉన్నాయి?
    1) 80 2) 84 3) 74 4) 81
36. తుపాను ముందస్తు అలర్ట్ దశలో ఏ రంగు కోడ్‌ను వాడతారు?
    1) పసుపు 2) నారింజ
    3) ఎరుపు 4) తెలుపు



37. తుపాను హెచ్చరిక సమయంలో ఏ రంగు కోడ్‌ను వాడతారు?
    1) పసుపు 2) నారింజ 3) ఎరుపు 4) ఆకుపచ్చ
38. తుపాను తీరం దాటిన దశలో ఏ రంగు కోడ్‌ను వాడతారు?
    1) ఆకుపచ్చ 2) తెలుపు
    3) ఎరుపు 4) నారింజ
39. టోర్నడో అనేది ఏ భాషా పదం నుంచి ఉద్భవించింది?
    1) గ్రీకు 2) స్పానిష్ 3) జపనీస్ 4) ఫ్రెంచ్
40. ఆసియాలో నివసించే నాలుగు బిలియన్ల జనాభాలో ఎంతశాతం తీరప్రాంతాల దగ్గర నివసిస్తోంది?
    1) 6% 2) 4% 3) 5% 4) 7%
41. హుద్ హుద్ తుపాను వల్ల ఆంధ్రప్రదేశ్‌లో బాగా నష్టపోయిన నగరం?
    1) విశాఖపట్నం 2) బొబ్బిలి
    3) విజయవాడ 4) నెల్లూరు
42. తుపానుకు ఉపయోగించిన హుద్ హుద్ అను పదం సాధారణంగా దేన్ని సూచిస్తుంది?
    1) జింక 2) సర్పం 3) పక్షి 4) బల్లి
43. హుద్ హుద్ తుపాను ఏ విభాగానికి చెందింది?
    1) తీవ్ర పెనుతుపాను 2) పెను తుపాను
    3) సూపర్ సైక్లోన్ 4) అల్పపీడనం
44. గాలి వేగం ఎంత ఉంటే దాన్ని చక్రవాత తుపాను కింద వర్గీకరిస్తారు? (కి.మీ./గంట)
    1) 50-61 2) 62-88 3) 31-49 4) 89-118
45. చక్రవాతాలు వేటి కలయిక ద్వారా సంభవిస్తాయి?



    1) వెచ్చని సముద్రపు ఉష్ణోగ్రత
    2) అధిక సాపేక్ష ఆర్ద్రత
    3) వాతావరణ అస్థిరత 4) పైవన్నీ
46. బంగాళాఖాతం వెంబడి ఉండే ఏ రాష్ట్రాలు తుపాన్లకు గురవుతాయి?
    1) ఒడిశా 2) ఆంధ్రప్రదేశ్
    3) తమిళనాడు 4) పైవన్నీ
47. హిందు మహాసముద్ర ఉత్తర భాగంలో సంభవించే బైమోడల్ స్వభావం కలిగిన తుపాన్ల తీవ్రత ఏయే నెలల్లో అధికంగా ఉంటుంది?
    1) మే 2) నవంబరు
    3) 1, 2 4) ఏదీకాదు
48. హుద్ హుద్ తీరం దాటింది ఎప్పుడు?
    1) 2014 అక్టోబరు 12 2) 2014 అక్టోబరు 11
    3) 2014 అక్టోబరు 10 4) 2014 అక్టోబరు 9
49. హరికేన్?
    1) ప్రకృతి విపత్తు
    2) మానవ ప్రేరేపిత విపత్తు
    3) సునామీ 4) భూమి విరిగిపడటం
50. సిడర్ అనే తుపాను బంగ్లాదేశ్‌ను తాకి నష్టం కలిగించిన సంవత్సరం?
    1) 2008 2) 2007
    3) 2009 4) 2006

సమాధానాలు

1-2, 2-1, 3-2, 4-1, 5-2, 6-1, 7-2, 8-1, 9-4, 10-3, 11-2, 12-1, 13-3, 14-1, 15-2, 16-2, 17-3, 18-4, 19-3, 20-1, 21-4, 22-2, 23-1, 24-2, 25-1, 26-3, 27-1, 28-1, 29-4, 30-4, 31-1, 32-4, 33-1, 34-1, 35-2, 36-1, 37-2, 38-3, 39-2, 40-4, 41-1, 42-3, 43-1, 44-4, 45-4, 46-4, 47-3, 48-1, 49-1, 50-2.



ప్రవాసాంధ్రులకు రోజూ
100 వీఐపీ బ్రేక్ దర్శనాలు

తిరుమల, న్యూస్‌టుడే: ప్రవాసాంధ్రులకు సులభంగా తిరుమల శ్రీవారి దర్శనం లభించనుంది. ఏపీ ప్రవాసాంధ్రుల సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీ) అధ్యక్షుడు రవి వేమూరి ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ఫిబ్రవరిలో సీఎంను కలిశారు. వైకాపా హయాంలో తిరుమలలో ప్రవాసాంధ్రులకు అందించే వీఐపీ బ్రేక్ దర్శన కోటాను 50 నుంచి 10 తగ్గించారని.. దీనివల్ల విదేశాల నుంచి వచ్చే తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం ఆ కోటాను 10 నుంచి 100కు పెంచారు. రోజూ వంద వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వాలని తితిదేకు సూచించారు.

ప్రవాసాంధ్రులు ముందుగా ఏపీఎన్ఆర్‌టీఎస్ వెబ్‌సైట్ https://www.apnrts.ap.gov.in లోకి వెళ్లి సభ్యత్వం నమోదు చేసుకోవాలి. ఇది పూర్తిగా ఉచితం. ఇందుకోసం తాము ఉంటున్న దేశాల వీసాలు, వర్క్ పర్మిట్‌ల వివరాలు నమోదు చేయాలి. వెబ్‌సైట్‌లో శ్రీవారి దర్శనానికి సంబంధించి మూడు నెలల స్లాట్లు కన్పిస్తాయి. అందులో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ రోజు పరిస్థితులను బట్టి తితిదే టికెట్లను కేటాయిస్తుంది. టికెట్లు కేటాయింపు అయిన వారికి తిరుమలలోని ఏపీఎన్ఆర్‌టీఎస్‌కు చెందిన పీఆర్వో ద్వారా వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తారు. వివరాలకు ప్రవాసాంధ్రులు సంస్థ వెబ్‌సైట్ ద్వారాగానీ, ఏపీలోని తాడేపల్లి, ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ జంక్షన్ ఫోన్ నంబరు 0863 2340678లో గానీ సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధి వెంకట్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగులు కారు.. ధీరులు



శ్రీనగర్‌లోని దాల్ సరస్సు సమీపంలో ఆదివారం జమ్మూకశ్మీర్ పోలీసులు 'పెడల్ త్రూ ప్యారడైజ్' పేరిట నిర్వహించిన సైక్లోథాన్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు

పచ్చదనానికి.. మట్టి బాంబులు



తెలంగాణ వ్యాప్తంగా మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా.. జైళ్ల శాఖ తనవంతుగా లక్ష విత్తన బంతులు (సీడ్ బాల్స్) తయారు చేయాలని నిర్ణయించింది. సెంట్రల్ జైలు, జిల్లా కారాగారాల్లోని ఖైదీలతో వీటిని తయారు చేయించి.. ఆ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ల వద్ద వాటిని వాహనదారులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. చెట్లు లేని ఖాళీ ప్రదేశాల్లో వాటిని వేయాలని వాహనదారులకు సూచిస్తారు. విత్తన బంతుల తయారీకి ప్రయోగాత్మకంగా కరీంనగర్ జిల్లా కారాగారాన్ని ఎంపిక చేసి.. వారం పాటు ఖైదీలకు శిక్షణ ఇచ్చారు. నాణ్యమైన మట్టిని సేకరించి కానుగ, వేప, చింత తదితర మొక్కల విత్తనాలతో ఇలా పది వేల బంతులను తయారు చేయించారు.

– న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు

10 ఏళ్ల బాలుడిని చదివించనున్న సైన్యం



చండీగఢ్: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సైనికులకు ఆహారం అందించిన ఓ 10 ఏళ్ల బాలుడి విద్యకు అయ్యే మొత్తం ఖర్చును భరించనున్నట్లు భారత సైన్యం ఆదివారం ప్రకటించింది. పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తారావాలీ గ్రామానికి చెందిన శ్వాణ్ సింగ్ పాకిస్థాన్ సైన్యంతో కాల్పుల సమయంలో తనంతట తానే భారత సైనికులకు ఆహారం తీసుకెళ్లేవాడు. అతి చిన్న వయసులో ఎంతో ధైర్యం ప్రదర్శించిన శ్వాణ్‌ని చదివించనున్నట్లు లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ వెల్లడించారు. ఇలా ధైర్యసాహసాలు ప్రదర్శించే నిజమైన నాయకులకు గుర్తింపు, మద్దతు అవసరమని పేర్కొన్నారు.

A ఫర్ ఆధార్ B ఫర్ బయోమెట్రిక్

● ఇక బడుల్లోనే ఆధార్ నవీకరణ

దిల్లీ: దేశంలో ఏడు కోట్లమందికిపైగా పిల్లలు తమ వేలిముద్రలను ఆధార్ కోసం ఇవ్వాల్సి ఉండడంతో వాటి సేకరణకు పాఠశాలలకే బయోమెట్రిక్ యంత్రాలను పంపించాలని 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) యోచిస్తోంది. రెండు నెలల తర్వాత ఇది కార్యరూపం దాల్చనుంది. దశలవారీగా దీన్ని విస్తరిస్తారు. ప్రస్తుతం పసికందులు మొదలు ఐదేళ్లలోపు చిన్నారులకు వారి బయోమెట్రిక్ వివరాలు తీసుకోకుండానే ఆధార్ సంఖ్యను కేటాయిస్తున్నారు. వారికి ఐదేళ్లు వచ్చాక వీటిని ఇచ్చి నవీకరించుకోవాలి. ఏడేళ్లు వచ్చిన తర్వాత కూడా ఇలా చేసుకోని వారి ఆధార్ సంఖ్యలను క్రియారహితం చేయవచ్చని ఉడాయ్ నిబంధనలు చెబుతున్నాయి. 5-7 ఏళ్ల మధ్యనైతే ఉచితంగా, ఆ తర్వాత రూ.100 రుసుముతో అప్‌డేట్ చేస్తారు. పాఠశాలల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షలకు నమోదు, ఉపకారవేతనాలు పొందడం, ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు వంటివాటికి ఇది అవసరం కావడంతో పాఠశాలలకు వెళ్లి వీటిని సేకరించే ప్రణాళికతో ఉన్నామని ఉడాయ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) భువనేశ్ కుమార్ పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు.

తుక్కే కదా అని... తక్కువగా చూడొద్దు!

ఎవరైనా చనిపోతే డెత్ సర్టిఫికెట్ తీసుకుంటాం. మరి వాహనాలకు కూడా ఇటువంటి ధ్రువీకరణ పత్రమే ఉంటుందని... దాని వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని తెలుసా?



ఏ వాహనాలు..?

● 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాల (ఆర్టీసీ బస్సులతో సహా)ను తప్పనిసరిగా తుక్కుగా మార్చాలి.

● 15 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలు (కార్లు, జీపులు, బైక్స్), వాణిజ్య వాహనాల(లారీలు, ఆటోలు, ప్రైవేటు బస్సులు)ను వాటి యజమానులు స్వచ్ఛందంగా ఈ యూనిట్లలో తుక్కు చేయించుకోవచ్చు.

ఎలా చేయించాలి...

● స్క్రాప్ చేసే వ్యాపారులు యజమానికి కొంత మొత్తం చెల్లించి పాత వాహనాలను తీసుకుంటారు. వీరు లెటర్‌హెడ్‌పై వాహనం వివరాలు రాసి, పత్రం ఇస్తారు.

● దీనిని రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి, అక్కడ అందజేసి ఆ వాహనాన్ని తుక్కు చేయించినట్లు నమోదు చేయించాలి. లేకపోతే రవాణాశాఖ పోర్టల్‌లో ఆ వాహనం మనుగడలో ఉన్నట్లే చూపుతుంది.

● రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్వీఎస్ఎఫ్) యూనిట్‌లో స్క్రాప్‌గా మార్చితే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వాహన్ పోర్టల్ ద్వారా 'సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్' ఇస్తారు. మరో నెల రోజుల్లో 'సర్టిఫికెట్ ఆఫ్ వెహికల్ స్క్రాపింగ్' కూడా వచ్చేస్తుంది.



కొత్తవి కొంటే...

● ఆర్వీఎస్ఎఫ్ యూనిట్‌లో స్క్రాప్ చేయాలనుకున్నపుడు.. వాహనంలోని ఇంజిన్ రేడియేటర్, మోటర్లు, డాష్‌బోర్డు ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రానిక్ పరికరాలు పనికొచ్చే స్థితిలో ఉంటే వాటికి కొంత సొమ్మును లెక్కించి ఇస్తారు. అలాగే రిజిస్టర్డ్ సర్టిఫికెట్ (ఆర్సీ)లో వాహనం బరువు ఎన్ని వందల కేజీలు ఉందో.. వాటికి కేజీకి రూ.20-25 చొప్పున ధర చెల్లిస్తారు.

● ఈ యూనిట్ జారీచేసే సర్టిఫికెట్ ఆఫ్ వెహికల్ స్క్రాపింగ్ ఉంటే వివిధ కార్ల కంపెనీలు కొత్త కార్లపై రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ధర తగ్గిస్తున్నాయి. అశోక్‌లేల్యాండ్ కంపెనీ 3 నుంచి 3.5 శాతం రాయితీ ఇస్తోంది. ద్విచక్ర వాహనాలకైతే రూ.3-5 వేల వరకు ధర తగ్గిస్తున్నారు.

యూనిట్లు ఎక్కడున్నాయి?

ఆర్వీఎస్ఎఫ్ యూనిట్లు ఏపీలో గుంటూరు శివారులో, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఉన్నాయి. అనంతపురం, విశాఖపట్నంలో మంజూరైన యూనిట్లు ప్రారంభం కావాల్సి ఉంది. తెలంగాణలో పాశమైలారం, షాద్‌నగర్ సమీపంలోని కొత్తూర్, గజ్వేల్ వద్ద ఉన్నాయి.

ప్రభుత్వాలు.. రాయితీలు..

● ఆర్వీఎస్ఎఫ్ యూనిట్‌లో వ్యక్తిగత వాహనం తుక్కు చేయించిన తర్వాత, కొత్త వాహనం కొనుగోలు చేస్తే.. లైఫ్ ట్యాక్స్‌లో 50 శాతం రాయితీ ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం తన పాలసీలో ప్రకటించింది.

● వాణిజ్య వాహనాన్ని తుక్కు చేయించి, కొత్తది కొనుగోలుచేస్తే.. వాటి త్రైమాసిక పన్నులో కొంత రాయితీ ఇస్తామని పేర్కొంది.



తుక్కుగా మారిన కారు...

● తెలంగాణలో వ్యక్తిగత వాహనాల్లో కార్లు తుక్కు చేయించి, కొత్తవి కొనుగోలుచేస్తే..వాహన విలువను బట్టి లైఫ్ ట్యాక్స్‌లో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు.

● వాణిజ్య వాహనాలకు త్రైమాసిక పన్నులో 8 ఏళ్లపాటు 10 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారు.

● వీటి అమలుకు సంబంధించి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

సర్టిఫికెట్ అమ్ముకోవచ్చు

ఓ వ్యక్తి తన పాత వాహనాన్ని ఆర్వీఎస్ఎఫ్‌లో తుక్కుగా మార్చి 'సర్టిఫికెట్ ఆఫ్ వెహికల్ స్క్రాపింగ్' పొందాక కొత్త వాహనం కొనుగోలు చేయకూడదని భావిస్తే ఆ సర్టిఫికెట్‌ను అమ్ముకునేందుకు అవకాశం ఉంది. డీజీఈఎల్‌వీ అనే పోర్టల్ ద్వారా దీన్ని అమ్మకానికి పెడితే.. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా దాన్ని కొనుగోలు చేయొచ్చు. వారక్కడ కొత్త వాహనాలు కొనుగోలు చేసే సమయంలో రాయితీలు పొందొచ్చు.

- ఈనాడు, అమరావతి

మైసూర్ మల్లె.. ఒక్కటి చాలు



ఈ చిత్రంలో కనిపిస్తోంది పుష్పగుచ్ఛం అనుకుంటే పొరబడినట్టే. ఇది మల్లె జాతికి చెందిన ఒకే పువ్వు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవిలో కనిపించింది. దీన్ని మైసూర్ జాస్మిన్ అంటారని అటవీ శాఖ ఉద్యోగి ఆమర్తి వీరబాబు తెలిపారు. మైసూర్ ప్రాంతంలో ఎక్కువగా పెరుగుతుందన్నారు. అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లిన స్థానికులు సువాసన వెదజల్లుతున్న ఈ పువ్వును చూసి బయటికి తీసుకొచ్చారు.

– మారేడుమిల్లి, న్యూస్‌టుడే

రొమేనియాలో లైగర్



బుకారెస్ట్: రొమేనియా తూర్పు ప్రాంతంలోని సుసీవాలో ఉన్న ప్రైవేటు జూలో లైగర్ (శార్దూహం) జన్మించింది. మగ సింహం, ఆడపులి సంభోగంతో ఇది జన్మిస్తుంది. ఇలాంటివి అతి అరుదని, ప్రపంచంలో ఇప్పటిదాకా 20 వరకే ఉన్నాయని జూ అధికారులు తెలిపారు. మగ లైగర్ పిల్ల జన్మించిందని, దానికి ఇంకా పేరు పెట్టలేదని వెల్లడించారు. ఆదివారం దానిని తొలిసారిగా బయటి ప్రపంచానికి చూపించారు. లైగర్ 400 కేజీల వరకూ బరువు పెరుగుతుందని, సింహం 250 వరకే ఉంటుందని అధికారులు తెలిపారు. లైగర్లు చాలా పెద్దగా ఉంటాయి. స్విమ్మింగ్ అంటే వాటికి ఇష్టం.

శాశ్వత నిద్రలోకి 'స్లీపింగ్ ప్రిన్స్'



దిల్లీ: 'స్లీపింగ్ ప్రిన్స్'గా పేరొందిన సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ (36) శనివారం తుది శ్వాస విడిచారు. ఆయన తండ్రి ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. పదిహేనేళ్ల వయసులో బ్రిటన్‌లోని ఓ మిలిటరీ కాలేజీలో చదువుతుండగా ఖలీద్ బిన్ కారు ప్రమాదం (2005)లో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మెదడులో రక్తస్రావమై కోమాలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి కోలుకోలేదు. తర్వాత ఖలీద్ బిన్‌ను రియాద్‌లోకి కింగ్ అబ్దుల్ అజీజ్ మెడికల్ సిటీకి తరలించారు. అక్కడే రెండు దశాబ్దాలుగా అతను వెంటిలేటర్‌పై ఉన్నారు. వైద్యులు బతికే అవకాశం లేదని తెలిపినా, తన కొడుకు కోమా నుంచి బయటికి వస్తాడన్న ఆశతో వెంటిలేటర్ తీయడానికి ఖలీద్ బిన్ తండ్రి తలాల్ అల్ సౌద్ నిరాకరిస్తూ వచ్చారు.



ఘటాలతో హిజ్రాలు



ఎడ్ల బండిపై సారె

దుర్గాలమ్మకు హిజ్రాల సారె

విజయనగరం జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు గట్టుపై ఉన్న దుర్గాలమ్మకు హిజ్రాలు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. ఏడు ఎడ్ల బండ్లపై పూలు, పండ్లు, మిఠాయిలు, పసుపు, కుంకుమ, గాజులు తెచ్చి తల్లికి నివేదించారు. అంతకుముందు మూడు లాంతర్లు, పైడితల్లి దేవస్థానం, గంట స్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల, ఎంజీ రోడ్డు, డాబా గార్డెన్స్, ఎన్సీఎస్ మీదుగా దుర్గాలమ్మ ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. లిఫ్టింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హిజ్రాలు, సాధారణ భక్తులు ఘటాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

వేగానికి బ్రేకుల్లేవ్!



జర్మనీలోని బొమ్టేలో అతివేగంతో దూసుకొచ్చిన ఓ కారు.. వాహనాన్ని ఢీకొని పక్కనే ఉన్న పార్కులో ఏడేళ్ల బాలుడిని ఢీకొట్టి బీభత్సం సృష్టించి.. చివరికి గాలిలో ఎగిరి వెళ్లి ఇలా ఓ గిడ్డంగి పైకప్పుపై చిక్కుకుంది. దానిని పోలీసు అధికారి పరిశీలిస్తున్నారిలా..



ప్లాస్టిక్‌ను వదిలితే బహుమానాలే

"ప్లాస్టిక్ కవర్లు ఇవ్వండి... జూట్ బ్యాగులు తీసుకోండి" అంటూ తమ పట్టణాన్ని ప్లాస్టిక్ ముప్పు నుంచి రక్షించడానికి కృషి చేస్తున్నారు తెలంగాణలోని హుస్నాబాద్ మున్సిపాలిటీ పర్యావరణ ఇంజినీర్ డి.రవికుమార్, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌లు. వందల ప్లాస్టిక్ సీసాలు, మూలపడిన తోపుడు బండి, రెండు పాత ఫ్యాన్లతో హెలికాప్టర్‌ను పోలిన వాహనాన్ని తయారు చేసి "డ్రై హెలి" అని పేరు పెట్టారు. దాన్ని పట్టణంలో తిప్పుతూ... ప్రజల నుంచి ప్లాస్టిక్ కవర్లను సేకరిస్తున్నారు. కవర్లు ఇచ్చిన వారికి జూట్ బ్యాగులు అందజేస్తున్నారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణ

స్వచ్ఛ నగరం సాకారం దిశగా గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని అమలు చేస్తున్నారు. కవర్లలో మాంసం తీసుకెళ్లే అలవాటును మార్చేందుకు వినూత్నంగా ప్రయత్నిస్తున్నారు. వస్త్ర సంచి లేదా టిఫిన్ బాక్స్‌తో వచ్చి కొనుగోలు చేసిన మాంసాన్ని వాటిలో తీసుకెళ్తే వారికి కిలోకు రూ.20 మేర తగ్గించాలని విక్రేతలకు సూచించి, అమలు చేయిస్తున్నారు. నగరంలోని అన్ని మాంసం దుకాణాల వద్ద బోర్డులు పెట్టించారు.

– ఈనాడు, గుంటూరు



కొలువును ముంచిన కౌగిలింత

వాషింగ్టన్: అమెరికన్ ఐటీ కంపెనీ 'ఆస్ట్రానమర్' సీఈవో ఆండీ బైరన్ ప్రముఖ బ్యాండు 'కోల్డ్‌ప్లే' సంగీత కచేరీలో తన సహోద్యోగినితో సన్నిహితంగా ఉన్న వీడియో వైరల్ కావడంతో ఆయన ఉద్యోగం ఊడింది. మసాచుసెట్స్‌లోని ఫాక్స్‌బరో పట్టణ జిలెట్ స్టేడియంలో గత బుధవారం కోల్డ్‌ప్లే కచేరీ జరిగింది. ఇందులో తాను పనిచేస్తున్న కంపెనీ హెచ్‌ఆర్ విభాగంలోని చీఫ్ పీపుల్ ఆఫీసరు క్రిస్టిన్ కాబోట్‌ను కౌగిలించుకొని కచేరీని ఆస్వాదిస్తున్న ఆండీ కెమెరా కంటపడ్డారు.



ఫోకస్ లైటు ఈ జంట మీదకు రాగానే ఇద్దరూ ఉలిక్కిపడి విడిపోయి ముఖాలు దాచుకొన్నారు. వివాహ భాగస్వాములున్న వీరిద్దరూ ప్రముఖులే కావడంతో ప్రేక్షకులు వెంటనే గుర్తించి కేరింతలు కొట్టారు. ఈ వ్యవహారం కంపెనీకి తలవంపులుగా మారింది. దీంతో సీఈవో ఆండీ బైరన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కంపెనీ 'ఎక్స్' ద్వారా ప్రకటించింది.

యంత్రుడి గస్తీ



పుదుచ్చేరి సముద్ర తీరంలో గస్తీ నిర్వహించేందుకు పోలీసులకు సహాయంగా తొలిసారిగా రోబోను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో అధునాతన సాంకేతికతతో కూడిన కెమెరాను అమర్చారు. బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని, మద్యం తాగే వారిని, నిషేధం మీరి స్నానాలు చేసే వారిని ఫొటో తీసి కంట్రోల్ రూమ్‌కు పంపే విధంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేశారు. ఆదివారం అధికారుల సమక్షంలో రోబో పనితీరును పరీక్షించారు. సుమారు 2 కి.మీ ఉన్న బీచ్ రోడ్డులో పెరియకడై పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి సాయంగా అధునాతన రోబోను వినియోగించనున్నారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీ సహకారంతో దీనిని రూపొందించారు.

–న్యూస్‌టుడే, చెన్నై(అశోక్‌నగర్)

అమ్మా.. నాన్నా.. పిలుపు కోసం..!



● చిన్నారుల దత్తతకు వేల మంది ఎదురుచూపులు

ఈనాడు, హైదరాబాద్: 'అమ్మా.. నాన్నా..' అనే పిలుపునకు తపిస్తూ.. పిల్లల దత్తత కోసం దరఖాస్తుచేసుకున్నవారు వేలసంఖ్యలో ఎదురుచూస్తున్నారు. దేశవ్యాప్తంగా వీరు వేలల్లో ఉండగా.. దత్తతకు అర్హులైన చిన్నారులు వందల్లోనే ఉన్నారు. దీంతో చాలామేర దరఖాస్తుదారులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆ పిలుపునకు దూరంగానే ఉండిపోక తప్పడంలేదు. దేశవ్యాప్తంగా చట్టబద్ధ దత్తత కార్యక్రమాన్ని కేంద్రీయ దత్తత ఏజెన్సీ (కారా) పర్యవేక్షిస్తోంది. దీని పరిధిలో రాష్ట్ర దత్తత వనరుల ఏజెన్సీలు పని చేస్తున్నాయి. చట్టబద్ధమైన దత్తత గురించి తెలియక కొందరు దళారుల చేతుల్లో మోసపోతున్న సంఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి.

ఎవరిని దత్తత ఇస్తారు?

అసహాయ పరిస్థితుల్లో తల్లిదండ్రులు వదిలేసిన చిన్నారులు, ఆర్థికభారంతో పెంచలేక ప్రభుత్వానికి అప్పగించిన పిల్లలను చిన్నారుల సంరక్షణ కమిటీల ఆదేశాల మేరకు శిశు సంక్షేమశాఖ అధికారులు చేరదీసి శిశుగృహాల్లో ఆలనాపాలనా చూస్తారు. ఈ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు మాత్రమే సంరక్షణ ఉంటుంది. ఆరేళ్లు దాటిన చిన్నారులను శిశుగృహాల నుంచి బాల సదన్‌కి పంపించి విద్యాబుద్ధులు నేర్పిస్తారు.

● దంపతుల వయసు, వైవాహిక బంధం ఆధారంగా చిన్నారులను దత్తతకు ఇస్తారు. కనీసం రెండేళ్ల పాటు ఎలాంటి గొడవలు లేకుండా సాఫీగా జీవిస్తున్న వారే అర్హులు. రెండేళ్లలోపు పిల్లల్ని దత్తత తీసుకోవాలంటే దంపతులిద్దరి వయసు కలిపి 85 ఏళ్లు, సింగిల్ పేరెంట్ అయితే.. మహిళలు మాత్రమే అర్హులు కాగా వయసు 40 ఏళ్లకు మించకూడదు.



పెరుగుతున్న 'నిరీక్షణ'

కేరింగ్స్ పోర్టల్‌లో దరఖాస్తు అనంతరం, విచారణ అన్నీ పూర్తయిన తర్వాత, సీనియారిటీ ప్రకారం వెయిటింగ్ ఉంటుంది. ఇందుకు కనీసం ఏడాది నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. దేశవ్యాప్తంగా 'కారా' గణాంకాల ప్రకారం 2,690 మంది చిన్నారులు సంరక్షణగృహాల్లో ఉన్నారు. వీరిలో 967 మంది సాధారణ; 1,723 మంది దివ్యాంగ పిల్లలు. కాగా దత్తత కోరుకుంటున్నవారు 34,009 మంది ఉన్నారు. దేశవ్యాప్తంగా దరఖాస్తుచేసుకున్నవారిలో భారతీయులు 33,123 కాగా మిగతావారంతా ఎన్నారైలు, విదేశీ భారతపౌరులు, విదేశీయులు.



● దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్ ద్వారా తమ పరిస్థితిని తెలుసుకోవచ్చు. తమవంతు సమీపించగానే దేశవ్యాప్తంగా దత్తతకు అందుబాటులో ఉండే చిన్నారుల వివరాలు కనిపిస్తాయి. నెలరోజుల వ్యవధిలో కొంత కాలపరిమితి ఇస్తూ ముగ్గురు పిల్లలను రిఫర్ చేస్తారు. చిన్నారి ఫొటో, వివరాలన్నీ పరిశీలించి దంపతులు రిజర్వ్ చేసుకోవాలి. మూడు రిఫరల్స్‌లో చిన్నారి నచ్చితే 48 గంటల్లోగా సమ్మతి తెలియజేయాలి. లేకుంటే సీనియారిటీ తిరిగి మొదటికి వస్తుంది. మళ్లీ తమవంతు వచ్చేవరకు వేచిచూడాల్సి ఉంటుంది.

9 నుంచి ఇంటర్.. స్థానికంగా చదివితేనే లోకల్

'నీట్' వెబినార్‌లో నిపుణుల స్పష్టీకరణ

ఈనాడు, హైదరాబాద్, విజయవాడ, వరంగల్

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ స్థానికంగా చదివితేనే ఎంబీబీఎస్ లోకల్ కోటా సీట్లకు అర్హులని సంబంధిత నిపుణులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రోగ్రాం ద్వారా నడిచే ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్ ఆటోమేటిక్‌గా ర్యాంకులు, వెబ్ ఆప్షన్ల నమోదు ఆధారంగా జరిగిపోతుందనీ, ఏదైనా పొరపాటు జరిగితే.. వెంటనే పరిశీలించి సరిదిద్దుతుంటామనీ భరోసా ఇచ్చారు. వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించే 'నీట్ కౌన్సెలింగ్'పై ఈనాడు- చదువు, శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ ఉచిత వెబినార్ విజయవంతమైంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రొ. నీలమేఘ శ్యామ్ దేశాయి సమన్వయకర్తగా వ్యవహరించగా డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (విజయవాడ) రిజిస్ట్రార్ డా. వేమిరెడ్డి రాధికారెడ్డి, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (వరంగల్) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా. నాగార్జునరెడ్డి, డెప్యూటీ రిజిస్ట్రార్ డా. కె. జ్యోతిలు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి విలువైన సూచనలు అందించారు. ముఖ్యాంశాలు ఇవీ...



వెబినార్‌లో మాట్లాడుతున్న డా. రాధికారెడ్డి, డా.జ్యోతి, డా.నాగార్జునరెడ్డి. చిత్రంలో సమన్వయకర్త దేశాయి(పై వ్యక్తి)

ఏపీ, తెలంగాణల్లో లోకల్ సీట్ల భర్తీకి ప్రాతిపదిక?

- ఏపీలో తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివితే వారినే లోకల్‌గా పరిగణిస్తాం. నాలుగేళ్లలో ఒక్క ఏడాది బయట వేరే రాష్ట్రాల్లో చదివినా నాన్‌లోకల్ అయిపోతారు. ఏపీలో ఎస్వీయూ, ఆంధ్రా విశ్వవిద్యాలయం రెండు పరిధులున్నాయి. అందుకే.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఏ ప్రాంతంలో చదివితే.. ఆ విశ్వవిద్యాలయం పరిధిలో భర్తీ చేసే సీట్లకు వారిని లోకల్‌గా పరిగణిస్తాం.

- నీట్ పరీక్షకు అర్హత ఇంటర్మీడియట్ కాబట్టి.. వరుసగా తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే వారిని స్థానికులుగా పరిగణించి.. లోకల్ సీట్లను కేటాయిస్తాం. స్టడీ సర్టిఫికెట్ ఇక్కడే ఉండాలి. ఒకవేళ ఏదైనా దూరవిద్య ద్వారా చదివినా.. అలాంటి వారికి గత నాలుగేళ్లుగా తెలంగాణలో ఉన్నట్టుగా రెసిడెంట్ సర్టిఫికెట్ అడుగుతున్నాం
- ఏ ప్రాంతంలోని కళాశాలలో సీటు కావాలని కోరుకుంటే.. దాన్ని బట్టి ఆప్షన్లు పెట్టుకోవాలి. ఏపీలో కౌన్సెలింగ్ ఎన్ని దశల్లో జరిగినా ఒకేసారి 36 కళాశాలలకూ మొదటి కౌన్సెలింగ్‌కు ముందే ఆప్షన్లను పెట్టేసుకోవాలి. ఆ తర్వాత మార్చడానికి ఉండదు. అందుకే.. ఆరంభంలోనే జాగ్రత్తగా వారి ఆసక్తిని బట్టి.. కళాశాలలను ఎంపిక చేసుకునేలా వరుసగా నమోదు చేసుకోవాలి. తెలంగాణలో మొదటి దశ కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు పెట్టుకున్నాక, తర్వాత రెండో దశకు మళ్లీ మార్చుకోవచ్చు, ఇలా ప్రతి దశకూ మార్చుకోవచ్చు.
- స్థానిక కోటా సీట్ల భర్తీ కోసం నమోదు చేసుకునే వెబ్ ఆప్షన్లతో ఆల్ ఇండియా కోటాకు సంబంధం ఉండదు. దానికి మళ్లీ ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటా సీట్లన్నీ నీట్ ర్యాంకుల ఆధారంగా మెరిట్ ద్వారానే భర్తీ చేస్తాం. యాజమాన్యాలకు భర్తీ చేసుకునే అవకాశం లేదు.

మొత్తం సీట్లెన్ని?

- దేశంలో మొత్తం 1.10 లక్షల ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వీటిలో ఈ ఏడాది 25,400 సీట్లను ఆలిండియా కోటా కింద మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ భర్తీ చేస్తుంది. ఏపీలో ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గత ఏడాది 6500 సీట్లను భర్తీ చేశాం. ఈ ఏడాది మరికొన్ని కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతులు రావడంతో వాటిలో సీట్లు అదనంగా కలుస్తాయి. ఏపీలో ఉన్న ప్రభుత్వ సీట్లలో 15 శాతం అంటే.. 490 వరకూ ఆలిండియా కోటా కిందకి వెళతాయి. మిగతా వాటికి ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తాం. బీడీఎస్ సీట్లు ఏపీలోని ప్రభుత్వ కళాశాలల్లో 140 ఉన్నాయి. వాటిలో 15 శాతం ఆల్ ఇండియా కోటా కిందకు వెళతాయి. బీడీఎస్ సీట్లు ప్రైవేటు కళాశాలల్లోనే అధికంగా ఉన్నాయి.
- తెలంగాణ పరిధిలో ఉన్న 8415 సీట్లకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ప్రభుత్వ సీట్లలో 15 శాతం అంటే 637 సీట్లు ఆలిండియా కోటా కింద భర్తీ అవుతాయి. మిగతా 85 శాతం సీట్లను ఇక్కడే కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తాం. తెలంగాణలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లోని 50 శాతం సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే కన్వీనర్ కోటా ద్వారా భర్తీ చేస్తాం. మిగతా 50 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లను కూడా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ద్వారానే భర్తీ చేస్తాం. బీడీఎస్ సీట్లు తెలంగాణలోని ఒక ప్రభుత్వ కళాశాలలో 100 ఉన్నాయి. వీటిలో 15 శాతం ఆలిండియా కోటా కిందకు వెళతాయి.

తప్పులు దొర్లితే ఏంచేయాలి?... రిజిస్ట్రేషన్లు ఎప్పుడు మొదలవుతాయి?... రిజర్వేషన్ల సంగతి?... కౌన్సెలింగ్ కోసం ఏ సర్టిఫికెట్లు అవసరం?

తదితర వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..


శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ. చిత్రంలో తితిదే ఓఎస్డీ సత్రేనాయక్ తదితరులు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు కుటుంబసభ్యులతో కలిసి చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేయించి, ప్రసాదం అందజేశారు.

చదువుతో పాటు ఉత్సుకత, సృజనాత్మకత అవసరం

- తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవంలో కేఆర్ఈఏ విశ్వవిద్యాలయ కులపతి లక్ష్మీనారాయణన్



అత్యుత్తమ ప్రతిభచాటిన అరవింద్ శ్రీనివాసన్‌కు రాష్ట్రపతి బంగారు పతకం అందజేస్తున్న లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఉత్సుకత.. సృజనాత్మకత.. విమర్శనాత్మక ఆలోచనలు కలిగి ఉంటే అద్భుతాలు ఆవిష్కరించవచ్చని కేఆర్ఈఏ కులపతి, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సహవ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణన్ అన్నారు. తిరుపతి ఐఐటీలో ఆదివారం నిర్వహించిన 7వ స్నాతకోత్సవంలో ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడారు. అద్భుత పరిశోధనలతో ప్రత్యేకత చాటుకున్న పట్టభద్రులు విభిన్న దృక్పథాలపై శ్రద్ధ చూపాలని, విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. బొమ్మలు చెక్కే వడ్రంగిగా ఓలే కిర్క్ క్రిస్టియన్సెన్ 'లెగో'ను సృష్టించి అతిపెద్ద బొమ్మల తయారీదారుగా గుర్తింపు పొందారని వివరించారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వికసిత్ భారత్ కార్యక్రమం దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి దోహదపడుతోందన్నారు. తిరుపతి ఐఐటీ అభివృద్ధి తదితర అంశాలను ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎస్.సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంపీపీ, ఎంఎస్(పరిశోధన), పీహెచ్‌డీ తదితర కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేశారు.

నిలకడగా ముద్రగడ ఆరోగ్యం

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి శనివారం రాత్రి అస్వస్థతకు గురైన విషయం విదితమే. కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను తొలుత నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డయాలసిస్ చేయగా ఆరోగ్యం నిలకడగా ఉంది. ముద్రగడ ఆసుపత్రిలో చేరారని తెలియడంతో ఆయన కుమార్తె బార్లపూడి క్రాంతి ఆసుపత్రికి చేరుకుని తండ్రిని చూసి వెళ్లారు.

జగన్ ఆరా: ముద్రగడ ఆరోగ్య పరిస్థితిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరా తీశారు. ముద్రగడ కుమారుడు గిరిబాబుకు ఫోన్ చేశారు. అత్యవసరమైతే కాకినాడ నుంచి హైదరాబాద్‌కు ఎయిర్‌లిఫ్ట్ చేయాలని జగన్ సూచించినట్లు తెలిసింది. ముద్రగడను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. ఆయన తనయుడు గిరిబాబును పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



రోజుకు 18 నిమిషాలు కేటాయించలేరా?

రోజుకు సుమారు 18 నిమిషాల చొప్పున ఏడాదిలో 100 గంటల పాటు మీరు ఓ విషయాన్ని సాధన చేస్తే చాలు.. ఈ ప్రపంచంలోని 95 శాతం మంది కన్నా మెరుగ్గా మీరు ఆ అంశంలో పట్టు సాధిస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే ఎన్ని పనులున్నా మీరు నిర్దేశించుకున్న లక్ష్యం కోసం ప్రతిరోజూ సమయం కేటాయించడం అత్యంత ముఖ్యమని.

– జేడ్ బొనకోల్టా, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం

- రోదసియాత్రలో పెనుముప్పును తప్పించాం
- ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్

ఈనాడు, కర్నూలు: భారతదేశం 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం) కళాశాల ఏడో స్నాతకోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన నారాయణన్ ప్రసంగిస్తూ, 2040వ సంవత్సరంలో మనిషిని చంద్రుడిపైకి పంపి తిరిగి భూమిపైకి తీసుకొస్తామన్నారు. ఇందుకోసం 40 అంతస్తుల ఎత్తుకు సమానమైన ఎత్తు ఉండే భారీ రాకెట్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. యాక్సియం-4 మిషన్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములను పంపే కార్యక్రమం వాస్తవానికి చాలాసార్లు వాయిదా పడిందన్నారు. ఈ ఏడాది జూన్ 11న ఉదయం 8.30 గంటలకు తొలుత ఆ రోదసియాత్ర జరగాల్సి ఉందని తెలిపారు. జూన్ 10న రాకెట్‌లో లీకేజీ సమస్య ఉన్నట్లు తాము గుర్తించి అమెరికాలోని కమిటీకి చెప్పామన్నారు. అయినప్పటికీ వారు రోదసియాత్రకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరించకుండా రోదసియాత్ర ప్రారంభించాలనుకుంటే ఆ కార్యక్రమంలో మేము పాల్గొనబోమని స్పష్టం చేసినట్లు చెప్పారు. దీంతో వారు జూన్ 10న ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఆరోజు ప్రయోగాన్ని వాయిదా వేయకపోతే భారీ వైఫల్యాన్ని చవిచూడాల్సి వచ్చేదన్నారు. దీంతో పాటు వ్యోమగాముల ప్రాణాలను కూడా కాపాడగలిగామని ఆయన వివరించారు.


విద్యార్థినికి బంగారు పతకం, పట్టా అందజేస్తున్న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ట్రిపుల్‌ఐటీ డీఎం ఛైర్మన్ డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మాణే, డైరెక్టర్ బి.ఎస్.మూర్తి

ఇస్రో విజయానికి సమష్టి కృషే కారణం

ఇస్రో సాధిస్తున్న విజయాలకు శాస్త్రవేత్తల సమష్టి కృషే కారణమని వి.నారాయణన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 131 ఉపగ్రహాలను పంపినట్లు వివరించారు. ప్రస్తుతం చంద్రుడిపై ఉన్న కెమెరాల్లో అత్యుత్తమమైంది భారతదేశ కెమెరానే అని తెలిపారు. రూ. 20 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన గగన్‌యాన్ కార్యక్రమంతో పాటు, పలు రకాల ఉపగ్రహ ప్రయోగాలకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ట్రిపుల్ ఐటీ డీఎం ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి దేశ్‌మణే, ఇన్‌ఛార్జి డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, రిజిస్ట్రార్ కె.గురుమూర్తితో కలిసి విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించారు. విద్యార్థులు ప్రణయ్‌సందీప్ పరాట్‌వార్, గుమ్మశ్రీ సౌగంధిక, లావిష్‌సింగ్, సీహెచ్‌వీ శ్రీవర్ధనమూర్తి, బి.ప్రీతి బంగారు పతకాలు అందుకున్నారు. మొత్తం 206 మందికి పట్టాలు ప్రదానం చేశారు.

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: కృష్ణా నది పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి 1,38,841 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నీటి మట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.70 అడుగులు, నీటి నిల్వ 202.9673 టీఎంసీలుగా నమోదైంది. ఇదిలా ఉండగా శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 67,488 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

మీరేమైనా సూపర్ కాప్ అనుకున్నారా?


- దృష్టికి వచ్చిన ప్రతి దానిపై దాడులు చేయడానికి వీల్లేదు
- ఈడీని ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, చెన్నై: ప్రతి నేరానికీ సంబంధించి దాడులు నిర్వహించడానికి మీరు డ్రోన్ కాదని, అలాగని మీ దృష్టికి వచ్చిన ప్రతిదానిపై విచారణ చేపట్టడానికి మీరు 'సూపర్ కాప్' కూడా కాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ను ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. చెన్నైకి చెందిన ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన రూ.901 కోట్ల డిపాజిట్లను ఈడీ సీజ్ చేయడంతో దాన్ని సవాల్ చేస్తూ ఆ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా విచారించిన జస్టిస్ ఎం.ఎస్.రమేష్, జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్‌ల ధర్మాసనం ఈడీపై పైవిధంగా వ్యాఖ్యలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని పవర్ ప్లాంటుకు బొగ్గు సరఫరాపై ఆరోపణలు రావడంతో ఆర్‌కేఎంపై 2014లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత దాన్ని మనీ లాండరింగ్ వ్యవహారం కింద ఈడీకి బదిలీ చేసింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 31న ఆర్‌కేఎం సంస్థకు చెందిన ఆస్తులపై ఈడీ దాడులు చేపట్టి రూ. 901 కోట్లను ఎటాచ్ చేసింది. ఈ అంశంపై విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఈడీ ఎత్తిచూపిన అభియోగాలపై ఎలాంటి ఆధారాలూ దొరకనప్పుడు, ఇతర అంశాల మీద సుమోటోగా విచారణ చేపట్టే అధికారం ఈడీకి లేదని అభిప్రాయపడింది. నేరానికి సంబంధం ఉన్న వాటిని మాత్రమే సీజ్ చేసే అధికారముందని స్పష్టం చేసింది. ఈడీ చర్య తీసుకున్న వాటి మీద ఎలాంటి ఫిర్యాదు కూడా నమోదు కాలేదని పత్రాల్ని బట్టి తెలుస్తోందని పేర్కొంది. తమ దృష్టికి వచ్చిన విషయాలన్నింటిపై విచారణ చేపట్టడానికి ఈడీ సూపర్‌కాప్ కాదని, పీఎంఎల్ఏ కేసులోని నేరానికి సంబంధించిన వాటిమీదే చర్యలు తీసుకునేందుకు వీలుందని తేల్చి చెప్పింది.

సాంబారులో విషం కలిపిన భార్య

ప్రియుడి కోసం భర్తను కడతేర్చిన వైనం


రసూల్


అమ్ముబీ, లోకేశ్వరన్

చెన్నై(విల్లివాక్కం), న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తకు సాంబారులో విషం కలిపి హతమార్చిన ఘటన తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అరూర్ సమీపంలోని కీరైపట్టి గ్రామానికి చెందిన రసూల్(35) ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య అమ్ముబీ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని రోజుల క్రితం రసూల్ వాంతులు చేసుకొని, స్పృహ కోల్పోవడంతో కుటుంబీకులు సేలంలోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు ఆయన రక్త నమూనాలు పరీక్షించి పురుగుమందు అవశేషాలు గుర్తించారు. దీంతో రసూల్ కుటుంబీకులు ఆయన భార్యపై అనుమానంతో ఆమె సెల్‌ఫోన్‌లోని వాట్సప్ చాటింగ్ పరిశీలించారు. ఆమె స్థానికంగా సెలూన్ నడుపుతున్న లోకేశ్వరన్‌తో చాట్ చేసినట్లు గుర్తించారు. అందులో.. "నువ్వు ఇచ్చిన విషం మొదట దానిమ్మ రసంలో కలిపా. దాన్ని నా భర్త తాగలేదు. దీంతో ఆహారంలో కలిపా" అని అమ్ముబీ పేర్కొంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అమ్ముబీ, లోకేశ్వరన్‌లను శనివారం అరెస్టు చేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న రసూల్ మృతి చెందారు. దీంతో పోలీసులు హత్య కేసుగా మార్చారు. దర్యాప్తులో.. లోకేశ్వరన్, అమ్ముబీలు పథకం ప్రకారమే సాంబారులో విషం కలపడంతో రసూల్ మృతి చెందారని తేలింది.

EENADU Vol: 51, Issue: 342 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

సిరియా.. ఆరని కుంపటి

• జాతుల ఘర్షణతో ఉక్కిరిబిక్కిరి

సిరియా ఓ నిత్య అగ్నిగుండం. అంతర్యుద్ధం భగభగల్లో దహించుకుపోతున్న శలభ. బషర్ అల్ అసద్ పదవీచ్యుతి సమయంలో వెలిగిన మంటలు చల్లారి.. దేశం కాస్తంత తెప్పరిల్లుతోందని అనుకుంటున్న తరుణంలో.. స్థానికంగా రెండు జాతుల మధ్య రాజుకున్న మంటలు సిరియా భవితవ్యాన్ని మళ్లీ అగమ్యగోచరంలోకి నెట్టేశాయి! తాజా ఘర్షణలకు ప్రధాన కేంద్రంగా ఉన్న స్వెయిదా నుంచి వైదొలుగుతున్నట్లు ప్రభుత్వానికి ఓ గిరిజన తెగ ప్రకటించింది. అయితే ఇది శాశ్వత పరిష్కారంగా కనిపించడం లేదు. ఇక్కడ పరస్పరం దాడులకు పాల్పడుతున్న రెండు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఎప్పుడు కాలం తిప్పుతుందో.. ఈ నేపథ్యంలో.. సిరియాలో తాజా ఘర్షణలకు కారణమేంటి? దీనికి కారకులెవరు? ఈ గొడవల్లో ఇజ్రాయెల్ ఎందుకు జోక్యం చేసుకుంది? అనేవి ఆసక్తికర అంశాలు.



కత్తులు దూస్తున్న బెదోయిన్-డ్రూజ్ వర్గాలు

ప్రస్తుత ఘర్షణల్లో కీలక పాత్ర పోషిస్తున్నది బెదోయిన్ గిరిజన తెగలు, డ్రూజ్ వర్గాలు. స్వెయిదా ప్రాంతంలో ఈ రెండు వర్గాలు ఏళ్లుగా ఘర్షణ పడుతున్నాయి. బెదోయిన్ వెనుక సిరియా తాత్కాలిక ప్రభుత్వం ఉంది. డ్రూజ్‌కు ఇజ్రాయెల్ మద్దతిస్తోంది. తాజా ఘర్షణలకు మాత్రం ఓ కూరగాయల వ్యాపారిపై దాడి కారణం. ఈ నెల 13న సిరియాలోని స్వెయిదా ప్రాంతంలో ఉన్న ఓ తాత్కాలిక తనిఖీ కేంద్రం వద్ద డ్రూజ్‌కు చెందిన ఓ కూరగాయల వ్యాపారిపై బెదోయిన్ వర్గం వ్యక్తులు దాడులకు దిగారు. అతడి కారును, సొమ్మును అపహరించి వెళ్లిపోయారు. ఇది హింసాకాండకు దారితీయడంతో స్వెయిదా ప్రాంతమంతా వారం రోజుల పాటు అట్టుడికిపోయింది. డ్రూజ్‌కు చెందిన మహిళలు, చిన్నారులపై బెదోయిన్ దాడులకు, అపహరణలకు తెగబడింది. డ్రూజ్ మతపెద్దలను అవమానిస్తూ.. వారి మీసాలను తీసివేసింది. డ్రూజ్‌ల ఇళ్లను ధ్వంసం చేశారు. దాదాపు 900 మందికి పైగా మృత్యువాతపడ్డారు. ఈ దాడులను సిరియా ప్రభుత్వం బయటకు ఖండిస్తూనే... బెదోయిన్‌కు పూర్తి మద్దతిచ్చింది. డ్రూజ్‌లను కాపాడటం కోసమంటూ ఇజ్రాయెల్ సైన్యం సిరియా రాజధాని డమాస్కస్‌పై దాడి చేసింది.

ఇజ్రాయెల్ జోక్యం దేనికి?

సిరియా తర్వాత డ్రూజ్‌లు అత్యధికంగా, క్రియాశీలకంగా ఉన్నది ఇజ్రాయెల్‌లోనే. ఈ వర్గం వారు ఇజ్రాయెల్ ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్నారు. వీరిపై నెతన్యాహు సర్కారుకు సదభిప్రాయం ఉంది. అదీగాక.. డ్రూజ్‌లు ఒకరిపై మరొకరికి సోదరభావం ఎక్కువ. ఘర్షణల్లో తమకు సాయం చేయాలంటూ వారు ఇజ్రాయెల్‌కు అభ్యర్థన పంపారు. అప్పటికే దక్షిణ సిరియాపై పట్టు సాధించాలని తహతహలాడుతున్న ఇజ్రాయెల్‌కు ఇది ఓ సువర్ణావకాశంలా కనిపించింది. వెంటనే యుద్ధవిమానాలను డమాస్కస్‌కు పంపి ఆ దేశ రక్షణ కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. సిరియా ప్రభుత్వానికి నేరుగా హెచ్చరికలు చేసింది.

ఎవరీ వైరి వర్గాలు?

డ్రూజ్‌లు, బెదోయిన్‌లకు సంక్లిష్టమైన చరిత్ర ఉంది. డ్రూజ్‌ల కంటే ముందే బెదోయిన్ సిరియాలో అడుగుపెట్టారు. కాలక్రమేణ రెండు వర్గాలూ బలమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పరచుకున్నాయి. బెదోయిన్‌లు పశు వ్యాపారం, పశువులను మేపడం వంటి పనులు చేసేవారు. డ్రూజ్‌లు రవాణా, వ్యవసాయం చేసేవారు. బదులుగా డ్రూజ్‌లు వారికి వస్తువులు, మార్కెట్లను తెరిచారు. ఆధునిక సిరియా రాజ్యాన్ని స్థాపించడానికి ఒట్టమన్, ఫ్రెంచి పాలకులకు వ్యతిరేకంగా డ్రూజ్‌లు, బెదోయిన్‌లు కలిసి తిరుగుబాటు చేశారు. కానీ వీరి మధ్య సామరస్యం ఎక్కువ కాలం నిలువలేదు. 1950ల ప్రారంభంలో అప్పటి సిరియా అధ్యక్షుడు అదిబ్ షిషక్లి వీరి మధ్య చిచ్చుపెట్టారు. డ్రూజ్‌లపై దాడి చేయాలని బెదోయిన్‌లను ప్రోత్సహించారు. ఈ దాడులు దోపిడీలు, వలసలు, బాల వివాహాలకు దారితీశాయి. అప్పటి నుంచి వారి మధ్య వైరం నెలకొంది. 2000 సంవత్సరంలో బెదోయిన్‌లు ఓ వ్యక్తి డ్రూజ్‌ను హతమార్చారు. దీంతో పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. వీరిని అణచివేసేందుకు సిరియా ప్రభుత్వం వారిపై కాల్పులకు తెగబడింది.

రహస్య డ్రూజ్‌లు

పశ్చిమాసియాలో అత్యంత రహస్యమైన, తప్పుగా అర్థం చేసుకున్న మతాల్లో డ్రూజ్ ఒకటి. ఖురాన్ సహా అనేక మూలాల నుంచి ప్రేరణ పొందిన ఈ సిద్ధాంతం 11వ దశాబ్దంలో ప్రారంభమైంది. 6వ ఇస్మాయిలీ షియా ఫాతిమిద్ ఖలీఫ్, అల్ హకీమ్ బి అమ్ర్ అల్లాహ్ పాలనలో ఈజిప్టులో ఉద్భవించింది. 1021లో అల్ హకీమ్ రహస్యంగా అదృశ్యమయ్యేంత వరకు వీరు మతమార్పిడులు చేసేవారు. ఆ తర్వాత హకీమ్ కుమారుడు డ్రూజ్‌పై తిరుగుబాటు చేయడంతో వారంతా సిరియా, ఇజ్రాయెల్ ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. అప్పటి నుంచి మనుగడ కోసం మతమార్పిడులకు స్వస్తి పలికారు. పరమతస్తులను వివాహం చేసుకోవడమన్న కఠినమైన విధానాలను పాటిస్తారు. సిరియా నియంత బషర్ అల్ అసద్ గద్దె దిగినప్పుడు సంబరాలు చేసుకున్న వీరు ఆ తర్వాత వచ్చిన తాత్కాలిక అహ్మద్ అల్ షరా పాలనపై కూడా విముఖతతోనే ఉన్నారు. విచిత్రమేంటంటే అసద్ పాలనలో వీరికి స్వయంప్రతిపత్తి ఉంది. వీరిని నిర్బంధ సైనిక శిక్షణ నుంచి మినహాయించారు. అసద్ సమయంలోని అంతర్యుద్ధానికి వీరు దూరంగా ఉన్నారు. మరోవైపు బెదోయిన్‌లు సంప్రదాయ సంచార జాతులు. బెదోయిన్ అంటే 'ఎడారి నివాసి' అని అర్థం. వీరు శతాబ్దాలుగా పశ్చిమాసియా, ఆఫ్రికా ఎడారుల్లో నివసించారు. సిరియా ప్రభుత్వ మద్దతుదారులు డ్రూజ్‌లను వేర్పాటువాదులుగా, ఇజ్రాయెల్‌కు ఒక సాధనంగా చూస్తారు. ఫలితంగా తమ జాతిని పక్షాన చేయాలని ప్రభుత్వం భావిస్తోందని భయపడుతున్నారు. ఇదే ఇరు వర్గాల మధ్య ప్రతి దాడులకు దారితీస్తోంది. ఇది ఆగాలంటే సంవత్సరాల యుద్ధం తర్వాత సిరియాలో లోతుగా పాతుకుపోయిన మత విభజనను తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా తగ్గించగలగాలి. లేదంటే ఆయన ప్రభుత్వమూ సంక్షోభంలో చిక్కుకునే అవకాశం ఉంది.

స్వెయిదాను వీడిన సాయుధ బెదోయిన్లు

• కుదుటపడుతున్న సిరియా

మజ్రా (సిరియా): స్వెయిదా బెదోయిన్లు, డ్రూజ్ ముఠాల మధ్య ఘర్షణతో వారం రోజులపాటు అట్టుడికిన సిరియాలో మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటున్నట్లు కనిపిస్తోంది. డ్రూజ్ జనాభా అధికంగా ఉన్న స్వెయిదా నగరం నుంచి తాము పూర్తిగా నిష్క్రమించినట్లు బెదోయిన్ వర్గాలు ప్రకటించాయి. ఈ పరిణామంపై సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్-షరా హర్షం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణకు సంపూర్ణంగా కట్టుబడి ఉండాలని ఇరు వర్గాలను పిలుపునిచ్చారు. బెదోయిన్ వర్గాల నిష్క్రమణతో స్వెయిదా ప్రావిన్సువ్యాప్తంగా ఆదివారం ప్రశాంత వాతావరణం నెలకొంది. మానవతా సాయంలో భాగంగా ఆహారం, ఔషధాలు, నీరు, ఇంధనం అందజేసే ట్రక్కులు ఆ ప్రాంతంలోకి తిరుగుతూ కనిపించాయి. డ్రూజ్ ముఠాలు, బెదోయిన్ తెగల మధ్య ఈ నెల 13 నుంచి జరిగిన ఘర్షణల్లో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. హింసను అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న ప్రభుత్వ బలగాలు ఒక దశలో బెదోయిన్ తెగలకు మద్దతుగా నిలిచాయి. దీంతో డ్రూజ్‌లకు అండగా ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ఈ నెల 16న ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా.. మరుసటి రోజు నుంచి మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

మహారాష్ట్ర అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రి!

• విమర్శలు గుప్పించిన ప్రతిపక్షాలు



నాగ్‌పుర్: మహారాష్ట్రలో ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా, మరోవైపు ఆ రాష్ట్ర మంత్రి సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మంత్రి చర్యపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. అసెంబ్లీ సమావేశాల జరుగుతున్నప్పుడు వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కోకాటే.. ఫోన్‌లో రమ్మీ ఆడుతున్నారని ఎన్సీపీ(ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "ఓ వైపు రైతుల సమస్యలపై సభలో చర్చ జరుగుతుంటే కోకాటే ఇలా వ్యవహరించారు. రాష్ట్రంలో రోజుకు 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ఇవేమీ పట్టించుకోకుండా ఆయన ఆటలాడుతున్నారు" అని రోహిత్ మండిపడ్డారు. కోకాటేపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు శివసేన (యూబీటీ) నేత ఆనంద్ దుబే విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కోకాటే.. 'నేను యూట్యూబ్ వీడియో చూస్తున్నప్పుడు రమ్మీ ఆటకు సంబంధించిన ప్రకటన వచ్చింది. రెండు సార్లు దాన్ని తొలగించేందుకు ప్రయత్నించాను. ప్రతిపక్షాలు కావాలనే అసంపూర్తి వీడియోను ప్రదర్శించి విమర్శిస్తున్నాయి" అని పేర్కొన్నారు.

పార్టీ ప్రయోజనాలకంటే దేశమే ముఖ్యం

• జాతీయ ఐక్యతకు రాజకీయ వైరం అడ్డుకాకూడదు
• కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్



దిల్లీ: పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యమివ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ పేర్కొన్నారు. కొచ్చిలోని ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సొంత పార్టీలో వ్యతిరేకత రావడంపై ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. జాతీయ ఐక్యతకు రాజకీయ వైరాలు అడ్డుకాకూడదన్నారు. 'దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు మీ విధానాలను పక్కన పెట్టాలి. దేశమే గుర్తుండాలి. అప్పుడే మనమంతా జీవించగలం. నా దృష్టిలో దేశమే ముందు. మీరు ఏ పార్టీకి చెందినవారైనా సరే. ఆ పార్టీ లక్ష్యం మెరుగైన భారతదేశాన్ని సృష్టించడమే అవ్వాలి. సోషలిజం, స్వేచ్ఛ, నియంత్రణ వంటి భావజాలాలతో పార్టీలు భిన్నంగా ఉండవచ్చు. అయితే, సురక్షితమైన భారత్‌కు అవన్నీ కట్టుబడి ఉండాలి. జాతీయ భద్రతకు సంబంధించిన విషయం వస్తే అన్ని పార్టీలూ సహకరించుకోవాలి. మన సాయుధ దళాలకు, మన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడంలో నేను తీసుకున్న వైఖరి కారణంగా కొందరు నాపై విమర్శలు చేశారు. కానీ, నేను చేసింది సరైందని నమ్మి.. నిలబడ్డా" అని థరూర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ హైకమాండ్‌తో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించగా.. స్పందించేందుకు థరూర్ నిరాకరించారు.

శశిథరూర్‌ను ఆహ్వానించేది లేదు

• కాంగ్రెస్ నేత కె.మురళీధరన్ వ్యాఖ్య

తిరువనంతపురం: కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యవహార శైలిపై సొంత పార్టీలో అసంతృప్తి పెరుగుతోంది. ఆయన్ను తమలో ఒకరిగా పరిగణించడం లేదంటూ తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత కె.మురళీధరన్ వ్యాఖ్యానించారు. దేశ భద్రత అంశంపై ఆయన తన వైఖరిని మార్చుకునే వరకు తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆయన్ను ఆహ్వానించేది లేదన్నారు. పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని శశిథరూర్ వ్యాఖ్యానించిన వేళ.. మురళీధరన్ ఈ మేరకు స్పందించారు. "శశిథరూర్ తన తీరును మార్చుకునే వరకు.. తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించబోం. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది" అని మురళీధరన్ మీడియాతో అన్నారు. ఇదిలా ఉంటే, మోదీ ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి శశిథరూర్ విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

డ్రగ్స్‌కు అలవాటుపడి.. తల్లిని నరికి చంపాడు

గురుగ్రామ్: హరియాణాలోని నూహ్ జిల్లా జైసింగ్‌పుర్‌లో మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు.. రూ.20 ఇవ్వలేదన్న కోపంతో కన్నతల్లి రజియా (56)ను గొడ్డలితో నరికి చంపినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. శనివారం ఈ అఘాయిత్యానికి పాల్పడిన జమ్‌షెడ్ అదే ఇంట్లో రాత్రంతా నిద్రపోయాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రజియా భర్త ముబారక్ నాలుగు నెలల క్రితమే మృతిచెందగా.. జమ్‌షెడ్ చాలాకాలంగా గంజాయి, ఓపియంలకు అలవాటుపడినట్లు సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. రజియా మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

జపాన్ ఎగువ సభలో మెజారిటీ కోల్పోనున్న పాలక సంకీర్ణం

• ఎగ్జిట్ ఫలితాల అంచనా

టోక్యో: జపాన్‌లో ప్రధానమంత్రి షిగేరు ఇషిబా నేతృత్వంలోని పాలక కూటమి పార్లమెంటు ఎగువ సభలో మెజారిటీ కోల్పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎగువ సభలో మొత్తం 248 స్థానాలుండగా.. వాటిలో సగం సీట్లకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. పోలింగ్ సమయం ముగియగానే విడుదలైన ఎగ్జిట్ ఫలితాలు ఇషిబాకు చెందిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)కి, పాలక సంకీర్ణంలోని దాని మిత్రపక్షమైన కొమీటోకు షాకిచ్చాయి. రెండు పార్టీలూ కలిపి దాదాపు 40 సీట్లు మాత్రమే గెల్చుకుంటాయని ఎగ్జిట్ ఫలితాలు అంచనా వేశాయి. ఎల్‌డీపీ సొంతంగా 32-35 స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పాయి. ఎగువ సభలో పాలక సంకీర్ణానికి ప్రస్తుతం 75 స్థానాలు ఉన్నాయి. సాధారణ మెజార్టీ కావాలంటే ఈ ఎన్నికల్లో మరో 50 సీట్లు దక్కించుకోవాలి. ఎగ్జిట్ అంచనాలు నిజమైతే సంకీర్ణ ప్రభుత్వం ఎగువ సభలో మెజార్టీ కోల్పోయినట్లే. దేశంలో రాజకీయ అస్థిరతను ఇది మరింత పెంచే ముప్పుంది. ధరల పెరుగుదలకు కళ్లెం వేసే దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ప్రతిఫలాలు ప్రజలకు ఇంకా అందలేదని ప్రధాని ఇషిబా పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో తమ సంకీర్ణం ఆశించిన ఫలితాలు దక్కించుకునే అవకాశాలు కనిపించడం లేదన్నారు.

హాంకాంగ్, చైనాలో తుపాను బీభత్సం

• విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
• దక్షిణ కొరియాలో 17 మంది మృతి

బీజింగ్, హాంకాంగ్: విఫా తుపాను చైనాలోని పలు ప్రాంతాల్లో బీభత్సం సృష్టిస్తోంది. దీని ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. పొరుగున ఉన్న హాంకాంగ్‌పైనా ఇది విరుచుకుపడి విధ్వంసానికి కారణమవుతోంది. హాంకాంగ్, షెన్‌ఝెన్, ఝుహాయ్, మకావోల నుంచి బయల్దేరాల్సిన అత్యధిక విమానాలు రద్దు కాగా, అనేక సర్వీసులు ఆలస్యమయ్యాయి. ఒక్క హాంకాంగ్‌లోనే 400 విమానాలు రద్దవడం 80 వేల మందిపై ప్రభావం చూపింది. పలు హైస్పీడ్ రైళ్లూ రద్దయ్యాయి. అత్యంత ప్రమాదకర పరిస్థితిని సూచించే పదో నంబరు హెచ్చరికను హాంకాంగ్‌లో జారీచేశారు. తుపాను కన్ను ఈ నగర దక్షిణ భాగం మీదుగా పయనించినప్పుడు గంటకు 140 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీచాయి. దీంతో పెద్దఎత్తున చెట్లు కూలిపోయాయి. డిస్నీలాండ్ సహా వినోద పార్కుల్ని మూసివేశారు. దక్షిణ కొరియాలోనూ ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. వివిధ ఘటనల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. చుంగ్‌చియోంగ్ ప్రావిన్సులో ఒక అపార్ట్‌మెంటు సెల్లార్‌లోకి వరదనీరు భారీగా చేరడంతో ఓ కారులో చిక్కుకున్న ముగ్గురు అందులోనే ప్రాణాలు కోల్పోయారు. నాలుగు రోజుల వ్యవధిలో పలు ప్రాంతాల్లో 600-800 మి.మీ. వర్షం కురిసింది. తుపాను ఆదివారం సాయంత్రం తీరాన్ని దాటింది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని పిన్‌డ్రా నియోజకవర్గంలో ఆదివారం పొలంలో మహిళా రైతులతో కలిసి వరి నాట్లు వేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్



ఉత్తరాది శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో మట్టితో చేసిన శివలింగాలను నర్మదా నదిలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తున్న భక్తులు

పుతిన్‌తో ఖమేనీ సలహాదారు భేటీ

• అణు కార్యక్రమంపై చర్చ

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఆదివారం మాస్కోలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ సీనియర్ సలహాదారు అలీ లారిజానీ భేటీ అయ్యారు. పశ్చిమాసియాలోని పరిస్థితులు, ఇరాన్ అణు కార్యక్రమంపై వారి మధ్య చర్చలు సాగాయి. 'ఖమేనీ తరఫున అలీ లారిజానీ పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులను వివరించారు. అణు కార్యక్రమం గురించీ తెలిపారు' అని రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు.

సెప్టెంబరులో నేపాల్ ప్రధాని భారత్ పర్యటన

కాఠ్‌మాండూ: నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి సెప్టెంబరులో భారత్‌లో పర్యటించనున్నారని ఆ దేశ విదేశాంగశాఖ ఆదివారం తెలిపింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తి షెడ్యూలు విడుదల చేస్తామని పేర్కొంది. ఓలి గత జులైలో నాలుగోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించాక మొదటగా భారత్‌ను సందర్శించే సంప్రదాయాన్ని పక్కనబెట్టి గతేడాది డిసెంబరులో ఆయన చైనాలో పర్యటించారు. అయితే.. ప్రధాని ఓలి భారత పర్యటనకు దిల్లీ నుంచి ఆహ్వానం రాలేదని, ఇది ఆయనకు ఆ దేశంతో ఉన్న సంబంధాలకు నిదర్శనమని స్థానిక మీడియాలో ఇటీవల వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఓలి ఇటీవల మాట్లాడుతూ.. త్వరలో తాను భారత్‌లో పర్యటించనున్నానని, దానికి సంబంధించిన ఏర్పాట్లు సాగుతున్నాయని పేర్కొనడం గమనార్హం.

పాకిస్థాన్‌లో 203కు చేరిన మృతులు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూన్ నుంచి ఇప్పటివరకు 203 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో వంద మంది చిన్నారులూ ఉన్నారు. ఇళ్లు కూలి ఎక్కువ మంది మరణించారు. పంజాబ్ ప్రావిన్సులో అత్యధికంగా 123 మంది చనిపోయారు.

ఇప్పటిదాకా లోక్‌సభకు ఎన్నికైన ముస్లిం మహిళలు వీరే..

దిల్లీ: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా లోక్‌సభకు మొత్తం మీద 18 మంది ముస్లిం మహిళలు ప్రాతినిధ్యం వహించారు. ఆ జాబితా ఇదీ..

- ✦ మొఫీదా అహ్మద్ (1957- కాంగ్రెస్)
- ✦ జోహ్రాబెన్ అక్బర్‌భాయి చావ్డా (1962-67, కాంగ్రెస్)
- ✦ మైమూనా సుల్తాన్ (1957-67, కాంగ్రెస్)
- ✦ బేగం అక్బర్ జెహాన్ అబ్దుల్లా (1977-79, 1984-89, నేషనల్ కాన్ఫరెన్స్)
- ✦ రషీదా హక్ (1977-79, కాంగ్రెస్)
- ✦ మొహసినా కిద్వాయ్ (1977-89, కాంగ్రెస్)
- ✦ బేగం అబీదా అహ్మద్ (1981-89, కాంగ్రెస్)
- ✦ నూర్ బానో (1996, 1999-2004, కాంగ్రెస్)
- ✦ రుబాబ్ సయదా (2004-09, సమాజ్‌వాదీ పార్టీ)
- ✦ మెహబూబా ముఫ్తీ (2004-09, 2014-19, పీడీపీ)
- ✦ తబస్సుమ్ హసన్ (2009-14, ఎస్పీ, లోక్‌దళ్, బీఎస్పీ ఉమ్మడి అభ్యర్థి)
- ✦ మౌసం నూర్ (2009-19, తృణమూల్ కాంగ్రెస్)
- ✦ కైజర్ జహాన్ (2009-14, బహుజన్ సమాజ్ పార్టీ)
- ✦ మంతాజ్ సంఘమిత (2014-19, తృణమూల్ కాంగ్రెస్)
- ✦ సజ్దా అహ్మద్ (2014-24, తృణమూల్ కాంగ్రెస్)
- ✦ రానీ నారాహ్ (1998-2004, 2009-14, కాంగ్రెస్)
- ✦ నుస్రత్ జహాన్ రుహీ (2019-24, తృణమూల్ కాంగ్రెస్)
- ✦ ఇక్రా హసన్ (2024 నుంచి, సమాజ్‌వాదీ పార్టీ)



అవును.. ఆమెకిద్దరు!

శిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లా కున్హత్ గ్రామానికి చెందిన సునీతకు ప్రదీప్, కపిల్ నేగీ అనే ఇద్దరు సోదరులతో ఇటీవల వివాహం జరిగింది. ప్రదీప్ ప్రభుత్వ ఉద్యోగి కాగా.. కపిల్ విదేశాల్లో పనిచేస్తున్నాడు. మూడు రోజులపాటు సాగిన పెళ్లి వేడుకకు పెద్దసంఖ్యలో బంధువులు హాజరయ్యారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది సోదరులు ఒకే మహిళను పెళ్లాడే 'జోడీదారా' సంప్రదాయం ఈ పర్వత ప్రాంత రాష్ట్రంలో ఇప్పటికీ ఉంది. దీన్ని 'జజ్‌దా'గానూ పిలుస్తారు. ఆ మహిళకు పుట్టే పిల్లలకు భర్తల్లో పెద్ద సోదరుడు తండ్రిగా వ్యవహరిస్తారు. హిమాచల్ ప్రదేశ్ - ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతాల్లో హట్టీ అనే తెగ దాదాపు 450 గ్రామాల్లో విస్తరించి ఉంది. ఈ తెగలో శతాబ్దాలుగా జోడీదారా సంప్రదాయం ఉంది. కాలక్రమేణా చట్ట ప్రకారం నిషేధం విధించినా చాటుమాటుగా ఈ పెళ్లిళ్లు జరుగుతూనే ఉన్నాయి. పూర్వీకుల భూమి మరింత విభజనకు గురికాకుండా చూడటమే ఈ సంప్రదాయం వెనుక ఉన్న అసలు కారణమని హట్టీ తెగ నాయకుడైన కుందన్‌సింగ్ శాస్త్రి తెలిపారు.

30 వేల పాములు పట్టిన స్నేక్‌మ్యాన్

ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపుర్ జిల్లా పతుల్కి గ్రామానికి చెందిన సూరజ్‌కుమార్ బింద్‌ను స్థానికులు ముద్దుగా 'స్నేక్‌మ్యాన్' అని పిలుస్తారు. గ్రామంలో ఎవరి ఇంట్లోకి పాము వచ్చినా సూరజ్‌కు పిలుపు వెళుతుంది. ఎంతటి విషపూరిత పామునైనా సరే ఇట్టే పట్టుకొని అడవిలో క్షేమంగా వదిలేస్తాడు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకొంటున్న సూరజ్‌కు చిన్నప్పుడు పాము కాటు వేసింది. అప్పటినుంచీ పాములను పట్టుకోవడం అలవాటైంది. వర్షాకాలంలో ఈ పనిలో మరింత బిజీగా ఉంటాడు. ఇలా గత పద్నాలుగేళ్లలో ఇప్పటివరకు 30 వేలకు పైగా పాములను పట్టినట్లు సూరజ్ తెలిపాడు.



2 లక్షల మొక్కలు నాటిన విజయ్



ఈటీవీ భారత్: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాకు చెందిన విజయ్ జెనా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గత 24 ఏళ్లలో ఏకంగా 2 లక్షలకు పైగా మొక్కలను నాటారు. భువనేశ్వర్‌లో ఆదాయపుపన్ను శాఖ తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న విజయ్ 2001లో మొక్కలు నాటడం ప్రారంభించారు. ఈయన సంకల్పానికి కుటుంబం కూడా అండగా నిలుస్తోంది. సొంత డబ్బుతో నర్సరీలో మొక్కలు పెంచుతూ, వాటిని పలు ప్రదేశాల్లో విజయ్ నాటుతున్నారు. బాలేశ్వర్‌తోపాటు భువనేశ్వర్ పరిసరాల్లోనూ రోడ్ల పక్కన, ప్రభుత్వ భూముల్లో, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటుతున్న విజయ్‌ను అందరూ 'ట్రీ మ్యాన్' అని పిలుస్తారు. మొక్కలు నాటేందుకు ఉపయోగించే ప్రత్యేక వాహనంలో పార, గునపం, కొన్ని మొక్కలు, చిన్న నీటిట్యాంకు ఉంటాయి. నాటిన మొక్కలను పశువులు తినేయకుండా కంచె కూడా ఏర్పాటు చేస్తారు. ఇలా గత రెండు దశాబ్దాల్లో విజయ్ నాటిన మొక్కలు కొన్ని ఇప్పుడు మహావృక్షాలుగా ఎదిగాయి. ఈయన మొక్కలు నాటిన అన్ని ప్రదేశాలను సర్వే చేసిన ఒడిశా అటవీశాఖ ప్రత్యేక అవార్డుతో సత్కరించింది. విజయ్ కృషిని చూసి మిత్రులు, కొన్ని సంస్థలవారు ఆర్థికంగా మద్దతునిస్తున్నారు.

10.6 కిలోల కణితిని తొలగించిన దిల్లీ వైద్యులు



ఈటీవీ భారత్: దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యులు ఒక వ్యక్తి కడుపులో నుంచి 10.6 కిలోల భారీ కణితిని తొలగించారు. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆస్పత్రికి రాగా.. పరీక్షించిన వైద్యులు కడుపులో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. వర్ధమాన్ మహావీర్ వైద్య కళాశాల, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యబృందం తీవ్రంగా శ్రమించి రోగి కడుపు నుంచి జీర్ణాశయాంతర కణితిని విజయవంతంగా తొలగించారు. గత 8 నెలలుగా రోగి ఈ సమస్యతో బాధపడుతూ నడవటానికి కూడా ఇబ్బంది పడినట్లు వైద్యులు తెలిపారు. భారీ పరిమాణంలో ఉన్న కణితి శరీరంలోని మిగతా అవయవాలపై కూడా ప్రభావం చూపడం మొదలుపెట్టిందన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇలాంటి కణుతులను అలాగే వదిలేస్తే ప్రాణాలకే ప్రమాదమని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి డైరెక్టరు డాక్టర్ సందీప్ బన్సాల్ అన్నారు. ఇవి జీర్ణాశయ పేగు మార్గంలో ఏర్పడే అరుదైన క్యాన్సర్ కణుతులని తెలిపారు.

విభేదాలు ఉండొచ్చు గానీ వైరం ఎందుకు?: ధన్‌ఖడ్

దిల్లీ: రాజకీయ పార్టీలు అర్థవంతమైన, గంభీరమైన చర్చలు సాగించాలని, పార్లమెంటేరియన్లు తమకు తగని పదాలను వాడకూడదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ హితవు పలికారు. రాజ్యసభ ఇంటర్న్‌ల బృందాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. "రాజకీయ పక్షాలు సామరస్యంతో మెలగాలి. ఒక అంశాన్ని మెరుగుపరిచేందుకు చేసే సూచనల్ని ఖండనలుగానో, విమర్శలుగానో చూడరాదు. నిర్మాణాత్మక విమర్శల్ని పార్టీలు స్వీకరించాలి. టీవీ చర్చలు విని చెవులు మోతెక్కిపోయాయి. అభిప్రాయాల్లో భేదాలు ఉండడంలో తప్పులేదు.. గుండెల్లో పగ ఎందుకు? పరస్పర గౌరవంతో వ్యవహరించాలని రాజకీయ పార్టీలకు నా విజ్ఞప్తి. టీవీ చర్చల్లో గానీ, ఒక పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేటప్పుడు గానీ తగని భాష వాడొద్దు. ఈ సంస్కృతి మన నాగరికతలో భాగం కాదు. రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనూ అర్థవంతమైన చర్చలు జరగాలి. మన దృక్కోణాన్ని విశ్వసిస్తూనే అవతలివారి అభిప్రాయాన్ని గౌరవించాలి" అని ధన్‌ఖడ్ చెప్పారు.

ముస్లింలు తమ ఓటు బ్యాంకుగా కొనసాగాలనే వక్ఫ్ చట్టానికి ప్రతిపక్షాలు వ్యతిరేకం: రిజిజు

దిల్లీ: ముస్లింలు తమ ఓటు బ్యాంకుగా కొనసాగాలనే లక్ష్యంతోనే వక్ఫ్ సవరణ చట్టాన్ని కాంగ్రెస్, ఇతర పార్టీలు తప్పుబడుతున్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలను నమ్మదని.. అందరికీ న్యాయమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదని వ్యాఖ్యానించారు. 'ప్రపంచంలోనే అత్యధికంగా 9.70 లక్షలకుపైగా వక్ఫ్ ఆస్తులు భారత్‌లో ఉన్నాయి. వాటిని ఏర్పాటు చేసిన ఉద్దేశం నెరవేరేలా.. వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. ముస్లిం సమాజం, ముఖ్యంగా పేదల సంక్షేమానికి ఈ ఆస్తులు ఉపయోగపడేలా వక్ఫ్ బోర్డులను నిర్వహించాల్సి ఉంది' అని ఓ వార్తాసంస్థతో రిజిజు పేర్కొన్నారు.

అవుతారా.. ఇంటెలిజెన్స్ ఆఫీసర్?

దేశంలో ప్రభుత్వ పరంగా జరిగే నియామకాల్లో ముఖ్యమైన వాటిలో కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఒకటి. ఈ విభాగంలో సాధారణ డిగ్రీ విద్యార్హతతో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు పోటీ పడొచ్చు. ఇటీవలే 3717 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పరీక్ష, ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు లెవెల్-7 వేతన శ్రేణితో మొదటి నెల నుంచే సుమారు రూ.లక్ష జీతం పొందవచ్చు. ఎస్ఎస్‌బీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ పరీక్షల సన్నద్ధతతోనే ఈ పరీక్షనూ ఎదుర్కోవచ్చు.



ఎక్కువమంది యువత పోటీ పడుతోన్న ఉద్యోగాల్లో ఇంటెలిజెన్స్ ఆఫీసర్ ఒకటి. సామాజిక గుర్తింపు, హోదా, ఆకర్షణీయ వేతనం, వృత్తిపరమైన సవాళ్లు, వాటి ద్వారా లభించే సంతృప్తి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం.. ఇవన్నీ ఈ ఉద్యోగంపై ఆసక్తి పెంచుతున్నాయి. ఎక్కువ పోస్టులు ప్రకటించడం అభ్యర్థులకు ఎంతో కలిసొచ్చే అంశం. తాజా గ్రాడ్యుయేట్లు సైతం ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మొదటిసారే ఉద్యోగ సాధనతో మెరిసిపోవచ్చు. టైర్-1, టైర్-2 పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ప్రతిభతో తుది నియామకాలుంటాయి. ఇలా అవకాశం వచ్చినవారికి రూ.44,900 మూలవేతనంతోపాటు డీఏ, ఎస్ఎస్ఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రయోజనాలూ దక్కుతాయి. వీరు సుమారు రూ.లక్ష వేతనం మొదటి నెల నుంచే అందుకోగలరు.

పరీక్షలు ఇలా

రాత పరీక్షలో రెండు పేపర్లుంటాయి. టైర్-1 పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, టైర్-2 డిస్క్రిప్టివ్‌గానూ ఉంటుంది.

టైర్-1: ఇందులో 5 విభాగాల నుంచి వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్/లాజికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ ఒక్కో విభాగంలో 20 చొప్పున ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి ఒక గంట.

టైర్-2: దీనికి 50 మార్కులు. ఇందులో ఎస్సే 20 మార్కులకు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌కు 10 మార్కులు. కరెంట్ అఫైర్స్, ఎకనామిక్స్, సోషియో పొలిటికల్ ఇష్యూస్‌ల్లో రెండు వ్యాసరూప ప్రశ్నలు. ఒక్కో దానికి 10 చొప్పున వీటికి 20 మార్కులు. వ్యవధి ఒక గంట.

ఇంటర్వ్యూ: వంద మార్కులకు. ఇందులో భాగంగా సైకోమెట్రిక్/ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహిస్తారు.

ఎంపికవ్వాలంటే?

టైర్-1 పరీక్షలో అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యుఎస్ 35, ఓబీసీ 34, ఎస్సీ, ఎస్టీలు 33 మార్కులు పొందాలి. ఇలా కనీస మార్కులు పొందినవారి జాబితా నుంచి ఆ విభాగాల వారీ ఉన్న ఖాళీలకు పది రెట్ల సంఖ్యలో అభ్యర్థులను టైర్-2కి ఎంపిక చేస్తారు. టైర్-2లో కనీసం 17 మార్కులు పొందడం తప్పనిసరి. ఇందులో అర్హత పొందినవారి జాబితాకు వారు టైర్-1లో పొందిన మార్కులను కలుపుతారు. ఈ మార్కుల మెరిట్‌తో విభాగాల వారీ ఖాళీలకు ఐదు రెట్ల సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. తుది నియామకాలు టైర్-1, టైర్-2, ఇంటర్వ్యూల్లో సాధించిన మొత్తం మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి.

ముఖ్య సమాచారం

ఖాళీలు: 3717
అర్హత: ఏదైనా డిగ్రీ. దివ్యాంగులకు అవకాశం లేదు.
వయసు: 10.08.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు. భర్త చనిపోయిన, విడాకులు పొంది తిరిగి పెళ్లి చేసుకోని జనరల్ మహిళలైతే 35 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీలైతే 40 ఏళ్ల వయసు వరకు మినహాయింపు.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 10.08.2025
పరీక్ష ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ రూ.550. యూఆర్, ఈడబ్ల్యుఎస్, ఓబీసీ రూ.650. **పరీక్ష తేదీలు:** ప్రకటించలేదు. సమాచారం అభ్యర్థుల ఈ-మెయిల్‌కు అందుతుంది.
వెబ్‌సైట్: https://www.mha.gov.in/en

మెలకువలు

- పోటీ పరీక్ష ఏదైనప్పటికీ ప్రాథమికాంశాలకే తొలి ప్రాధాన్యం. అందులో రాణిస్తేనే మిగిలినవి సులువుగా నేర్చుకోవడానికి వీలవుతుంది. అందువల్ల సన్నద్ధతను వీటితోనే ప్రారంభించాలి.
- ఐబీ పాత ప్రశ్న పత్రాలను నిశితంగా పరిశీలించాలి. దీంతో ప్రశ్నలు ఏ స్థాయిలో వస్తున్నాయి, వాటిని ఎదుర్కోవడానికి ఎలా సన్నద్ధం కావాలో తెలుస్తుంది.
- ఎస్ఎస్‌సీ, రైల్వే, ఐబీపీఎస్.. పాత, మాదిరి ప్రశ్నపత్రాలూ అధ్యయనంలో ఉపయోగమే.
- అసలు పరీక్ష ప్రకారం కనీసం 10 మాక్ టెస్టులు రాయాలి. తప్పులు సమీక్షించుకుని, పునరావృతం కాకుండా చూసుకోవాలి. పరీక్షల వారీ స్కోరు మెరుగుపడేలా చూసుకోవాలి.
- రుణాత్మక మార్కులు ఉన్నందున పరీక్ష రాసినప్పుడు తెలియని ప్రశ్నలు వదిలేయాలి. అలాగే ఎక్కువ సమయం తీసుకునే వాటిని చివరలోనే ప్రయత్నించాలి.

- ప్రతి విభాగం లోనూ అంశాల వారీ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి. అనంతరం ఆ అంశంలో మాక్ టెస్టులు రాయాలి. స్కోరు సంతృప్తికరంగా ఉంటే మరో అంశంలోకి వెళ్లాలి. ఇలా అన్ని విభాగాల్లో ఉన్న అన్ని అంశాల్లోనూ మెరుగుపడాలి.

ప్రశ్నకు 36 సెకన్లే!

టైర్-1లో వంద ప్రశ్నలకు ఒక గంట. అంటే ప్రతి ప్రశ్నకు 36 సెకన్ల సమయమే లభిస్తుంది. కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, ఇంగ్లిష్‌లను వీలైనంత తక్కువ సమయంలో పూర్తిచేసుకోవాలి. ఇలాచేస్తేనే న్యూమరికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల్లో గరిష్ఠ ప్రశ్నలకు జవాబు గుర్తించే అవకాశం దక్కుతుంది. రుణాత్మక మార్కులున్న పరీక్షల్లో విజయాన్ని నిర్ణయించేది.. ఎన్ని ప్రశ్నలకు సమాధానం గుర్తించామనేది కాదు. తప్పులు లేకుండా 60 శాతం ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించినవారే విజేత కాగలరు.

టైర్-2లో అభ్యర్థి పరిజ్ఞానం, ఆంగ్ల నైపుణ్యం పరిశీలిస్తారు. విశ్లేషణాత్మకంగా రాయగలిగే నేర్పు ఉండాలి. రాత నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి. తాజా పరిణామాలపై నిపుణులు రాసిన వ్యాసాలు అధ్యయనం చేయాలి. పరీక్ష ఇంటెలిజెన్స్ బ్యూరో కాబట్టి సెక్యూరిటీ (సోషల్, సైబర్), టెర్రరిజం, క్రైమ్, బోర్డర్ సమస్యలు... ఈ అంశాల్లో వచ్చిన వ్యాసాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ద హిందూ/టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్ పేజీలు చదడం మేలు. ఆ తర్వాత వ్యాసంలో ముఖ్యాంశాలను సొంతంగా రాసి, తప్పులు సరిదిద్దుకోవాలి.

డేటాసైన్స్‌తో ఏ అవకాశాలు?

బీఎస్సీ డేటాసైన్స్ చేశాను. దీంతో ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? ఎన్ఐటీలు, ఐఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు చేయాలంటే ఏ విద్యార్హతలుండాలి? – సంధ్య

■ బీఎస్సీ డేటా సైన్స్ డిగ్రీ పూర్తి చేసినవారికి ఐటీ కంపెనీలు, బ్యాంకింగ్ రంగం, ఈ-కామర్స్ సంస్థ, హెల్త్‌కేర్ సంస్థల్లో డేటా అనలిస్ట్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, డేటా ఇంజినీర్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ లాంటి ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఎస్‌క్యూఎల్, ఎంఎస్ ఎక్సెల్, పైథాన్, పవర్ బీఐ, టాబ్ల్యూల్లో ప్రావీణ్యం ఉంటే త్వరగా ఉద్యోగం పొందే అవకాశం ఉంటుంది. డేటా సైంటిస్ట్‌గా మెషిన్ లెర్నింగ్ మోడల్స్ రూపొందించేందుకు పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్‌ల్లో నైపుణ్యం అవసరం. డేటా ఇంజినీర్‌గా రాణించాలంటే హడూప్, స్పార్క్, ఏడబ్ల్యుఎస్, అజూర్ లాంటివి నేర్చుకోవాలి.

ఉన్నత విద్యావకాశాల విషయానికి వస్తే.. డేటా సైన్స్, ఏఐల్లో ఎమ్మెస్సీ లేదా పీజీ డిప్లొమా చేయవచ్చు. ఆసక్తి ఉంటే బిజినెస్ అనలిటిక్స్‌తో ఎంబీఏ చదవొచ్చు ఎమ్మెస్సీ తర్వాత గేట్ రాసి ఎంటెక్‌లోనూ చేరొచ్చు. పైన పేర్కొన్న విద్యార్హతలతో పాటు గిట్ హబ్ పోర్ట్‌ఫోలియో, గూగుల్ డేటా అనలిటిక్స్, ఐబీఎం డేటాసైన్స్ లాంటి సర్టిఫికేషన్లు పొందడం అదనపు అర్హత అవుతుంది.



ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ

ఐఐటీ, ఎన్ఐటీల్లో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ప్రోగ్రాంలో బీఎస్సీ, ఎమ్మెస్సీలను కలిపి పూర్తి చేయొచ్చు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఎర్త్ సైన్సెస్, కంప్యూటింగ్, స్టాటిస్టిక్స్ లాంటి సబ్జెక్టుల్లో ఈ ప్రోగ్రాం ఉంటుంది. మొదటి మూడు సంవత్సరాలూ బీఎస్సీ స్థాయిలో ప్రాథమిక జ్ఞానం, తర్వాత రెండేళ్లు పీజీ స్థాయిలో లోతైన పరిజ్ఞానం నేర్పిస్తారు. ఈ ప్రోగ్రాం పూర్తిచేసినవారికి డీఆర్‌డీఓ, ఇస్రో, బార్క్, సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థల్లో, ఇతర ప్రభుత్వ పరిశోధన సంస్థల్లో, ప్రైవేటు ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో, ఐటీ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఐఐటీల్లో ఈ ప్రోగ్రాం చదవాలంటే ఇంటర్మీడియట్ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా, ఎన్ఐటీల్లో చదవాలంటే జేఈఈ మెయిన్స్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేశాక జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్) ద్వారా ఐఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో నాలుగో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందవచ్చు. ఎన్ఐటీల్లో రెండు సంవత్సరాల ఎమ్మెస్సీ చేయడానికి కూడా జామ్‌లో మెరుగైన ర్యాంకు పొందాలి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

స్మార్ట్ ఫోన్లలో ఏ ఆపరేటింగ్ సిస్టమ్?

కంప్యూటర్ ఆప్టిట్యూడ్/అవేర్‌నెస్/ ప్రొఫిషియెన్సీ అవగాహన పోటీ పరీక్షలు రాసేవారికి తప్పనిసరి. ఈ విభాగంలో ఎలాంటి పరిజ్ఞానం పెంచుకోవాలో పరిశీలిద్దాం.



కంప్యూటర్లలో కంటితో చూడగలిగి, చేతితో తాకగలిగిన భాగాలు హార్డ్‌వేర్. ఆ హార్డ్‌వేర్ పరికరాలను పని చేయించటానికీ, నియంత్రించడానికీ అవసరమైన ప్రోగ్రామ్‌ల సముదాయం సాఫ్ట్‌వేర్. ఈ అవగాహన విద్యార్థులకు ఉండాలి.

సాఫ్ట్‌వేర్‌లలో రెండు రకాల గురించి తెలుసుకోవాలి.

▼ ఆపరేటింగ్ సిస్టమ్స్, లాంగ్వేజ్ ప్రాసెసర్లు, యుటిలిటీ ప్రోగ్రాములు సిస్టమ్ సాఫ్ట్‌వేర్ విభాగానికి చెందినవి.

▼ ఒక ప్రత్యేకమైన పని కోసం మనం ఇచ్చిన డేటాను తీసుకొని, ప్రాసెస్ చేసి ఫలితాన్నిచ్చేది అప్లికేషన్ సాఫ్ట్‌వేర్.

ఒక్కొక్క అప్లికేషన్ కోసం దానికి అనుకూలమైన, ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ తయారవుతుంది. వీటి మధ్య తేడాలూ, అవి పనిచేసే విధానాలను అభ్యర్థులు గ్రహించాలి.

యుటిలిటీ సాఫ్ట్‌వేర్: కొన్ని యుటిలిటీ ప్రోగ్రామ్‌లను తరచుగా సిస్టమ్ సాఫ్ట్‌వేర్ కింద వర్గీకరించినప్పటికీ, నిర్దిష్ట పనుల కోసం ఉపయోగించినప్పుడు వాటిని అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌గా కూడా పరిగణిస్తారనేది మరచిపోకూడదు.

కింది వాటిలో కంప్యూటర్ కార్యకలాపాలను నియంత్రించడానికి రూపొందించినది ఏది?
ఎ) అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ బి) సిస్టమ్ సాఫ్ట్‌వేర్
సి) యుటిలిటీ సాఫ్ట్‌వేర్ డి) యూజర్ జవాబు: బి

ఆపరేటింగ్ సిస్టమ్స్: వివిధ ఆపరేటింగ్ సిస్టమ్స్ అయిన ఎం.ఎస్. డాస్, మైక్రోసాఫ్ట్ విండోస్, మాక్ ఓఎస్, లినక్స్, సోలారిస్, సింబయాన్, ఆండ్రాయిడ్ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్, ఐఓఎస్ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌ల గురించీ, అవి ఏ రకమైన కంప్యూటర్లలో వినియోగిస్తారో, వాటి లక్షణాలూ, వాటి లోపాలపై అవగాహన అవసరం.

ఈ ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను పరిశీలిస్తే..
▼ విండోస్ పర్సనల్ కంప్యూటర్లలో
▼ మాక్ ఓఎస్ ఆపిల్ కంప్యూటర్ సిస్టమ్స్‌లో ఉపయోగిస్తారు.
▼ లినక్స్.. సర్వర్లు, సూపర్ కంప్యూటర్లలో
▼ సింబయాన్.. స్మార్ట్ ఫోన్లలో
▼ ఆండ్రాయిడ్‌ను టచ్ స్క్రీన్ మొబైల్స్‌లో
▼ ఐఓఎస్‌ను కేవలం ఐ ఫోన్‌లలో ఉపయోగిస్తారు.

ఈ విషయాలను గుర్తుంచుకొని, పరీక్షల్లో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలను ఇవ్వాలి.

– డా. చెన్నంశెట్టి రమేష్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

మోషన్ గ్రాఫిక్స్
సంస్థ: బనానా థ్రెడ్స్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, యానిమేట్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.4,000-5,000
☛ https://shorturl.at/hmFvB

మార్కెటింగ్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: కల్చర్ ఫ్రీ
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ ఇంటరాక్షన్, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, సేల్స్, వెండర్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.2,000-5,000
☛ https://shorturl.at/Rh0Wj

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 13

జూనియర్ ఆర్కిటెక్ట్/ అసిస్టెంట్
సంస్థ: హెచ్‌జీసీ ఆర్కిటెక్చర్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ 3డీస్ మ్యాక్స్, ఆటోడెస్క్ రెవిట్, గూగుల్ స్కెచప్, లుమియన్
స్టైపెండ్: రూ.2,500-10,000
☛ https://shorturl.at/qLWOM

ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్
సంస్థ: యాప్‌వెర్సల్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, నెట్‌వర్కింగ్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.9,000-18,000
☛ https://shorturl.at/5N2uj

ఐటీ హెచ్ఆర్, అడ్మిన్ అండ్ కోఆర్డినేటర్
సంస్థ: టెల్లిస్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, హ్యూమన్ రిసోర్సెస్, జావాస్క్రిప్ట్, టైమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.5,000-8,000
☛ https://shorturl.at/mxU1d

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: టీమర్స్ నైపుణ్యం: మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,000-1,500
☛ https://shorturl.at/G5C2k

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్
సంస్థ: కార్ట్అండ్‌బై డాట్ ఇన్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.5,000-6,000
☛ https://shorturl.at/GimPu


సేల్స్
సంస్థ: మీడియాబుల్ మార్కెటింగ్ ప్రై.లి.
నైపుణ్యాలు: కేన్వా, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.3,000-6,000 (వారానికి)
☛ https://shorturl.at/ymFQx

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 15

మాట్లాడకు.. నిర్మించు!

రాజ్ షామానీ రచించిన 'బిల్డ్, డోంట్ టాక్' నేటితరం యువతకు కనువిప్పు నిచ్చే పుస్తకం. ముఖ్యంగా విద్యార్థులకు ఇదో ఆచరణాత్మక మార్గదర్శి.

తరగతి గది విద్య మనకు సిద్ధాంతాలను నేర్పుతుంది కానీ నిజ జీవితంలో విజయం సాధించడానికి అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను అందివ్వదు. ఈ లోటును పూరించడానికి షామానీ ఆర్థిక నిర్వహణ, నెట్‌వర్కింగ్, నిర్ణయం తీసుకోవడం, వ్యక్తిగత పరివర్తన లాంటి కీలకమైన అంశాలు పరిచయం చేశారు.



కేవలం మాట్లాడటం లేదా ఆలోచించడం కంటే కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చాలామంది యువతీ యువకులు తమ లక్ష్యాల గురించి అనర్గళంగా మాట్లాడగలరు. కానీ వాటిని సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుంటారు. రచయిత ఈ ధోరణిని ప్రశ్నిస్తూ, నిర్దిష్టమైన ప్రణాళికలు వేసుకోవాలనీ, వాటి అమలుకు వెంటనే పని ప్రారంభించాలనీ సూచిస్తారు. 'బిల్డ్, డోంట్ టాక్' శీర్షికే ఈ పుస్తక ప్రధాన సందేశాన్ని స్పష్టం చేస్తుంది.

విద్యార్థి దశ జీవితంలో భవిష్యత్తుకు పునాది వేసే సమయం. ఈ సమయంలో నేర్చుకున్న పాఠాలు కెరియర్‌ను మలుపు తిప్పుతాయి. ఈ పుస్తకం విద్యార్థులకు కొన్ని ముఖ్యమైన అంశాలను తెలుపుతుంది.

1 ఆర్థిక అక్షరాస్యత: తరగతి గదిలో ఆర్థిక నిర్వహణ గురించి పెద్దగా చర్చించరు. కానీ నిజ జీవితంలో డబ్బును ఎలా నిర్వహించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ పుస్తకంలో బడ్జెట్‌ను ఎలా తయారు చేసుకోవాలి, పొదుపు ఎలా చేయాలి, ఆదా చేసిన డబ్బుతో తెలివైన పెట్టుబడులు ఎలా పెట్టాలి అనే విషయాలను సరళమైన భాషలో వివరిస్తారు. కళాశాల దశ నుంచే ఈ నైపుణ్యాలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడటానికి వీలవుతుంది.

2 నెట్‌వర్కింగ్ ప్రాముఖ్యం: చాలామంది విద్యార్థులు చదువుకే పరిమితమవుతారు. కానీ విజయవంతమైన కెరియర్‌కు బలమైన నెట్‌వర్క్ చాలా అవసరం. ఇదో కళ. విలువైన సంబంధాలను ఎలా ఏర్పరచుకోవాలి, వాటినెలా కొనసాగించాలి అనే విషయాలను ఈ పుస్తకం వివరిస్తుంది. కళాశాల దశలోనే సహవిద్యార్థులూ, అధ్యాపకులూ, నచ్చిన రంగాల్లో కృషి చేస్తున్న నిపుణులతో సంబంధాలు ఏర్పరచుకుంటే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలనూ, వృత్తిపరమైన అభివృద్ధినీ పెంచుతుంది.

3 నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు: జీవితంలో ప్రతి క్షణం ఏదో ఒక నిర్ణయం తీసుకుంటూనే ఉంటాం. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం ముఖ్యం. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం కంటే ఆలోచనాత్మకంగా ఎలా వ్యవహరించాలి, విశ్లేషణ ఎలా చేయాలి, సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అనే విషయాలపై దృష్టి పెట్టాలి. విద్యార్థులు ఈ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే వ్యక్తిగత, వృత్తి జీవితంలో మేటి ఫలితాలు పొందగలరు.

4 నిరంతర అభ్యాసం: నేటి ప్రపంచంలో అన్ని రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. డిగ్రీ పట్టాతోనే ఆగిపోకుండా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యం. స్వీయ-అధ్యయన ప్రాముఖ్యం, వివిధ ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ వనరుల వినియోగాలను ఈ రచన వివరిస్తుంది.

ఆచరణాత్మక సలహాలు

కెరియర్‌ను ఇప్పుడే ప్రారంభించినవారికి ఈ పుస్తకం దిక్సూచి లాంటిది.

▼ **తొందరపాటు వద్దు, నిర్మించుకుంటూ వెళ్ళు:** చాలామంది త్వరగా విజయం సాధించాలని ఆత్రుత పడతారు. కానీ నెమ్మదిగా-స్థిరంగా లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ప్రతి చిన్న విజయాన్నీ ఆస్వాదిస్తూ, నైపుణ్యాలనూ, అనుభవాన్నీ క్రమంగా పెంచుకోవాలి.

▼ **ఓటమిని స్వీకరించు:** కెరియర్ ప్రారంభంలో ఎదురుదెబ్బలు తగలడం సహజం. నిరుత్సాహపడకుండా, వాటి నుంచి నేర్చుకొని ముందుకు సాగాలి. ఓటమిని పాఠంగా భావించాలి. ఆ పాఠాన్ని వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి ఉపయోగించాలి..

▼ **మీ ప్రత్యేకత గుర్తించండి:** ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేకమైన నైపుణ్యం ఉంటుంది. దాన్ని గుర్తించి, మరింత మెరుగుపరుచుకోవడం విజయాన్ని సులభతరం చేస్తుంది. బలాలూ, బలహీనతలను ఎలా గుర్తించాలో, మనలోని ప్రత్యేకతను ఎలా ఉపయోగించాలో ఈ రచన సూచిస్తుంది.

▼ **నమ్మకంగా ఉండండి:** మనపై మనకు నమ్మకం ఉండడం విజయ సాధనకు ముఖ్యం. ప్రతికూల ఆలోచనలను ఎలా అధిగమించాలో, సానుకూల దృక్పథంతో ఎలా ఉండాలో ఈ పుస్తకం ద్వారా నేర్చుకోవచ్చు. ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పాల వల్ల ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చు. రచయిత తన వ్యక్తిగత అనుభవాలనూ, విజేతల కథలనూ ఉదాహరణగా చూపిస్తూ యువతకు ప్రేరణ కలిగిస్తారు.

– రహ్మాన్ & సంపత్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

వీవోసి పోర్ట్ అథారిటీలో ..

తమిళనాడులోని వీవోసీ పోర్ట్ అథారిటీ ఒప్పంద ప్రాతిపదికన 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● అసోసియేట్ కన్సల్టెంట్: 01 ● ప్రొఫెషనల్ ఇంటర్న్: 02
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (సివిల్), ఎంఏ (ఇంగ్లిష్), డిప్లొమా (ఎంసీజే)తో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 30 ఏళ్లు. ఓబీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు అసోసియేట్ కన్సల్టెంట్‌కు రూ.50,000, ప్రొఫెషనల్ ఇంటర్న్‌కు రూ.30,000. **చిరునామా:** కార్యదర్శి, V.O. చిదంబరనార్ పోర్ట్ అథారిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ భవనం, హార్బర్ ఎస్టేట్, ట్యూటికోరిన్- 628 004. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31.07.2025 **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.vocport.gov.in/applications.aspx

ఎగ్జిమ్ బ్యాంక్‌లో ఆఫీసర్లు

ముంబయిలోని ఇండియన్ ఎగ్జిమ్ బ్యాంక్ ఒప్పంద ప్రాతిపదికన 6 ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ. **గరిష్ఠ వయసు:** 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.600. మహిళలకు రూ.100.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.08.2025. **వెబ్‌సైట్:** https://www.eximbankindia.in/careers

ఐఐఐటీడీఎం కాంచీపురంలో నాన్-ఫ్యాకల్టీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) కాంచీపురం వివిధ విభాగాల్లో 27 నాన్-ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 03
● జూనియర్ టెక్నీషియన్: 13
● జూనియర్ అసిస్టెంట్: 11
అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ(కంప్యూటర్ సైన్స్)తో పాటు పని అనుభవం.
వయసు: జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ పోస్టుకు 32 ఏళ్లు, జూనియర్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025
దరఖాస్తు ఫీజు: రూ.500.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌లతో.
వెబ్‌సైట్: https://iiitdm.ac.in/

వాక్-ఇన్స్

టీఎంసీలో స్టాఫ్ నర్సులు

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్ (టీఎంసీ), పంజాబ్ ఒప్పంద ప్రాతిపదికన 20 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ (నర్సింగ్)తో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 35 ఏళ్లు. **వేతనం:** నెలకు రూ.31,000 - రూ.33,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 23.07.2025. **వేదిక:** హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, న్యూ చండీగఢ్, మెడ్‌సిటీ, ఎస్ఏఎస్ నగర్, పంజాబ్. **వెబ్‌సైట్:** https://tmc.gov.in/

మణుగూరులో టీచింగ్ ఖాళీలు

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, మణుగూరులోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్ ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి డెమో, స్కిల్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది.
పోస్టులు: ● టీజీటీ (హిందీ, సంస్కృతం, సోషల్ సైన్స్)
అర్హత: పోస్టును బట్టి బ్యాచిలర్ డిగ్రీ, బీఏ (హ్యూమానిటీస్), పీజీ, బీఎడ్, బీఏఈడీతో పాటు సీటెట్ పేపర్-2లో అర్హత. **వేతనం:** నెలకు రూ.34,125. **వయసు:** 01.04.2025 నాటికి 18-65 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** స్కిల్ టెస్ట్, డెమో టీచింగ్ క్లాస్‌తో. **ఇంటర్వ్యూ తేదీ:** 23.07.2025. **వేదిక:** ఏఈసీఎస్, మణుగూరు, హెచ్‌డబ్ల్యూపీ కాలనీ, అశ్వాపురం. **వెబ్‌సైట్:** https://aecsmanuguru.edu.in/

అప్రెంటిస్‌షిప్

డీఆర్‌డీఓ డీఐబీటీలో అప్రెంటిస్‌లు

మైసూర్‌లోని డీఆర్‌డీవో- డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోడిఫెన్స్ టెక్నాలజీస్.. ఏడాది కాలానికి 20 డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
డిప్లొమా అప్రెంటిస్ ట్రెయినీ: ● మెకానికల్ ఇంజినీరింగ్: 04 ● ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్: 04 **ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ:** ● మెకానికల్: 05 ● ఫిట్టర్: 03 ● ఎలక్ట్రీషియన్: 04 **వ్యవధి:** 12 నెలలు. **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా. **స్టైపెండ్:** డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,000, ఐటీఐ అప్రెంటిస్‌కు రూ.7,000. **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, రిజర్వేషన్‌తో.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా 'డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోడిఫెన్స్ టెక్నాలజీ, డీఆర్‌డీఓ, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సిద్ధార్థ్ నగర్, మైసూర్ చిరునామాకు పంపించాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** 15.08.2025.
వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo/careers

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

ఈనాడు సినిమా

ఇంకొన్ని కథల కోసం..



రామ్‌చరణ్

అగ్ర కథానాయకులు వేగంగా సినిమాలు చేయడంపై దృష్టి పెడుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఆలస్యాలకి ఆస్కారం ఇవ్వడం లేదు. పాన్ ఇండియా ప్రాజెక్టులు నత్తనడకన సాగడం కారణంగా చాలామంది కథానాయకులు కెరీర్‌లో కీలకమైన సమయాన్ని కోల్పోయారు. అందులో రామ్‌చరణ్ ఒకరు. ఇప్పుడు ఆయన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చేస్తున్నారు. ఆ తర్వాత సుకుమార్‌తో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'పెద్ది' పక్కా ప్రణాళికతో చకచకా చిత్రీకరణ చేసుకొంటోంది. ముందు నిర్ణయించిన ప్రకారమే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా చిత్రబృందం పనిచేస్తోంది. ఇకపైన వేగంగా సినిమాలు చేయాలనే వ్యూహంతో ఉన్న రామ్‌చరణ్, కొత్త కథలపై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. ముందుగానే కథల్ని పక్కా చేస్తే, ఆ తర్వాత వేగంగా సినిమాలు చేయడానికి ఆస్కారం ఉంటుందనేది రామ్‌చరణ్ వ్యూహం. అందుకే గత కొన్ని రోజులుగా పలువురు దర్శకులతో కథలపై చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. చేతిలో ఉన్న సినిమాలు పూర్తయ్యేలోపు, ఖరారు చేసిన కొత్త కథలకు సంబంధించి పూర్వ నిర్మాణ పనుల్ని పూర్తి చేయించాలనేది రామ్‌చరణ్ ఆలోచనగా తెలుస్తోంది.

ముచ్చటగా మూడోసారి?

వైవిధ్యమైన కథలతో తెరపై సందడి చేస్తూనే.. నిర్మాతగా కూడా రాణిస్తోంది అందాల తార సమంత. ఇటీవలే ఈమె నిర్మాణ సంస్థలో రూపొందిన 'శుభమ్' మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడామె తన సొంత నిర్మాణంలో రూపొందుతున్న ఓ ప్రాజెక్టులో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని నందిని రెడ్డి తెరకెక్కించనున్నట్లు సమాచారం. 'ప్రస్తుతం ఓటీటీ కథలతో తీరిక లేకుండా గడుపుతోన్న సమంత.. తన రాబోయే ప్రాజెక్టు కోసం సన్నాహాలు మొదలు పెట్టింది. దీని కోసం ఇప్పటికే దర్శకురాలు నందినితో చర్చలు చేస్తోంది. ఈ ప్రాజెక్టును స్వయంగా ఆమె నిర్మించాలని అనుకుంటోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార'ని సమంత సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నందిని, సమంత కలయికలో 'జబర్దస్త్', 'ఓ బేబీ' సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. మరి ముచ్చటగా మూడోసారి వస్తోన్న ఈ కాంబినేషన్ తెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



సమంత

మధ్యతరగతి జీవితాలకు అద్దం పట్టే...

మద్రాస్ మ్యాట్నీ

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!



"మధ్యతరగతి జీవితాలలో ఎలాంటి అద్భుతాలు జరగవు.. వారి లైఫ్ అంతా నిరాశ.. నిస్సహాయతతోనే సాగిపోతుంది.." మిడిల్ క్లాస్ గురించి చెప్పమంటే చాలా మంది ఇలాంటి మాటలే చెప్తూ ఉంటారు. ఇలాంటి వారి ఆలోచనల్ని తిప్పి కొట్టి.. మధ్యతరగతి జీవితాలకు అద్దం పడుతోంది ఓ చిత్రం. మిడిల్ క్లాస్ లైఫ్‌లో కష్టాలు, కన్నీళ్లతో పాటు నవ్వులు.. సరదాలు ఉంటాయని, డబ్బు కన్నా బంధాలకు విలువనిచ్చే వ్యక్తులు ఉంటారని కళ్లకు కట్టినట్లు చూపించింది. పిల్లల కోసం జీవితాన్నే త్యాగం చేసిన ఓ తండ్రి కథను తెరపై ఆవిష్కరించింది. అదే 'మద్రాస్ మ్యాట్నీ' సినిమా.

కథాంశం: ఒక వృద్ధాశ్రమంలో సైన్స్ ఫిక్షన్ కథలు రాసే జ్యోతి రామయ్య అనే రచయిత (సత్యరాజ్) ఉంటారు. ఎన్నో అద్భుతమైన పుస్తకాలు రాసే ఆయనకు.. ఒక రోజు ఆ ఆశ్రమంలోని కొందరు ఓ మధ్యతరగతి వ్యక్తి గురించి పుస్తకాన్ని రాయాలనే సవాల్ విసురుతారు. కానీ మిడిల్ క్లాస్ లైఫ్‌లో బాధలు తప్పా ఏం ఉండవనేది ఆయన అభిప్రాయం. ఈ క్రమంలోనే ఆయన ఓ ఆటోడ్రైవర్ కన్నన్ (కాళీ వెంకట్) కథ రాయాలని నిర్ణయించుకుంటారు. మరి ఆ తర్వాత ఏమైంది? కన్నన్ జీవితాన్ని దగ్గరి నుంచి చూసిన జ్యోతి రామయ్య ఆలోచనలో ఏమైనా మార్పు వచ్చిందా? అనే ఆసక్తికర ప్రశ్నల చుట్టూ 'మద్రాస్ మ్యాట్నీ' సినిమా తిరుగుతుంది. ఈ ఫ్యామిలీ డ్రామాకు కార్తికేయన్ మణి దర్శకుడు. రోషిని హరిప్రియన్, షెల్లీ కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

◆ తన పిల్లలు పెద్ద కలలు కనడానికి తన కలలను పక్కన పెట్టే గొప్ప వ్యక్తి తండ్రి. అతడు చేసే ప్రతి ప్రయాణం.. ప్రతి త్యాగం.. తన కుటుంబం కోసమే. ఈ విషయాన్ని ఎన్నో చిత్రాల్లో చూపించినప్పటికీ.. మరోసారి తండ్రి గొప్పతనాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'మద్రాస్ మ్యాట్నీ'. సాధారణంగా గ్రామీణ నేపథ్యంలో వచ్చే కథలు.. మధ్యతరగతి జీవితాల్ని చూపించే చిత్రాలంటే ప్రేక్షకులకు ఆసక్తి ఎక్కువ. ఆ కోవలోనే రూపొందిన ఈ సినిమా భావోద్వేగాలతో సినీప్రియుల్ని కట్టిపడేస్తుంది. ఇందులో భవిష్యత్తులో పిల్లలు తనలా కష్టపడకూడదని తపన పడే తండ్రి.. ఉన్నదాంట్లోనే సర్దుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చే తల్లి.. ఈ రెండు పాత్రలు సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడిని కదిలిస్తాయి. మిడిల్ క్లాస్ ఆనందాలు, కష్టాలను చూపిస్తున్న ఈ చిత్రాన్ని వీక్షిస్తున్నంతసేపు ఇది మన జీవిత కథే అని అనుకోని వారంటూ ఉండరంటే సందేహమే లేదు. తమని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి తండ్రి పడే కష్టాల్ని చూసి పిల్లలు మారిన విధానం నేటి యువతను ఆలోచింపజేస్తుంది. 'మిడిల్ క్లాస్ లైఫ్‌లో అడ్వెంచర్‌లు ఉండవు. యాక్షన్స్ ఉండవు.. రొమాన్స్ ఉండదు' అంటూ రచయిత పాత్రలో సత్యరాజ్ పలికే సంభాషణలు, కన్నన్ అనే ఓ మధ్యతరగతికి చెందిన ఆటో డ్రైవర్‌గా కాళీ వెంకట్ నటన సినీప్రియుల మనసుల్ని హత్తుకుంటుంది. ప్రేక్షకులకు ఈ ఫ్యామిలీ డ్రామా మంచి అనుభూతిని పంచుతుంది.

సినిమా : మద్రాస్ మ్యాట్నీ (తమిళం, ఇంగ్లిష్ సబ్‌టైటిల్స్‌తో)
జానర్ : ఫ్యామిలీ డ్రామా
ప్లాట్‌ఫామ్ : అమెజాన్ ప్రైమ్ వీడియో

"ప్రతి తరానికీ మన చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతో ఉంది. శ్రీ మహావిష్ణువు దశావతారాల గురించి నేటి తరాలకి తెలియాలనే ప్రయత్నంలో భాగంగానే మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌గా వరుస సినిమాల్ని రూపొందిస్తున్నాం" అన్నారు దర్శకుడు అశ్విన్‌కుమార్. ఈ యానిమేషన్ ఫ్రాంచైజీలో తొలి చిత్రంగా 'మహావతార్: నరసింహ' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో, క్లీమ్ ప్రొడక్షన్స్ పతాకంపై శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించారు. తెలుగులో గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా 'మహావతార్: నరసింహ' విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

మన చరిత్రని చేరువ చేయాలనే...

"దశావతారాల్ని పౌరాణికాలుగా కంటే, మన చరిత్రగానే చూడాలి. ఈ చరిత్రని లార్జర్ దేన్ లైఫ్ స్థాయిలో, ఓ పెద్ద కాన్వాస్‌పై అందరికీ చేరువ చేయాలనే ప్రయత్నంలో భాగంగానే ఈ ఫ్రాంచైజీ ఆలోచన వచ్చింది. యానిమేషన్‌లోనే ఈ సినిమాని నిర్మించాలనే ఆలోచన మొదటి నుంచీ ఉంది. శ్రీమహావిష్ణువు అవతారాలకి సంబంధించిన కథల్ని చెప్పాలంటే యానిమేషన్ అత్యుత్తమమైన మార్గం. నటులు దేవుడి పాత్రల్లో నటిస్తున్నప్పుడు చాలా సవాళ్లు ఎదురవుతుంటాయి. అప్పటివరకూ చేసిన వాళ్ల సినిమాల ఇమేజ్ ఆ పాత్రలపై పడుతుంది. అలా కాకుండా, ఆ పాత్రని పాత్రలాగే చూడాలన్నా, చూపించాలన్నా యానిమేషన్‌లోనే మేలు అని భావించాం".



అశ్విన్‌కుమార్

❑ "లార్జర్ దేన్ లైఫ్ సినిమాలకి పెట్టింది పేరు హోంబలే ఫిల్మ్స్. ఆ సంస్థ మార్గ నిర్దేశకత్వంలో ఈ ప్రాజెక్ట్‌ని చేయడం మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఈ ఫ్రాంచైజీలో పదికి పైగా సినిమాలు రానున్నాయి. చరిత్రతోపాటు, సంస్కృతి, ధర్మాన్ని చూపించే సినిమాలు ఇవి. తదుపరి 'మహావతార్: పరశురాం' సినిమాని తీసుకొస్తాం. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది ఆ చిత్రం. గీతా ఆర్ట్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాల్ని విడుదల చేస్తుండడం ఆనందంగా ఉంది".

❑ "ప్రతి అవతారానికీ ఓ విశిష్టత ఉంది. నరసింహ అవతారం నేటి సమాజానికి, ముఖ్యంగా యువతకి తెలియడం చాలా అవసరం. నరసింహ స్వామి రక్షకుడు. ఆ అవతారాన్ని మేం చూపించిన విధానం ప్రేక్షకుల్లో ఓ కొత్త ఉత్తేజాన్ని నింపుతుందని భావిస్తున్నాం. కథని శాస్త్రాల నుంచే తీసుకున్నాం. సినిమా చేస్తున్నప్పుడు అహోబిలం కూడా వెళ్లాం. ఎన్నో విషయాల్ని తెలుసుకుని చేశాం. స్వామివారి ఆశీర్వాదం మా సినిమాపై ఉంది. ఇప్పటివరకూ వెండితెరపై ఎప్పుడూ చూడని విజువల్స్‌ని ఇందులో ఆస్వాదించనున్నారు ప్రేక్షకులు. ఇందులో యుద్ధ నేపథ్యంలోని సన్నివేశాలు మరింతగా ఆకట్టుకుంటాయి. ఒక విజువల్ వండర్‌గా అన్ని తరాలకీ నచ్చేలా ఉంటుంది".

కలల్ని నెరవేర్చిన సినిమా ఇది



ప్రవీణ, మనోజ్ చంద్ర, ఉష, మోనిక

"స్వతంత్రంగా సినిమా తీయడం... దాన్ని ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లడం వెనక చాలా కష్టం ఉంటుంది. ఈ ప్రయాణం కష్టమైనా ప్రేక్షకుల స్పందన చూశాక ఎంతో తృప్తినిచ్చింది" అన్నారు ప్రవీణ పరుచూరి. ఆమె దర్శకత్వంలో, విజయ ప్రవీణ ఆర్ట్స్ పతాకంపై రూపొందిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రలు పోషించారు. ఉష ముఖ్యభూమిక పోషించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది. దర్శకురాలు ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ "ఒక నమ్మకం చుట్టూ తిరిగే కథే ఇది. సున్నితమైన హాస్యంతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చా. ఈ కథ, అందులోని హాస్యం, పాత్రలకు మంచి స్పందన వచ్చింది. చిత్రసీమలో రాణించాలనుకున్న మనోజ్ చంద్ర, మోనిక, ఉషతో పాటు ఎంతో మంది కలల్ని నెరవేర్చిన సినిమా ఇది. భవిష్యత్తులో వాళ్లకి మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్నా" అన్నారు. మనోజ్ చంద్ర మాట్లాడుతూ "నేను పోషించిన రామకృష్ణ పాత్రకి ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యారు. ఎన్నో సందేశాలు వచ్చాయి. కొత్త నటులైన మా అందరినీ స్వీకరించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రవీణ ఇలాంటి మరెన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు మెహర్‌బాబాతోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

మరో తెలుగు చిత్రంలో ఉపేంద్ర?



ఉపేంద్ర

తాను దర్శకత్వం వహించిన అనువాద చిత్రాలతోనే తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు ఉపేంద్ర. ఆ తర్వాత నేరుగా తెలుగు సినిమాల్లో నటించి అలరించారు. 'కన్యాదానం', 'ఒకే మాట' మొదలుకొని 'సన్నాఫ్ సత్యమూర్తి', 'గని' లాంటి పలు చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం రామ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాలో ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీంతో పాటు ఆయన, మరో తెలుగు కథకి పచ్చజెండా ఊపినట్టు సమాచారం. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్... ఇటీవల ఉపేంద్రని కలిసి కథని వినిపించినట్టు తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ కథకి ఉపేంద్ర ఆమోదం కూడా లభించినట్టు తెలిసింది. రూ.100 కోట్ల అంచనా వ్యయంతో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

'గుడ్ బ్యాడ్ అగ్లీ' దర్శకుడితో మళ్లీ



అజిత్

హీరో అజిత్, దర్శకుడు అధిక్ రవిచంద్రన్ కలయికలో రూపొంది మంచి విజయాన్ని అందుకుంది 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం. ఇప్పుడీ హిట్ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుంది. దీన్ని 'ఏకే 64' (వర్కింగ్ టైటిల్)గా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. దీని గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "నా తదుపరి చిత్రం అజిత్‌తో ఉండనుంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో పోలిస్తే ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉంటుంది. అభిమానులకు 'ఏకే 64'తో మరో ట్రీట్ ఇవ్వబోతున్నామ'ని అన్నారు. ఇందులో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఆమె నటించిన పాత్రల్లో మరొకర్ని ఊహించుకోలేం!



విజయ్ సేతుపతి

విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అందాల తార నిత్యామేనన్ జంటగా 'తలైవాన్ తలైవి' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పరోటా మాస్టర్‌గా విజయ్, అతని భార్యగా నిత్య సందడి చేయనున్నారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విజయ్.. నిత్యతో పనిచేయడం గురించి మాట్లాడారు. "ఒక అద్భుతమైన నటి నిత్య. ఆమె ఎంచుకున్న ప్రతీ పాత్రలోనూ ప్రాణం పెట్టి నటిస్తుంటుంది. ఇప్పటి వరకు ఆమె పోషించిన పాత్రల్లో మరొకర్ని ఊహించుకోలేం. ఇంతకు ముందు మలయాళ చిత్రం '19(1)(ఏ)లో మేమిద్దరం కలిసి నటించాం. ఈ 'తలైవాన్ తలైవి' కథ మా దగ్గరకు వచ్చినప్పుడు.. మేము మరోసారి జోడీగా సందడి చేయడానికి ఇదే సరైన కథ అనిపించింది. నిత్యతో స్క్రీన్‌ను పంచుకోవడం మంచి అనుభవమ"ని అన్నారు.

బాలీవుడ్ దర్శకుడు చంద్ర బరోట్ మృతి



బాలీవుడ్ దర్శకుడు చంద్ర బరోట్ (86) కన్నుమూశారు. గత కొన్ని సంవత్సరాలుగా పల్మనరీ ఫైబ్రోసిస్‌తో పోరాడుతున్న ఆయన ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. 'పురబ్ ఔర్ పచ్చిమ్' చిత్రంతో సహాయ దర్శకుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టారు చంద్ర. దీని తర్వాత 1978లో 'డాన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. బాలీవుడ్ అగ్రహీరో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా అప్పట్లో ఓ కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచింది. అనంతరం 'ఆశ్రిత' అనే బెంగాలీ సినిమాతో సహా పలు హిందీ చిత్రాలను రూపొందించారు. "మరో విషాదకరమైన క్షణం ఇది.. నా ప్రియమైన స్నేహితుడు.. 'డాన్' దర్శకుడు చంద్ర మరణించారు. ఇది మాటల్లో చెప్పలేని నష్టం. మేము కలిసి పని చేశాము కానీ, ఆయన నాకు కుటుంబ స్నేహితుడిగా అందరికంటే ఎక్కువ" అంటూ అమితాబ్‌తో పాటు పలువురు బాలీవుడ్ సినీ ప్రముఖులు చంద్ర మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



త్రిప్తి దిమ్రీ

విభిన్నమైన పాత్రల్లో నటించినప్పుడే చిత్రపరిశ్రమలో నటిగా ఎదుగుదల ఉంటుందని అంటోంది బాలీవుడ్ నాయిక త్రిప్తి దిమ్రీ. 'యానిమల్' సినిమాతో యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ భామ.. కథల ఎంపికలో జోరు చూపిస్తుంది. ఇటీవలే 'స్పిరిట్' సినిమాతో అగ్రహీరో ప్రభాస్ సరసన నటించే అవకాశాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె, సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ధడక్ 2'. షాజియా ఇక్బాల్ తెరకెక్కించిన ఈ ప్రేమకథా చిత్రం ఆగస్టు 1న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా విశేషాలతో మన ముందుకొచ్చింది త్రిప్తి.

నెగిటివ్ పాత్రలు పోషించడానికైనా సిద్ధమే!

"ధడక్ 2'లో నటించే అవకాశం కరణ్ జోహార్ వల్లే వచ్చింది. ఇదొక అద్భుతమైన ప్రేమకథ. ఇందులో నేను కాలేజీ విద్యార్థినిగా నటించా. తరగతి గది సన్నివేశాలను చిత్రీకరించినప్పుడు నా కళాశాల రోజుల్లోకి తిరిగి వచ్చినట్లు అనిపించింది. ఈ సినిమా చిత్రీకరణలోనే నేను.. సిద్ధాంత్ మంచి స్నేహితులమయ్యాం. అందుకే షూట్ అంతా చాలా సరదాగా సాగిపోయింది".

అది నేను టచ్ చేయని జానర్

"నా సినీప్రయాణంలో ఎన్నో ప్రేమ కథలు, కామెడీ చిత్రాల్లో నటించా. కానీ ఇప్పటి వరకు నేను టచ్ చేయని జానరంటే యాక్షన్ మాత్రమే. నాకు ఇలాంటి పాత్రలు చేయడమంటే చాలా ఇష్టం. నా దగ్గరికి ఎప్పుడూ ఈ యాక్షన్ కథలు రాలేదు. కానీ వస్తే మాత్రం నటించే అవకాశాన్ని అస్సలు వదులుకోను. యాక్షన్ పాత్రలు చేయడమంటే మీ శరీరాన్ని ఉపయోగించి భావోద్వేగాలను వ్యక్తపరచడమే. ఈ పాత్రల్లో నటిస్తే నాలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయొచ్చు. అందుకే భవిష్యత్తులో యాక్షన్ దిశగా అడుగులు వేయాలనుకుంటున్నా".

ఇందులో నటించాలనేది కోరిక

"ప్రస్తుతం నటీనటులు కంటెంట్ బాగుంటే.. పాత్రతో సంబంధం లేకుండా నటిస్తున్నారు. నేను కూడా అంతే. నెగిటివ్ పాత్రలు పోషించడానికైనా సిద్ధమే. అప్పట్లో నెగిటివ్ పాత్రలను విలన్లుగా పరిగణించేవారు. కానీ ప్రస్తుతం వీటిని ఎవరైనా పోషించవచ్చు. ఇలాంటి భూమికల్లో ఒదిగిపోవడం సవాలే. కానీ కష్టమైనా కొత్తగా ఏదైనా నేర్చుకోవడానికే ఇష్టపడతా".

నా కెరీర్‌లో గొప్ప విషయమిది

"సినీరంగంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే అద్భుతమైన దర్శకుల సినిమాల్లో నటించే అవకాశం రావడం నా కెరీర్‌లోనే గొప్ప విషయం. భాషతో సంబంధం లేకుండా వేర్వేరు నటులతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. వారందరి నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అవి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం నేను.. షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓ సినిమాలో నటిస్తున్నా. దీంతో పాటు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్'లో కీలక పాత్ర పోషిస్తున్నా. దీన్ని భారీ స్థాయిలో తీర్చిదిద్దుతోంది చిత్రబృందం. ఈ సినిమా కోసం చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా".

ఈనాడు బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ 7 అభ్యంతరాలు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం సమీపంలో ఉన్న తమ ప్లాంట్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ నుంచి 7 అభ్యంతరాలతో కూడిన ఫారం 483 అందినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈనెల 10-18 తేదీల్లో తమ ఫార్ములేషన్ల తయారీ కేంద్రంలో జీఎంపీ, ప్రీ అప్రూవల్ ఇన్‌స్పెక్షన్ (పీఏఐ)ను యూఎస్ఎఫ్‌డీఏ నిర్వహించిందని ఎక్స్ఛేంజీలకు డాక్టర్ రెడ్డీస్ సమాచారమిచ్చింది. అనంతరం 7 అభ్యంతరాలతో ఫారం 483 జారీ చేశారని, నిర్దేశించిన సమయంలోగా వీటిపై సమాధానం ఇస్తామని తెలిపింది. ఆహార, ఔషధ, కాస్మోటిక్ (ఎఫ్‌డీ అండ్ సీ) చట్టం, అనుబంధ చట్టాల్లో ఉల్లంఘనలు ఉంటే, తనిఖీల అనంతరం కంపెనీ యాజమాన్యానికి ఫారం 483ను యూఎస్ఎఫ్‌డీఏ జారీ చేస్తుంది.

2030కి 30% మార్కెట్ వాటా లక్ష్యం

హెచ్ఎంఎస్ఐ ప్రెసిడెంట్ సుత్సుము ఒటాని



దిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన విపణిలో 2030 నాటికి 30% వాటా దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్లు జపాన్‌కు చెందిన దిగ్గజ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ప్రెసిడెంట్ సుత్సుము ఒటాని వెల్లడించారు. ప్రస్తుతం మన దేశంలో హెచ్ఎంఎస్ఐ మార్కెట్ వాటా 27 శాతంగా ఉంది. అంతర్జాతీయ ద్విచక్ర వాహన విక్రయాల్లో సగం (50%) వాటాను దీర్ఘకాలంలో సాధించాలన్నది హోండా లక్ష్యం. మొత్తం ద్విచక్ర వాహన విక్రయాల్లో మహిళల వాటా ప్రస్తుతం 10% మాత్రమేనని, ఈ విభాగంలో విక్రయాలు పెంచుకునేందుకు మంచి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలు అధికంగా చేరుతుండటం ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషించారు. దీర్ఘకాలంలో ద్విచక్ర వాహనాల్లోనూ సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసీఈ) నుంచి విద్యుత్, ఫ్లెక్స్ ఇంధనాలకు మారాలని చూస్తున్నామని తెలిపారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరాలు ఈ విభాగంలో ప్రస్తుతం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని వివరించారు.

● వాహన డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాల ప్రకారం, 2024-25లో దేశంలో మొత్తం ద్విచక్ర వాహనాలు 1,88,77,812 విక్రయమయ్యాయి. 2023-24లో ఈ సంఖ్య 1,75,27,115 మాత్రమే. ఇదే సమయంలో హెచ్ఎంఎస్ఐ విక్రయాలు 40,93,895 నుంచి 47,89,283కు పెరిగాయి. హీరో మోటోకార్ప్ రిటెయిల్ విక్రయాలు 53,97,315 నుంచి 54,45,251కు చేరాయి.

ఐపీఓలు బంపర్ హిట్

జనవరి-జూన్‌లో రూ.45,350 కోట్ల సమీకరణ ● 2024 ఇదే సమయం కంటే 45% అధికం

జనవరి-జూన్‌లో నిధుల సమీకరణ

ఏడాది	ఐపీఓల సంఖ్య	మొత్తం (రూ.కోట్లు)
2024	36	31,281
2025	24	45,350



దిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల ద్వారా కంపెనీలు రూ.45,350 కోట్లు సమీకరించాయి. గతేడాది ఇదే సమయంలో సమీకరించిన రూ.31,281 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం 45% ఎక్కువ. అంతర్జాతీయ వాణిజ్య ఒడుదొడుకులు, భౌగోళిక ఉద్రిక్తతలు, స్థూల ఆర్థిక ఆందోళనలు ఉన్నా, దేశీయంగా ఐపీఓలు రాణించడం గమనార్హం. 2024 జనవరి-జూన్‌లో 36 ఐపీఓలు రాగా.. ఈ సారి ఆ సంఖ్య 24కు పరిమితమైంది. అయితే సమీకరించిన మొత్తం భారీగా పెరిగింది. అంటే పబ్లిక్ ఇష్యూ సగటు పరిమాణం పెరుగుదలను ఇది సూచిస్తోంది. ఈ ఏడాది ద్వితీయార్ధంలోనూ ఐపీఓ మార్కెట్ ఆశావహంగా ఉండొచ్చని.. అప్రమత్తత కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దేశీయ పెట్టుబడుల జోరు, సానుకూల మదుపర్ల సెంటిమెంట్, బలమైన వృద్ధి అంచనాలు ఇందుకు దోహదపడొచ్చని అంటున్నారు.

● ఈ ఏడాది ప్రథమార్ధంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద 118 కంపెనీలు ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. గతేడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 52గా ఉంది.

● మర్చంట్ బ్యాంకర్ల పరంగా ఈ ఏడాది ఇష్యూల పరిమాణం, విలువలో జేఎం ఫైనాన్షియల్ అగ్రస్థానంలో నిలిచింది. 2025-26 ఏప్రిల్-జూన్‌లోనే ఈ సంస్థ నిర్వహించిన 10 ఐపీఓలు రూ.26,838 కోట్లు సమీకరించాయి.

● ఈ ఏడాది జనవరి-జూన్‌లో వచ్చిన 24 మెయిన్‌బోర్డ్ ఐపీఓల్లో 67% షేర్లు ఇష్యూ ధర కంటే ఎక్కువగా నమోదయ్యాయి. సగటున మదుపర్లకు దాదాపు 25% ప్రతిఫలాన్ని అందించాయి.

● ఈ ఏడాది వచ్చిన అతిపెద్ద ఐపీఓల్లో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ.12,500 కోట్లు), హెగ్జావేర్ టెక్నాలజీస్ (రూ.8,750 కోట్లు), స్కోలాస్ బెంగళూరు (రూ.3,500 కోట్లు), ఏథర్ ఎనర్జీ (రూ.2,981 కోట్లు) ఉన్నాయి.

● ఈ నెలలో ఇప్పటివరకు 4 ఐపీఓలు మార్కెట్‌లోకి రాగా.. మరో 5 సంస్థలు నిధుల సమీకరణకు సిద్ధంగా ఉన్నాయి. స్థిరమైన మార్కెట్ కార్యకలాపాలను ఇది సూచిస్తోంది.

24 నుంచి బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీఓ

దిల్లీ: బెంగళూరు, చెన్నై, కొచ్చి, మైసూరు, గిఫ్ట్ సిటీల్లో 9 హోటళ్లకు యజమానిగా బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 24న ప్రారంభమై 28న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.749.6 కోట్లు సమీకరించడానికి సన్నాహాలు చేస్తోంది. యాంకర్ మదుపర్లు ఈనెల 23న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. ఈ ఐపీఓ పూర్తిగా తాజా షేర్ల ఇష్యూగా రానుంది. సమీకరించే నిధుల్లో రూ.468.14 కోట్లను రుణాల చెల్లింపునకు కంపెనీ వినియోగించనుంది. ప్రమోటర్ నుంచి భూమి కొనుగోలుకు రూ.107.52 కోట్లు వెచ్చించనుంది. మిగతా మొత్తాన్ని ఇతర సంస్థల కొనుగోళ్లు, వ్యూహాత్మక కార్యక్రమాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వాడనుంది. ఈ నెల ప్రారంభంలో 360 వన్ ఆల్టర్నేటివ్స్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా కంపెనీ రూ.126 కోట్లు సమీకరించింది. బెంగళూరుకు చెందిన స్థిరాస్తి కంపెనీ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్‌కు అనుబంధ సంస్థగా బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఉంది. ఈ సంస్థ హోటళ్లను మారియట్, అకార్ అండ్ ఇంటర్ కాంటినెంటల్ హోటల్స్ గ్రూప్ వంటివి నిర్వహిస్తున్నాయి.

ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓ

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియాకు చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం ఎన్ఐఆర్ఎల్ ఐపీఓకు రానుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) రెండో త్రైమాసికంలో ఎన్ఐఆర్ఎల్ ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్లు సమీకరించనున్నామని, విస్తరణ ప్రణాళికలకు వీటిని వినియోగించనున్నట్లు ఎన్ఎల్‌సీ ఇండియా సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1.4 గిగావాట్ సామర్థ్యాన్ని 2030కు 10 గిగావాట్‌కు పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2026-27 మొదటి త్రైమాసికంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద కంపెనీ ముసాయిదా పత్రాలు దాఖలు చేయాలని భావిస్తోంది. పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని దాదాపు 7 రెట్లు పెంచేందుకు రూ.50,000-60,000 కోట్ల పెట్టుబడులను ఎన్ఎల్‌సీ ఇండియా పెట్టనుంది. ఇందుకోసం నిధులను ఈక్విటీ, రుణాల ద్వారా సమీకరించాలని చూస్తోంది.

● గుజరాత్‌లోని గాంధీనగర్ కేంద్రంగా ఈపీసీ కార్యకలాపాలు నిర్వహించే ఎస్ఎంఈ సంస్థ శావి ఇన్‌ఫ్రా లాజిస్టిక్స్ ఐపీఓ ఈనెల 21న ప్రారంభమై, 23న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.114-120. ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌పై ఈ షేర్లు నమోదవుతాయి.

కాయిన్‌డీసీఎక్స్‌లో రూ.378 కోట్ల సైబర్ చోరీ

దిల్లీ: దేశీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ కాయిన్‌డీసీఎక్స్‌పై సైబర్ దాడి జరిగింది. ఫలితంగా 44.2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.378 కోట్లు) చోరీకి గురైనట్లు తెలుస్తోంది. వినియోగదారుల నిధులు భద్రంగా ఉన్నాయని, వీటిపై ఎటువంటి ప్రభావం పడలేదని సంస్థ సహవ్యవస్థాపకులు సుమిత్ గుప్తా, నీరజ్ ఖండేల్‌వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించారు. సైబర్ దాడి వల్ల నష్టపోయిన మొత్తాన్ని కాయిన్‌డీసీఎక్స్ భరిస్తుందని, అంతర్గత నిల్వలను ఇందుకు వినియోగిస్తుందని కంపెనీ తెలిపింది. సంస్థ నివేదిక ప్రకారం.. ఈనెల 19న ఉదయం 4 గంటలకు సైబర్ దాడి చోటుచేసుకుంది. భాగస్వామి ఎక్స్ఛేంజీలోని తమ ఖాతాల్లో, ఒకదాంట్లో ధ్రువీకరణ లేని చొరబాటు జరిగిందని కాయిన్‌డీసీఎక్స్ భద్రతా వ్యవస్థలు గుర్తించాయి. ఈ ఘటనలో దాదాపు రూ.378 కోట్ల నష్టం వాటిల్లింది. గతేడాది క్రిప్టో ఎక్స్ఛేంజీ వజీర్‌ఎక్స్‌లో కూడా 230 మి.డాలర్ల సైబర్ చోరీ జరిగిన విషయం తెలిసిందే.

అదానీ సిమెంటేషన్‌తో అంబుజా సిమెంట్స్ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

దిల్లీ: అదానీ సిమెంటేషన్‌తో అంబుజా సిమెంట్స్ విలీన ప్రక్రియకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోద ముద్ర వేసింది. దీంతో అదానీ గ్రూప్ సిమెంట్ వ్యాపారం ఒక గొడుగు కిందకు వస్తుంది. 2024 జూన్‌లో గౌతమ్ అదానీ గ్రూప్, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో భాగమైన అదానీ సిమెంటేషన్, అంబుజా సిమెంట్స్ ఆస్తులను విలీనం చేసి, యాజమాన్యాన్ని పునర్నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రణాళికలో భాగంగానే అదానీ సిమెంటేషన్‌తో అంబుజా సిమెంట్స్ విలీన పథకానికి సంబంధించిన ఉత్తర్వులను ఈ నెల 18న అహ్మదాబాద్ ఎన్‌సీఎల్‌టీ జారీ చేసింది. విలీనం అమలు తేదీ 2024 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుందని తన 70 పేజీల ఉత్తర్వుల్లో ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు అంబుజా సిమెంట్స్ 87 లక్షల షేర్లు

గ్రూప్‌లో అంతర్గతంగా జరుగుతున్న విలీనంలో షేర్ల మార్పిడి (స్వాపింగ్) జరగనుంది. అదానీ సిమెంట్స్‌కు చెందిన 87 లక్షల షేర్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు లభిస్తాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, లక్సెంబర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీలు జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలని అంబుజా సిమెంట్స్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసింది. అంబుజా సిమెంట్స్ గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్‌లు) లక్సెంబర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదయ్యాయి.

● దేశంలో అతి పెద్ద రెండో సిమెంటు తయారీ సంస్థగా అదానీ గ్రూప్ ఉండబోతోంది. 100 మిలియన్ టన్నులకు పైగా వార్షిక ఉత్పత్తి (ఎంటీపీఏ) సామర్థ్యం ఈ గ్రూప్ సంస్థలకు ఉంది. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల విస్తరణ ద్వారా 2026 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 118 ఎంటీపీఏ, 2028 నాటికి 140 ఎంటీపీఏ సామర్థ్యం సాధించాలని కంపెనీ భావిస్తోంది.

వాహన ఎగుమతులు 22% పెరిగాయ్

ఏప్రిల్-జూన్‌పై సియామ్



దిల్లీ: మన దేశం నుంచి ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 14,57,461 వాహనాలు ఎగుమతి అయ్యాయని వాహన తయారీదార్ల సమాఖ్య సియామ్ వెల్లడించింది. 2024 ఇదే కాల ఎగుమతులు 11,92,566తో పోలిస్తే, 22% అధికం.

● కార్ల ఎగుమతులు 1,80,483 నుంచి 13% వృద్ధితో 2,04,330కు చేరాయి. పశ్చిమాసియా, లాటిన్ అమెరికాల నుంచి వీటికి అధికంగా గిరాకీ లభించింది. శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాలతో పాటు జపాన్ నుంచీ గిరాకీ పుంజుకుందని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)తో ఆస్ట్రేలియా వంటి దేశాలకు ఎగుమతులు పెరిగాయని సియామ్ పేర్కొంది.

● ద్విచక్ర వాహన ఎగుమతులు 9,23,148 నుంచి 23% పెరిగి 11,36,942కు చేరాయి.

● వాణిజ్య వాహన ఎగుమతులు 23% వృద్ధితో 19,427కు పెరిగాయి. త్రిచక్ర వాహన ఎగుమతులు 34% పెరిగి 95,796కు చేరాయి.

అగ్రస్థానంలో మారుతీ

మారుతీ సుజుకీ వాహన ఎగుమతులు 69,962 నుంచి 37% వృద్ధితో 96,181కు చేరినట్లు సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (కార్పొరేట్ వ్యవహారాలు) రాహుల్ భారతి తెలిపారు. గత నాలుగేళ్లుగా కార్ల ఎగుమతుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. ఈసారి మొత్తం ఎగుమతుల్లో తమ సంస్థ వాటా 47 శాతానికి పైగా నమోదైందని వెల్లడించారు. మిగిలిన కంపెనీల పరిమాణం 2% తగ్గగా, తమ ఎగుమతుల పరిమాణం 37 శాతానికి పైగా పెరిగిందని వివరించారు.

● హ్యుందాయ్ ఎగుమతులు 42,600 నుంచి 48,140కు పెరిగాయి.

ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 47% వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో మన దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 47% పెరిగి 12.41 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని వాణిజ్య శాఖ తెలిపింది. మన దేశం నుంచి ఎలక్ట్రానిక్స్ ఎక్కువగా ఎగుమతి అయిన దేశాల్లో అమెరికా, యూఏఈ, చైనా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో నెదర్లాండ్స్, జర్మనీ నిలిచాయి. మొత్తం మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో అమెరికా 60.17% వాటాతో అగ్రస్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో యూఏఈ (8.09%), చైనా (3.88%), నెదర్లాండ్స్ (2.68%), జర్మనీ (2.09%) ఉన్నాయి. ఇదే కాలంలో మన రెడీమేడ్ దుస్తుల ఎగుమతులు బి.డాలర్ల నుంచి 4.19 బి.డాలర్లకు పెరిగాయి. రెడీమేడ్ దుస్తుల ఎగుమతుల్లో 34.11% అమెరికాకే వెళ్లాయి. తర్వాత స్థానాల్లో బ్రిటన్ (8.81%), యూఏఈ (7.85%), జర్మనీ (5.51%) ఉన్నాయి.

పన్ను ఎగవేతకే వేదాంతా సెమీకండక్టర్!

వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపణ ● ఖండించిన వేదాంతా గ్రూప్

దిల్లీ: మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంతా గ్రూప్‌పై అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ తన ఆరోపణలు కొనసాగిస్తోంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)గా వర్గీకరణ నుంచి తప్పించుకోవడానికే కమొడిటీల ట్రేడింగ్ సంస్థగా సెమీకండక్టర్ యూనిట్‌ను ఆ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు ఆరోపించింది. రూ.2,500 కోట్ల పన్ను ఎగవేతకే ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని వేదాంతా గ్రూప్ తోసిపుచ్చింది.

● వేదాంతా గ్రూప్ కంపెనీలతో రుణదాతలకు నష్ట భయం పొంచి ఉందని వైస్రాయ్ రీసెర్చ్ ఇటీవల ఆరోపించిన సంగతి విదితమే. వేదాంతా వార్షిక సర్వసభ్య సమావేశానికి (ఏజీఎం) ముందు రోజు వ్యూహాత్మకంగా అప్పట్లో ఆరోపణలు గుప్పించింది. తాజాగా వేదాంతా సెమీకండక్టర్స్ ప్రై.లి. (వీఎస్‌పీఎల్)ను లక్ష్యంగా చేసుకుంది. వీఎస్‌పీఎల్ వ్యాపార కార్యకలాపాలు పారదర్శకంగా, నియంత్రణ సంస్థల నిబంధనలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని వేదాంతా ప్రతినిధి వివరించారు.

కోడి గుడ్లు

21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510	గోదావరి	505
వరంగల్	512	విశాఖపట్నం	540
విజయవాడ	520	చిత్తూరు	543

చమురు కొనొచ్చు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.98,180 కంటే పైన కదలాడితే మరింతగా పెరిగినా, రూ.98,700 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.99,385; రూ.1,00,321 వరకు రాణించొచ్చు. ఒకవేళ రూ.97,764 కంటే దిగువన చలిస్తే రూ.97,079 వరకు దిద్దుబాటు అవుతుందని భావించొచ్చు.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు కిందకు వస్తే రూ.1,10,741 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,08,547కు దిగివచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,15,132 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,17,329 వరకు పెరగొచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి జులై కాంట్రాక్టు రూ.887 కంటే దిగువకు రాకుంటే సానుకూల ధోరణికి ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ రూ.883.05 కంటే కిందకు వస్తే రూ.873.65; రూ.868.80 వరకు దిగిరావచ్చు.

● సీసం జులై కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు. రూ.177.65 వద్ద మద్దతు స్థాయిని కోల్పోతే రూ.176.50; రూ.175.20 వరకు దిద్దుబాటు కావచ్చు.

● జింక్ జులై కాంట్రాక్టు రూ.262.60 కంటే దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్లకు మొగ్గు చూపడం మంచిది. ఈ స్థాయికి పైన ట్రేడయితే లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మేలు.

● అల్యూమినియం జులై కాంట్రాక్టు రూ.253.75 కంటే దిగువన చలించకుంటే కొంత కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. లేకుంటే రూ.254.25 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, రూ.253.75 దిగువన కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయొచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు ఆగస్టు కాంట్రాక్టు రూ.5,869 కంటే దిగువన ట్రేడ్‌కాకుంటే రూ.6,035; రూ.6,188 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.5,550 కంటే దిగువన చలిస్తే రూ.5,397; రూ.5,231 వరకు దిగిరావచ్చు.

● సహజవాయువు జులై కాంట్రాక్టు రూ.289.95 కంటే కిందకు వస్తే రూ.277.05; రూ.265.95 వరకు దిద్దుబాటు కావచ్చు. అదే విధంగా రూ.313.95 కంటే పైకి వెళితే రూ.325.05; రూ.337.95 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఆగస్టు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.13,754 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని మించితే రూ.14,157; రూ.14,564 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.12,944 కంటే దిగువకు వస్తే రూ.12,537; రూ.12,135 వరకు పడిపోవచ్చు.

● పత్తి క్యాండీ జులై కాంట్రాక్టు రూ.56,146 కంటే పైకి వెళితే రూ.56,693; రూ.57,486 వరకు చేరొచ్చు. ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.54,806 వద్ద మద్దతు లభించొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	97,967	98,015	0.05
వెండి (సెప్టెంబరు)	1,13,542	1,12,935	-0.53
రాగి (జులై)	881.35	892.45	1.26
సీసం (జులై)	179.75	178.80	-0.53
జింక్ (జులై)	258.65	265.40	2.61
అల్యూమినియం (జులై)	248.55	252.40	1.55
ముడి చమురు (ఆగస్టు)	5,795	5,703	-1.59
సహజ వాయువు (జులై)	288.20	302.90	5.10
పసుపు (ఆగస్టు)	13,500	13,352	-1.10
పత్తి క్యాండీ (జులై)	54,910	55,600	1.26

కార్పొరేట్ ఫలితాలు.. అమెరికాతో ఒప్పందం

● ఈవారం మార్కెట్లకు ఇవే కీలకం ● విశ్లేషకుల అంచనాలు



నిఫ్టీ-50 సూచీలో 30 శాతానికి పైగా వెయిటేజీ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వెలువరించిన ఫలితాలు.. ఈ వారం వెలువడే ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే, బజాజ్ ఫైనాన్స్ వంటి దిగ్గజాల గణాంకాలు మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం సంబంధిత వార్తలనూ సునిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ-50 సూచీ 24,800-25,500 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈనెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు రూ.5,524 కోట్లు ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాదిలో వారి ఉపసంహరణ మొత్తం రూ.83,245 కోట్లుగా ఉంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **వాహన** కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. స్వల్పకాలంలో ప్రతికూల ధోరణి కనిపించొచ్చు. జూన్ త్రైమాసిక ఫలితాలపై ఆధారపడి షేర్లు కదలాడొచ్చు. రేట్ల కోత జరిగినా, వాహన విక్రయాలు ఇప్పుడే పుంజుకుంటాయన్న అంచనాలు లేకపోవడం నేపథ్యం.

● ఎంపిక చేసిన **యంత్ర పరికరాల** కంపెనీల షేర్లలో కదలికలుంటాయి. షేర్ల ధరలు అధిక స్థాయుల్లో ఉన్నా, ఈ ఏడాదిలో ప్రభుత్వ మూలధన వ్యయాల వల్ల ప్రయోజనం ఉంటుందన్న అంచనాల వల్ల, లాభాల స్వీకరణ జరగకపోవచ్చు. గురువారం సీజీ పవర్, సుప్రీం ఇండస్ట్రీస్ ఫలితాలున్నాయి.

● **టెలికాం** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. సెంటిమెంటు బలహీనంగా ఉండడంతో ఈ షేర్లు కొంత నష్టపోవచ్చు. భారతీ ఎయిర్‌టెల్ రూ.1850-1950 మధ్య కదలాడొచ్చు.

● **ఐటీ** కంపెనీల యాజమాన్యాలు, ఫలితాల అనంతరం చేసే వ్యాఖ్యలు కీలకం కానున్నాయి. బుధవారం ఇన్ఫోసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, కోఫోర్జ్, ఒరాకిల్; గురువారం ఎంఫసిస్ ఫలితాలు వెలువడనున్నాయి.

● ఫలితాలకు ముందు **ఔషధ** షేర్లు సానుకూల ధోరణితో పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. ఆగస్టు 1 నుంచి తాజా టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించినా, దేశీయ బ్రోకరేజీలు ఈ రంగంపై సానుకూలంగానే ఉన్నాయి.

● హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు శనివారం ప్రకటించిన ఫలితాల ఆధారంగా **బ్యాంక్** నిఫ్టీ సూచీ కదలికలు ఉండొచ్చు. 57,100పైకి వెళితే 57500-57600 దిశగా చలించొచ్చు. 56500, 56300 పాయింట్ల వద్ద మద్దతు కనిపిస్తోంది.

● **లోహ** కంపెనీల షేర్లు స్వల్పకాలానికి ఒత్తిడిలోనే కొనసాగొచ్చు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఫలితాల ప్రభావం ఉంటుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద నిర్ణయాలూ కీలకమే. లోహ కంపెనీలు మిశ్రమ పనితీరు కనబరచవచ్చన్న అంచనాలున్నాయి.

● ఎంపిక చేసిన **ఎఫ్ఎంసీజీ** షేర్లలో కదలికలుంటాయి. 31న వెలువడే డాబర్ ఇండియా, హిందుస్థాన్ యునిలీవర్ ఫలితాలతో పాటు ఈ వారం ప్రకటించే కోల్గేట్ పామోలివ్ (22), యునైటెడ్ బ్రూవరీస్ (22), టాటా కన్జ్యూమర్(23), నెస్లే(24) ఫలితాలను మదుపర్లు గమనించొచ్చు.

● అల్ట్రాటెక్ (సోమ), ఏసీసీ (గురు) ఫలితాలను బట్టి ఈ వారం **సిమెంటు** కంపెనీ షేర్ల కదలికలుంటాయి. మధ్య-దీర్ఘకాలానికి బులిష్‌గానే ఇవి కనిపిస్తున్నాయి.

● **చమురు**-గ్యాస్ కంపెనీలు స్వల్పకాలానికి బేరిష్ ధోరణిలో ట్రేడవవచ్చు. ఉత్పత్తి కంపెనీలతో పోలిస్తే చమురు మార్కెటింగ్ కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉండొచ్చు. శుక్రవారం మార్కెట్ తర్వాత వెలువడ్డ ఆర్ఐఎల్ ఫలితాల ప్రభావం ఈ షేర్లపై ఉంటుంది.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	122.25	125.40	120.50
బజాజ్ ఆటో	8347.50	8399.20	8279.20
ఐషర్ మోటార్స్	5627.50	5710.20	5570.20
హీరో మోటోకార్ప్	4396.70	4519.40	4325.80
ఎం అండ్ ఎం	3192.40	3282.30	3131.70
మారుతీ	12419.00	12595.70	12281.70
టాటా మోటార్స్	680.25	689.40	673.40
టీవీఎస్ మోటార్	2849.30	2917.40	2811.00

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5735.50	5854.50	5666.50
కోల్గేట్ పామోలివ్	2394.20	2424.70	2354.70
డాబర్ ఇండియా	522.60	526.50	516.40
ఇమామీ	591.65	600.70	578.10
హిందుస్థాన్ యునిలీవర్	2489.60	2528.70	2461.90
ఐటీసీ	422.75	427.80	417.60
మారికో	720.20	739.50	709.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	250.50	256.60	246.90
సీజీ పవర్	667.60	705.80	647.00
ఎల్ అండ్ టీ	3464.80	3520.30	3422.30
సీమెన్స్	3128.40	3172.80	3082.80
థెర్మాక్స్	3888.40	4002.80	3802.80

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1139.50	1163.10	1124.90
బయోకాన్	398.75	410.00	390.70
సిప్లా	1482.30	1493.80	1464.20
డాక్టర్ రెడ్డీస్	1257.50	1279.20	1240.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	2225.50	2285.40	2164.60
లుపిన్	1932.20	1971.60	1906.80

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1957.40	2013.10	1925.10
ఐసీఐసీఐ బ్యాంక్	1425.80	1441.60	1400.60
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	73.09	74.20	72.20
ఇండస్‌ఇండ్ బ్యాంక్	870.05	884.50	854.10
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2140.50	2183.50	2109.50
పీఎన్‌బీ	113.35	115.50	112.00
ఎస్‌బీఐ	823.35	837.80	813.00

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	675.90	683.70	667.10
హిందుస్థాన్ జింక్	435.50	446.40	425.60
ఎన్ఎండీసీ	71.44	72.90	69.00
సెయిల్	136.45	138.90	132.20
టాటా స్టీల్	162.37	164.40	159.10
వేదాంతా	445.80	451.30	440.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1548.80	1562.90	1522.90
ఇన్ఫోసిస్	1586.10	1607.80	1569.20
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5547.50	5745.20	5316.20
టీసీఎస్	3189.90	3243.70	3160.10
టెక్ మహీంద్రా	1548.90	1589.60	1517.60
విప్రో	266.95	274.50	261.90

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1476.00	1492.30	1460.90
బీపీసీఎల్	343.50	355.00	336.30
హెచ్‌పీసీఎల్	430.60	446.30	421.60
ఐఓసీఎల్	150.06	153.10	147.10
ఓఎన్‌జీసీ	246.31	249.60	241.80
ఆయిల్ ఇండియా	447.90	455.40	441.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1969.90	2002.80	1943.60
అంబుజా సిమెంట్స్	596.70	604.60	587.10
ఇండియా సిమెంట్స్	347.10	358.50	340.10
శ్రీ సిమెంట్	30790.00	31233.30	30503.30
అల్ట్రాటెక్ సిమెంట్	12498.00	12616.00	12382.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,901.00	1927.10	1878.70
ఎమ్‌టీఎన్ఎల్	50.11	51.60	49.20
టాటా కమ్యూనికేషన్స్	1763.80	1871.90	1646.30
వొడాఫోన్ ఐడియా	7.72	7.90	7.60



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

ఇద్దరు సోదరుల వయసుల నిష్పత్తి?

వయసులు

ఇద్దరు వ్యక్తుల వయసుల మధ్య వ్యత్యాసం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుంది. మన నిత్య జీవితంలో వయసుల వివరాలు ఎక్కడో ఒక చోట అవసరం అవుతూనే ఉంటాయి. జననం, చదువు, ఉద్యోగం, పెళ్లి, రిటైర్‌మెంట్, మరణం ఇలా అనేక సందర్భాల్లో వయసును ఉపయోగించాల్సి వస్తుంది. ఇందులో వ్యక్తి వయసు, లేదా వ్యక్తుల వయసుల మొత్తం, భేదం, నిష్పత్తులు తదితరాలను కనుక్కోమని అడుగుతారు. కొన్ని గణిత పరిక్రియలను ఉపయోగించడం ద్వారా ఈ రకమైన సమస్యలను సులువుగా సాధించవచ్చు.

1. మూడు సంవత్సరాల క్రితం తండ్రి వయసు కుమారుడి వయసుకు 7 రెట్లు. ప్రస్తుతం తండ్రి వయసు కుమారుడి వయసుకు 5 రెట్లు. అయితే కుమారుడి వయసు ఎంత?

1) 9 ఏళ్లు 2) 45 ఏళ్లు 3) 8 ఏళ్లు 4) 40 ఏళ్లు

సాధన: కుమారుడి వయసు x అనుకుందాం.

తండ్రి వయసు = 5x

3 సం. క్రితం కుమారుడి వయసు = x – 3

తండ్రి వయసు = 5x – 3

లెక్క ప్రకారం, మూడేళ్ల క్రితం తండ్రి వయసు కుమారుడి వయసుకు 7 రెట్లు.

$\Rightarrow (5x - 3) = 7(x - 3) \Rightarrow 5x - 3 = 7x - 21$

$\Rightarrow -3 + 21 = 7x - 5x \Rightarrow 18 = 2x$

$\frac{18}{2} = x$ ∴ కుమారుడి వయసు 9 సంవత్సరాలు

సమాధానం: 1

2. తండ్రి, కొడుకుల వయసుల మొత్తం 56 సంవత్సరాలు. 4 ఏళ్ల తర్వాత తండ్రి వయసు కుమారుడి వయసుకి 3 రెట్లు. అయితే కుమారుడి వయసు ఎంత?

1) 10 ఏళ్లు 2) 12 ఏళ్లు 3) 14 ఏళ్లు 4) 15 ఏళ్లు

సాధన: కుమారుడి వయసు = x

తండ్రి వయసు = 56 – x

4 సం.ల తర్వాత కుమారుడి వయసు = x + 4

తండ్రి వయసు = 60 – x

లెక్కప్రకారం, $3(x + 4) = 60 - x$

$3x + 12 = 60 - x \Rightarrow 3x + x = 60 - 12 \Rightarrow 4x = 48$

$x = \frac{48}{4} = 12$ ఏళ్లు

సమాధానం: 2

3. ఇద్దరు సోదరుల ప్రస్తుత వయసుల నిష్పత్తి 1 : 2. అయిదేళ్ల క్రితం వీరి వయసుల నిష్పత్తి 1 : 3. అయితే అయిదేళ్ల తర్వాత వారి వయసుల నిష్పత్తి ఎంత?

1) 2 : 3 2) 3 : 5 3) 4 : 1 4) 5 : 7

సాధన: క్రితం నిష్పత్తి = 1 : 3

ప్రస్తుత నిష్పత్తి = 1 : 2

$x = \frac{(1-2) \times 5}{1 \times 2 - 1 \times 3} = 5$ సం.లు

5 సం.ల క్రితం వారి వయసులు = 5, 15

5 సం.ల తర్వాత వారి వయసుల నిష్పత్తి = 15 : 25 = 3 : 5

సమాధానం: 2

4. ప్రస్తుతం తండ్రి, కుమారుడి వయసుల నిష్పత్తి 3 : 1. కానీ 4 ఏళ్ల క్రితం వారి వయసుల నిష్పత్తి 4 : 1. అయితే ప్రస్తుతం తండ్రి వయసు ఎంత?

1) 12 ఏళ్లు 2) 24 ఏళ్లు 3) 48 ఏళ్లు 4) 36 ఏళ్లు

సాధన: తండ్రి వయసు = 3x

కుమారుడి వయసు = x

4 ఏళ్ల క్రితం తండ్రి వయసు = 3x – 4

4 ఏళ్ల క్రితం కొడుకు వయసు = x – 4

$\therefore 3x - 4 : x - 4 = 4 : 1$

$\Rightarrow 3x - 4 = 4(x - 4) \Rightarrow 3x - 4 = 4x - 16$

$16 - 4 = 4x - 3x \Rightarrow 12 = x$

తండ్రి వయసు $3x = 3 \times 12 = 36$ ఏళ్లు

సమాధానం: 4

5. తులసి, స్వప్నల వయసుల నిష్పత్తి 4 : 5. అయిదేళ్ల తర్వాత వారి వయసు 5 : 6 నిష్పత్తిలో ఉంటే తులసి ప్రస్తుత వయసు?

1) 20 ఏళ్లు 2) 25 ఏళ్లు
3) 30 ఏళ్లు 4) 24 ఏళ్లు

సాధన: తులసి వయసు = 4x ; స్వప్న వయసు = 5x

5 సం.ల తర్వాత తులసి వయసు = 4x + 5

స్వప్న వయసు = 5x + 5

వారి వయసుల నిష్పత్తి $\Rightarrow (4x + 5) : (5x + 5) = 5 : 6$

$\Rightarrow 6(4x + 5) : 5(5x + 5)$

$\Rightarrow 24x + 30 = 25x + 25$

$30 - 25 = 25x - 24x \Rightarrow 5 = x$

తులసి ప్రస్తుత వయసు = $4x = 4 \times 5$

= 20 ఏళ్లు

సమాధానం: 1

6. చంద్ర, గగన్‌ల వయసులు 8 : 15 నిష్పత్తిలో ఉన్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత వారి వయసులు 11 : 18 నిష్పత్తిలో ఉంటే వారిద్దరి మధ్య వయసుల తేడా ఎంత?

1) 21 ఏళ్లు 2) 20 ఏళ్లు 3) 24 ఏళ్లు 4) 26 ఏళ్లు

సాధన: కొత్త నిష్పత్తి = 11 : 18

పాత నిష్పత్తి = 8 : 15

రెండింటి మధ్య తేడా = 3 : 3

3 నిష్పత్తులు = 9 సం.లు,

1 నిష్పత్తి = 3 సం.లు

వయసుల తేడా = (15 – 8) నిష్పత్తులు = 7 నిష్పత్తులు

= 7 × 3 = 21 ఏళ్లు

సమాధానం: 1

7. మోహన్‌కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. అతడి ప్రస్తుత వయసు వివాహ సమయం నాటి వయసు కంటే $1\frac{1}{3}$ రెట్లు ఎక్కువ. అయితే అతడి ప్రస్తుత వయసు ఎంత?

1) 24 ఏళ్లు 2) 27 ఏళ్లు 3) 12 ఏళ్లు 4) 36 ఏళ్లు

సాధన: తొమ్మిదేళ్ల క్రితం మోహన్ వయసు = x

ప్రస్తుతం అతడి వయసు = x + 9

లెక్కప్రకారం, మోహన్ ప్రస్తుత వయసు...

$= (x + 9) = x \times \frac{4}{3}$

$\Rightarrow 3(x + 9) = 4x$

$\Rightarrow 3x + 27 = 4x$

$\Rightarrow 4x - 3x = 27 \Rightarrow x = 27$

మోహన్ ప్రస్తుత వయసు

= 27 + 9 = 36 ఏళ్లు

సమాధానం: 4



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

717 Word of the Day

Torrid

Telugu meaning: అత్యుష్ణ, తీక్షణమైన

English meaning: The word torrid (టోరిడ్) is an adjective that describes something intensely hot, passionate, or emotionally charged.

Synonyms: Scorching, Intense

Antonyms: Mild, Calm

Usage: **1.** The hikers struggled through the torrid heat of the desert.
2. Their torrid performance became the talk of the town.

కరెంట్ అఫైర్స్



ఆపదలో చిక్కుకునే జలాంతర్గాములను రక్షించడానికి ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' నౌకను రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్‌సేథ్ 2025, జులై 18న విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో జాతికి అంకితం (కమిషనింగ్) చేశారు. హిందుస్థాన్ షిప్ యార్డులో నిర్మించిన ఈ నౌక 10,500 టన్నుల బరువు, 120 మీటర్ల పొడవు ఉంటుంది. దీని తయారీకి 80 శాతానికిపైగా స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించారు.



ఉక్రెయిన్ ప్రధానమంత్రిగా యూలియా స్విరిడెంకో 2025, జులై 17న నియమితులయ్యారు. దేశ ఉప ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా ఉన్న ఆమెను పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధానిగా నియమించనున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల ప్రకటించారు. డెనిస్ ష్మిహాల్ స్థానంలో ప్రస్తుత నియామకం జరిగింది.



తెలంగాణ హైకోర్టు 7వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ 2025, జులై 19న ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రధాన న్యాయమూర్తిగా ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.


బ్యాటరీ రీసైక్లింగ్ సేవల సంస్థ బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్ మనదేశంలో తొలిసారిగా అరుదైన భూఅయస్కాంతాల రీసైక్లింగ్, రిఫైనింగ్ సదుపాయాలు కల్పించనుంది. దీని కోసం జర్మనీకి చెందిన రాక్‌లింక్ జీఎంబీహెచ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జీరో లిక్విడ్ డిస్చార్జి (జడ్ఎల్‌డీ) ప్రమాణాలతో రిఫైనింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు ఈ సందర్భంగా బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్ వెల్లడించింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

భారతదేశంలోని ప్రధాన గిరిజన తెగలు

స్టడీ - జోన్

నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తూ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలను కలిగినవారే గిరిజనులు. వీరు అనాదిగా కొండలు, అడవి ప్రాంతాల్లోనే జీవనాన్ని సాగిస్తున్నారు. వేట లేదా వ్యవసాయం వీరి జీవన విధానం. గిరిజనులను ఆంగ్లంలో 'ట్రైబ్స్' అంటారు. ఇది 'ట్రైబస్' అనే రోమన్ పదం నుంచి వచ్చింది.



☛ ప్రపంచంలో తొలిసారిగా గిరిజనుల జీవనవిధానంపై పరిశోధనలు చేసినవారు లూయిస్ హెన్రీ మోర్గాన్. ఈయన గ్రంథం 'ది ఏన్షియంట్ సొసైటీ'. భారతదేశంలో గిరిజనుల జీవనవిధానంపై పరిశోధనలు చేసినవారు వెన్నెలకంటి రాఘవయ్య. ఈయన గ్రంథం 'ట్రైబ్స్ ఇన్ ఇండియా'.

☛ 1991 రాయ్‌బర్మన్ కమిషన్ ప్రకారం దేశంలో మొత్తం గిరిజన తెగల సంఖ్య 427. వారి జనాభా 6.776 కోట్లు (8.08%). 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో గిరిజన తెగలు 573. వారి జనాభా 10.43 కోట్లు (8.6%). ఇందులో పురుషులు 5.24 కోట్లు, స్త్రీలు 5.19 కోట్లు.

☛ గిరిజనుల్లో మరింత వెనుకబడి, నాగరికతకు దూరంగా ఉన్న వర్గాలు ఆదిమ గిరిజనులు. వీరిని ప్రస్తుతం పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ (పీవీటీజీ) అని పిలుస్తున్నారు.. ప్రస్తుతం 17 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం (అండమాన్-నికోబార్ దీవులు)లో ఇలాంటివి 75 తెగలు ఉన్నట్లు గుర్తించారు.


ప్రస్తుతం దేశంలోని ప్రధాన గిరిజన తెగలు - వారున్న రాష్ట్రాలను పరిశీలిస్తే..

తెగ	రాష్ట్రం
గోండ్లు	మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఝార్ఖండ్, పశ్చిమ్ బెంగాల్
బిల్లులు	రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర
సంతాల్స్	ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్
నాగాలు	నాగాలాండ్, మణిపూర్, అస్సాం
తోడాలు	తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
జర్వాస్	అండమాన్ నికోబార్ దీవులు
ముండా	ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్
ఒరాన్	ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగం (ఐటీ సెక్టార్)

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో తృతీయ రంగం లేదా సేవా రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇందులో సమాచార సాంకేతిక విజ్ఞాన (ఐటీ) రంగం ముఖ్యమైంది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా అధికం. స్థూల జాతీయోత్పత్తిలో ఐటీ సెక్టార్ వాటా పెరుగుతోంది. భారతదేశంలో ఐటీ సెక్టార్ - వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వం అందిస్తోన్న వివిధ సేవలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



భారతదేశంలో ఐటీ సెక్టార్

ఐటీ, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సర్వీసులు, ఇంజినీరింగ్ డిజైన్ హార్డ్‌వేర్, బీపీఓ మొదలైనవి ఐటీ సేవల కిందకు వస్తాయి. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్‌ను నెట్‌వర్క్ కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ (ఎన్‌సీపీ) 1984 ప్రకారం ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం 2000లో ఐటీ చట్టాన్ని ఆమోదించింది. దీని వల్ల ఆన్‌లైన్ వాణిజ్యం, లావాదేవీలు సులభతరం అవుతున్నాయి.

నూతన కంప్యూటర్ విధానం – 1984

1984లో భారత ప్రభుత్వం నూతన కంప్యూటర్ విధానాన్ని ప్రకటించింది. దీని ప్రకారం 1985లో సాఫ్ట్‌వేర్ ఎగుమతుల వల్ల వచ్చే రాబడిని ఆదాయ పన్ను పరిధి నుంచి మినహాయించారు. 1984లో బెంగళూరు కేంద్రంగా **Centre for Development of Telematics (C-DOT)** ను ఏర్పాటు చేశారు.

ఐటీసీ, బీపీఓ, భారతదేశంలో సమాచార సాంకేతిక పరిశ్రమ వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వం అందిస్తోన్న వివిధ సేవలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహ పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Non-Executive Posts

Ferro Scrap Nigam Limited (FSNL), Bhilai is inviting applications for the filling of Non-Executive posts in various departments. Total no.of posts 50. Eligible candidates can apply online before 24 July 2025.

DSSSB Recruitment Notification 2025

Delhi Subordinate Services Selection Board (DSSSB) inviting online applications for the recruitment of 2119 posts across various Departments, Local, and Autonomous Bodies under the Government of NCT of Delhi. The last date for online applications is 7 August 2025.

Paid Internship Posts

Defence Metallurgical Research Laboratory (DMRL), Hyderabad- a premier laboratory of DRDO (Defence Research & Development Organisation), invites applications from eligible Indian students for a Paid Internship Program for a duration of 6 months. The total no. of posts is 20. Eligible can apply online before 25 July 2025.

Did You Apply..?

Today (July 21) is the last date for the following jobs/ Apprentice posts

☛ SSC Junior Engineer Recruitment 2025 - 1,340 posts.
Eligibility: Diploma or Degree.

☛ 35 Technician Posts in Medak Ordnance Factory.
Eligibility: Diploma.

For more information and other notifications - scan QR code

Sentence Improvement

SSC Exams English

Directions (1-18): *Select the most appropriate option to substitute the underlinedsegment in the given sentence. If there is no need to substitute it, select No improvement as your answer.*

1. He seldom goes to the cinema, doesn't it?
A) is he? B) isn't he?
C) does he? D) No Improvement

2. The teacher advised that the student must concentrate more on grammar.
A) the student may concentrate
B) the student should concentrate
C) the student to concentrate
D) No Improvement

3. I am used to drive long distances during vacations.
A) used for driving B) used to driving
C) used with driving
D) No Improvement

4. Ramesh as well as his brothers are coming to the function.
A) were coming for B) have come for
C) is coming to D) No Improvement

5. The patient has died before the doctor arrived.
A) had died before B) have died before
C) dies before D) No Improvement

6. Neither the manager nor the employees knows the actual reason for the delay.
A) is knowing the actual reason
B) know the actual reason
C) are knowing the actual reason
D) No Improvement

7. She is working here since the past five years.
A) has worked here
B) is working since
C) has been working here
D) No Improvement

8. The moment she received the news, she starts crying.
A) started crying
B) was starting to cry
C) has started crying
D) No Improvement

9. He is too tired that he cannot attend the meeting today.
A) so tired that B) very tired that
C) too tired to D) No Improvement

10. Each of the participants were given a certificate and a medal.
A) were being given B) was given
C) had been given
D) No Improvement

11. The principal gave us a lot of advices before the exam.
A) a lot of suggestions
B) many advices C) a lot of advice
D) No Improvement

12. The boys were playing cricket when it was raining heavily.
A) while it was raining
B) during it was raining
C) yet it was raining
D) No Improvement

13. The teacher asked the student why was he late.
A) why late he was
B) why he was late
C) why did he late
D) No Improvement

14. She went to the market, bought some fruits and returned back home.
A) and came back home
B) and returned to home
C) and returned home
D) No Improvement

15. Neither of the girls have submitted their assignment.
A) has submitted her assignment
B) has submitted their assignment
C) have submitted her assignment
D) No Improvement

16. The train will leave before we will reach the station.
A) before we are reaching
B) before we reach
C) before we reached
D) No Improvement

17. It is high time we take strict action against corruption.
A) we should take strict action
B) we must take strict action
C) we took strict action
D) No Improvement

18. The cricket player is enough wealthy to afford a luxurious car.
A) wealthy enough to afford
B) so wealthy enough affording
C) enough wealthy so as to
D) No Improvement

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

భూ కుంభకోణాల్లోనూ చట్టపరంగా చర్యలు: మంత్రి అనగాని

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలోలానే కాకుండా భూ కుంభకోణాలు, ఇతర అవినీతి, అక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 'జగన్ గతంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. డిజిటల్ చెల్లింపులు లేకుండా వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం సిట్ అధికారులు అరెస్టు చేస్తున్నారు. వీటిని కక్షసాధింపు చర్యలని అనడం తగదు' అని అనగాని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు పోటీ పరీక్షలపై శిక్షణ


ఈనాడు, అమరావతి: త్వరలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రాల్లో శిక్షణ ఉంటుందని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకు పీవో, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థుల నుంచి త్వరలో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సుల వెబ్ ఆప్షన్ల గడువు పొడిగింపు

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ ఏడాదికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ angrau.ac.inని చూడాలని సూచించారు.

ఔటర్ రింగ్ రైలు 392 కి.మీ.

- 26 స్టేషన్లతో తుది ఎలైన్‌మెంట్ ఖరారు
- తెలంగాణలోని 8 జిల్లాలు 14 మండలాల పరిధిలో..
- ఆర్ఆర్ఆర్‌కు 3-5 కి.మీ.దూరంలోనే
- అంచనా వ్యయం రూ.12,070 కోట్లు
- ఆరు ప్రాంతాల్లో పాత రైలు మార్గంపై కొత్త లైన్



సుతార్ల సోమశేఖర్
ఈనాడు - హైదరాబాద్

దేశంలో మొట్టమొదటిది, ప్రతిష్ఠాత్మక 'ఔటర్ రింగ్ రైలు' ప్రాజెక్టు తుది ఎలైన్‌మెంట్ ఖరారైంది. 392 కిలోమీటర్ల పొడవున ఈ ప్రాజెక్టు రానుంది. తెలంగాణలోని ఎనిమిది జిల్లాలు, 14 మండలాలను కలుపుతూ దీన్ని చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మార్గంలో కొత్తగా 26 రైల్వే స్టేషన్లు రానున్నాయి. మొత్తం నిర్మాణానికి రూ.12,070 కోట్లు అవుతుందని అంచనా. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట జిల్లాల పరిధిలో రింగ్ రైలు మార్గం రానుంది. ఆలేరు, వలిగొండ, గుళ్లగూడ, మాసాయిపేట, గజ్వేల్ మీదుగా ఔటర్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

దూరం తగ్గినా అభివృద్ధికి దగ్గర..

రెండేళ్ల క్రితం రైల్వే శాఖ తుది సర్వేకు ఆమోదం తెలిపినపుడు ఔటర్ రింగ్ రైలు ప్రతిపాదిత మార్గం దూరం 508 కిలోమీటర్లు. తుది సర్వేలో ఈ ప్రాజెక్టును ద.మ.రైల్వే అధికారులు మూడు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొదటి ప్రతిపాదన 508.45 కి.మీ., రెండోది 511.51 కి.మీ., మూడోది 392.02 కి.మీ. ఈ మూడింటిని పరిశీలించిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, గనుల మంత్రి కిషన్‌రెడ్డి మొదటి రెండు ప్రతిపాదనలు రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు దూరంగా ఉంటాయని.. మూడో ప్రతిపాదనలోకి తీసుకోవాలని సూచించడంతో ద.మ.రైల్వే ఈ ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేసింది. 508 కి.మీ. మార్గంతో పోలిస్తే ప్రస్తుతం ఖరారు చేసిన ఎలైన్‌మెంట్.. దూరం తక్కువైనా అభివృద్ధికి అధిక అవకాశాలున్న ప్రాంతాలకు దగ్గరలో రానుంది. 392 కి.మీ.లతో రింగ్ రైలు ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రైల్వే బోర్డుకు పంపించేందుకు ద.మ.రైల్వే సిద్ధం అవుతోంది.

హైదరాబాద్ చుట్టూ 361 కి.మీ. మేర ఆర్ఆర్ఆర్ రానుంది. దానికి 3-5 కి.మీ. దూరంలోనే వచ్చేలా ఔటర్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. రెండుచోట్ల ఈ దూరం 11 కి.మీ. ఉంటుంది. ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టులో ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్(ఆర్వోఆర్) వంతెనలు రానున్నాయి. కొత్త లైన్లను ఎత్తుగా ఫ్లైఓవర్‌లా నిర్మిస్తారు. మాసాయిపేట, గుళ్లగూడ, బూర్గుల, వలిగొండ, వంగపల్లి, గజ్వేల్ ఆర్వోఆర్ ప్రాంతాలుగా ప్రతిపాదించారు.

సామాజిక ఆర్థిక లాభాలు

ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుతో పరిసర ప్రాంతాల్లో ఆర్థికవృద్ధి వేగవంతం అవుతుంది. ఆర్ఆర్ఆర్‌కు రింగ్ రైలు మార్గాన్ని దగ్గరలోకి తీసుకురావడంతో రోడ్డు, రైలు మార్గంతో రవాణా ఆధారిత అభివృద్ధి జోరందుకుంటుంది.

- **ఇంటిగ్రేటెడ్ మల్టీమోడల్ కనెక్టివిటీ:** రింగ్ రైలు ప్రాజెక్టుతో ఆయా రైల్వేస్టేషన్ల నుంచి నగరానికి బస్సులు, మెట్రో రైలు వంటి రవాణా సేవలతో మల్టీ మోడల్ కనెక్టివిటీ వస్తుంది.
- **పర్యావరణహిత ప్రయాణాలు:** ప్రజా రవాణా వ్యవస్థ వినియోగం పెరుగుతుంది. తద్వారా ప్రైవేట్ వాహనాలపై ఆధారపడటం తగ్గుతుంది. దీంతో ఇంధన వాడకం, కాలుష్య స్థాయిలు తగ్గుతాయి. పర్యావరణానికి అనుకూలమైన రవాణా విధానం ఏర్పడుతుంది.
- **శివారు ప్రాంతాల అభివృద్ధి:** హైదరాబాద్‌కు పొరుగు జిల్లాలతో మెరుగైన రైలు కనెక్టివిటీ వస్తుంది. దీంతో అభివృద్ధి అంతా ఒకేచోట కేంద్రీకృతం కాకుండా ఇతర ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. కొత్త టౌన్‌షిప్‌ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు తోడ్పడుతుంది.

రైల్వే లైన్	ఆర్వోఆర్ ఏ స్టేషన్ల మధ్యలో వస్తుందంటే
సికింద్రాబాద్-కాజీపేట	వంగపల్లి-ఆలేరు
సికింద్రాబాద్-వాడి	గుళ్లగూడ-చిట్టిగిద్ద
సికింద్రాబాద్-డోన్	బూర్గుల-బాలానగర్
సికింద్రాబాద్-ముద్ఖేడ్	మాసాయిపేట-శ్రీనివాసనగర్
సికింద్రాబాద్-గుంటూరు	వలిగొండ-రామన్నపేట
సికింద్రాబాద్-కొత్తపల్లి★	గజ్వేల్-కొడకండ్ల

★ నిర్మాణంలో ఉన్న మార్గం


రాజధాని నిర్మాణ పనులు సమీక్షిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

వర్షాలతో ఇబ్బందిలేని పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఇంజినీర్లను ఆదేశించిన మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణంలో వర్షాలతో ఇబ్బంది లేని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఇంజినీర్లను ఆదేశించారు. భవనాల్లోని అంతర్గత పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై ఆదివారం సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో పనులు నిలిపి వేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. భవన నిర్మాణాలు, రోడ్లు, కార్మికుల సంఖ్య, యంత్రాలు, ఇతర పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణారెడ్డితోపాటు సీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎటువంటి అదనపు ఛార్జీల భారం పడదని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'వినియోగదారులకు అందించే సేవల్లో పారదర్శకతను మరింతగా పెంచేందుకు మాత్రమే కేంద్రం చేపట్టిన ఆర్‌డీఎస్ (పునరుద్ధరించిన పంపిణీ రంగం) పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలోనే ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్-2021 ప్రకారం ప్రభుత్వ వాణిజ్య కేటగిరీల దుకాణాలకు వీటిని అమర్చుతున్నాం. అనంతరం ఎక్కువ విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు అమర్చుతాం. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. వీటిని అమర్చే సమయంలో ఛార్జీలు, మామూళ్లు చెల్లించాల్సిన అవసరం లేదు. నెలవారీ విద్యుత్ బిల్లులో కూడా ఇన్‌స్టాల్‌మెంట్స్ వసూలు చేయరు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవు. ఏపీఈఆర్‌సీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే బిల్లులు వసూలు చేస్తాం' అని పేర్కొన్నారు.

481 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం

తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 481 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనుందని తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ తెలిపారు. 149 పీవీటీజీ గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం ద్వారా బీటీ రహదారులు నిర్మించనున్నట్టు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "వంద మంది కంటే తక్కువ జనాభా ఉన్న 78 పీవీటీజీ గ్రామాలు, 254 నాన్ పీవీటీజీ గ్రామాలకు ఉపాధి హామీ పథకం నిధులతో గ్రావెల్, మెటల్ రహదారుల నిర్మాణం కూటమి ప్రభుత్వం చేపట్టనుంది. జగన్ ప్రభుత్వం గంజాయి సాగుతో గిరిజన ప్రాంతాల భవిష్యత్తును నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం కాఫీ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ వారి స్థితిగతుల్ని మారుస్తోంది. ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది" అని దారునాయక్ వివరించారు.

సజ్జలా.. మీ తెలివితేటలను ప్రజలు నమ్మరు

- మీ అబద్ధాలను ప్రజలు నమ్మరు
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజం

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణంలో ఆధారాల్లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారంటూ వైకాపా నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి చావు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. వివేకానందరెడ్డి హత్యకేసు తరహా బుకాయింపులే మళ్లీ ఇప్పుడు పునరావృతం చేసి అపహాస్యంపాలు కావొద్దని హితవుపలికారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా నాయకుల నిజస్వరూపాన్ని ప్రజలు పూర్తిగా గ్రహించారని, ఇకమీదట మీ అబద్ధాలను నమ్మే పరిస్థితుల్లో వారు లేరని పేర్కొన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం రాత్రి ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. "ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి ఉండగా మద్యం వ్యవహారాలకు సంబంధించి సీఎం కార్యాలయం ఎందుకు ఆదేశాలు జారీచేసింది? ఆటోమేటిక్ కొనుగోళ్ల ఆర్డర్లు ఇచ్చే ఓఎఫ్ఎస్ విధానాన్ని పక్కనపెట్టి మాన్యువల్ విధానాన్ని అనుసరించమని వాసుదేవరెడ్డి ఎందుకు ఉత్తర్వులిచ్చారు? ఈ ప్రశ్నలకు సజ్జల సమాధానం చెప్పాలి. మద్యం అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపులకు తావులేకుండా నగదు లావాదేవీలే ఎందుకు నిర్వహించారు? నాసిరకం మద్యంతో ప్రజల మరణానికి కారణమై కూడా దానికి ప్రజామోదం లభించిందని చెప్పడానికి సిగ్గువేయడం లేదా? ఈ మద్యం కుంభకోణంలో విజయసాయిరెడ్డి సహనిందితుడు. ఆయనే ఇందులో కుంభకోణం జరిగిందని పక్కాగా చెప్పిన తర్వాత మీ బుకాయింపులు ఎందుకు? వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో చంద్రబాబు పాత్ర ఉందని మీ పత్రికలో పతాకశీర్షికల్లో రాయించారు. తీరా అసలు దర్యాప్తు మొదలైన తర్వాత హూ కిల్డ్ బాబాయ్ అంటే అబ్బాయ్ అని తేలింది. ఇప్పుడు మద్యం కుంభకోణాన్ని తాము చెప్పినట్లు దర్యాప్తు చేయాలంటున్న సజ్జల.. వివేకా హత్యకేసులోనూ ఇదే తరహాలో వ్యవహరించారు. వివేకా కూతురు సునీత, ఆమె భర్తపై అనుమానాలు ఉన్నాయనే కోణంలో సీబీఐ ఎందుకు దర్యాప్తు చేయలేదని వాదించారు. ఇప్పుడు లిక్కర్ కుంభకోణంలో అలాగే వ్యవహరించినంత మాత్రాన మీ నేరాలు మాసిపోవు" అని కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు.

సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ముగ్గురు హైదరాబాదీల అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉండి షేర్‌ట్రేడింగ్ పేరిట రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరస్థుల ముఠాకు సహకరిస్తున్న ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) పోలీసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గురు విదేశీ ముఠాకు మ్యూల్ బ్యాంకు ఖాతాలను సమకూర్చడంతోపాటు సైబర్ మోసాల ద్వారా కాజేసిన సొమ్మును క్రిప్టోకరెన్సీలోకి మార్చి విదేశాలకు బదిలీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ సంతోష్‌నగర్ పిసల్‌బండకు చెందిన ప్రైవేటు ఉద్యోగి రజియుద్దీన్(22)ను టెలిగ్రామ్ యాప్ ద్వారా విదేశీ సైబర్ నేరస్థులు సంప్రదించారు. భారత్‌లో బ్యాంకు కరెంట్ ఖాతాలను తెరిపించడంతోపాటు ఇక్కడి కరెన్సీని క్రిప్టోకరెన్సీలోకి మార్చి పంపిస్తే ఖాతాకు రూ.1.5లక్షల చొప్పున కమీషన్ ఇస్తామని ఆశ చూపగా రజియుద్దీన్ అంగీకరించాడు. అనంతరం అతడు ఆసిఫ్‌నగర్ మురాద్‌నగర్‌కు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ జుబేర్‌ఖాన్(34)తో ఒకటి.. శాలిబండకు చెందిన నర్సింగ్ స్టూడెంట్ వలియుల్లా(25)తో 5 కరెంట్ ఖాతాలను తెరిపించి వారికి రూ.95 వేలు ముట్టజెప్పాడు. ఆ ఖాతాల చెక్కులను తన వద్దే ఉంచుకున్నాడు.

రూ.3.24 కోట్ల మోసం కేసు దర్యాప్తుతో వెలుగులోకి..

ఇటీవల హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నుంచి షేర్ ట్రేడింగ్ పేరిట రూ.3.24 కోట్లను సైబర్ నేరస్థులు కాజేసిన ఉదంతంపై కేసు దర్యాప్తు క్రమంలో వలియుల్లా మోసపు ఖాతా వ్యవహారం బహిర్గతమైంది. బాధితుడు జులై 3న బదిలీ చేసిన రూ.10 లక్షలు బంధన్‌బ్యాంకు ఖాతాకు బదిలీ కాగా.. అందులోనుంచి రూ.7.5లక్షలు వలియుల్లా ఖాతాకు బదిలీ అయినట్లు తేలింది. ఆ సొమ్ముతో పాటు మరో ఖాతా నుంచి మరో రూ.7.5లక్షలు కూడా జమవ్వగా.. అదేరోజు రజియుద్దీన్ చెక్కుల ద్వారా వలియుల్లా బ్యాంకు ఖాతానుంచి రూ.15లక్షలను డ్రా చేసి క్రిప్టోల్లోకి మార్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ క్రిప్టోవ్యాలెట్‌ను గుర్తించిన పోలీసులు దాన్ని స్తంభింపజేశారు. బాధితుడి నుంచి సొమ్ము కాజేసిన విదేశీ నేరస్థులు కంబోడియాలో ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు వారి వివరాలు తెలుసుకోనున్నారు.

రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా

ఈనాడు, హైదరాబాద్: గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. గత ఎన్నికలకు ముందు జరిగిన ఓ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి రూ.పది లక్షల ఆర్థిక సహాయం ప్రకటిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ.కోటి నగదు పురస్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల గద్దర్ పురస్కారాల్లో కూడా రాహుల్ పేరును ప్రస్తావిస్తూ త్వరలోనే ప్రభుత్వం ప్రకటన చేస్తుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో బోనాల పండగ సందర్భంగా రూ.కోటి నగదు పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పాతబస్తీ కుర్రోడిగా మొదలైన రాహుల్ ప్రస్థానం 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని నాటు నాటు పాట ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ వరకు వెళ్లిందని సీఎం పేర్కొన్నారు.

● జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం సినీనటుడు దుల్కర్ సల్మాన్, నిర్మాత స్వప్న దత్ మర్యాదపూర్వకంగా కలిశారు.


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సినీనటుడు దుల్కర్ సల్మాన్


దిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

నిధులున్నా.. ఖర్చు చేయలేకపోతున్నాం

- పోలవరం ప్రాజెక్టుకు సిద్ధంగా రూ.2,200 కోట్లు
- మరో రూ.5,936 కోట్లు బడ్జెట్ కేటాయింపులు
- ఇవన్నీ 9 నెలల్లో ఖర్చు చేయాలి
- పునరావాసం వేగం పెంచితే మేలు

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టు పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? అని గతంలో కేంద్ర అధికారులు ప్రశ్నిస్తే.. మీరు బిల్లులు చెల్లించడం లేదు, మేము ఇప్పటికే ఇన్ని వందల కోట్లు ఖర్చుచేశాం. ఆ నిధులిస్తే పనులు చేసేస్తాం అని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు చెప్పేవారు. తొలిసారి మీకు నిధులిచ్చాం కదా.. ఎందుకు ఖర్చు చేయట్లేదని కేంద్ర జలశక్తి అధికారులు ప్రశ్నించే పరిస్థితులు వచ్చాయి. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన అడ్వాన్సు నిధులు రూ.2,200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయి. అవికాక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.5,936 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు పోలవరానికి చూపారు. అంటే ఇప్పటికిప్పుడు దాదాపు రూ.8,200 కోట్ల వరకు ఉన్నట్లు లెక్క. అయినా పునరావాసం నిధులు ఎందుకు చెల్లించట్లేదని కేంద్రం ప్రశ్నించింది. ఇదే విషయమై సీఎస్‌కు లేఖ రాయనున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడగానే పోలవరానికి మంచిరోజులు వచ్చాయి. తొలిదశలో +41.15 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేందుకు వీలుగా అవసరమైన మిగిలిన నిధులు రూ.12,157 కోట్లు మంజూరు చేయడంతో పాటు ఆ నిధులు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. తొలుత రూ.2,807 కోట్లు ఇచ్చింది. అందులో 80 % ఖర్చుచేస్తే మిగిలిన నిధులు విడుదల చేస్తామని పేర్కొంది. తర్వాత సుమారు రూ.2,700 కోట్లు ఇచ్చింది. దీంతో పాటు తాజా బడ్జెట్‌లో రూ.5,936 కోట్ల కేటాయింపులు చూపింది.

పునరావాసంపై దృష్టి అవసరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు పునరావాసం కల్పించడమూ సమాంతరంగా పూర్తికావాలి. 2027 డిసెంబరుకు ప్రాజెక్టు పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యం. అప్పటికి తొలిదశ పునరావాసం పూర్తిచేయాలి. గత ఐదేళ్లుగా పోలవరంలో పునరావాసం, భూసేకరణపై ప్రభుత్వం సరిగా దృష్టి సారించలేదు. తొలిదశలో 1,00,099.58 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇంతవరకు 86,981.62 ఎకరాలు సేకరించారు. ఇందుకు రూ.4,063.22 కోట్లే ఖర్చుపెట్టారు. మిగిలిన 13,117.95 ఎకరాలకు రూ.2,102.93 కోట్లు అవసరం. తొలిదశలో భూసేకరణకు కేంద్రం రూ.4,853.22 కోట్లే కేటాయించింది. కానీ నిధులు ఇంకా అవసరమయ్యేలా ఉన్నాయి. మరోవైపు పునరావాస ప్యాకేజీ ఇవ్వడంతో పాటు 30 వేలకు పైగా కుటుంబాలను 2027 డిసెంబరు నాటికి తరలించేలా కాలనీల నిర్మాణమూ పూర్తికావాలి. భూసేకరణకు రూ.1,000 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కానీ కాలనీల నిర్మాణపనులు నిలిచిపోయాయి. మళ్లీ టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తొలి దశలో పనులు పూర్తిచేసేందుకు సుమారు రూ.35వేల కోట్లు అవసరమని పాత ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే కేంద్ర జలసంఘం, రివైజ్డ్ కాస్ట్ కమిటీలు పరిశీలించి వివిధ మొత్తాలు కోత విధించాయి. చివరకు రూ.30,436.95 కోట్లకు ఖరారు చేశాయి. ప్రస్తుతం ప్రధాన డ్యాంలో అదనంగా చేరుతున్న పనుల విలువ లెక్కిస్తే నిధులు ఇంకా అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తొలిదశలో వేటికి ఎంత? (అంకెలన్నీ రూ.కోట్లలో)

ప్రధాన డ్యాం	14,023.20
ఎడమ కాలువ	1,955.23
కుడి కాలువ	1,812.45
భూసేకరణ	4,853.22
పునరావాసం	7,417.19
పీపీఏ ఛార్జీలు	375.66
మొత్తం	30,436.95

ఇతర రాష్ట్రాల పేరుతో ఎగవేతలు

బోగస్ రిజిస్ట్రేషన్లతో వ్యాపారాలు

ఈనాడు, హైదరాబాద్: జీఎస్టీ ఎగవేసేందుకు కొందరు వ్యాపారులు పలు మోసాలకు పాల్పడుతున్నారు. బోగస్ వివరాలతో జీఎస్టీ గుర్తింపు సంఖ్యను పొందడానికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం బోగస్ కరెంటు బిల్లులు, ఇతర రాష్ట్రాలకు చెందిన సామాన్యుల ఆధార్ వివరాలను నమోదు చేస్తున్నారు. వారిది బోగస్ వ్యాపారం అని అధికారులు గుర్తించేసరికి కోట్ల రూపాయల పన్ను ఎగవేసి పరారవుతున్నారు. అక్రమాలకు వాణిజ్య పన్నులశాఖలోని కొందరు సిబ్బంది కూడా సహకరిస్తున్నట్లు ఇటీవల నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

పెరగని సర్కిళ్లు..: తెలంగాణలో 5 లక్షలకు పైగా జీఎస్టీ గుర్తింపు సంఖ్య (ఐఎన్) కలిగిన వ్యాపారులున్నా.. తనిఖీలకు వెయ్యి మంది వరకే అధికారులున్నారు. వాణిజ్యపన్నుల సర్కిళ్లను పెంచకపోవడం, తనిఖీ వ్యవస్థలను పటిష్ఠం చేయకపోవడం బోగస్ వ్యాపారాలకు అనుకూలంగా మారింది.

ఈ తరహా మోసాలు ఎన్నో..: వినోద్‌కుమార్ అనే వ్యక్తి బొమ్మలు, వీడియో గేమ్స్ వ్యాపారాలు చేస్తానని ఖైరతాబాద్-సోమాజిగూడ సర్కిల్‌లో ఆన్‌లైన్ ద్వారా బోగస్ కరెంటు బిల్లు పెట్టి అదే చిరునామా పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి కొత్త జీఎస్టీఐఎన్ తీసుకున్నాడు. 2025 మార్చి, ఏప్రిల్‌లో సిమెంట్, కాపర్, పైపులు, ప్లైవుడ్ వ్యాపారాలు చేస్తున్నట్లు 1268 బోగస్ వేబిల్లులు సృష్టించాడు. వీటి పేరుతో రూ.6.25 కోట్ల ఐటీసీని మరో 32 మంది వ్యాపారులకు ఇవ్వాలని బదిలీ చేశాడు. రెండు నెలల్లో ఇంత వ్యాపారం చేయడంపై అనుమానంతో తనిఖీ చేస్తే రూ.6.25 కోట్ల ఐటీసీ మోసం బట్టబయలైంది. అధికారులు దీనిపై 32మందికి నోటీసులు జారీచేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారి జీఎస్టీఐఎన్‌ను రద్దు చేశారు. ఇలాంటి మోసాలకు పాల్పడిన మరో 100కి పైగా ఐటీసీలను అధికారులు గుర్తించారు.

ఏఆర్ఎస్‌లో ఏదీ మన సత్తా

- జాతీయ సర్వీసుపై దృష్టిపెట్టని తెలుగు వ్యవసాయ పరిశోధకులు
- గత మూడు బ్యాచ్‌ల్లో 16 మంది మాత్రమే ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: సివిల్స్‌లో ఏటా తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు మెరుగ్గా రాణిస్తూ పదుల సంఖ్యలో ఎంపికవుతున్నారు. వ్యవసాయంలోనూ అఖిలభారత స్థాయిలో జరిగే ప్రతిష్ఠాత్మక భారత వ్యవసాయ పరిశోధన సేవ(అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీసు-ఏఆర్ఎస్)లో మాత్రం రెండు రాష్ట్రాల అభ్యర్థులు ఈ స్థాయిలో రాణించడం లేదు. 2023 నియామకాల్లో ఎంపికైన వారికి ఇటీవల శిక్షణ ప్రారంభమైంది. మొత్తం 216 మంది ఎంపిక కాగా అందులో కేవలం నలుగురు మాత్రమే తెలుగు రాష్ట్రాల వారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు. తెలంగాణ నుంచి నుంచి ఒక్కరే ఉన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్) 1973 నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తల నియామక మండలి ద్వారా శాస్త్రవేత్తల ఎంపికకు పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలుంటాయి. గతంలో పీజీ అర్హత కాగా 2023లో పీహెచ్‌డీ అర్హతగా నిర్ణయించారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని వ్యవసాయ పరిశోధన విస్తరణ సంస్థ(నార్మ్)లో మూడు నెలల శిక్షణ ఉంటుంది. అనంతరం వారు ఐకార్ పరిధిలోని వ్యవసాయం, అగ్రోఫారెస్ట్రీ, పశుసంవర్ధకం, మత్స్యశాస్త్రం, గృహ విజ్ఞానం తదితర సంస్థల్లో చేరి వివిధ హోదాల్లో సేవలు అందిస్తారు. నార్మ్, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఆర్ఎం, అటారి తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలకు డైరెక్టర్లుగా ఎదిగే అవకాశం లభిస్తుంది.

ఇక్కడ పోటీపడుతున్నా..

గత ఎనిమిదేళ్లలో మూడు.. 2018, 2021, 2023 బ్యాచ్‌లు రాగా కేవలం 16 మంది మాత్రమే తెలుగు వారు ఎంపికయ్యారు. కర్ణాటక, ఒడిశా, హరియాణా, కేరళ, రాజస్థాన్ నుంచి ఎక్కువ మంది ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాలున్నాయి. హైదరాబాద్‌లో ఐకార్ సంస్థలు 18 నడుస్తున్నాయి. రెండు వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రాలు కాగా.. వ్యవసాయ కోర్సులను భారీగా డిమాండ్ ఉంటోంది. రాష్ట్రస్థాయిలో ఉద్యోగ నియామకాలకు పోటీ పడుతున్నారు. జాతీయ స్థాయి పోటీలకు మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెస్సీ (వ్యవసాయ, ఉద్యాన) ఎంవీఎస్‌సీ, ఆ తర్వాత పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థుల్లో ఎక్కువ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు పొందడానికి వారు మొగ్గుచూపుతున్నారు. ఏఆర్ఎస్‌పై ఎక్కువ దృష్టి సారించడం లేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

ఐదో ర్యాంకు సాధించా



మాది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లీడు గ్రామం. 2018లో ఇంటర్వ్యూదాకా వెళ్లాను. 2023లో మళ్లీ రాసి ఐదో ర్యాంకు సాధించా. శిక్షణ అనంతరం శాస్త్రవేత్తగా రైతులకు సేవలందిస్తా
-శ్రీలత, శిక్షణ శాస్త్రవేత్త

దేశానికి సేవలందించడమే లక్ష్యం



మాది కృష్ణా జిల్లా మచిలీపట్నం. దిల్లీలో పీహెచ్‌డీ చేశా. ఆ సమయంలో ఏఆర్ఎస్ ప్రాధాన్యం తెలిసింది. ఆరు నెలలపాటు దానికి పట్టుదలతో చదివి, సీనియర్ల సలహాలతో పరీక్ష రాసి ఎంపికయ్యాను. శాస్త్రవేత్తగా దేశానికి సేవలందించడమే నా లక్ష్యం.
-పెదపూడి లోకేశ్‌బాబు, శిక్షణ శాస్త్రవేత్త

అక్రమ కేసుల అంశం పార్లమెంటు దృష్టికి తెస్తాం: పిల్లి సుభాష్‌చంద్రబోస్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో వైకాపా ఉనికి లేకుండా చేయడానికి అక్రమ కేసులు పెడుతున్నారని, ఈ అంశాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకెళతామని ఆ పార్టీ రాజ్యసభాపక్ష నేత పిల్లి సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. ఏపీలో అధర్మ పాలన సాగుతోందని, తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదన్నారు. గతంలో జగన్ ప్రభుత్వాన్ని విమర్శించిన తెదేపా.. ఇప్పుడు విచ్చలవిడిగా అప్పులు చేస్తోందని ఆరోపించారు. మామిడి, పొగాకు రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. మామిడి కిలోకు రూ.12 మద్దతు ధర ప్రకటించినా కేవలం రూ.5కే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ తాము పార్లమెంటులో ప్రస్తావిస్తామన్నారు.

వీధి శునకాల దాడిలో 25 మందికి గాయాలు

ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమం

తూప్రాన్, న్యూస్‌టుడే: తెలంగాణలోని మెదక్ జిల్లా తూప్రాన్‌లో వీధి శునకాలు స్వైరవిహారం చేశాయి. ఆదివారం ఒక్కరోజే 25 మందిపై (వీరిలో పదేళ్లలోపు చిన్నారులు ఐదుగురు) దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఒకటో వార్డుకు చెందిన విశాల్-లిఖిత దంపతుల కుమారుడు అనిరుధ్(3) ఇంటి ముందు ఆడుకుంటుండగా.. కుక్క ఒక్కసారి దాడి చేసింది. దీంతో బాలుడి కన్నుకు తీవ్ర గాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం బాలుడిని హైదరాబాద్‌కు తరలించారు. రెండో వార్డుకు చెందిన సురేశ్-శిరీష దంపతుల కుమారుడు రితీశ్(8)పై శునకం దాడి చేయడంతో చేతికి గాయమైంది. మెరుగైన చికిత్స కోసం మెదక్‌కు తరలించారు. స్థానికంగా జరిగిన బోనాల జాతర ఉత్సవాల్లోనూ పలువురు చిన్నారులను కుక్కలు గాయపరిచినట్లు స్థానికులు పేర్కొన్నారు. తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో 25 మందికి పైగా బాధితులకు చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. పట్టణంలో శునకాల బెడద పెరిగినా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.